# చిత్తూరు జిల్లా - వందేళ్ళ కథా సారథులు

(మొదటి భాగం)

టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి

కళా ప్రచురణలు
మదనపల్లె - 517 325, చిత్తూరు (ఎ.పి.)

*పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో ముద్రితం*

**చిత్తూరు జిల్లా - వందేళ్ళ కథా సారథులు**

(మొదటి భాగం)

**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**

ప్రథమ ముద్రణ : **నవంబరు 2013**

ప్రతులు : **1000**

హక్కులు : **© రచయితవి**

ముఖచిత్రరూపకల్పన : **అన్వర్**

**కళాప్రచురణలు-4**

**మదనపల్లె - 517 325**

వెల : ₹ 100

ప్రతులకు : **అన్ని పుస్తక కేంద్రములు**

లేదా : **టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**

3-169-16, రామారావు కాలనీ

బాపూజీ మునిసిపల్ స్కూల్ రోడ్

చిత్తూరు జిల్లా (ఆం.ప్ర.)

ఫోన్ : 08571-221963

సెల్ : 93472 98942

email : todimella krishnamurthy@gmail.com

**పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయంతో ముద్రితం**

ముద్రణ : **విజయవాణి ప్రింటర్స్**

**గోసులకురప్పల్లి రోడ్**

**చౌడేపల్లె - 517 257**

చిత్తూరు జిల్లా (ఆం.ప్ర.)

## అంకితం



ఆధునిక సాహితీ బ్రహ్మర్షి

స్వర్గీయ **R.S. సుదర్శనం** వారికి....

- రచయిత

## కృతజ్ఞతలు

**ఈ** గ్రంథ రచనకు మొట్టమొదటి కారకులు మాన్యశ్రీ వేదగిరి రాంబాబు గారు. వారికీ, రెండవ ముఖ్య కారకులు ద్వారకా (సి. హెచ్. వెంకటరత్నం) గారు... వారికీ, ఈ గ్రంథంలోని పరిచయాలను వరుసగా ప్రచురించిన 'ఆలోచించండి' మాసపత్రిక సంపాదక వర్గానికీ, వారి సిబ్బందికీ మరియు విషయసేకరణకు సహకరించిన ఇందులోని ఆయా రచయితలకూ, స్వర్గీయులైన రచయితల తరపున సహకారాలనందించిన వారి వారికీ, పరిశోధన విద్యార్థులయిన శ్రీ తవ్వావెంకటయ్య, శ్రీ పొదిలి నాగరాజులను నాకు పరిచయం చేసి నూతన విషయాలను గ్రహించడానికి సహకరించిన సాహితీ మిత్రులు శ్రీ తవ్వా ఓబుల్‌రెడ్డి గారికీ, ముఖచిత్ర రూపకల్పన గావించిన అన్వర్‌గారికీ, ఈ గ్రంథానికి ₹ 6,000/- ఆర్థిక సహకారాన్ని మంజూరు చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు వారికీ, ఈ గ్రంథాన్ని ఇంత చక్కగా ముద్రించి, సకాలంలో అందించిన విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లె వారికీ మరియూ వారి సిబ్బందికీ.... అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనములు తెలియజేయుచున్నాను.

- టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి

# ఇందులో.....


| | | పేజి నెం. |
|---|---|---|
| ♦ | అంకితం మరియు కృతజ్ఞతలు | 3 |
| ♦ | కథను గూర్చి కొద్దిగా | 4 |
| ♦ | మనిషి ఆశాజీవి కదా!?.... | 5 |
| ♦ | చిత్తూరు జిల్లా – వందేళ్ళ కథాసారథులు<br>– *టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి* | 15 |
| 1. | నడిచే గ్రంథాలయం – కదిలే సాహితీ సౌరభం<br>*డా॥ జోలె పాళెం మంగమ్మ* | 16 |
| 2. | స్వాతంత్ర్య సమరులుగానే తెలిసిన అలనాటి కథకులు, కవి, నవలాకారులు, అభ్యుదయవాది<br>*మాన్యశ్రీ యం.వి. పాపన్న గుప్త* | 19 |
| 3. | సాహిత్యం ఊపిరి – విమర్శ ప్రాణంగా జీవించిన సాహితీ బ్రహ్మర్షి *ఆర్.ఎస్. సుదర్శనం* | 22 |
| 4. | కథకులకూ, నవలాకారులకూ కరదీపికలందించిన ఆధునిక విమర్శకులు వల్లంపాటి వెంకట సుబ్బయ్య | 24 |
| 5. | వేంపల్లి అబ్దుల్ ఖాదర్ కథలన్నీ గుండెల్ని కదిలిస్తాయి! కంటతడి తెప్పిస్తాయి!! | 26 |
| 6. | అంతర్లీన విషాదాలతో ఆలోచింపజేసే<br>*ఆర్. వసుంధరాదేవి కథలు* | 28 |
| 7. | ప్రచారమెరుగని కథాసారథి... *సనగరం పార్థసారథి!* | 30 |
| 8. | అంతరంగిక దృష్టికోణం అనంతంగా కలిగిన<br>*కథారచయిత్రి ఎ. పుష్పాంజలి* | 32 |
| 9. | నాటక కడలిలో ఓలలాడి, కవితలఒడిలో ఒదిగి అద్భుత కథలలో తేలిన సాహితీసవ్యసాచి<br>*శ్రీ యస్. మునిసుందరం* | 34 |
| 10. | వినాయకుడి కథలతో కథాజగత్‌లో అడుగిడిన<br>*అల్లీ రామకృష్ణ కవి* | 37 |
| 11. | సమాజ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ సాహితీ సృజన గావిస్తున్న కథకుడు *మాన్యశ్రీ నాయుని కృష్ణమూర్తి* | 39 |
| 12. | ప్రేమించే మంచి మనసున్న మధుర కథకుడు<br>*మధురాంతకం రాజారాం* | 42 |
| 13. | నేనెందుకు వ్రాశాను? ఎలా?? – *టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి* | 45 |
| 14. | తక్కువ కథలతో కథకులుగా ప్రసిద్ధులయిన కవి పండితులు, నవలాకారులు *కరణం బాలసుబ్రహ్మణ్యంపిళ్ళై* | 48 |
| 15. | అలుపెరుగని కలం యోధుడు *మాన్యశ్రీ కాణిపాకం లింగన్న* | 50 |

16. నిశ్శబ్ద తరంగంలా ముందుకు సాగుతున్న సాహితీగళం... *శైలజామిత్ర కలం* 52
17. అడుగడుగునా అగ్ని పరీక్షలెదుర్కొనే అబలల సమస్యలపట్ల స్పందించిన కలం... *శ్రీమతి పి. శైలజ సాహితీగళం* 54
18. బాహ్య అంతరంగిక శత్రువుల బాధితుడు, కరువు కాటకాల పీడితుడు, సామాజిక రుగ్మతల శాపగ్రస్తుడు.. "భారతరైతు" గుండె లోతుల్ని ఆవిష్కరించిన అద్భుత రచయిత *డా॥ లంకిపల్లె కన్నయ్యనాయుడు* 56
19. అల్లూరి అమ్మణ్ణిమ్మ, కురబలకోట కవయిత్రి, కళల కణాచి.. అయినా.. ప్రచారం కోరని రచయిత్రి *శ్రీమతి లక్ష్మీరాఘవ* 59
20. అలనాడు హలాన్ని, కలాన్ని కదిలించి ధాన్యం పాతరలు, సాహితీసిరులు నింపించిన సవ్యసాచి *మాన్యశ్రీ సి. వేణు* 61
21. చిరుకొలనులా గోచరించే సదానందగారి సాహిత్యం ఒక అగాథ సాహితీ సాగర సామ్రాజ్యం 63
22. మానవీయ విలువలకు పట్టంకడ్తూ, సమాజానికి సందేశాలనందిస్తూ సరళమైన భాషతో, సాఫీగా సాగే రాచపూటి రమేష్ కథలు 67
23. మనుష్యులు ఎందుకింత నిశ్శబ్దంగా నిష్క్రమిస్తారు? *గాడేపల్లి శివరామయ్య* 70
24. అరవయ్యోఏట కలం పట్టి సాహితీగళంతోఅలరిస్తున్న కవి, కథకులు *మాన్యశ్రీ కలవకుంట్ల గురునాథ పిళ్ళై* 73
25. అలనాడే వైవిధ్యభరితమైన కథలనందించిన కథకురాలు *శ్రీమతి కానాల నాగలక్ష్మమ్మ (అమృత)* 76
26. భావజాల ప్రకటనలకు రచనకు మించిన మాధ్యమం లేదని గుర్తించిన రచయిత్రి, ప్రకృతి ప్రేమికురాలు *శ్రీమతి సి. ఉమాదేవి* 78
27. స్వార్థం పురులు విప్పుకుని నృత్యం చేస్తున్న సమాజానికి సమర్పించదగిన రచనలను అందించిన కవి, కర్షకులు మరియు సమాజసేవకులు *శ్రీ కె. రామకృష్ణ* 81
28. చక్కటి చదివించే గుణంతో, మానవత్వపు విలువలు గుభాళిస్తూ... గుండెల్ని కదిలించి ఆలోచింపజేసే కథల నందించిన కథకుడు *శ్రీ సి.యన్. చంద్రశేఖర్* 84
29. సమకాలీన సామాజిక సమస్యలపట్ల ప్రతిస్పందిస్తున్న రచయిత్రి *శ్రీమతి యం.ఆర్. అరుణకుమారి* 87
30. చిత్రమైన కథకుడు... *చిలమకూరి లాజరెస్* 91

## కథను గూర్చి కొద్దిగా ...

**న**వలకయితే సుదీర్ఘమైన చరిత్రేవుంది ప్రపంచంలో. జపాన్ రచయిత్రి అయిన 'మురాసాకిషకుచు' పదకొండవ శతాబ్దంలోనే 'గెంజిమోనో గోతారి' అన్న నవలను వెలువరించారు. పాశ్చాత్య విమర్శకుల భావనలో అదే ప్రపంచపు తొట్టతొలి నవల. ఈ నవల 'గెంజిగాథ'గా తెలుగులోకి అనువదింపబడినది. భారతదేశంలో తొలినవలను 1865లో బంకించంద్రచటర్జీ వెలువరించగా, తెలుగులో తొట్టతొలినవల 'సుదక్షిణా చరిత్రము'ను జయంతి సూరమ్మగారు 1906లో వెలువరించినట్లు తెలుస్తున్నది.

'కథ' వేదకాలం నుండీ ప్రాచుర్యంలో వున్నదయినా ఆధునిక కథ ఆవిర్భావం మాత్రం భారతదేశంలో కాస్త ఆలస్యంగానే జరిగింది. అంతకు ఏభయి సంవత్సరాలకు ముందే అమెరికా, రష్యాలలో కథ ప్రాచుర్యంలో వున్నట్లు తెలుస్తున్నది. 1805లో పశ్చిమ బెంగాల్‌లో 'చండీచరణ్' అన్న రచయిత వెలువరించిన 'తాతా ఇతిహాస్' అన్న కథ భారతదేశపు మొట్టమొదటి కథగా భావింపబడ్తున్నది.

ఆంధ్రదేశంలో 1855లో సి.పి. బ్రౌన్‌గారు ప్రచురించిన తాతాచారి కథల ద్వారా తాతాచారి (నేలటూరు వెంకటాచలం పంతులు) గారు, 'హిందూ సుందరి' అన్న మాసపత్రిక నవంబరు 1902 సంచికలో ప్రచురితమైన 'ధన త్రయోదశి' కథ ద్వారా బండారు అచ్చమాంబగారు, 1910నాటి 'దిద్దుబాటు' కథానిక ద్వారా గురజాడ అప్పారావుగారు తొలి తెలుగు ఆధునిక కథకులుగా భావింపబడ్తున్నారు.

ఇప్పటికి లభ్యమవుతున్న ఆధారాలనుబట్టి చిత్తూరు జిల్లా ఆధునిక తొలికథకులు ఎం.వి. పాపన్నగుప్తగారు. 1927 ప్రాంతంలోనే వీరి కథలు ప్రచురితమయ్యాయి! ఇహ అక్కడ్నుండీ ఎందరో చిత్తూరు జిల్లా కథకులు తమతమ సాహితీ సృజనలతో తెలుగు సాహిత్య కథావనాన్ని సుసంపన్నం చేస్తూ వచ్చారు. వారిలో కొందరిని గూర్చయినా తెలుసుకోవడానికి నేను చేసిన చిరు ప్రయత్నంలో ఒక చిన్న భాగం... ఈ గ్రంథం....

మదనపల్లె, - టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి

18-10-2013

# మనిషి ఆశాజీవి కథ....?...

– టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి

నేనీ గ్రంథరచన మొదలు పెట్టడానికి ముఖ్యకారకులు మాన్యశ్రీ వేదగిరి రాంబాబు గారు. కొద్ది సంవత్సరాల క్రితం వారి పరిచయభాగ్యం లభ్యలైంది. ఆ తరువాత వారొక పర్యాయం నాకు ఫోనుచేసి చిత్తూరు జిల్లాలోని కథానికా రచయితలను గూర్చి ఒక వ్యాసం వ్రాసి పంపమని కోరారు. నాకు తెలిసిందే కొంత! గతాన్ని గూర్చిన అవగాహన అంతంత!!

అయినా వారిమాట కాదనలేక పరిశీలించి, కొందరు పెద్దలను కలిసీ కొంత సమాచారం సేకరించి వ్రాయడం మొదలు పెట్టాను. అయితే త్వరగానే ముగించాల్సి వచ్చింది. ముగించిన పిదప ఆ ఆర్టికల్ అసమగ్రంగానే ఉందని నాకే అనిపించినా వేదగిరి రాంబాబు గారికి పంపివేశాను.

వేదగిరి రాంబాబు గారు ప్రచురించిన 'వందేళ్ళ తెలుగు కథానిక' అన్న గ్రంథంలో నేను పంపిన రచన 'చిత్తూరు జిల్లాలో వందేళ్ళ కథాసారథులు" కూడా చోటు చేసుకుంది. ఆ గ్రంథంలో అనేక జిల్లాల నుండీ రచయితలు వారి, వారి జిల్లాలలోని వందేళ్ళ కథానికా రచయితలను గూర్చి చాల సమగ్రంగా, నిర్దిష్టంగా వ్రాయగలిగారు. నేను కూడా మరింత కృషి చేసి వుంటే చాల బావుండేది అని అన్పించింది నాకు.

పైగా నేను చేసిన మరో పొరపాటేమిటంటే నా రచనను చిత్తుప్రతి నుండీ శుద్ధ ప్రతిలోకి మార్చి పంపేటప్పుడు అతురతతో ఒక పేరా తప్పించి వ్రాసి పంపేశాను. ఆ గ్రంథంలో నా వ్యాసం చదువుకున్నాకగానీ నాకా విషయం అవగతం కాలేదు. తప్పు గ్రహించాక చాల బాధ పడ్డాను. నాకు చాల సన్నిహితులైన రచయితల పేర్లున్న ఫేరానే ఎగిరిపోయింది మరి. ఆ పొరపాటు విషయంలో ఆ రచయితలకన్నా నాకు తెలిసిన పబ్లిషర్ ఒకాయన తెగ మధనపడిపోయి నన్ను విరివిగా విమర్శించడం జరిగింది కూడా.

తరువాత ఒకటిరెండేళ్ళలోపే... ఆలోచించండి పత్రిక ఎడిటర్ ద్వారకా (సి. హెచ్. వెంకటరత్నం) గారు నన్ను ఏదయినా వ్యాసం వ్రాసివ్వమని కోరారు.

నేను అదే వ్యాసాన్ని తప్పిపోయిన పేరాను చేర్చి, మరికొంత విషయం కూడా కలిపి 'ఆలోచించండి' పత్రికకు పంపాను.

ఆలోచించండి మాసపత్రిక జూలై 2010 సంచికలో ఆ రచన 'చిత్తూరు జిల్లా – వందేళ్ళ కథా సారథులు' అన్న శీర్షికన ప్రచురితమైంది.

"మీ ఆర్టికల్ మీద పాఠకుల స్పందన బావుంది. మీ వ్యాసంలో మీరు వ్రాసిన రచయితలలోంచి, నెలకొకరిని గూర్చి విపులంగా వ్రాసి పంపండి!" అని కోరారు ద్వారకా గారు.

మొదట భయపడ్డాను.

ఎందుకంటే... అప్పటికి దాదాపు నలభైయేళ్ళుగా నేను ఎక్కువగా కథలు, తక్కువగా నవలలు వ్రాసినవాణ్ణే కానీ వ్యాస పరంపరలు వెలువరించిన వాణ్ణికాను. పైగా ఇలాంటి కార్యక్రమాలను ఇదివరకే కల్లూరు అహోబలరావు గారు, మధురాంతకం రాజారాం గారు, డా॥ కొత్వాలు అమరేంద్ర గారు మొదలైన లబ్ధ ప్రతిష్ఠులు చాలగొప్పగా నిర్వహించి ఉన్నారు.

నేనయితే ఇలాంటి ప్రయత్నాలు చేసినవాణ్ణీ కాను. అయితే అంత పెద్దవారడిగారని ప్రయత్నం మొదలు పెట్టాను.

మొదట్లో నాకు బాగా పరిచయస్తులైన రచయితలను గూర్చి వివరాలు సేకరించుకుంటూ, వారి రచనలను చదువుతూ నెలకొక్కరిని గూర్చి నా స్థాయిలోంచీ వ్రాయసాగాను. ఆ పరిచయాలు ప్రతినెలా 'ఆలోచించండి' మాసపత్రికలో చోటు చేసుకుంటూ వచ్చాయి.

దిగితే కానీ లోతు తెలియదన్నట్లు... దాదాపు ఏడాది గడుస్తుండగా నాకు ఈ విషయంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒకటికి పట్టు రెండుసార్లు వెళ్ళినా కొందరు రచయితలు సహకరించరు. కొందరు సహకరించినా తమ ఫోటోలు ఇవ్వరు. కొందరి రచయితల రచనలయితే వారివద్దగానీ, లైబ్రరీలలో కానీ లభ్యంకాని పరిస్థితి కూడా ఎదురయింది. ఇంకా అనేక రకాలయిన నిరాదరణలను, చేదు అనుభవాలను కూడా కొందరు రచయితల నుండీ పొందాల్సివచ్చింది.

"చిత్తూరు జిల్లా రచయితలను గూర్చి తెలిసిన వారెవరైనా ఆ రచయితల చిరునామాలను కానీ ఫోను నెంబర్లను కానీ టి.యస్.ఎ. కృష్ణమూర్తికి పోస్ట్‌కార్డు ద్వారా లేదా ఫోను ద్వారా తెలుపగలరు" అంటూ నా చిరునామాతో ప్రతినెలా ఆలోచించండిలో ప్రకటన ఇవ్వసాగారు ద్వారకా గారు. కానీ ఎక్కడా... ఎలాంటి స్పందనా... కన్పించలేదు!

శ్రీమతి లక్ష్మీరాఘవ గారి ద్వారా శ్రీమతి కానాల నాగలక్ష్మమ్మ, శ్రీమతి సి. ఉమాదేవి మొదలైన దూరప్రాంతాలలో స్థిరపడ్డ చిత్తూరు జిల్లా రచయిత్రుల చిరునామాలు లభ్యం అయ్యాయి. వారి వారి వివరాలు, ఫోటోలు, రచనలు సేకరించుకుని కొన్ని నెలలపాటు వరుసగా రచనలని ఆలోచించండికి పంపగలిగాను.

ప్రారంభించిన మొదట్లో నా ఆలోచనలు ఎలా వుండేవంటే "మొదట సీనియర్ కథకులనందర్నీ గూర్చి వ్రాసెయ్యాలి.. తరువాతే ప్రస్తుత కథకులను గూర్చి వ్రాయాలి.." ... ఇలా ఉండేవి. అయితే అందుకు తగిన సానుకూలత నాకు లభ్యం కాకపోయింది.

ఉదాహరణకు... సభాగారిని గురించి, రాజారాంగార్ని గూర్చి వ్రాయడానికన్నా ముందే వ్రాయాలని ప్రయత్నించాను. వారి రచనలు కొద్దిగా సంపాదించగలిగాను. కానీ ఇతర విషయాలు, ముఖ్యరచనలు సేకరించడంలో చాల వెనుకబడ్డాను. వారి బంధువు ఒకతను రెండుమూడు సభలలో పరిచయం అయి సభాగారి విషయాలన్నీ వివరంగా తెలియజేసే ఏర్పాటు చేస్తాననీ, సభాగారి పిల్లల చిరునామాలు అందివ్వగలననీ తెలిపారు. కానీ కార్యాచరణ జరుగలేదు.

తిరుపతిలో ఒక సభలో, నందలూరులో మరో సభలో సభాగారి కుమారుడు రమణ గారు తటస్థ పడ్డారు. నా నవలలు రెండు వారికిచ్చి నన్ను నేను పరిచయం చేసుకుని నేను చేస్తున్న పరిచయాలను గూర్చి క్లుప్తంగా వివరించి సభాగారి విషయంగా సహకరించవలసినదిగా అభ్యర్థించాను. అయితే వారినుండీ తగిన స్పందన లభ్యం కాలేదు.

తరువాత అప్పటి వరకూ ప్రచురితమైన ఆలోచించండి పరిచయాలలో కొన్నింటిని వారికి రిజిస్టరు పోస్టులో పంపుతూ ఆ స్థాయిలో వ్రాయగలుగు

తున్నాను. మీ తండ్రిగారి ముఖ్య వివరాలు, ఫోటో, వీలయితే వారి రచనలు కొన్ని పంపండి అంటూ లేఖ వ్రాశాను.

వారి నుండీ జవాబు కోసం కొన్ని నెలలు ఎదురు చూశాను... కానీ... అశనిపాతంలా ఓ రోజు మధ్యాహ్నం నూకా రాంప్రసాద్ రెడ్డి గారి నుండీ ఫోను వచ్చింది. రమణగారు గుండెపోటుతో నిశ్శబ్దంగా నిష్క్రమించారని! మనుషలెందుకింత హఠాత్తుగా మాయమవుతుంటారో తెలియదు!!

ఇలా ఆశ, నిరాశల మధ్య ఓలలాడుతూ ఇప్పటికి ముప్పయి మంది చిత్తూరు జిల్లా కథకుల పరిచయాలను వెలువరించగలిగాను.. 'ఆలోచించండి' ద్వారా.. ఈ ముప్పయి మంది కథకుల పరిచయాలతో 'చిత్తూరు జిల్లా – వందేళ్ళ కథా సారథులు' మొదటి భాగాన్ని గ్రంథరూపంలో తీసుకురావడానికి సాహసిస్తున్నాను.

మరణించిన కథా రచయితలు, జీవించివున్న కథకులూ మా జిల్లాలో ఇంకా వందమందికి పైగానే ఉండవచ్చు. వరుసగా వారి వివరాలు, రచనలు, ఫోటోలు సేకరించుకుంటూ ఒక్కొక్కరినే పరిచయం చెయ్యాలి.

ప్రస్తుతం నా వయసు అరవై నాలుగు సంవత్సరాలు. ఆరోగ్యం సహకరించి, ఆయుష్షు కొనసాగినన్నాళ్ళూ ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ తరువాతి భాగాలను కొన్నయినా తీసుకురావాలన్నదీ, కనీసం రెండవ భాగంలోనైనా సభాగారి మరియు వారి సమకాలికుల పరిచయాలన్నీ చోటు చేసుకోవడానికి కృషి చెయ్యాలన్నది నా ఆకాంక్ష. ఎందుకంటే మనిషి ఆశాజీవి కదా!

# చిత్తూరు జిల్లా - వందేళ్ళ కథా సారథులు

- టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి

**చి**త్తూరు జిల్లాలో ఆధునిక కథానికకు ఆద్యుడు పి. రాజగోపాలు నాయుడు గారని చెప్పవచ్చు. కథకులుగానే కాక ఆధునిక సాహిత్య ఒరవడికి తెరతీసిన వ్యక్తిగా కూడా వారిని భావించవచ్చు. నాటకాలు, వ్యాసాలు, కథలు, నవలలు ఎక్కువగా వ్రాయడమేకాక విమర్శనా గ్రంథాలు వెలువరించిన వ్యక్తిగా కూడా వారికి మంచి గుర్తింపు వుంది.

చిత్తూరు జిల్లా నడిబొడ్డున ఒక రాజకీయ పాఠశాలను నడపడం, 'చిత్తూరు జిల్లా కళాపరిషత్'ను ఏర్పాటు చెయ్యడం ద్వారా జిల్లా యువకులలో చైతన్యవంతమైన కదలికను తీసుకువచ్చి ఎందరినో కథకులుగా తీర్చిదిద్దగలిగిన వ్యక్తి పి. రాజగోపాలు నాయుడు గారు.

చిత్తూరు జిల్లాలో ఆ రోజులకు ఆధునిక పత్రిక 'నాగేలు'. రైతుల సమస్యల్ని దృశ్యమానం చెయ్యడం కోసం పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి గారు ఆ పత్రికను నెలకొల్పారు. పి. రాజగోపాలు నాయుడుగారు ఈ పత్రికకు సంచాలకత్వం వహించారు. రైతు సమస్యలమీద వారిరువురూ వెలువరించిన రైతు కథలు ఆ పత్రికలో ముద్రింపబడ్తూ వచ్చాయి.

అయినా ఆధునిక కథకునిగా, రాయలసీమకు చెందిన తొలి కథకునిగా గుర్తింపు పొందిన చిత్తూరు జిల్లా రచయిత కె. సభా. ఆయన వ్రాసిన మొట్టమొదటి కథ 'కడగండ్లు' 1944 ఏప్రిల్ నెలలో చిత్రగుప్త అనే పక్షపత్రికలో ప్రచురితమైంది. దీనినిబట్టి చిత్తూరు జిల్లాలో ఆధునిక కథ గురజాడ వారి 'దిద్దుబాటు' కథ నుండీ 34 సంవత్సరాల ఆలస్యంగా ఉద్భవించిందని చెప్పవచ్చు. అందుకు కారణాలను చాలమంది విమర్శకులు చాలరకాలుగా విశ్లేషించారు. వెనుకబడ్డ ప్రాంతమైన కళింగాంధ్ర ఆ విషయంలో రాయలసీమ కన్నా చాల ముందున్నదని చెప్పక తప్పదు. అయితే ఇటీవలి కాలంలో కొందరు పరిశోధకుల ద్వారా చర్చకు వస్తున్న విషయములను పరిశీలిస్తే చిత్తూరుజిల్లా మదనపల్లెకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ ఎం.వి. పాపన్నగుప్తగారు మంచి రచయిత అనే 1925-1938 సంవత్సరముల మధ్యకాలంలో అనేక కథలు, 'భానుమతి' అను నవల, కొన్ని పద్యములు, వ్యాసములు, ప్రభోదములు రచించిన వారని

తెలుస్తున్నది. కడపజిల్లా ప్రొద్దుటూరు నుండి వెలువడుతుండిన ఆనాటి పత్రిక 'భారత కథానిధి'లో ప్రచురితమైన వీరి కథలు కొన్ని, గ్రంథరూపంలోవున్న భానుమతి నవల ఇటీవల లభ్యమైనవి.

అయితే అతి తక్కువ వ్యవధిలో అనేక కథలు వ్రాసిన ఖ్యాతి కె. సభా గారికి దక్కుతుంది. వారి కథలలో "పాతాళగంగ" ప్రసిద్ధమైనది.

చిత్తూరు జిల్లా గర్వించదగ్గ కథారచయితలలో ముఖ్యులు మధురాంతకం రాజారాం గారు. కె. సభాగారి పరిచయంతో ప్రేరణ పొందిన మధురాంతకం రాజారాం గారు మానవ స్వభావాలకు దర్పణం పట్టే, హృదయస్పర్శతో కూడిన కథలు వందలాదిగా వ్రాసి ఆంధ్ర పాఠక లోకాన్ని మెప్పించగలిగారు.

అనేక సాహిత్య సంస్థలు, కొన్ని విశ్వవిద్యాలయాలు మాత్రమేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వారి ప్రతిభను గుర్తించి గౌరవించాయి. సంక్రాంతి శంఖం, రాతిలో తేమ లాంటి గొప్ప విలువైన కథలను అలవోకగా వందలాదిగా వెలువరించి చిత్తూరు జిల్లా ఖ్యాతిని రాష్ట్ర వ్యాపితం చేశారాయన. 1950–60 దశకంలో పత్రికారంగం వారి కథలతో ధగధగలాడిందని చెప్పవచ్చు.

1960 తరువాత వెలుగు చూసిన చిత్తూరు జిల్లా కథా రచయితలలో ముఖ్యులు. సి. వేణు, కలువకొలను సదానంద, ముంగర శంకరరాజు, పులికంటి కృష్ణారెడ్డి, ఆర్.ఎస్. సుదర్శనం, నూతలపాటి గంగాధరం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, డా॥ జోళిపాలెం మంగమ్మ, ఆర్. వసుంధరాదేవి, ద్వారకా (సి. హెచ్. వెంకటరత్నం), ఇరువారం లోకనాధం, నైనారి చిన్నప్ప, ఎ.బి. ఎతిరాజులు మొదలైనవారు. వీరి కథలతో సాహితీ స్రవంతి క్రొత్త పుంతలు తొక్కడం మొదలు పెట్టిందని చెప్పవచ్చు. వీరిలో కొందరు దీపధారులని చెప్పవచ్చు.

వీరి సమకాలికులుగానూ, అనుసరించి కలాల్ని కదిలించిన వారిగానూ శ్రీమతి గల్లా అరుణకుమారి, కాణిపాకం లింగన్న, సనగరం పార్థసారథి, శ్రీరాములురెడ్డి, వి. వీణావాణి, డా॥ జె. భాగ్యలక్ష్మి, దొరస్వామి, లంకెపల్లి కన్నయ్య నాయుడు, టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి, ఓలేటి కృష్ణ, వేంపల్లి అబ్దుల్‌ఖాదర్, శైలకుమార్, జావీద్‌హుస్సేన్, మునిసురేష్ పిళ్ళై, వడ్డెర చండీదాస్, కేశవరెడ్డి, తుమ్మల రామకృష్ణ, నాయుని కృష్ణమూర్తి మొదలైన వారిని పేర్కొనవచ్చు.

తరువాతి తరంలో పేరొందిన రచయితలుగా మధురాంతకం నరేంద్ర, మహేంద్ర, సౌదా, డా॥ రాసాని, గోపిని కరుణాకర్, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, కాశీభట్ల వేణుగోపాల్, మునిసురేష పిళ్ళై, పసుపులేటి గీత, మేర్లపాక

మురళి, కె.ఎస్. రమణ, రమణ జీవి, వేంపల్లి సికిందర్, శ్రీమతి వి. నాగమణి, అరుణా సహదేవ్, పులోమజాదేవి, పసుపులేటి మాణిక్యవీణ, కె.ఎస్.వి., జి.ఆర్. మహర్షి, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, పలమనేరు బాలాజీ, శ్రీరావు, లెనిన్ ధనిశెట్టి, కె. చంద్రమౌళి, సుంకోజి దేవేంద్రాచారి, జయచంద్రారెడ్డి, జిళ్ళెళ్ళ బాలాజీ, కలువకుంట్ల గురునాథ పిళ్ళై, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, పుష్పాంజలి, దుర్గమ్మ, శ్రీమతి లక్ష్మీరాఘవ, పి. శైలజ, పి.వి. ప్రసాద్, శైలజామిత్ర మొదలైన వారిని గుర్తించవచ్చు.

ఇటీవలి కాలంలో అతి తక్కువ వ్యవధిలో ఎక్కువ కథలు వ్రాయడమేకాక దాదాపు పది సంపుటాలను స్వల్ప వ్యవధిలో తీసుకురాగలిగిన కథా రచయిత సి.ఎన్. చంద్రశేఖర్. ఆ తరువాత స్థానంలో రాచపూటి రమేష్ కన్పిస్తున్నారు. అల్దీ రామకృష్ణ కవి వినాయకుడి కథలు వ్రాసి పుస్తకరూపంలో తేవడం ద్వారా చిత్తూరు జిల్లా కథకుల జాబితాలో తనకో స్థానం కల్పించుకోగలిగారు.

అప్పుడప్పుడు మాత్రమే కథలు వ్రాసే కథకులూ కొందరున్నారు జిల్లాలో. అలాంటి వారినీ, వారి కథలనూ కూడా వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. “పెండ్లి ప్రయాణం” లాంటి గొప్ప కథలు వ్రాసిన టి. తిప్పారెడ్డి, ‘జింకపిల్ల’ లాంటి విలువైన కథలు వ్రాసిన కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై (కవిగా, వ్యాసకర్తగా వీరు ప్రసిద్ధులు), ఆముదాల మురళి, కె. వేణుగోపాల్ (సింధూ) బడబాగ్ని శంకరరాజు, పురాణం త్యాగమూర్తి శర్మ, ఓ.వి.యన్. గుప్త మొదలైనవారు ఈ కోవకు చెందుతారు.

ఇతర జిల్లాల నుండీ చిత్తూరు జిల్లాకు వచ్చి “వంజె” లాంటి అద్భుతమైన కథలను, ‘ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్’ లాంటి కథా సంపుటాలను అందించిన జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, డి. రామచంద్రరాజు లాంటి కథకులూ కొందరున్నారు జిల్లాలో.

పైన తెలిపిన కథకులలో కొందరు కథా రచనలోనే కాక మిగిలిన సాహితీ ప్రక్రియలన్నింటిలో ఎంతో ప్రతిభ కనబరచి రాష్ట్ర, దేశ, ప్రపంచ వ్యాప్తంగా జిల్లా పేరును కీర్తి శిఖరాల పైన నిలిపారు. వారిని గూర్చి తదుపరి విడివిడిగా తెలియజేసే ప్రయత్నం జరుగుతున్నది.

పొరపాటునో, అవగాహనా లోపం వల్లనో కొందరు చిత్తూరు జిల్లా కథకుల పేర్లు ఇందులో చోటు చేసుకొనకపోయి వుండవచ్చును. అందుకు ఈ వ్యాస రచయిత క్షంతవ్యుడు. వారిని గూర్చి తెలియపరచవలసిదిగా కోరుచున్నాను.

## నడిచే గ్రంథాలయం-కదిలే సాహితీ సౌరభం

## *డా॥ జోలెపాళెం మంగమ్మ*



**ఆ**ంధ్రదేశానికి చెందిన చిత్తూరు జిల్లాలోని ఓ మారుమూల ప్రాంతం అయిన మదనపల్లె మహనీయులకూ, కారణజన్ములకూ జన్మనిచ్చిన చల్లని పుణ్యభూమి. ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి గారి జననం ఈ వూర్లోనే రాఘవేంద్రరావు వీధిలోని ఓ పురాతన భవంతిలో జరిగింది. సాహితీ బ్రహ్మర్షి అని చెప్పుకోదగ్గ ఆంధ్రదేశపు ప్రముఖ సాహితీవేత్త ఆర్.ఎస్. సుదర్శనం గారి జననం కమ్మవీధిలో జరిగింది.

డాక్టర్ అనిబీసెంట్ లాంటి విదేశీయులు ఎందరో ఇక్కడ కాలం గడపడానికి ఎంతో ఇష్టపడ్డారు. మనం ప్రస్తుతం పాడుకుంటున్న జాతీయగీతానికి రూపకల్పన, తొలిపర్యాయం స్వరకల్పన మదనపల్లెలోనే జరిగిందన్న వాస్తవం చాల మందికి తెలియదు. ఇక్కడి బెసెంట్ దివ్యజ్ఞాన కళాశాలలో చదువుకున్న విద్యార్థులెందరో దేశ విదేశాలలో పేరెన్నికగన్న ఉద్యోగులూ, నాయకులూ అయ్యారు.

జోలెపాళెం సుబ్బన్న, లక్ష్మమ్మ అను పుణ్యదంపతులకు దాదాపు 87 సంవత్సరాల క్రితం మదనపల్లె జె. సుబ్బన్నవీధిలో జన్మించిన మంగమ్మగారు మదనపల్లెలోనూ, అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి చెందిన మద్రాసు మొదలైన పట్టణాలలోనూ విద్య, ఉన్నత విద్యలను అభ్యసించారు.

వారి ఉద్యోగజీవితం విద్యాశాఖలో ప్రారంభమైనా త్వరలోనే ఢిల్లీలోని ఆల్ ఇండియా రేడియోకు మారింది. మృదుగంభీర స్వరంతో వారు చదివిన తెలుగు వార్తలు, ఆంగ్ల వార్తలు ఇప్పటికీ చాల మందికి జ్ఞాపకం ఉన్నాయి. 1968 డిసెంబరు 6న కొత్తఢిల్లీ నగరాన్ని జనసంఘ్ కార్యకర్తలు అల్లకల్లోలానికి గురిచేసినప్పుడు, రేడియో కేంద్రం మీద వారు దాడి జరుపుతుండగా, సెక్యూరిటీ గార్డులు కాల్పులు జరిపి కొంతమందిని చంపివేస్తుండగా అట్టి విపత్కర, విషమ పరిస్థితులలో ఆహారం కూడా లభ్యం కాని పరిస్థితిలో కూడా నిబ్బరంగా వార్తలు చదివిన ఘనత మంగమ్మ గారిది.

కథా రచనతో ప్రారంభమయిన వారి సాహితీ వ్యాసాంగం త్వరలోనే

పరిశోధకురాలిగా ఎదగడానికి సహకరించింది. ఆమె కార్యదీక్షకు అంకిత భావానికి ఒక ఉదాహరణగా ఈ క్రింది విషయాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది.

ఇన్‌ఫర్‌మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ మినిస్ట్రీలో అసిస్టెంటు ఎడిటర్‌గా వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు 1974 వ సంవత్సరంలో రష్యా నుండీ వచ్చిన డెలిగేట్సుకు ట్రాన్స్‌లేటర్‌గా వ్యవహరించినప్పుడు వీరికి అల్లూరి సీతారామరాజు మీద పరిశోధన చెయ్యాలన్న ఆసక్తి కలిగింది.

మొదట... హెూంపబ్లిక్, హెూం పోలీస్ రిపోర్టులను, పాత న్యూస్ పేపర్లను, అప్పటి ఆఫీసర్ల రిపోర్టులను పరిశీలించి కొంతమేర అల్లూరి సీతారామరాజుగారి రోజువారీ కార్యక్రమాలను గూర్చి విషయసేకరణ చెయ్యగలిగారు. ఆపై ప్రభుత్వ అనుమతి పొందిన వీరు పరిశోధన నిమిత్తం మన్యం ప్రాంతానికి వచ్చారు. ప్రభుత్వం సహాయకుడుగా పంపిన ఒక అటెండరుతో కలిసి వారు జరిపిన పరిశోధన సీతారామరాజు గారి జీవితంలో చాలకొద్ది సంవత్సరాలకు సంబంధించినదే కావచ్చు... కానీ ఎంత లోతుగా, అంకితభావంతో జరుపబడిందో నాకు తెలిసినంతవరకూ విశ్లేషించదలచు కున్నాను.

చింతపల్లి పోలీసుస్టేషను, చింతపల్లి తహసీల్‌దారు కార్యాలయాల నుండీ ప్రారంభమైన వీరి పరిశోధన సీతారామరాజుగారి కార్యకలాపాలతో పాటు, మల్లుదొర, ఘంటందొరల సహాయ సహకారాలను గూర్చి కూడా కొనసాగింది.

కొయ్యూరు కొండ మార్గాన్ని, గూడెం కొండల నుండీ ఒరిస్సా బార్డర్ వరకూ సీతారామరాజు గారు ఉపయోగించి రహస్య మార్గాలను, వారు సంచరించిన ఇతర ప్రాంతాలను వరుసగా, ఓపికగా స్వయంగా పరిశీలించారు మంగమ్మగారు. తమ పరిశోధనలో ప్రాక్టికల్ వర్కుగా! ముఖ్యంగా బ్రిటిష్‌వారు సీతారామరాజుగారిని కట్టివేసి కాల్చి చంపిన చింతచెట్టు దగ్గర్నుండీ, ఎడ్లబండి మీద నిలబెట్టిన మంచానికి వారి శవాన్ని నిలబెట్టి కట్టి ప్రజలను భయభ్రాంతులను చేస్తూ కొయ్యూరు నుండీ కృష్ణదేవపేట వరకూ (కె.డి. పేట వరకూ) ఊరేగించిన ప్రదేశాలను, గ్రామాలనూ చాల శ్రద్ధగా తిరిగి పరిశీలించారు. పదహారుమైళ్ళ అవతల వారి శరీరాన్ని ఖననం చేయబడ్డ ప్రదేశాన్ని (ప్రస్తుత సమాధిని) పరిశీలించే వరకూ వారి గమనంలో 216 (రెండు వందలా పదహారు) గ్రామాల మీదుగా పరిశోధన సాగింది. దాదాపు 216 గ్రామాలలోనూ వీరిని చూసిన ప్రజలు ఎంతో సహకరించారు. సీతారామరాజు గారి పోరాటాలలో కొన్నింటివి

గూర్చి తెలియజెప్పారు. నాలుగయిదు పోరాటాలను గూర్చి స్పష్టంగా తెలుసుకోవడానికి ఆ గ్రామాల సందర్శనే కీలకం అయింది! అంతేకాక వారి ఆయుధాల గూర్చి, ప్రణాళికలను గూర్చి కూడా విషయసేకరణ సులభసాధ్యమైంది.

కలకత్తా సీక్రెట్ సొసైటీకి చెందిన శ్రీ అరబింద్‌ఘోష్, శ్రీ బిరేన్‌ఘోష్ మొదలైన వారితో సీతారామరాజుగారు ఏర్పరచుకున్న సంబంధాలు మొదలైన విషయాలెన్నింటినో వీరు అధ్యయనం చెయ్యగలిగారు.

ఒక స్త్రీ ఇన్ని ప్రాంతాలను పరిశీలించి స్వయంగా వాస్తవాలను వెలికితీసి ప్రపంచానికి చాటడానికి ప్రయత్నించడం సాధారణ విషయం కాదు. వారు ఏ పనినయినా అంత నిర్దిష్టంగా, కూలంకషంగా పరిశీలించి ముగించడానికే సిద్ధపడ్తారన్నది వాస్తవం.

మన్యం ప్రాంతంలో వారి ఈ పరిశోధన తాలూకు గ్రంథం తొలుత “AGENCY REBELLION” పేరిట ఆంగ్లంలోనూ, తదుపరి “విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు” పేరిట తెలుగులోనూ ముద్రింపబడి దేశ, విదేశాలకు, ఆంధ్రవీరుడి పోరాట పటిమను, ధైర్య, శౌర్యాలను, స్వాతంత్ర్య సమరజ్వాలల తీవ్రతను తెలియజేశాయి.

ఇలాంటి విలువైన గ్రంథాలను పదివరకూ ఆంగ్లంలోనూ, పదివరకూ తెలుగులోనూ వెలువరించారు డా॥ జోలెపాళెం మంగమ్మగారు.

“బుక్ ప్రింటింగ్ ఇన్ ఇండియా” పరిశోధక గ్రంథం వెలువరించడానికి వీరు సల్పిన కృషి కూడా సామాన్యమైనది కాదు. భారతదేశంలోని ముఖ్య గ్రంథాలయాలలోని పురాతన గ్రంథాలనే గాక విదేశాల లైబ్రరీలలోని గ్రంథాలను కూడా స్వయంగా వెళ్ళి పరిశీలించి తిరిగి రావడం జరిగింది. దాదాపు ప్రతి పనీ ఇలాగే చేస్తారు వారు.

తమ విద్య, నిరంతంర పరిశోధనలకు ఆటంకం కావచ్చుననే ఉద్దేశ్యంతో వారు వివాహాన్ని గూర్చి కూడా ఆలోచింపకుండా ఒంటరిగానే జీవనయానాన్ని కొనసాగించారు.

నిండయిన జీవితం గడిపిన మంగమ్మగారు నిగర్వి. గతాన్ని పూజిస్తూ, వర్తమానాన్ని ప్రేమిస్తూ, భవిష్యత్తులో ప్రపంచం పరమ ప్రశాంతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చాల సాదా, సీదాగా జీవితం గడుపుతున్న మహోన్నత వ్యక్తిత్వం వారి స్వంతం.

పెద్ద పోష్ బంగళాలో, ఆధునిక హంగులతో నివసించగల స్థితిలో వున్నా,

1920వ సంవత్సరంలో నిర్మితమైన తమ పూర్వీకుల చిన్న గృహంలో అనేక వేల గ్రంథాల మధ్య నిరంతర విద్యార్థిలా కాలం గడుపుతున్న ఆదర్శ స్త్రీమూర్తి ఆమె.

అడుగు నేలమీద పెట్టాల్సిన అవసరం లేకుండా వాహనం ఉపయోగించ గల అవకాశాలున్నా అనేక సభలకూ, సమావేశాలకూ వారు నెమ్మదిగా నడచిరావడం చూచినప్పుడు ఉత్తేజం కలిగేది.

తమ లేఖినితో సాహితీలోకాన్ని సుసంపన్నం చేసి, దేశ, విదేశాలలో తెలుగు తేజోరేఖలను దృశ్యమానం చేసిన అపూర్వ ఆదర్శ వ్యక్తి డా॥ జె. మంగమ్మగారు. ఆంధ్రదేశం మాత్రమే కాదు భారతదేశం మొత్తం గర్వించదగ్గ ఆంధ్రసాహితీ తేజోమూర్తి డా॥ జోలెపాళెం మంగమ్మ గారు.

ఇంత పెద్ద వయస్సులో సైతం ఋషివ్యాలీ పాఠశాల విద్యార్థులకు జ్ఞానోదయ విద్యాసంస్థ పాఠశాలలకు వెళ్ళి తమ సేవలను అందజేస్తుండిన డా॥ మంగమ్మ గారు ఇటీవల కొంత అస్వస్థతకు గురయ్యారు. కాలికి మేజర్ ఆపరేషన్ అయి నడవడానికి కష్టపడుతున్నస్థితిలో సైతం వీరు రచనా వ్యాసంగాన్ని, పరిశోధనలను సాగించారు. ప్రస్తుతం మళ్ళీ ఆరోగ్యాన్ని పొంది మళ్ళీ తమ కార్యకలాపాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్న వీరు సాహితీ లోకానికే ఆదర్శప్రాయులు.

అనేక సాహితీ సంస్థలు వీరి సేవలను పొందాయి. మరెన్నో ప్రభుత్వ, ప్రైవేటు కళాసంస్థలు వీరిని గౌరవించి తమ్ము తాము గౌరవించుకుంటూ అవార్డులను ప్రదానం చేశాయి. భారతజాతికే కాదు సంపూర్ణ ప్రపంచ మానవాళికే ఆదర్శప్రాయం డా॥ జోలెపాళెం మంగమ్మ గారు!!

**డా॥ జోలెపాళెం మంగమ్మగారి కొన్ని ముఖ్యమైన గ్రంథాలు:**

**తెలుగు :**

- సి.పి. బ్రౌన్ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు.
- అనిబీసెంట్.
- విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు.
- శ్రీ అరవిందులు.
- సరోజినీ నాయుడు.
- ఆంధ్రదేశానికి క్రైస్తవ మిషనరీల సేవలు.

- భారత చట్టసభ.
- తెలుగులో అచ్చయిన తొలి పుస్తకాలు.
- సీమపాలేగార్లు మొదలైనవి.

**ఆంగ్లం :**

- ది రేట్ స్కూల్స్ ఆఫ్ గోదావరి.
- బుక్ ప్రింటింగ్ ఇన్ ఇండియా.
- చాప్టర్, ఆన్ క్రిస్టియన్ మిషన్స్ ఇన్ ఆంధ్ర.
- ఏజన్సీ రెబిలియన్ మొదలైనవి.

**డా॥ మంగమ్మ జోలెపాళెం వారు అధికారం సాధించిన భాషలు :**

- ఆంగ్లం (Ph.D. వరకూ మీడియం)
- ఫ్రెంచ్.
- Esperanto
- తెలుగు.
- అరవం (తమిళం).
- హిందీ.
- కన్నడ.

**డా ॥ జె. మంగమ్మగారి ప్రస్తుత చిరునామా :**


**డా॥ జోలెపాళెం మంగమ్మ**

II - 250 - F - 40

మార్టూరినగర్, రెడ్డీస్ కాలనీ

**మదనపల్లె – 517 325**

చిత్తూరు జిల్లా

ఫోను నెం : 08571 – 223011


**స్వాతంత్ర్య సమరయోధులుగానే తెలిసిన అలనాటి కథకులు,**

## కవి, నవలాకారులు, అభ్యుదయవాది

### మాన్యశ్రీ యం.వి. పాపన్న గుప్త *(1905-1986)*



**చి**త్తూరు జిల్లాలోని చల్లని పుణ్యభూమి మదనపల్లె మాత ధరించిన మేలిఆభరణములలో ఒక మేలిఆభరణము స్వర్గీయ యం.వి. పాపన్నగుప్త గారు.

ఒక్కో మనిషిలో ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. చాల కొద్దిమందిలో మాత్రం చాల, చాల ప్రత్యేకతలు కన్పించడమే కాక వారివల్ల సమాజానికి ఎన్నో హితకరమైన కార్యాలు కూడా ఒనగూడుతుంటాయి. అలాంటివారిలో ఒకరు శ్రీ యం.వి. పాపన్నగుప్త గారు.

శ్రీ యం.వి. పాపన్నగుప్త గారి జననం తేది 12-06-1905 నాడు మదనపల్లెలో జరిగింది. మొగిలి వంశమునకు చెందిన శ్రీమతి రామలక్ష్మమ్మ, శ్రీ కృష్ణయ్య అను పుణ్యదంపతులు వీరి జననీ జనకులు. వీరి తండ్రిగారు బ్రిటీషిండియా గవర్నమెంటులో ఆంగ్లేయ అధికారుల మన్ననలు పొందిన తహశీల్దారుగా, ఇంచార్జి డిప్యూటీ కలెక్టరుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ఉండేవారు. దురదృష్టవశాత్తు వారు పాపన్నగుప్త గారు పసివయసులో ఉండగానే పరమపదించారు.

మాతామహుల ఇంట పెద్దతల్లిగారి ఆదరాభిమానములతో పాపన్నగుప్త గారు విద్యలో చక్కటి ప్రతిభను కన్పరచుచూ పెరిగి పెద్దవారైనారు.

తమ పండ్రెండవ యేటనే డా॥ అనిబిసెంట్‌గారి ఉపన్యాసములు వినడం వీరి జీవితానికి ఒక మంచి మలుపు. అంత చిన్నవయసులోనే ప్రభావితులై, దేశభక్తితో అనిబిసెంట్ వారి వెంబడి 'హోంరూల్' ఉద్యమం లోనూ, మాలవ్యా గారి వెంబడి 'విదేశీ వస్త్ర బహిష్కరణ' ఉద్యమంలోనూ పాల్గొన్నారు. తదుపరి 1918 లో 'ప్రిన్స్ ఆఫ్ వేల్సు' మద్రాసు వచ్చినప్పుడు పాఠశాల బాలభటులతో వెళ్ళి ప్రిన్స్ సన్మానమును బహిష్కరించు కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పుడే వారు ప్రభుత్వ పాఠశాలను వదిలి జాతీయ కళాశాలలో విద్యార్థిగా చేరడం జరిగింది. ఆ దశలోనే చదువులోనే కాక ప్రసంగాలలో, రచనలలో కూడా ప్రతిభ కన్పరచి ప్రఖ్యాతి చెందారు.

తెలుగుభాష మీది ప్రేమతో క్రమంగా భాషమీద సాధికారత సాధించి చిలకమర్తి లక్ష్మీనరసింహం వారి అసంపూర్ణ నవల అయిన 'కర్పూరమంజరి'ని ఎంతో నేర్పుతో, గొప్ప ఊహతో, ఆశావహమైన భావజాలంతో పూర్తిచేసి చిన్న వయస్సులోనే మన్ననలు పొందారు.




మంచి విద్యార్థిగా, గొప్ప హాకీ క్రీడాకారుడిగా ఎదుగుతున్న పాపన్న గుప్తగారు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులవల్ల చదువుకు, హాకీకి దూరమయి ఉద్యోగ జీవితంలో ప్రవేశించాల్సి వచ్చింది. ఉద్యోగంలో కూడా తమదైన ముద్రను, ప్రతిభను కన్పరచుచూ అంచెలంచలుగా పైకెదిగి ఆర్.డి.ఓ. కావాల్సిన తరుణంలో దేశాభిమానంతో ఉద్యోగమును త్యజించి ఖద్దరు ప్రచారంలో భాగస్వాములయ్యారు.

క్రమంగా గాంధీగారి అడుగుజాడలలో నడుస్తూ కాంగ్రెసు సేవలో మొత్తం ఆంధ్రదేశమును పర్యటించారు. వీరి విలువను గుర్తించిన ఆనాటి అఖిల భారత ఆర్యవైశ్య యువజన సంఘము వారు పాపన్నగుప్త గారిని సంఘమునకు అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.

ఆ రోజులలో రాయలసీమలో రాళ్ళు తప్ప మరేమీ లేవనీ, రాయల సీమలో విద్యాధికులు లేరనీ కొన్ని ప్రాంతాల వారిచే భావింపబడ్తుండేదట. ఆ స్థితిలో పాపన్నగుప్త గారు మైసూరు, తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ మొదలైన ప్రాంతాలన్నింటిలో పర్యటించి ప్రజలను ఉత్తేజితులను చేస్తూ, కొన్ని చోట్ల గ్రంథాలయాలు, వ్యాయామశాలలు, యువజన సంఘాలు, వసతి గృహములు స్థాపింపబడడానికి కృషి చేస్తూ రాయలసీమ ఔన్నత్యాన్ని తెలియపరుస్తూ అన్ని రంగాలలో కూడా రాయలసీమ రతనాల సీమగానే వుంది అనే భావనను పెంపొందిస్తూ అన్యులకు కనువిప్పు కలిగించారు.

భోగరాజు పట్టాభిసీతారామయ్య గారీ ప్రాంతానికి వచ్చినప్పుడు వారికీ యం.వి. పాపన్నగుప్త గారికీ కొన్ని ప్రాంతీయ అభిప్రాయబేధములు ఏర్పడినప్పటికీ పాపన్న గుప్త గారు ఆ అపోహలను తొలగించి సానుకూల వాతావరణాన్ని ఏర్పరచగలిగారు. అప్పుడు పాపన్నగుప్త, భోగరాజు పట్టాభిగార్ల మధ్య ఏర్పడిన ఒడంబడిక తర్వాతికాలంలో శ్రీభాగ్ ఒడంబడికకు పునాది అయింది. అలా సర్కారు, రాయలసీమల మధ్య అత్యున్నత స్నేహ భావనలు పెంపొంద గలిగాయి.

**యం.వి. పాపన్నగుప్త గారు నడచిన మైలురాళ్ళు :**

చిత్తూరు జిల్లా 'భారత్ సేవక్ సమాజ్ ఛైర్మెన్‌గా' సాంఘిక, సామాజిక కార్యక్రమాల నిర్వహణ.

విజయవాడ, హైదరాబాదు ఆలిండియా రేడియో కేంద్రాలకు ప్రభుత్వం తరఫున గౌరవ సంచాలకులుగా సేవలు అందించడం.

దక్షిణ భారత హిందీ ప్రచారసభకు ఆంధ్ర ప్రాంతపు ఛైర్మెన్‌గా 20 సంవత్సరాలపాటు వ్యవహరించడం. దాదాపు నలభై సంవత్సరాల పాటు సాధారణ సభ్యులుగా కొనసాగి హిందీ భాష వ్యాప్తికి కృషి సల్పడం.

దక్షిణ భారత హిందీ మహాసభకు చెందిన ఐదు రాష్ట్రాల ఉమ్మడి బ్రాంచి అయిన మద్రాసు టి.నగర్ హెడ్డాఫీసుకు ఐదు సంవత్సరాలు ఛైర్మెన్‌గా (ఇందిరాగాంధీ గారితో కలసి) కొనసాగడం.

మదనపల్లె శాస్త్రివీధి (సంత బాజారువీధి) లో రైతుల నుండీ సహకార పద్ధతిలో పాల సేకరణ సంఘమును స్థాపించి మదనపల్లె పట్టణానికి పాలు సరఫరా చేయిస్తూ, చుట్టుపట్ల ప్రాంతాల వారికి కూడా జీవనోపాధి కల్పించడం. హరిజన, గిరిజనులకు టిటిడి ఆలయాలలో ప్రవేశార్హతలు కల్పించడం.

ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ కార్యక్రమాలలో తమవంతు కృషి కొనసాగించడం.

బచావత్ ఒడంబడికకు చెందిన కమిటీ సభ్యులుగా వ్యవహరించడం. మదనపల్లె ఖాదీభాండార్ స్థాపనలో ప్రముఖ పాత్ర వహించడం.

ప్రయివేటు బ్యాంకుల వ్యవస్థాపనలకు కృషి చేశారు. మదనపల్లెలో దాదాపు వంద ప్రయివేటు బ్యాంకులు వీరి ప్రోత్సహంతో వెలసి చాలాకాలం కొనసాగాయి.

బాల్య వివాహాలు చేయరాదని, ఆడపిల్లలు రజస్వల అయినప్పుడు అట్టహాసంగా వేడుకలు నిర్వహించరాదని నిరవధికంగా ప్రచారాలు కొనసాగించారు.

స్త్రీ విద్యను ప్రోత్సహించి, అభివృద్ధిపరచడానికి కృషి సల్పారు.

తమ వద్దకు వచ్చే కవులు, పండితులు, రచయితలతో సాహితీ చర్చలు జరుపుతుండేవారు. స్వయంగా పద్య రచనలు, కథలు, నవలలు వ్రాయడంలో అందెవేసిన చెయ్యి అనిపించుకున్నారు.

ప్రభుత్వం నుండీ తామ్రపత్రం పొందిన ఈ ప్రాంతపు మొదటి వ్యక్తి వీరే!

రవీంద్రభారతిలో రాష్ట్రపతి నుండీ సన్మానం పొందారు.

**కవిగా, రచయితగా యం.వి. పాపన్నగుప్త గారి ప్రస్థానం :**

శ్రీ యం.వి. పాపన్నగుప్త గారి రచనావ్యాసంగంలో కథలు కూడా ప్రాధాన్యత వహించాయనీ, చాల కథలు అప్పటి పత్రికలలో ప్రచురితం కావడం జరిగిందనీ తెలుస్తోంది. దురదృష్టవశాత్తు వారు వ్రాసిన కథలేవీ పెద్దగా అందుబాటులో లేవు. కనీసం వారి కుటుంబీకుల వద్ద కూడా వారు వ్రాసిన కథలు లేకపోవడం విచారకరం. ప్రొద్దుటూరు నుండీ వెలువడుతుండిన భారత కథానిధి అన్న పత్రికలో 1927వ సంవత్సరం సెప్టెంబరు మాసములో ప్రచురితమైన 'హైమావతి' అన్న కథ, 1928 సం॥ము మార్చి మాసములో ప్రచురితమైన 'సావిత్రి' అన్నకథ మాత్రం లభ్యమైనవి. ఈ కథలలో దిగువ మధ్య తరగతి ప్రజల పేదరికము, అనుబంధాలు, తమ కుటుంబీకుల కోసం ఎంతటి త్యాగానికయినా... చివరికి ప్రాణ త్యాగానికయినా వెనుకాడని ప్రేమ మొదలైనవి గొప్ప హృదయస్పర్శతో దర్శనమిస్తాయి. ఈ కథలు ఎంత సహజంగా సరళ గ్రాంధికంలో, సులభశైలితో సాగుతాయో అంత చక్కగానూ ముగుస్తాయి.

క్లుప్తతకు పెద్దపీట వేయబడిన హైమావతి కథలో ఒక నవలకు సరిపడా కథా వస్తువు అంతర్లీనంగా కన్పించి ఆశ్చర్యం కలిగిస్తుంది.

'సావిత్రి' అన్న పెద్ద కథ అప్పటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టిన కథ. దాదాపు సగం కథ చక్కటి ప్రేమగాథగా నడుస్తుంది. తరువాత ఆనాటి మనుషుల ఆలోచనలు, విపరీత మనస్థత్వాలు, విషాదభరిత సంఘటనలు కథలో చోటుచేసుకుని గంభీరంగా సాగి విషాదంగా ముగుస్తుంది.

ఈ కథ చదివినప్పుడు పాపన్నగుప్తగారి మీద శరత్‌చంద్ర చట్టోపాధ్యాయ రచనల ప్రభావం ఉందనీ, ఈ కథ దేవదాసు, బడదీదీ నవలల ఇతివృత్తాలకు సమీపంగా వుందనీ అన్పిస్తుంది.

ఇంతమంచి పాతకథలు సాహితీవేత్తల దృష్టికి రాకపోవడం నిజంగా చిత్తూరు జిల్లా.. ముఖ్యంగా.. మదనపల్లె చేసుకున్న దురదృష్టం. ఎవరైనా పూనుకుని వారి కథలన్నింటినీ సమీకరించగలిగితే ఎంత బావుండును? అని అన్పిస్తుంది ఈ కథ చదివితే.

ఇహ పాపన్నగుప్త గారి సాహితీ ప్రస్థానంలో అమూల్యమైన భాగం వారిచే లిఖింపబడిన 'భానుమతి' నవల. ఈ నవలను యం.వి. పాపన్నగుప్త గారు సరళ గ్రాంధిక భాషలో 1928 వ సంవత్సరం ప్రాంతంలో రచించినారు. ఈ నవల తాలూకు వెయ్యిప్రతుల ముద్రణ మదనపల్లె బ్రిటానియా ముద్రాక్షరశాలలో 1930వ సంవత్సరము ఏప్రియల్, మే మాసములలో జరిగినది.

పాపన్నగుప్త గారి తండ్రిగారైన కీ॥శే॥ కృష్ణమశ్రేష్ఠి గారికి పద్యాలతో అంకితమివ్వబడ్డ ఈ అమూల్య గ్రంథరాజమునకు మదనపల్లె దివ్యజ్ఞాన కళాశాల తెలుగు పండితులైన విరూపాక్షం వెంకటరామశాస్త్రిగారు ఉపోద్ఘాతాన్నందించినారు. ప్రొద్దుటూరు భారత కథానిధివారు మరియు మాన్యశ్రీ విద్వాన్ హరి వెంకటేశ్వరులు, బి.ఏ., ఎల్.టి. గారు అభిప్రాయములను అందజేశారు. ఈ నవల వెల ఒక్కరూపాయి ఎనిమిది అణాలు (1-8-0). పుటలు - 332.

నలభై ప్రకరణములు కలిగిన ఈ నవల అద్భుతమైన నడకతో పాఠకులను తన వెంట లాక్కొని పోగలుగుతుంది. స్త్రీల సమస్యలను గొప్ప హృదయ స్పర్శతో తెలియజెప్పిన నవల యిది. సమాజానికి హితకరమైన, హితకరం కాని చాల విషయాలను ఈ నవలలో ప్రస్తావిస్తూ సంఘానికి గొప్ప సూచన లందించారు పాపన్నగుప్త గారు. ముఖ్యంగా కుటుంబాలలోని స్వార్థపరుల వల్ల అమాయకులు, నిస్సహాయులు పడే బాధలు, బలయిపోయే కొన్ని విధానాలు కళ్ళకు కట్టించారు.

పాపన్నగుప్త గారి ఆప్తమిత్రులైన జోలె పాళెం సుబ్బన్న గుప్త గారి కుమార్తె అయిన జోలెపాళం మంగమ్మ (88 సంవత్సరాల వయస్సులో కూడా నిరంతరం విద్య, సాహితీ రంగాలలో కృషి సల్పుతున్న విద్యావేత్త, ప్రఖ్యాత చారిత్రక పరిశోధకురాలు) గారు భానుమతి నవల గూర్చి ఇలా అంటారు...

"బ్రిటీషు వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొని జైలుశిక్ష అనుభవిస్తుండినప్పుడు పాపన్నగుప్త గారు జైలులోనే ఈ నవలను వ్రాయడం జరిగింది. ఈ నవల ముద్రణ జరిగిన పిదప నేను చదవడం మొదలు పెట్టినప్పుడు మధ్యలో నాలుగైదు పర్యాయాలు కన్నీటితో, హృదయభారంతో చదవడం ఆపివేసి తరువాత మళ్ళీ చదవాల్సి వచ్చింది. అంత హృద్యంగా, సహజంగా సన్నివేశాలను, పాత్రల కదలికలను సృష్టించగలిగారు రచయిత.

ముఖ్యంగా రాత్రులందు పినతల్లి జుత్తు విరబోసుకుని భానుమతిని భయపెడ్తూ హింసించే సన్నివేశాలలోని హృదయ వేదనను నేనీ నాటికీ మరచిపోలేకపోతున్నాను. గొప్ప నవల భానుమతి. అయితే ఆ నవలకు తగినంత ఖ్యాతి, గుర్తింపు రాలేదు."

డా॥ జోలెపాళెం మంగమ్మగారన్న మాటల్లో ఎంతో వాస్తవం వుంది. ఎందుకంటే సుప్రసిద్ధ సాహితీ విమర్శకులు స్వర్గీయ వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారి దృష్టికి కూడా ఈ నవల రాలేదు.

వల్లంపాటి వారి దృష్టికి ఈ నవల వచ్చి వుంటే తప్పకుండా ఈ నవలకు రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు లభించి ఉండేది బహుశా!

ఇంకో బాధాకరమైన విషయం యేమిటంటే సాహితీ బ్రహ్మర్షి స్వర్గీయ ఆర్.ఎస్. సుదర్శనం వారి దృష్టికి కూడా ఈ నవల రాకపోవడం.

ఇటీవల శ్రీపొదిలినాగరాజు (బద్వేలు) మరియు శ్రీ తవ్వా వెంకటయ్య (తవ్వారిపల్లె) అను పరిశోధక విద్యార్థుల పరిశోధనలలో ఎం.వి. పాపన్నగుప్త గారి రచనలను గూర్చి తెలియరావడం ముదావహం.

సాహిత్యాభిమానులు ఎవరైనా పూనుకుని ఈ నవలను పునర్ముద్రణ గావిస్తే జీవితాంతం ఖద్దరు మాత్రమే ధరించిన ఆ దేశభక్తుడైన సాహితీవేత్తకు నివాళి కాగలదు.

దురదృష్టవశాత్తు యం.వి. పాపన్నగుప్త గారి పద్యరచనలు కూడా అందుబాటులో లేవు. ఒకే ఒక చిరుపొత్తము 'ఆర్యవైశ్యయౌన్నత్య ప్రబోధములు' మాత్రము అందుబాటులో ఉన్నది. 1938 వ సం॥లో పద్నాలుగురు వైశ్య ప్రముఖులను ప్రస్తుతిస్తూ 14 పద్యములు, చివరగా వాటి భావములను సైతం వ్రాయబడ్డ గ్రంథమిది.

**ఆ ప్రముఖులు ...**

1. సర్ యం. విశ్వేశ్వరయ్య, 2. కుసుమగుప్త, 3. స్వామి వెంకటాచలం శ్రేష్ఠి, 4. లాలా జలపతిరాయి, 5. ఆత్మూరి లక్ష్మీనరసింహం, 6. 'వాసవి' (మద్రాసు నుండీ వెలవడుతుండిన పత్రిక), 7. ముత్తా వెంకటసుబ్బారావు, 8. ఉప్పులూరి వెంకటపున్నారావు, 9. మద్ది వెంకటరంగయ్య, 10. నేతి శ్రీరామమూర్తి, 11. రమణయ్య శెట్టి, 12. వైమానికారూఢులు, 13. పులవర్తి కమలావతీదేవి (కవయిత్రి), 14. మఠం బాలసుబ్రహ్మణ్య గుప్త

శ్రీ పెండేకంటి వెంకటసుబ్బయ్య శ్రేష్ఠిగారు ప్రకాశకులుగా ఈ చిరు గ్రంథము యొక్క వెయ్యి ప్రతులను నంద్యాల పాండురంగ ముద్రాక్షరాశాల యందు 1938వ సంవత్సరంలో ముద్రించడం జరిగినది. వెల ముద్రింపబడలేదు గనుక దీనిని 'అమూల్యము'గా వితరణ చేసి ఉండవచ్చునని భావింపవచ్చును.

పాపన్నగుప్తగారి కుమారులైన మోహనగుప్తగారు తండ్రి అడుగుజాడలలో నడుస్తూ మాజీ సైనికుల సంక్షేమం కోసం, కరువు కేంద్రాల కోసం సత్యాగ్రహాలు చేశారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంటుగా కొన్ని వేలమందిచే రక్తదానం చేయించారు. తాము స్వయంగా 35 పర్యాయాలు రక్తదానం చేశారు. ఐ క్యాంపులు, జనరల్ వైద్య క్యాంపులు నిర్వహించారు. వారి చిరునామా :

**శ్రీ ఎం.వి. మోహన్‌గుప్త, సన్/ఆఫ్ ఎం.వి. పాపన్నగుప్త**
16-96-సి2, సుభాస్ రోడ్,
మదనపల్లె - 517 325. లేదా
కర్ణాటక జాలీడే హోం & గిఫ్ట్ సెంటర్
హార్సిలీ హిల్సు
సెల్ నెం : 9440091849.

## సాహిత్యం ఊపిరి - విమర్శప్రాణంగా జీవించిన సాహితీ బ్రహ్మర్షి ఆర్.ఎస్. సుదర్శనం (13-12-1927 - 14-12-2001)



**చి**త్తూరు జిల్లాలో ఒక చివరగా వున్న చల్లని పుణ్యభూమి మదనపల్లె! మహనీయులకూ కారణజన్ములకూ నిలయం!! ఈ చిన్న పట్టణంలో ప్రపంచ ప్రఖ్యాత తత్త్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి వారి జననం జరిగిన భవనం వున్న రాఘవేంద్రరావు వీధికి కూతవేటు దూరంలో వున్న కమ్మవీధిలోని ఓ గృహంలో... ఉత్తమ అధ్యాపకుడు, విద్యారంగ పాలనాదక్షుడు, తాత్విక రచనల సృజనకర్త, తెలుగు సాహితీ విమర్శను వరవడించిన ప్రఖ్యాత సాహితీవేత్త, గొప్ప మానవతావాది అయిన ఒక కారణజన్ముని జననం యాదృచ్ఛికంగానే జరిగింది.

కాలంతోపాటు ఎంతో ఎత్తుకెదిగిన విద్యాధిపతి, ఆలోచనాపరుడు, కాలానికి నిలిచే కవి, కలకాలం గుర్తుండిపోయే పండితుడు కరువుసీమలో ప్రత్యేక కథకుడు నవలాకారుడు, అద్వైత సిద్ధాంతాన్ని జీవితానికన్వయించుకుని తన రచనలలో ప్రతిఫలింప చేసిన అత్యాధునిక తత్వవేత్త... డాక్టర్ కొత్వాలు అమరేంద్రగారి మాటల్లో చెప్పాలంటే... తెలుగు విమర్శక లోకంలో ఓ సుదర్శన చక్రం, సీమ సాహిత్యరత్నం అయిన ఆర్.ఎస్. సుదర్శనంగారే ఆ కారణజన్ములు.

'ఆర్' అనగా 'రాటకొండ' వారి ఇంటి పేరు, ఎస్ అనగా సుబ్బయ్య (సుబ్బయ్య నాయుడు) వారి తండ్రిగారి నామధేయం... వెరసి రాటకొండ సుబ్బయ్య సుదర్శనం వారి పూర్తి పేరు. శ్రీమతి కనకమ్మగారు వీరి తల్లిగారు.

మదనపల్లె జిల్లా పరిషత్ హైస్కూలు, బిసెంట్ దివ్యజ్ఞాన కళాశాల మరియు మద్రాసు క్రైస్తవ కళాశాలలలో వీరి విద్యాభ్యాసం జరిగింది.

1947 నుండీ 1985 వరకూ వీరు లెక్చరర్‌గా, ఇంగ్లీషు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటుగా, ప్రిన్సిపాల్‌గా, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌గా... వివిధ హోదాలలో మద్రాసు, బందరు, మదనపల్లె, అనంతపురం, వరంగల్, నల్గొండ, చిత్తూరు, విడవలూరు, మళ్ళీ అనంతపురం మరియు రాజమండ్రిలలో పనిచేశారు.

వారు ఎక్కడ పనిచేస్తున్నా ఉత్తమ అధ్యాపకులుగా ఎంత పేరు పొందేవారో ఉత్తమ రచయితగా, సాహితీవేత్తగా కూడా అంతే ముద్రను తమదైన శైలిలో పొందేవారు.

వారు పనిచేసే కళాశాలలోనే కాక ఆ ప్రాంతంలో కూడా ఒక సాంస్కృతిక వాతావరణం ఏర్పరచడం కోసం ప్రయత్నించడం వారి ప్రత్యేకత. రాజకీయేతర మానవతా విలువల్ని విద్యార్థులు తమ జీవితాలలో పొందుపరచుకుని వ్యక్తిత్వ వికాసాలు పెంపందించుకునే విధంగా వారిని తీర్చిదిద్దడానికి అనువైన వాతావరణాన్ని కూడా ఏర్పరచడానికి ప్రయత్నం చేశారు.

వారు విడవలూరులో పనిచేసేటప్పుడు సర్వశ్రీ విశ్వనాథసత్యనారాయణ, ఆరుద్ర, పిలకా గణపతిశాస్త్రి, మహీధర రామ్మోహన్‌రావు లాంటి ప్రముఖ సాహితీ వేత్తలను తమ కాలేజికి ఆహ్వానించి విద్యార్థులకు వారిచే సత్సందేశాల నందింపజేసి, వారిని సైతం తగు విధంగా సన్మానించి పంపడం జరిగింది.

వారు చిత్తూరులో పనిచేయు సమయంలో కొడవటిగంటి కుటుంబరావు లాంటి ప్రముఖ రచయితలు, అనంతపురంలో పనిచేయునప్పుడు గుంటూరు శేషేంద్రశర్మ, ఆరుద్ర, పిలకా గణపతిశాస్త్రి, మహీధర రామ్మోహన్‌రావు, గజ్జల మల్లారెడ్డి, నీలం సంజీవరెడ్డి మొదలైన వారు ఆయా కాలేజీలను సందర్శించి విద్యార్థులకు మానవతా విలువలతో కూడిన సాహితీ సందేశాలను అందించడం జరుగుతూ వచ్చింది.

ఆయనెక్కడున్నా ఏ పనిచేస్తున్నా సాహిత్యమే ఆయన ఊపిరి! నిరంతర విద్యార్థి, చదువరి అయిన వీరియొక్క రచనా వ్యాసంగం మొదట కథలతోనే ప్రారంభమైంది. వీరి కథలలో వ్యక్తి మానసిక స్వేచ్ఛకు ఇవ్వబడిన ప్రాధాన్యత స్పష్టంగా కన్పిస్తుంది. మధుర మీనాక్షి కథలో అయితే వ్యక్తి అంతర్గత ఆలోచనల తాలూకు విశ్వరూపం కన్పిస్తుంది. ఒకరకంగా ఆ రోజులలో వారు సాహసోపేతమైన రచనలు చేసి ఆలోచనాపరులైన పాఠకులను మెప్పించారని చెప్పక తప్పదు.

యదార్థ మానసిక స్థాయిని దాటి ఆధ్యాత్మిక అన్వేషణ, తాత్వికత అంతర్లీనంగా అద్వైతం కలిగిన కథలు వ్రాసిన అతికొద్ది మంది తెలుగు కథకులలో ఆర్.ఎస్. సుదర్శనం గారిదే అగ్రస్థానం అన్నది అనేక మంది మేధావుల భావన!

వీరి మొట్టమొదటి కథ 'కాలం తెచ్చిన మార్పు' 1961వ సంవత్సరంలో 'భారతి' మాసపత్రికలో ప్రచురితం అయినప్పుడు శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ లాంటి ప్రముఖుల ప్రశంసలు పొందింది.

ఆర్.ఎస్. సుదర్శనంగారు పదిహేడు కథలు మాత్రమే వ్రాశారు. అయితే ప్రతి కథా ఓ ఆణిముత్యమే!

వీరి 'మధుర మీనాక్షి' కథ 'తెలుగు కథా సాహిత్యంలో వంద ఆణిముత్యాలు' పట్టికలో స్థానాన్ని పొందింది. మధుర మీనాక్షి కథా సంపుటికి నూతలపాటి గంగాధరం సాహితీ కుటుంబం సాహితీ అవార్డు లభ్యమైంది.

అమృతుడు, ఏకాంతం, మొగలిపువ్వు, ఎరుపు, ప్రతిబింబం మొదలైన కథలు పాఠకులను వెంటాడి, వేధించి, ప్రశ్నించే కథలు.

వారి కవిత్వం, నవలలు, ఇతర రచనలు వారు అస్తిత్వవాది అనే తెలియ జేస్తాయన్నది కొందరు విమర్శకుల అభిప్రాయం.

వీరి మొట్టమొదటి నవల అనుబంధాలు. 1958లో ఆదర్శ గ్రంథమండలి వారు ప్రచురించారు. తరువాత మళ్ళీ వసంతం, అసురసంధ్య, సంసారవృక్షం నవలలను వెలువరించారు.

సంసారవృక్షం నవల (1977) రాష్ట్ర సాహిత్య అకాడమీ వారి అవార్డును మరియు నూతలపాటి గంగాధరం సాహితీ కుటుంబం అవార్డును పొందింది. మనస్తాత్విక నవలగా ప్రత్యేక ప్రశంసల నెన్నింటినో పొందిన ఈ నవల హిందీ, ఇంగ్లీషు, గుజరాతీ భాషలలోనికి అనువదింపబడింది. సాహిత్యం విద్యార్థులకు పాఠ్యాంశంగా కూడా ప్రభుత్వంచే నిర్ణయింపబడింది.

1959–1961 మధ్యకాలంలో ఆర్.ఎస్. సుదర్శనం గారిచే రచింపబడిన కవితలోని కొన్ని పద్య ఖండికలు భారతి మరియు స్రవంతి పత్రికలలో ప్రచురితం అయ్యాయి. ఆ కవితలను 1970వ సంవత్సరంలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు స్వయంగా 'నిశాంతం' పేరిట ముద్రింప జేయగా సదరు గ్రంథాన్ని 1975వ సంవత్సరంలో గుంటూరు శేషేంద్రశర్మగారు తమ అభిప్రాయంతో పాటు పునర్ముద్రించడం జరిగింది. నిశాంతం కావ్యంలో (పునర్ముద్రణలో) సాహితీకారుల అభిప్రాయములు, 'నాటకాంతం' పేరిట అయిదు కవితలు అనుబంధము చోటు చేసుకున్నవి.

నిశాంతం కావ్యాన్ని గూర్చి విశ్వనాథ సత్యనారాయణగారు 1970లో మున్నుడిలో ఇలా వ్రాశారు... "ఇందులోని భాషకానీ, భావములు కానీ గొప్ప

స్థాయిలో నున్నవి. ఇది ఒక అనుభూతి కావ్యము. ఒక వ్యాఖ్యాన కావ్యము. ప్రకృతి రహస్యములకు, సర్వ జగద్రహస్యములకు నొక భాష్యము వంటి కావ్యము. అట్లు చేయుటయే కష్టము...

ఆర్.ఎస్. సుదర్శనంగారు ఒక పర్యాయం కేంద్ర సాహిత్య అకాడమీ సమావేశాలకు వెళ్ళినప్పుడు తెలుగు సాహితీ రంగంలోని ప్రముఖ రచయితలను గూర్చి, వారి రచనలను గూర్చి ప్రస్తావించగా ఇతర భాషా సాహితీవేత్తలు... "తెలుగులో కూడా అంత గొప్ప రచయితలున్నారా?" అని ఆశ్చర్యపోవడం జరిగిందట.

ఆ సంఘటన తదుపరి ఆర్.ఎస్. సుదర్శనంగారు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, త్రిపురనేని గోపీచంద్, గుడిపాటి వెంకటచలం మొదలైన వారి రచనలపై ఆంగ్లభాషలో వ్యాసాలను వ్రాసి ఇతర రాష్ట్ర రచయితలకు పరిచయం చేస్తూ వచ్చారు.

తరువాత వాటినే తెలుగులో "సాహిత్యంలో దృక్పథాలు" పేరిట ప్రచురించారు. సాంప్రదాయక సాహితీ విమర్శలతో విసిగి పోయిన రచయితలకు, తెలుగు సాహిత్య విద్యార్థులకు ఒక గొప్ప కొత్త అనుభూతినీ, ఆశలనూ కలిగించింది ఈ గ్రంథం. ఒకరకంగా చెప్పాలంటే ఎందరికో మార్గదర్శకం అయింది కూడా. 'వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో వంద ఆణిముత్యాలు' అన్న పరిశోధక పట్టికలో సైతం స్థానం పొందింది ఈ గ్రంథం.

అంతవరకూ కూడా సారస్వత వ్యాసాలుగా పరిగణింపబడ్తున్న సమీక్షలు సాహిత్య విమర్శలుగా మార్పు చెందడానికి, సాహితీ విమర్శ అనేది ఒక ప్రత్యేక శాఖగా మారడానికి కూడా అవకాశాలు కలిగించింది ఈ గ్రంథం!

వీరి లేఖిని నుండి వెలువడిన విశ్లేషణాత్మకమైన వ్యాసావళిని 1972వ సంవత్సరంలో "సమాజము–సాహిత్యం" పేరిట చిత్తూరు జిల్లా రచయితల సంఘం (చి.ర.సం) వారు ప్రచురించడం జరిగింది. ఈ గ్రంథానికి సాహిత్య విమర్శకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభ్యమైంది (1975).

తరువాత కాలంలో 'సాహిత్య నేపథ్యం' వ్యాసావళి గ్రంథాన్ని వెలువరించారు. 'కవి హృదయం'. 'చలం జీవితం – సాహిత్యం' వారి విమర్శనాత్మక గ్రంథాలలో ముఖ్యమైనవి.

ఆర్.ఎస్. సుదర్శనంగారు సమీక్షించిన పుస్తక సమీక్షలు నూరింటిని 'నూరు సమీక్షలు' అన్న గ్రంథంగా వెలువరించారు. సాహితీ రంగంలో వున్న ప్రతి ఒక్కరూ చదివి తీరాల్సిన గ్రంథాలు ఇవి.

ఆర్, ఎస్. సుదర్శనం గారి జీవితమంతా గ్రంథపఠనం, వ్రాయడం లోనే గడచిపోయిందని చెప్పవచ్చు. వారి జీవితమే సాహిత్యం!

అనారోగ్యంతో ఉన్నప్పుడు కూడా సాహిత్య విషయాల నెన్నింటినో విశేషంగా చెప్తూ ఉండేవారు.

వారి మనసు (మేధస్సు) మహాశక్తి!

వారి నాలుక సరస్వతి!!

మరణానికి మరీ సమీపంలోనికి వచ్చిన రోజులలో సైతం వారు సల్పిన నిరంతర సాహితీ వ్యవసాయం చిరస్థాయిగా నిలచి పోతుంది.

వారిని గూర్చి తెలియజేయడమన్నది ఒక గంభీరమైన మహాసముద్రాన్ని దోసెడు నీటిని చూపుతూ తెలియజెప్పడమే అన్నది అతిశయోక్తి కాదు! సాహితీ బ్రహ్మర్షి అని చెప్పుకోదగ్గ మహానుభావుడు ఆయన!!

విద్యారంగంలోనూ, సాహితీరంగం లోనూ వీరు పొందిన పురస్కారాలు అన్నీ, ఇన్నీ కావు... పురస్కార ప్రదాతలు తమను తాము గౌరవించుకోగలిగారు. నేషనల్ బుక్‌ట్రస్ట్, తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాహిత్య అకాడమీలు తమ సలహా సంఘాలలో వీరికి సభ్యత్వాన్నిచ్చి గౌరవించాయి.

సాహితీరంగంలో కృషి సల్పుతున్న వారు ఎవరయినా సరే ఆర్.ఎస్. సుదర్శనం గారి తెలుగు, ఆంగ్ల గ్రంథాలనూ, ఆంగ్లాను వాదాలనూ తప్పక పరిశీలించడం ఎదుగుదలకు ఎంతగానో ఉపకరించగలదు. వారి రచనలను అధ్యయనం చేయడం అంటే ఒక సుదీర్ఘమైన కాలరేఖను స్పర్శించడమే! వాస్తవానికి అది ఓ అద్భుత కాలస్పర్శ!!

కుప్పం ద్రవిడ యూనివర్శిటీ వారు, అలకనంద ప్రచురణలు – విజయవాడ వారూ ఆర్.ఎస్. సుదర్శనం గారి ముద్రిత – అముద్రిత రచనలన్నింటినీ ముద్రించి అందుబాటులోకి తీసుకువస్తుండడం ముదావహం.

ప్రస్తుతం వారి శ్రీమతి, పిల్లలు అమెరికాలోయున్నారు. వారి కుమారుని చిరునామా :

**Krishna. C. Ratakonda**
1489 West View Drive
York Town
**New York- 10598**
Phone : 001 - 914 - 455 - 3684

## కథకులకూ, నవలాకారులకూ కరదీపికలందించిన ఆధునిక విమర్శకులు వల్లంపాటి వెంకటసుబ్బయ్య

## (15-3-1937 - 2-1-2007)



**సా**హిత్యం సమాజాన్ని జాగృతపరుస్తుంది. ప్రభావితం చేస్తుంది! ఉత్తమ సాహిత్యం వల్ల అత్యుత్తమ సమాజం ఆవిష్కృతమవుతుంది. సమాజికపరమైన అన్ని అంశాలమీదా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తన ప్రభావాన్ని తప్పక చూపే సాహిత్యంలో విమర్శది ఓ ప్రత్యేకస్థానం. తన హెచ్చరికల ద్వారా సాహిత్యాన్ని పక్కదారులు పట్టనీయకుండా, క్రమపరుస్తూ ఉత్తమ సాహిత్యంగా మలచగలుగుతున్నది విమర్శే! అందువల్ల విమర్శకులు సైతం పరోక్షంగా సాహిత్యాన్ని కొంతమేర ప్రభావితం చెయ్యగలుగుతారు.

నవీన సాహిత్య విమర్శకులలో చిత్తూరు జిల్లాలో ముఖ్యులు వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు. డా॥ కొత్వాలు అమరేంద్రగారు తమ 'సీమ సాహితీ రత్నాలు' గ్రంథంలో వల్లంపాటిని విమర్శక ఘనాపాటిగా అభివర్ణించారు. వల్లంపాటి వారి రచనలు చదువుతున్నప్పుడు వారి సుస్వరం వింటున్నట్లే అనుభూతి కలుగుతుంది. అది వారి శైలియొక్క ప్రత్యేకత!

చిత్తూరు జిల్లా 'రొంపిచెర్ల'లో శ్రీమతి లక్ష్మీదేవమ్మ, శ్రీ అశ్వర్థమయ్య దంపతులకు 15-3-1937 తేదీన జన్మించారు వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు. వీరి తాతగారు శ్రీరామచంద్రప్పగారు ఆ ప్రాంతంలో ప్రసిద్ధులు.

చిన్న వయసునుండీ మార్క్సిజాన్ని బాగా జీర్ణించుకున్న వల్లంపాటి వారు ఆధునిక సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యడానికి మునుపే ప్రాచీన సాహిత్యాన్ని కూడా ఎంతో లోతుగా తరచి చూసిన వ్యక్తి. సంస్కృత, ఆంధ్ర, ఆంగ్లభాషలలో చాల చిన్నతనం నుండీనే వారికి మంచి ప్రావీణ్యం ఉండేది. అమరకోశం వారికి పునాది అంటారు త్యాగమూర్తి శర్మగారి లాంటి వారి సమీప బంధువులు. సాంబ నిఘంటువును తల్లక్రిందులుగా చెప్పగలిగే వారట వల్లంపాటి వారు హైస్కూలు రోజులలోనే!

చిత్తూరులోని జిల్లా పరిషత్‌లో స్కూలు టీచరుగా జీవితాన్ని ప్రారంభించిన వీరు విద్యార్థులకు విద్యనందిస్తూనే తాము నిరంతర విద్యార్థిగా మారి తమలోని సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకుంటూ మానవ మనస్తత్వాలకు, ఆలోచనలకు అద్దంపడ్తూ సమకాలీన, సామాజిక సమస్యలను విశ్లేషిస్తూ రచనలు ప్రారంభించారు.

1958లో ఆంధ్రప్రభలో ప్రచురితమైన "అన్యథా శరణం నాస్తి" వీరి మొట్టమొదటి కథ. 1961లో ఆంధ్రపత్రికలో వారి 'కోరిక తీరినవేళ' కథ ప్రచురితమయ్యే సమయానికి కథకులుగా మంచి ఖ్యాతి పొందారు. 1962లో ఆంధ్రప్రభ నిర్వహించిన నవలల పోటీలో వారి "ఇంద్రధనుస్సు" నవల ద్వితీయ బహుమతిని పొంది వీరిని మంచి నవలాకారులుగా నిలబెట్టింది. దూరతీరాలు, మమతలు – మంచు తెరలు, జానకి పెళ్ళి తదితర నవలలు వీరి లేఖిని నుండీ వెలువడ్డాయి.

స్కూలు టీచరు స్థాయిలోనే ఆగిపోకుండా ఎస్వీ యూనివర్శిటీ నుండీ ఆంగ్ల సాహిత్యంలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్సు పట్టాపొంది, ఆంధ్రా యూనివర్శిటీ నుండీ బి.యడ్.తో మదనపల్లె బిసెంట్ దివ్యజ్ఞాన కళాశాలలో అధ్యాపక పదవిని చేపట్టారు. ఆపై హైదరాబాదు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు అండ్ ఫారెన్ లాంగ్వేజస్ నుండీ పి.జి. డిటిఇ మరియు యం.లిట్. పొందారు.

వ్యవస్థ పట్ల నిర్దిష్టమైన అభిప్రాయాలను కలిగివున్న వల్లంపాటి గారు నిరంతర సాహితీ అధ్యయనంతో తమ మేధస్సును పెంచుకుంటూ ప్రపంచ సాహిత్యాన్ని వివిధ కోణాల్లోంచీ లోతుగా పరిశీలించారు. ఆ అనుభవంతో వీరు అనేక ఆంగ్ల గ్రంథాలను తెలుగులోకి అనువదించడం జరిగింది. వాటిలో ముఖ్యమైనవి...

1. చరిత్ర అంటే ఏమిటి?, 2. చరిత్రలో ఏం జరిగింది?, 3. ప్రపంచ చరిత్ర, 4. ప్రాచీన భారతదేశంలో ప్రగతి – సాంప్రదాయం, 5. నవల – ప్రజలు, 6. ప్రాచీన భారతదేశ చరిత్ర, 7. లజ్జ

కన్నడమూలం వడీలాల్ నవలను కూడా వీరు 'కడుపుమంట' పేరిట తెలుగులోకి అనువదించడం జరిగింది.

వల్లంపాటి వారి ఆంగ్ల రచనలలో ముఖ్యమైన గ్రంథాలు ....

1. నోబుల్ ప్రయిజ్ ఫర్‌ది డంగ్లింగ్ మెన్.

2. గ్రాహంగ్రీన్‌ది ఆప్టమిష్టిక్ సాల్వనిస్టు.

3. వక్రోక్తి అండ్ లింగ్విస్టిక్ డీవియేషన్ మొదలైనవి.

ఇంకా వీరు శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య, తిలక్, వివిన మూర్తి, సింగమనేని నారాయణ మొదలైన కథకుల పుస్తకాలను ఆంగ్లభాషలోనికి తర్జుమాచేశారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఎంతో మంది నవలాకారులకూ, లెక్కకు

మించిన కథకులకూ దిశా, నిర్దేశాలను చూపగలిగిన కొన్ని గ్రంథాలతో వీరు సాహిత్య విమర్శకులుగా ఖ్యాతిని పొంది ఓ దీపధారిలా నిలచిపోయారు. ఆ రచనలలో ముఖ్యమైనవి.

1. వల్లంపాటి సాహిత్య వ్యాసాలు, 2. అనుశీలన, 3. నవలా శిల్పం, 4. కథాశిల్పం, 5. విమర్శనా శిల్పం

ఆధునికి తెలుగు కథా రచన మీద సశాస్త్రీయంగా, వివరణాత్మకంగా, విమర్శనాత్మకంగా, సులభ శైలిలలో గొప్ప విశ్లేషణలతో వ్రాయబడిన మొట్టమొదటి గ్రంథంగా సాహితీ ప్రముఖుల ప్రశంశలు పొందిన వీరి 'కథాశిల్పం' గ్రంథానికి 1999 సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ వారి సాహితీ అవార్డు లభ్యమైంది.

శాస్త్రీయంగా ఉండేదే అసలైన విమర్శ అని ఘంటాపథంగా చెప్పే వల్లంపాటి వారిని ఎంతగానో ప్రభావితపరచిన సాహిత్య విమర్శకులు 'లీవిస్'. ఆ కమిట్‌మెంటుకు తమ జీవితాంతం కట్టుబడ్డారు వారు.

శ్రీ పుట్టపర్తి నరాయణాచార్యుల వంటి కవి, పండితులతో సాన్నిహిత్యం కలిగి వుండిన వల్లంపాటి వారు సంస్కృతభాష మీద, పురాణ, ఇతిహాస గ్రంథాల మీద మంచి కమాండ్ కలిగి వుండేవారు. ఆకాశం నుండీ భూమి మీదకు దూకిన గంగా ప్రవాహంలా వారి నోటి గుండా మృదుగంభీరస్వరంతో జాలువారిన 'శివతాండవం' పద్యాలన్నీ వినగల అదృష్టం మ.ర.సం. సభ్యులకు దక్కింది ఓనాడు.

లోతయిన కవి, నిఖార్సయిన పండితులు, ఉత్తమ కథకులు, నవలాకారులు, ఆధునిక విమర్శకులు అయిన వీరికి లభ్యమైన పురస్కారాలు కొన్ని...

1. తాపీ ధర్మారావు స్మారక అవార్డు - 1995.

2. కొండేపూడి సాహిత్య అవార్డు - 1996.

3. పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్శిటీ అవార్డు - 1997.

4. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు - 1999

5. కుప్పంరెడ్డెమ్మ సాహితీ అవార్డు - చి.ర.సం. ద్వారా.

వల్లంపాటి వారి చిట్టచివరి పరిశోధక సృజన 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం - సామాజిక సాంస్కృతిక విశ్లేషణ'.

తీవ్ర అనారోగ్యంతో మృత్యువుకు చేరువలో ఉన్నప్పుడు సైతం గ్రంథాధ్యయనంలోనే గడిపారు వారు. 'అత్యుత్తమ నవల నొకదానిని వ్రాయాలి' అని అంటుండే వారు. ఆ కార్యం నిర్వర్థించకుండానే 2-1-2007 నాడు నిశ్శబ్దంగా నిష్క్రమించిన ఈ నిరంతర కృషీవలుని సాహితీ కృషిని అధ్యయనం చెయ్యడమే మనం వారి కివ్వగలిగిన నిజమైన నివాళి. వీరి కథలు, నవలలు అన్నియు పునర్ముద్రణ గావింపబడి అందుబాటులో లభ్యమవుచున్నవి.

**వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారి కుమారుని చిరునామా :**

**శ్రీ వల్లంపాటి ప్రసాద్**
3-55, టీచర్స్ కాలనీ
నక్కలదిన్ని
**మదనపల్లె - 517 325**
ఫోన్ : 08571 - 220139
సెల్ : 9703255889

## వేంపల్లి అబ్దుల్ ఖాదర్‌గారి కథలన్నీ గుండెల్ని కదిలిస్తాయి!
## కంటతడి తెప్పిస్తాయి!!



వ్రాయడం వేరు! వ్రాసిన దాన్ని జీవితానికి అన్వయించకుంటూ అడుగు లేయడం వేరు!! వ్రాయడం కొద్దో గొప్పో సులభం... ఎటొచ్చీ దాన్ని ఆచరించడం కాస్త కష్టం! ఆ కష్టమైన పనిని ఇష్టంగా అమలు పరచే దిశగా అడుగులేస్తూ ఆశాజనకంగా కన్పిస్తున్న రచయిత శ్రీ వేంపల్లి అబ్దుల్ ఖాదర్. ఆయన మాటతీరును, ప్రవర్తనను, వ్యక్తిగత జీవన విధానాన్ని ఏకాస్త పరిశీలించినా ఆ విషయం అవగతమవుతుంది.

దాదాపు డెబ్బయి ఏడేళ్ళ క్రితం శ్రీ వేంపల్లి హుస్సేన్ సాహెబ్, శ్రీమతి వేంపల్లి హుస్సేన్ బీబీ పుణ్యదంపతులకు కలికిరి (చిత్తూరు జిల్లా)లో జన్మించిన వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ గారు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు... ప్రవృత్తి రీత్యా వచనకవి, కథకులు, వ్యాసకర్త.

"I am an Indian Muslim" అంటూ భావోద్వేగంతో నిండు సభల్లో ప్రకటించుకోగల ఈ రచయిత బహుకాలంగా శక్తివంతమైన వందలాది కవితలతో అసంఖ్యాకులైన పాఠకులను అలరించిన వచన కవిగా ప్రసిద్ధులు. వీరు వ్రాసిన కొన్ని కవితలలోని వర్ణనా చాతర్యం బహు ప్రశంసనీయం. మరికొన్ని కవితలలో కన్పించే ప్రాంతీయతా, వినవచ్చే సహజత్వమూ కవి ప్రతిభకూ, ఆలోచనా విధానానికీ దర్పణంగా కన్పిస్తాయి. కొన్ని కవితలలో అయితే అలవోకగా ఇమిడిన పదాల అమరికా, శక్తివంతంగా కదిలే వాక్యాల కదలికా అద్భుతం అని అనేలాచేస్తాయి పఠితులను.

తదుపరి 'మల్లెరేకు' అన్న కథా సంపుటితో ఆధునిక కథా సాహిత్యంలో తమకూ కొంతమేర స్థానం సంపాదించుకుని కథకులుగా గుర్తింపును పొందారు.

ఈ రచయితకు సమాజం పట్ల మంచి అవగాహన వుంది. ప్రస్తుత పరిస్థితుల మీద ఆక్రోశం వుంది. అయితే ఆయన మనసులో ఎప్పటికయినా అత్యుత్తమ సమాజాన్ని చూడగలమన్న ఆశలూ వున్నాయి... ఆలోగా రాలిపోతున్న మల్లెరేకుల పట్ల ఆయన గుండెల్లో అంతులేని దుఃఖంతో కూడిన విషాదరేఖలెన్నో వున్నాయి. అవన్నీ ఆయన కథల్లో ప్రతి ఫలిస్తాయి!, మనిషితనంతో మానవత్వాన్ని ప్రబోధిస్తాయి!!

ఆపై వీరు చినుకు, మేఘం కవితా సంపుటాలను వెలువరించి సాహిత్యాభిమానుల మన్ననలను చూరగొన్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే వీరి సాహిత్య వ్యాససంపుటి 'వాకిలి' మరో ఎత్తు!

వాకిలి తీయగానే ఆకట్టుకునే మొదటి శీర్షిక 'వచన కవిత – తీరుతెన్నులు'. ఇందులో వస్తువు నుండీ – వాస్తవికత వరకూ పన్రెండు అంశాలను పరిగణన లోనికి తీసుకుని ఒక్కొక్క అంశాన్నే విశదంగా తమ ఆలోచనా విధానంతో రచయిత వివరించిన విధానం ప్రతి వచన కవీ తప్పక పరిశీలించాల్సిన అంశం. అందులో ఉదాహరణలుగా వీరు అందించిన కవితలు సైతం చాల శక్తివంతంగా, స్పందనతో గుండెలను తాకే విధంగా ఉన్నాయి. వాకిలిలో తదుపరి అంశాలుగా ప్రముఖ రచయితల రచనలను నేపథ్యాలుగా తీసుకుని వారివారి వ్యక్తిత్వాలతో మేళవించి వ్రాయబడిన సాహితీ వ్యాసాల ద్వారా రచయిత ఒక దీపధారిలాగా కన్పిస్తారు.

ఇహ వీరి కథలను పరిశీలిస్తే...

నిరవధికంగా మబ్బులు కమ్ముకుని విడవకుండా రాత్రింబవళ్ళు వర్షాలు పట్టుకున్నప్పుడు... 'ఇహ సూర్యుడు కనిపిస్తాడా'? అన్న సంశయం కలుగుతుంది మనిషికి...అది భ్రమ! అయినా ఆ మబ్బుల వెనుక ఎక్కడో సూర్యుడు వెయ్యికోట్ల వెలుగులతో వెలుగుతూ ఉంటాడన్నదీ, మబ్బులు తొలగిపోగానే ప్రకాశవంతంగా దర్శన మిస్తాడన్నదీ వాస్తవం!! ఈ ఇతివృత్తంతోటే పాపాత్ములు కూడా పశ్చాత్తాప పడగలరని తెలియజెప్పే కథ 'చీకటి కోణం'.

పాఠకుడి గుండెను అందిపుచ్చుకుని నొక్కిపడ్తూ చదివించే కథ 'కొత్త చిగుళ్ళు'. రచయిత తాలూకూ అభ్యుదయ భావాలూ, ఆశావాదమూ కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి ఈ కథలో.

పైకి ఎవరెన్ని మాటలు చెప్పినా లేమిని నిరసించే వారి సంఖ్య ఎక్కువే! మేధావులు సైతం అందుకతీతులు కాకపోవడం కన్పిస్తూనే ఉంటుంది అక్కడక్కాడా!! ఈ స్థితిలో ఒక కడుపునిండిన స్త్రీ (యువతి) పేదరికాన్ని, జబ్బులను చిన్నచూపు చూడడంలో పెద్ద ఆశ్చర్యం ఏముంది? దీన్ని విడమరిచే కథానికే... 'శిలలో సెలయేరు'... అయితే ముగింపులో అదే స్త్రీ (అబల) యొక్క నిశ్శబ్ద ఆక్రందనతో కూడిన గుండెల్ని పిండే ముగింపు పాఠకుల కంట నీరు తెప్పిస్తుంది.

నాగరికత పేరుతో విద్యావంతులు, మేధావులు ముసుగులలో దాక్కుని సాగిస్తున్న అమానవీయ అమానుష కార్యాల తాలూకు నేపథ్యంలో సాగిన కథ 'మల్లెరేకు'. ప్రాచీన స్త్రీ అయినా, ఆధునిక మహిళ అయినా... హృదయం కలిగివున్న ప్రతి స్త్రీ అబలే!... నేరం ఎవరు చేసినా శిక్ష అనుభవించేది మాత్రం అబలేనని తేలుస్తుంది ఈ కథ! రచయిత స్త్రీ హృదయంలోకి పరకాయ ప్రవేశం చేసి ఈ కథను వ్రాశారా? అని అన్పిస్తుంది ఈ కథను చదువుతున్నప్పుడు. ఈ కథను ప్రస్తావిస్తూ కోడూరి శ్రీరామమూర్తిగారు వర్జీనియా వుల్ఫ్ నవలలతోనే గాక ఆమె విషాద జీవనగాథతో కూడా పోల్చడం నిజంగా రచయితకు ఒక అమూల్యమైన అవార్డు ఇవ్వడం లాంటిదే.

కాలానికి నిలిచే కథలు వ్రాసిన కథకుల జాబితాలో ఈ రచయిత పేరు చేర్చవచ్చు. సంఘహితంకోరి, సామాజిక బాధ్యతతో కాలానికి తగిన కథలు వ్రాశారు వారు. గత నలభై సంవత్సరాలుగా వీరు వ్రాసిన కథలలో ఎక్కువభాగం కాలానికి నిలువగలిగేవే, విషాద బిందువులను చిలకరిస్తూ నిన్న మొన్న వ్రాయబడ్డ కథల్లా కన్పించేవే!! అలాంటి కథలలో ఒకటి 'పొగమంచులో సూర్యోదయం'. ఆ కాలాన్నీ, అప్పటి ఆలోచనా విధానాల్నీ సుస్పష్టంగా దృశ్యమానం చేస్తుంది.

ఎవరు చెప్పారు? వేంపల్లి అబ్దుల్ ఖాదర్‌గారు విషాదం తప్ప మరొహటి తెలియని సీరియస్ కథకుడని?! ఆయన పెద్దంత హాస్యప్రియుడు! ఆ విషయం వారి 'ప్రయాణంలో పదనిసలు' కథను చదివితే తెలుస్తుంది. "శ్రీశ్రీ" ఏనాడో చెప్పాడు కద? కళ్ళుంటే చూసీ! వాక్కుంటే వ్రాసీ!! అని. రెండు మూడు గంటల ప్రయాణంలో ఖాదర్‌గారు తాము కళ్ళారా చూసిన వ్యంగ్య వైభవానికి ఇచ్చిన అక్షర రూపం ఈ కథ!

సరయిన సామాజిక దృక్పథం, విశాల హృదయం ఉంటే చాలు సామాన్యుడు కూడా అసమాన్యంగా ఆలోచించి ఆదర్శవంతంగా జీవితాన్ని గడపగలగడం పెద్ద కష్టం కాదని తెలియజేసే కథ 'మాలిన్యం'.

బంధాలు–అనుబంధాలు... వీటి మధ్యన ఎదురయ్యే అటుపోట్లను విశదంగా వివరించే కథ 'నీలితెరలు'. రచయిత ఆశావాదానికి ప్రతీక ఈ కథ.

అన్నీవున్నా అవివేకంతో బ్రతుకులు అతలాకుతలం చేసుకునే ప్రయత్నాలు చేస్తారు కొందరు. అలాంటి వారి జీవితాలకు వాస్తవాలను చూపి సరయిన దిశానిర్దేశం చెయ్యగల దీపధారులయిన అసామాన్యులు కొందరు సామాన్యులలో కూడా ఉంటారు. అలాంటి ఒక మహామనీషి కథ 'తెలిమంచు'.

పండిత పుత్రులు శుంఠలుగా మారితే ఆ తల్లిదండ్రుల విషాదాంతాలకు ప్రతీకగా దర్శనమిచ్చే కథ 'బిడ్డలు'.

వేంపల్లి అబ్దుల్ ఖాదర్‌గారి కథలన్నింటి లోకీ మకుటం అనదగ్గ కథ 'మడిసిగా...'. చీకటిని తిట్టుకుంటూ ఎన్ని రాత్రులు గడుపుతావు? చిట్టి ప్రమిదలో చిన్న ఒత్తిని వేసి, చిటికెడు గింజలు నూరి నూనెదీసి పోసి, వెలిగించి బ్రతకరా వెధవ సచ్చినోడా!... అంటూ ఈడ్చికొట్టే కథ 'మడిసిగా...'. కలికిరి మండలం తాలూకు మాండలికంలో రచయిత కలం చేసిన చిందులు సామాన్యమైనవి కావు... అందుకే కడగంటా కన్నార్పనీయకుండా చదివించ గలుగుతుందీ కథ.

ఇటీవల వీరు మరో రెండు గ్రంథాలను వెలువరించారు.

1. కిరణం (వచన కవితా సంపుటి)

ఈ కవితా సంపుటిలోని కవితలన్నీ మానవీయ విలువలతో కూడుకుని విభిన్నమైన మానవ సంబంధాలను దృశ్యమానం చేస్తున్నాయి.

2. ఆలోచన (విశ్లేషణాత్మక సాహితీ వ్యాసాలు)

ఇందులో శక్తివంతమైన సమకాలీన ఆధునిక సాహిత్య వ్యాసాలు పదహైదు చోటు చేసుకున్నాయి.

ప్రభుత్వం వీరిని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులుగా, రాష్ట్ర అధికారభాషా సంఘసభ్యులుగా నియమించి గౌరవించింది.

ఇంకా ఎన్నో... ఎన్నెన్నో...

దాదాపు ప్రతి కథలోనూ రచయిత ఆత్మ ప్రతిఫలిస్తూ కన్పిస్తుంది.

మొత్తానికి ఆయన కథలన్నీ గుండెల్ని కదిలిస్తాయి!

కంట తడి తెప్పిస్తాయి!!

**వీరి చిరునామా :**

**వేంపల్లి అబ్దుల్‌ఖాదర్**

1-34

కొత్తపేట ఎక్స్‌టెన్షన్

**కలికిరి - 517 234**

ఫోన్ : 08586 - 256034

సెల్ : 9440756131

# అంతర్లీన విషాదాలతో ఆలోచింపచేసే
# ఆర్. వసుంధరాదేవి కథలు



ఎప్పటిమాట? దాదాపు నలభై ఏళ్ళ క్రిందటి మాట! అప్పుడో ఘటన జరిగింది!

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారికి జ్ఞానపీఠ్ అవార్డు వచ్చిన శుభ సందర్భం... నెల్లూరు జిల్లా విడవలూరు డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్‌గారు వారిని ఆహ్వానించి వారి చిత్రపటంతో అభినందన సత్కారం గావించి ఆ కాలేజి విద్యార్థులకు వారి అమూల్య సందేశాన్ని అందింపచేయడం జరిగింది.

ఆ సందర్భంలో శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు ఆ ప్రిన్సిపాల్‌గారి ఇంటికి వెళ్ళి అక్కడ ఒకరాత్రి విశ్రమించడం జరిగింది.

సాధారణ గృహిణి ప్రిన్సిపాల్ గారి సతీమణి అడిగిన ప్రశ్నలకు విశ్వనాథ వారు ఓపికగా జవాబులు ఇవ్వడం మొదలుపెట్టడంతో ఒక గంటపాటు ఆధ్యాత్మిక తాత్విక చర్చ ఇష్టాగోష్ఠిగా జరిగింది.

అనేక లౌకిక, అలౌకిక విషయములపై సాగిన జీవాత్మ-పరమాత్మల సమాలోచన అది!

కెమిస్ట్రీ పోస్టుగ్రాడ్యుయేట్ అయిన ఆ గృహిణి ఆర్. వసుంధరాదేవి. సాంకేతిక తాత్విక ప్రశ్నలకు మేధావి అయిన ఆమె భర్త (ప్రిన్సిపాల్)గారు క్లుప్తంగానూ, శ్రీ విశ్వనాథ వారు విశదంగానూ ప్రత్యుత్తరాలివ్వడంతో ఎంతో విలువైన ఎన్నో విషయాలు ఆ గోష్ఠిలో చోటు చేసుకున్నాయి.

కాలానికి నిలిచే ఇష్టాగోష్ఠి అది. ప్రముఖ కథ, నవలా రచయిత్రి శ్రీమతి ఆర్. వసుంధరాదేవి. ఆ ప్రిన్సిపాల్ గారే సాహితీ బ్రహ్మర్షిగా చెప్పుకోదగ్గ కవి, కథకులు, నవలాకారులు, విమర్శకులు, అనువాదకులు - శ్రీ ఆర్.ఎస్. సుదర్శనం గారు. వసుంధరాదేవి బంగారంలో పొదిగిన వజ్రంలా భాసించింది ఆ గోష్ఠిలో!

అదృష్టవశాత్తు ఆ చర్చ ఆకాలపు టేపురికార్డరుకు చెందిన స్పూల్‌లో రికార్డు చెయ్యబడడం వల్ల నేటికీ అందుబాటులో వున్నది.

స్పందనతో కూడిన లోతయిన ఆలోచనా, అధ్యయనంతో పొందిన అవగాహనా, అపార జీవితానుభవమూ, జయింపనలవికాని మృత్యువు గూర్చి ఒకింత విషాదమూ వసుంధరాదేవిగారి కథల్లో కన్పించి ఆలోచనలను

రేకెత్తిస్తాయి. రక్తస్పర్శ దూరమై పోతున్నప్పుడూ, పోయినప్పుడూ మనిషిపడే ఆవేదనా, మనసు పొందే వేదనాభరితమైన ఆక్రోశమూ కూడా కొన్ని కథల్లో కన్పించి చదువరి హృదయాన్ని కదిలిస్తాయి. ప్రకృతిలో విలీనమైపోవాలన్న మనిషి గాఢమైన కోరికల తాలూకు భావావేశాలు మరికొన్ని కథల్లో చిత్రంగా కన్పించి విచిత్రంగా వాస్తవాన్ని దృశ్యమానం చేస్తాయి.

రచయిత(త్రు)ల సాహితీ ప్రయాణాలు మాత్రం ప్రారంభం నుండీ ధాటిగా, ధీటుగా గంభీరంగా కదలి నిలుపుదల లేకుండా చివరికంటా సాగుతూ ఎందరికో మార్గదర్శకంగా భాసిల్లుతుంటాయి. అలా దీపధారులుగా కన్పించే వారిలో ముఖ్యులు శ్రీమతి ఆర్. వసుంధరాదేవిగారు.

వారి కథలను కొన్నింటిని పరిశీలిస్తే...

1967వ, సంవత్సరం అక్టోబరు మాసపు భారతిలో 'నిర్ణయం' అన్న కథ ప్రచురింపబడింది.

వృత్తిరీత్యా పేరుమోసిన ఒక వైద్యుడు ఎనభై పైబడిన తన తల్లి అనారోగ్యం వల్ల తన పల్లెటూరు చేరి నోటి క్యాన్సర్‌తో తల్లడిల్లుతున్న తన తల్లికి ఆఖరి సేవలు అందిస్తాడు. భరింపలేకపోతున్న తన తల్లి బాధ చూడలేకా, భార్య పరోక్షవత్తిడి వల్లా ఒక ఆలోచన అతనిలో అంతర్గతంగా చోటుచేసుకుంటుంది. దాంతో మార్ఫియా ఎక్కువ మోతాదులో ఇచ్చి తల్లికి విముక్తి కలిగిస్తాడు. అందువల్ల కలిగిన మానసిక క్షోభతో ఆ వైద్యుడూ మరణిస్తాడు.

అతని అంత్యక్రియలకు దూరతీరాలలో వున్న అతని పిల్లలు హాజరు కాలేకపోవడం వల్ల అతని సహోదరుడు అంత్యక్రియలు నిర్వహిస్తాడు.

స్థూలంగా ఇదీ కథ.

అయితే తాత్విక వేదాంత స్పర్శతో, అంతర్గత విషాదంతో సాగే ఈ కథ నలభై ఏడు సంవత్సరాలకు ముందే 'మెర్సీ కిల్లింగ్'ను ఇతివృత్తంగా చేసుకుని వ్రాయబడిన అత్యంత ఆధునిక కథ ఆనాటికి.

1969 డిసెంబరు భారతి మాసపత్రికలో ప్రచురింపబడిన 'వేషం'లో నక్సలైట్ల జీవన సంవిధానానికి ఇవ్వబడిన ప్రాధాన్యత కనపడ్తుంది. కథలో విప్లవకారుడు వర్ణింపబడిన తీరు... "అతడు మనిషికాదా? అతని చర్మం ఎండా చలీ తాకకుండా మొద్దుబారిపోయింది కాబోలు?! పోలీసులు తనకోసం వేటకుక్కల్లా వెతుకుతున్నప్పుడు పొలాల్లో రోజుకో గడ్డివామిలో నిద్రపోతూ,

పగలు ఏ తోటలోనో, పాడుబడిన గుడి చీకటిలోనో మనిషి తిరగని చోట గడుపుతూ, నమ్మకస్తుడైన హరిజనుడెవరో వీలున్నప్పుడు కూలివాడిలా తెచ్చుకున్న అన్నం అందిస్తే తింటూ, లేకుంటే వస్తుంటూ... అబ్బ ఏం జీవితం? ఏదో గొప్ప వినాశకరశక్తి అతనిలో నిండి ఇలాంటి బ్రతుకును మోస్తోంది... కోరుతోంది...”

ఈ కథలో వసుంధరాదేవి నక్సల్బరీ ఉద్యమాన్ని సమర్థించడం కానీ, వ్యతిరేకించడం కానీ కన్పించదు. కానయితే అప్పటికే సమాజాన్ని, వ్యవస్థను ఓ కుదుపు కుదుపుతున్న ఓ క్లిష్ట సమస్య మీద లోతయిన అవగాహన కన్పిస్తుంది.

1970 జూన్ మానవు భారతిలో ప్రచురితమైన ‘పాపం’ అన్న కథ హృదయస్పర్శతో సాగి స్త్రీ పురుష బేధం లేకుండా మనుష్యులలో కన్పించే క్రూరత్వానికి, అనాగరికమైన మనిషి అంతర్గత స్వరూపానికీ అద్దం పడుతుంది.

1971 మార్చి భారతిలో ప్రచురితమైన ‘జీవాతువు’ కథలో నలభై రెండు సంవత్సరాల క్రితమే తీవ్రతరం అయిన నిరుద్యోగ సమస్య పరోక్షంగా ప్రస్తావించ బడింది. యుగయుగాలుగా మానవజాతి అంతరించి పోకుండా నడిపించుకు వస్తున్న మానవ జీవన ధర్మం సంకీర్ణంగా అల్లుకుపోయిన ప్రపంచపు నెరియల్లోంచీ తొంగిచూస్తున్న రహస్యం... “బతకడమే పండుగ!” అని చెప్పే చెంచురాముడి కథ.

శ్రీమతి ఆర్. వసుంధరాదేవిగారు వ్రాసిన అత్యుత్తమ కథలలో ఒకటిగా చెప్పుకోదగ్గ కథ ‘పిన్నలూ–పెద్దలూ’ 1972 జనవరి భారతిలో చోటుచేసుకుంది. సమాజంలో కాలప్రవాహంతో వచ్చి పడ్తున్న అనేక అనివార్య పరిస్థితుల వల్ల మనుషుల మానసిక స్థితి గతులలో ఉత్పన్న మవుతున్న సంఘర్షణలనూ, మనిషి ఆలోచనా విధానంలో వస్తున్న అసంగతాలనూ కళ్ళకు కట్టినట్లు చూపుతుంది ఈ కథ.

1972 ఏప్రిల్ భారతిలో వెలువడిన ‘అల్పమైన విలువలు’ కథ జీవితంలో విలువలు అస్తవ్యస్త మవుతున్నప్పుడు మనిషి మనసు నుంచి వెల్తిని వారు వెలిగ్రక్కే వింతవైఖరుల పోకడను వ్యంగ్య ధోరణిలో తెలియపరుస్తుంది.

1977–78 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో అచ్చయిన ‘మనిషి’ కథ ఒక మంచి చలన చిత్రాన్ని చూసిన అనుభూతినిస్తుంది.

19-8-1992 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురింపబడిన 'చిట్టిరాజు' పాఠకుల దృష్టిలో చాల గొప్పకథ. మనిషియొక్క అంతరంగాన్ని, అంతఃస్వరూపాన్ని వివిధ కోణాల్లోంచీ జీవన చదరంగంతో పోల్చి చూపడానికి ప్రయత్నించిన కథ ఇది. తిరగేస్తే ప్రతి మనిషి జీవితమూ ఓ కథ లేదా ఓ నవల అవుతుంది అని అన్పింప జేసే కథ చిట్టిరాజు. అప్పట్లోనే ఈ కథలో ప్రపంచీకరణ అంతర్లీనంగా స్ఫురిస్తుంది.

24-3-1993 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితమైన మరో గొప్ప కథ 'కనిపించని నిజాలు'.

"నేను ఈ ప్రపంచంలో ఎవరిని? సంఘంలో నా స్థానం ఏమిటి? నేను నేనుగా బ్రతకడానికి ఇక్కడ అనుకూల పరిస్థితులున్నాయా?" అంటూ ఎలుగెత్తి ప్రశ్నించే ఓ మహిళ ఆక్రోశం ఈ కథ!

స్త్రీవాద దృక్పథంతో సాగిన ఈ కథనిండా మనిషి జీవితం కన్పిస్తుంది! మనుగడను గూర్చి అనేక ప్రశ్నలతో నిలదీస్తుంది!! కథ చదువుతున్నప్పుడు... కొన్ని వాక్యాలయితే పఠితుడికి తెలియకుండానే అతని కంట నీటి కాల్వలు కట్టిస్తాయి.

13-4-1994 ఆంధ్రప్రభ వారపత్రికలో వచ్చిన లోతయిన కథ 'మహాప్రదో, మహాగర్తో'- ఊరు పొమ్మంటూ కాడు రమ్మంటున్న దశలో తెలిసిన లోకం నుంచి తెలియని లోకంలోకి అడుగెట్టబోతూ బ్రతుకులు వెళ్ళదీసే పండుటాకుల మానసిక స్థితిగతులకు ప్రతిబింబం ఈ కథ. వాళ్ళు ఎదుర్కొనే చరమ సత్యం... నిస్సహాయక ఒంటరితనం 'నిరర్థకత' అన్న గుర్తింపు. మీ మధ్యన "నాకు నేనే బరువు" అని చెప్పే ఒక అవ్వ కథ.

22-2-1995 ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చయిన అత్యుత్తమ కథ 'అమ్మా ఇక సెలవు!!'

మృత్యు శీతలఛాయల మధ్యన ఆఖరి రోజులలో వున్న తల్లిని గురించి ఒక కుమారుడు పడే బాధ, తపన, ఆస్పత్రులలో ఎదురయ్యే నిర్లక్ష్య ధోరణులు, ప్రపంచం లోంచి కనుమరుగవుతున్న 'కరుణ'ల గురించి ఆర్ద్రగాథ ఈ కథ.

నిజానికయితే ఇవన్నీ వారి సాధారణ కథలలో కొన్ని మాత్రమే. వారి కథలలో అసాధారణమైన కథలెన్నో ఉన్నాయి. వాటి గూర్చి మరింత విశదంగా సమీక్షలు వచ్చాయి... వస్తున్నాయి... శక్తివంతమై మరింత లోతయిన ఆ కథలను ప్రతిసాహిత్యాభిమానీ తప్పక చదివి తీరాలి.

ఆర్. వసుంధరాదేవిగారి కథలలో కొన్ని ఆంగ్లభాషలోకి, కొన్ని కథలు ఇతర భాషలలోనికి అనువదించబడ్డాయి.

వీరి నవలలు 'ఓ పెళ్ళికథ', రెడ్డెమ్మ గుండు'... రెండూ ప్రస్తుతం ఏ బుక్‌స్టాల్‌లోనూ, పబ్లిషింగ్ హౌస్ బ్రాంచిలలోనూ లభ్యం కావడం లేదు.

వసుంధర పబ్లికేషన్స్, హైదరాబాదు వారు ప్రచురించిన ఆర్. వసుంధరాదేవి గారి కథా సర్వస్వం... 'ఆర్. వసుంధరాదేవి కథలు' (ఏభయి కథల సంపుటి) పుస్తకాల షాపులలో లభ్యం కావచ్చును. సాహిత్యంతో సంబంధం వున్న ప్రతి వ్యక్తి వద్దా ఉండాల్సిన, అధ్యయనం చెయ్యదగిన గ్రంథం ఇది.

అనేక సాహితీ పురస్కారాలు పొందిన వసుంధరాదేవిగారి జననీ జనకులు డా॥ పండా సత్యనారాయణచౌదరి, శ్రీమతి పరిపూర్ణమ్మ గారు. వృత్తిరీత్యా వైద్యులయిన సత్యనారాయణచౌదరిగారు ప్రకాశం జిల్లా పరుచూరులో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు పరుచూరులో వసుంధరాదేవిగారి జననం జరిగింది. వేటపాలెంలోని బండ్లపాపయ్య హిందూ మిడిల్ స్కూలు యందు ప్రాథమికవిద్య, గుంటూరు సెయింట్ జోసెఫ్ కాన్వెంటుయందు ఆంగ్ల మాధ్యమంలో హైస్కూలు చదువు పూర్తిచేసిన వసుంధరాదేవిగారు తదుపరి గుంటూరు ప్రభుత్వం స్త్రీల కళాశాలలో బి.ఎస్‌సి., ఆనర్స్, విశాఖ ఆంధ్రాయూనివర్సిటీలో ఎమ్.ఎస్‌సి., కెమిస్ట్రీ పూర్తిచేశారు. తమ మెట్టినూరయిన చిత్తూరుజిల్లా మదనపల్లెలో చిరకాలం గడిపిన వసుంధరాదేవిగారు ఆర్.ఎస్. సుదర్శనంగారి మరణం తదుపరి ఇటీవల అమెరికాలోని తమ పిల్లలవద్దకు చేరుకున్నారు.

వీరి చిరునామా :

**R. VASUNDHARA DEVI**

C/o Shanti S. Ratakonda, M.D.,

27, Joan Avenue

White Plains

**NEW YORK - 10607**

Phone : 001 - 914 - 683 - 3266

# ప్రచారమెరుగని కథాసారథి... సనగరం పార్థసారథి!!



పండితులకూ, కవులకూ, కథకులకూ కళాకారులకూ నిలయమైన చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దతిప్పసముద్రంలో 26-8-1939వ తేదీన శ్రీమతి జ్ఞానమ్మ, శ్రీ సనగరం శంకరప్ప దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించిన సనగరం పార్థసారథిగారి రచనా జీవితం మొట్టమొదట బాలల గేయాలతో ప్రారంభమైంది. గేయాలు, వచన కవితలు అనేక పత్రికలలో నిరవధికంగా ప్రచురితమయ్యాక వీరు కథా రచన వైపు మొగ్గుచూపి శీఘ్రకాలంలోనే లబ్ధప్రతిష్టులు కాగలిగారు.

1965వ సంవత్సరంలో సదరన్ లాంగ్వేజస్ బుక్ ట్రస్ట్ వారు తమిళనాడులో పదిహేను రోజుల కళా, సారస్వత కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడుల నుండీ రాష్ట్రానికి నలుగురు కళాకారుల చొప్పున ఎన్నికచేసి ఆహ్వానించడం జరిగింది. మన రాష్ట్రం నుండీ నియమితులైన నలుగురిలో ఇద్దరు చిత్తూరు జిల్లా వాసులకు ఆ గౌరవం దక్కింది. ఒకరు కలువకొలను సదానందగారయితే, రెండవారు సనగరం పార్థ సారథిగారు! అక్కడవారు కథకులుగా తమ ప్రతిభను చాటుకొనడమే గాక కొన్ని తమిళ పద్యాలను సైతం తెలుగులోకి అనువదించడం అవి రేడియోలో ప్రసారం కావడం కూడా జరిగింది.

కథా రచనా వ్యాసంగంలో విహారిగారి ప్రోత్సాహం మరువరానిది అని చెప్పే సనగరం పార్థసారథిగారి మొట్టమొదటి కథ 'స్నేహితుడు'. ఇది 2-7-1965 ఆంధ్రపత్రికలో ప్రచురితమైంది. 'ఈశ్వర' అన్న కలం పేరుతో ఈ కథను వ్రాసిన పార్థసారథిగారు ఆ పేరుగల రచయిత ఉన్నారని తెలిసి ఆపై తమ స్వంతపేరుతోటే రచనలు సాగించారు. అనేక పత్రికలు వీరి కథలను ప్రచురించాయి.

ప్రారంభదశలోనే వీరికి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టిన కథ 'శిథిల శిల్పం'. ఒక అనాకారి వికలాంగురాలి మనసులోకి ఏ దివ్యదృష్టితోటో తొంగిచూసి.... ఆమె మనసులోని భావజాలంతో 'శిథిలశిల్పం' కథను వ్రాసి వుండాలి పార్థసారథిగారు. ఆ మూగమనసు పడే బాధను ఎంతో ఆర్ద్రంగా,

హృద్యగమంగా చిత్రీకరించగలిగిన భాగ్యం వారికి అబ్బింది. గుండెల్ని పిండే విషాద బిందువుల లాంటి అక్షరాలను చిలికించిన వారి కలానికి జోహార్లర్పించారు పాఠకులు.

'శిథిలశిల్పం' కథ 1968 ఏప్రిల్ భారతి మాసపత్రికలో ప్రచురితమైనప్పుడు జీవిత బీమా సంస్థలో ఉద్యోగరీత్యా హిందూపురంలో ఉన్నారు పార్థసారథిగారు. ఆ కథను చదివిన శారదా దాస గోవిందయ్యశెట్టి కాలేజి ప్రొఫెసర్ సర్రాజు లక్ష్మీనరసింహారావు, తెలుగు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు నారాయణరావుగారు... ఇద్దరూ వెతుక్కుంటూ వచ్చి పార్థసారథిగారిని కలసి పరిచయం చేసుకుని సాహితీ మిత్రులుగా మారడం జరిగింది. అదే విధంగా కల్లూరి అహోబలరావు గారి కుమారుడు కల్లూరి రాఘవేంద్రరావు లాంటి మరికొందరు సాహితీ మిత్రులు తోడయ్యాక పార్థసారథి గారికి ఒక రచయితల వేదిక ఏర్పాటు చేయాలనే కోరిక కలిగింది. ఆ ఊహ బలపడడంతో 'కథా కల్పనాలయం'గా రూపుదిద్దుకుని 1972 నుండీ 1976 వరకూ అనంతపురం జిల్లా హిందూపురంలో ఒక వెలుగు వెలిగింది.

సనగరం గారితో పాటు సర్రాజు లక్ష్మీ నరసింహారావు, కల్లూరి రాఘవేంద్రరావు, దేశెట్టి కేశవరావు, తంగిరాల జగన్నాథం, బుస్సా శ్రీనివాసరావు, పి. ఓబయ్య, జె.ఎస్.ఆర్.కె. శర్మ, కరణం గోపాలరావు మొదలైన ప్రముఖులు కథా కల్పనాలయంలో సభ్యులుగా కొనసాగారు. ప్రతి ఆదివారం ఒక సభ. ఆ సభలో ఒక సభ్యుడు తప్పనిసరిగా కథ చదవాలి. ఆపై ఆ కథపై చర్చ, విశ్లేషణ, సమీక్షలు! ఒకవేళ ఆ వారం కథ చదవాల్సిన సభ్యుడు అత్యవసరంగా ఏవూరయినా వెళ్ళాల్సి వచ్చినా కథ వ్రాసి అందజేసి వెళ్ళాల్సిందే. ఆ కథను మరెవరైనా చదివి ఆపై కార్యక్రమం సజావుగా జరపాల్సిందే!

ఇతర రోజులలో సభ్యులు కలసినప్పుడు పత్రికలలో వచ్చిన మంచి కథలను చదవడం, సమీక్షించడం!

ప్రతియేటా శివరాత్రినాడు ప్రత్యేక కార్యక్రమం తప్పనిసరి. సాయంత్రం ఆరుగంటల నుండీ ఉదయం ఆరుగంటల వరకూ ప్రతి ఒక్క సభ్యుడూ తను వ్రాసిన కథను చదువుట, దానిమీద ఇతర సభ్యుల చర్చాగోష్ఠి.

కథా కల్పనాలయంలో సమీక్షింపబడిన అనేక కథలు ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడడమేగాక అనేక బహుమతులను కూడా పొందాయి.

ఒక పర్యాయం ఒకే శీర్షికపై సభ్యులందరూ మూడు గంటలలోగా కథలు వ్రాయడం జరిగింది. నిజంగా ఒక అరుదైన విషయం అది. 'కథాకల్పనాలయం' సభ్యుల విహారయాత్రలు కూడా ఉండేవి.

1973వ సంవత్సరం 'మంజరి' సంవత్సరాది సంచిక కథల పోటీలో పార్థసారథిగారి 'ఆరడుగులు చాలు' కథకు మొదటి బహుమతి లభించింది. హైదరాబాదు రవీంద్రభారతిలో వారికా బహుమతిని అందజేసి ఘనంగా సన్మానించడంతో ప్రచార విముఖులైన పార్థసారథి గారికి రచయితగా ప్రత్యేక గుర్తింపు లభ్యమైంది.

1978వ సంవత్సరంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ వారు సిల్వర్ జూబ్లీ సందర్భంగా ప్రచురించిన సావనీర్‌లో గుంటూరు నాగార్జున యూనివర్శిటీ తెలుగు ప్రొఫెసర్ ఆచార్య టి. దోణప్ప వ్రాసిన "తెలుగు సాహిత్యానికి రాయల సీమ చేసిన దోహదం!" వ్యాసంలో ప్రముఖంగా ప్రస్తావింపబడిన కొద్దిమంది కథకుల పేర్లలో సనగరం పార్థసారథిగారి పేరు చోటు చేసుకుంది. నిజానికి అప్పటికే వీరు ప్రసిద్ధులు.

సనగరం పార్థసారథిగారి కథలను కొన్నింటిని పరిశీలిస్తే... 'మంజరి' పత్రికలో ప్రచురితమైన 'ఒకే అద్దం – మూడు ముఖాలు' కథ, ఆంధ్రసచిత్ర వారపత్రికలో ప్రచురితమైన 'రాజేశ్వరి'... ఈ రెండు కథలూ వాస్తవానికి ఒకే కథగా చదవ దగ్గవి. అద్భుతం అని అన్పింపజేసే అమలిన శృంగారం ఈ కథలలోని ప్రత్యేకత.

వివిధ వయస్సులు కలిగి రకరకాల విద్యల, వృత్తుల, పరిస్థితులమధ్య నున్నవారు సైతం పర స్త్రీ పొందుకోసం ఎలా పలవరిస్తారో సుస్పష్టంగా తెలియజెప్పే కథ 'ఒకే అద్దం – మూడు ముఖాలు!' ఒక వేశ్యలో కరుణ, మనిషితనం, మానవత్వం నిండిన ఒక మహోన్నత మానవతా మూర్తిని ప్రతిష్ఠించి దృశ్యమానం చెయ్యబడ్డ కథ ఇది. ఈ కథకు కొనసాగింపు లేదా రెండవ భాగం అని ఖచ్చితంగా చెప్పవచ్చు 'రాజేశ్వరి' కథను.

నిస్వార్థంగా ఇతరులకు సహకారాలందిస్తూ నడచిన కరుణామయి అయిన ఒక వేశ్య కథ రాజేశ్వరి. ఈ కథ చదువుతున్నప్పుడు గుండెలు ద్రవిస్తాయి. రావూరి భరద్వాజగారి పాకుడురాళ్ళు నవలలోని 'మంజరి'లాంటి పాత్రలు మననానికి వచ్చి బాధ కలిగిస్తాయి. వేశ్యలకు కూడా మనసులుంటాయనీ,

వారికీ వ్యక్తిత్వాలూ, స్వంత ఆలోచనలూ, ఆశలూ, ఆశయాలూ ఉంటాయనీ తెలియజెప్పే కథలివి.

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన మరో కథ 'తరంగాలు'. మానసిక అనుభూతులకు చెందిన గొప్ప విశ్లేషణ ఈ కథ. ఆనందంలో ఒకరకంగా, విషాదంలో ఒకరకంగా మనిషి ఆలోచనలు ఎలా పరస్పర విరుద్ధ భావాల ఉప్పెనలను ముందుకు చొచ్చుకువచ్చేలా చేస్తాయో తెలియజెప్పిన కథ ఇది. పరిస్థితులకూ, పరిసరాలకూ అనుగుణంగా మార్పుచెందే ఆలోచనా తరంగాలలోని ఇంద్రధనుస్సు రంగులను ఈ కథలో వీక్షించవచ్చు... ఆస్వాదించవచ్చు!!

అనుభూతి ఐక్యతతో నిండి, క్లుప్తంగా సాగడమేగాక శిల్పపరంగా కూడా మెచ్చుకోదగ్గ కథ 'పునర్జీవులు'. ఈ కథ 16-1-2001 ఇండియా టుడేలో ప్రచురితమైంది. ఈనాడయితే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు జీతాలు పుష్కలంగా ఉంటున్నాయి కానీ... ఒకప్పుడు టీచర్లంటే బతకలేని బడిపంతులన్న కఠోర వాస్తవం ఆనాటికీ, ఈనాటికీ జీవించి ఉన్న వారికే తెలుస్తుంది. అలాంటి ఓ పదవీ విరమణ చెందిన, బ్రతకలేని పంతుల కథతో సమాజంలోని సామాన్యుని అతుకుల బ్రతుకుని పాఠకుల కళ్ళు చమర్చేలా హృద్యమంగా గొప్ప హృదయ స్పర్శతో చెప్పారు పార్థసారథిగారు. కథలో అడుగడుగునా అమూల్యమైన అద్భుత వాక్యాలు, పేరాలు పాఠకులను ఉక్కిరిబిక్కిరి చేయడమే కాదు పఠితులు బాధతో దీక్షగా ఆలోచించేలా చేస్తాయి. శిలా హృదయులైనా కరిగి నీరవ్వాల్సిందే! ఈ అత్యుత్తమ కథకు ఆశాజనకమైన మంచి ముగింపునిచ్చిన రచయిత అభినందనీయులు.

1998 అక్టోబరు స్వాతి మాసపత్రికలో ప్రచురితమైన 'ఊరేగింపు' కథ నిస్వార్థపరుడైన ఓ దైవభక్తుడి దీనగాథ. ఆర్ద్రతతో నిండిన ఈ కథ చదువుతుంటే రవీంద్రుల వారి గీతాంజలిలోని ఏభయ్యో గీతం చెవులలో విన్పించి, కళ్ళముందు కదులుతుంది.

అవినీతి, లంచగొండితనం సమాజాన్ని ఎలా పీక్కుతింటున్నాయో, సామాన్యులూ, నిజాయితీపరులూ, పేదలూ వాటికెలా బలయిపోతున్నారో తెలిపే కథ 'పందికొక్కులు కట్టిన సమాధి'. 5-7-85 ఆంధ్ర పత్రికలో అచ్చయిన ఈ కథలో ఆ రెండింటి పట్లా తమ నిరసనను, అసహనాన్ని అర్థవంతంగా తెలియజెప్పారు పార్థసారథిగారూ.

స్వార్థంతో నిండిన ఈ లోకంలో... మనసుతో చూసి, హృదయంతో ఆలోచించే మనుషులు ఆశాజనంగా అక్కడక్కడయినా ఉన్నారని తెలిపే విలక్షణమైన ఓ పెళ్ళికొడుకు కథ 'జరుగుతున్న కథ'. ఈ కథ 4-12-1980 ఆంధ్రభూమి వారపత్రికలో వచ్చింది.

ఇలాంటి విలక్షణమైన సమాజ శ్రేయస్సుకు ఉపకరించే కథల నెన్నింటినో ఆంధ్రపాఠక లోకానికందించిన సనగరం పార్థసారథిగారి కథలలో కొన్ని కన్నడ, హిందీ భాషలలోనికి అనువదింపబడ్డాయి.

శ్రీ జోస్యము విద్యాసాగర్, శ్రీ టి. సుందరయ్యలాంటి లబ్దప్రతిష్ఠులు పార్థసారథిగారి కథల మీద అమూల్యమైన అభిప్రాయాలనూ, సమీక్షలనూ అందించారు.

ఒకరకంగా పార్థసారథిగారి కథలన్నీ గడచిపోయిన కాలానికి సంబంధించిన కథలు... కానయితే కాలానికి నిలచే కథలు!! ఇంతటి సలక్షణమైన కథలను సమాజానికి అందిస్తూ వచ్చిన ఈ లోతయిన కథకులు ఎందుకోగానీ కథానిక శతవార్షికోత్సవానికి చేరువవుతున్న దశలో వ్రాయడం మానుకోవడం బాధాకరం. వారు మౌనాన్ని వీడి మరిన్ని అత్యుత్తమ కథలను నిరవధికంగా సమాజానికి అందించి ఉత్తమ సమాజ నిర్మాణానికి సహకరించాల్సిన అవసరం ఉన్నది.

చిత్తూరు జిల్లా, మదనపల్లె తాలూకా పి.టి.యం.లో జన్మించి, పాకాల, మదనపల్లె, మద్రాసులలో చదువు సంధ్యలు సాగించి, ఉద్యోగరీత్యా అనేక ఊర్లలో నివసించి అపారమైన జీవితానుభవాన్ని గడించిన పార్థసారథిగారు హైదరాబాదులో విశ్రాంత జీవితం గడుపుతున్నారు. వీరి కథా సంపుటాలు రెండు అందుబాటులో ఉన్నాయి. మరిన్ని కథా సంపుటాలను త్వరలో వెలువరిస్తారని ఆశిద్దాం.

**చిరునామా :**

**సనగరం పార్థసారథి**
155, సురక్షా ఎన్‌క్లేవ్
చందానగర్
**హైదరాబాదు - 500 050**
ఫోను : 23035852
సెల్ : 9542661691

# అంతరంగిక దృష్టికోణం అనంతంగా కలిగిన కథా రచయిత్రి ఎ. పుష్పాంజలి



"ఈ ప్రపంచంలో అత్యంత క్లిష్టమైన, కఠినమైనపని ఆలోచించడం!" అంటాడు ఎమర్సన్. ఆ కష్టమైన పనిని ఇష్టంగా చేస్తూ తనకంటూ ఓ నిర్దిష్టమైన పరిధిని ఏర్పరచుకుని అందులోంచే విస్తృతమైన, విశృంఖలమైన కథలను చక్కటి తెలుగులో, అక్కడక్కడ కొద్దోగొప్పో మట్టి వాసనలతో అందిస్తున్న రచయిత్రి పుష్పాంజలిగారు. గతంలో కేవలం రేడియో కథలకు, ప్రసంగాలకు పరిమితమై వుండిన వీరి లేఖిని అచిరకాలంలోనే విజృంభించడం వల్ల అనేక కథలు, వ్యాసాలు వెలువరింపబడ్డాయి. రెండు కథా సంపుటాలు సైతం విడుదలయ్యాయి.

నెల్లూరు జిల్లాలోని ఓ కుగ్రామంలో జన్మించిన పుష్పాంజలిగారు గత ముప్పై సంవత్సరాలుగా చిత్తూరు జిల్లాలోని కొన్ని కళాశాలలలో జువాలజీ లెక్చరర్‌గా వృత్తిబాధ్యతలను నిర్వరిస్తూ చల్లని పుణ్యభూమి మదనపల్లెలో స్థిరపడ్డారు.

వీరి రెండవ కథాసంపుటి... 'అమ్యూజింగ్స్' లోని కొన్ని కథలను (చాల కథలు వివిధ మాస, వారపత్రికలలో ప్రచురితమైనవే!) పరిశీలిస్తే...

తీరని కోరికలతో, కొని తెచ్చిపెట్టుకున్న అసంతృప్తి జ్వాలలతో రగలిపోతూ తడిమంటల్ని పొడి నీళ్ళతో చల్చార్చుకునేందుకు ప్రయత్నం చేసే ఒక అక్క, ఇష్టం వచ్చిన రీతిలో నిండుగా, తృప్తిగా జీవించడాన్కి ప్రయత్నించే ఆమె చెల్లి, పేదరికమనే శాపానికి తోడు వంచన అనే రోగానికి గురయి ఈ లోకం నుండీ నిష్క్రమించిన ఓ అభాగ్యురాలూ... మూడు ముఖ్య పాత్రలుగా నడచిన కథ... 'మరకల్లో మెరుపులు'... అసాధారణమైన కథయినా ఆశాజనకమైన ముగింపు కలిగిన ఈ కథకు 'భూమిక' సచిత్ర మాసపత్రిక తాలూకు పురస్కారం లభ్యమైంది.

ఎంత చదువుకున్నా, ఎంత మంచి పొజిషన్‌లోకి వచ్చినా కొంతమంది మనుష్యులకు ఎదుటి వారిని ఏకాస్త ఉన్నతంగా అయినా ఊహించుకోగల సంస్కారం అలవడకపోవడం కద్దు! అలాంటి వ్యక్తుల దృష్టికోణం స్త్రీల విషయంలో అయితే మరింత వంకరగా ఉండడం వాస్తవం!! చీకటిలో నడిచే అలాంటి

మనుష్యులకు ఒక్కసారిగా వెయ్యి వెలుగురేఖలు ఎదురైతే వారి పరిస్థితి ఎలా వుంటుందో, ఆపై యేమవుతుందో సున్నితంగా తెలియజెప్పిన కథ "ఈక్వేషన్స్". క్లుప్తత కథకు ఎంతటి బలాన్ని చేకూర్చగలదో తెలియజెప్పిన కథ ఇది.

వ్యంగ్య ధోరణిలో వ్రాయబడ్డ హాస్యకథ 'బామ్మగారు-ఇంటర్నేషనల్ స్కూల్'. హాస్యప్రధానంగా ప్రారంభమయ్యే ఈ కథ క్రమంగా పాఠకులను చాల గంభీరమైన విషయంలోకి తీసుకు వెళ్తుంది. నిజంగా ఆంధ్రదేశాన్ని కమ్ముకునివున్న ఒక వింత, విపరీత, కృతకమైన జాడ్యాన్ని చాల శక్తివంతంగా నిరసించారు రచయిత్రి ఈ కథ ద్వారా. ఈ కథను విడిగా ప్రింటు చేసో, జిరాక్స్ తీసో ఆంధ్రదేశం లోని ఆంగ్ల మాధ్యమ పాఠశాలలన్నింటికీ పంపగలిగితే బావుండును.

పరస్పర విరుద్ధభావాల మేలి కలయిక మనసు. ప్రతి మనిషి మనసులోనూ మంచి-చెడు... ఈ రెండు రకాల ఆలోచనలు ఉత్పన్నమవుతుంటాయి. అయితే చెడు భావనల వల్ల పశ్చాత్తాప పడక తప్పదు. అందుకే పశ్చాత్తాపపడే పన్లేవీ చేయవద్దంటాడు గోపీచంద్. అలా పశ్చాత్తాప పడాల్సివస్తే హృదయంలో తేళ్లూ, జర్రులూ గూడు కట్టుకుంటాయని కూడా అంటారు. అందువల్ల చెడు భావాలను అణచుకుని మంచి భావాలను పెంపొందించుకోగలిగితే మనిషితనం పెరిగి పెద్దదవుతుంది. అలా మనిషితనాన్ని పెంచుకోవడంలో లభించే అమూల్యమైన ఆనందాల్ని గూర్చి తెలియజేసిన కథ 'వైరుధ్యం'.

మనిషి తనంతతాను కొనితెచ్చుకునే అనవసర ఆలోచనల తాలూకు మానసిక బాధలను, సంఘర్షణలను వాటి తాలూకు నిరుపయోగమైన పర్యవసానాల్ని తెలియజెప్పే కథ 'తడి'. రచయిత్రి ఈ కథకు అద్భుతమైన ముగింపునిచ్చారు. ఆత్మీయ హృదయ స్పర్శతోకూడిన ఈ ముగింపు పాఠకుల కంట తడి తెప్పించడమే కాదు రచయిత్రికి ఆంధ్రభూమి పత్రిక వారి పురస్కారాన్ని కూడా అందించింది.

అత్యాధునికమైన ఆలోచనల పోకడలో పడి పండంటి సంసారాన్ని పాడుచేసుకోబోయిన ఓ కుమార్తెకు పరోక్షంగా కర్తవ్యబోధ చెయ్యగల కథ వ్రాసిన కథకుడి కథ 'అలా-ఇలా'.

పుష్పాంజలిగారు వ్రాసిన పెద్ద కథలలో ఒకటి 'బాధ్యత'. అయితే చివరి వరకూ ఆసక్తిగా చదివించే కథ. శక్తివంతమైన విషయాన్ని చాల లోతుగా ఆలోచించి వ్రాయబడ్డ కథ కాబట్టి రచయిత్రికి తప్పక హేట్సాఫ్ చేస్తారు పాఠకులు.

‘ఎలుకతోలు తెచ్చి యేడాది ఉతికినా నలుపు నలుపే కాని తెలుపు కాదు’ అన్నట్లుగా కొద్దిమంది మనుష్యులలో మార్పుండదు. తాత్కాలికంగా కొద్దో గొప్పో మార్పు కన్పించినా అది ఎండకు పట్టిన గొడుగులాంటిది. గాలివానకు నిలబడదు. పిలుపు దగ్గర పడిందని భావించిన ఓ మనిషిలో కొద్దిలో మార్పు వచ్చినా... మృత్యువు దూరమైందనీ, ఇంకా జీవితం మిగిలుందనీ తెలియగానే అతనిలో వచ్చిన పెనుమార్పు తాలూకు వింతకథ ‘ఆశల పాతం’.

“ఈ ప్రపంచంలో అతిదారుణంగా దోపిడికి గురవుతున్నది స్త్రీ!” అంటాడు లెనిన్. ఆనాటికీ ఈనాటికీ అదే జరుగుతోంది. మనం సంపాదించుకున్న నాగరికత, పెంచుకున్న సంస్కారాలు దారుణాలను ఆపలేకపోతున్నాయి. నిజానికి కొన్ని సందర్భాలలో అనాగరిక మానవుడికీ, నేటి మానవుడికీ తేడా తెలియడం లేదు. ఎన్నివేల రకాలుగా స్త్రీ దోపిడికి గురవుతున్నదో వివరించుకుంటూ వెళ్తే కొన్ని లక్షల కథలను సృష్టించవచ్చు. కొంతమేరయినా వివరించే ప్రయత్నం చేశారు పుష్పాంజలి గారు తమ ‘ఏడవకూ... ఏడవకూ...’ కథ ద్వారా. హృద్యమైన నడకతో సాగిన ఈ కథకు ఆశాజనకమైన ముగింపునిచ్చిన రచయిత్రిగారు అభినందనీయులు.

ఒంటరితనంలోని ఆనందం, విషాదం కలగలసిపోయిన జీవితంలోంచి ఉప్పెనలా పొంగిన ఒక వింత వినోదంతో కూడిన ఆనందభరితమైన ఆక్రందన ‘అమ్యూజింగ్స్’ కథ. శక్తివంతమైన ఈ కథకు రచన మాసపత్రిక ‘కథాపీఠం’ పురస్కారం లభ్యమైంది.

మూడు తరాల జీవితాలని దృశ్యమానం చేసే కథలెంత బావుంటాయి? అలాంటి కథే ‘తెలిసిన వాళ్ళు!’ ఈ కథలో మధురమైన మట్టి వాసనతో కూడిన అందమైన బాల్యం వుంది. వేదనతో, దుఃఖంతో, గుండె బరువుతో నడచిన యవ్వనం వుంది. ఆనంద విషాదాలు కలగలసిపోయిన ప్రౌఢతనం కూడా వుంది. గుండెలను తడిమే కథ ఇది. హృదయస్పర్శ నిండుగా వున్న కథ.

వందల, వేల సంవత్సరాల అనుభవాలు మానవుడికి నాగరికత నేర్పితే ఆ నాగరికతలోంచీ కుటుంబ వ్యవస్థ పుట్టుకువచ్చింది. కుటుంబ వ్యవస్థ మానవ సమాజానికి చాలమేర భద్రత కల్పిస్తూ వచ్చింది. అయితే మనిషి రక్తంలో వున్న కొన్ని అనాగరిక లక్షణాలు అక్కడక్కడ అప్పుడప్పుడు వికారంగా తల పైకెత్తి వ్యవస్థను అవస్థలపాలు చెయ్యడానికి ప్రయత్నిస్తుంటాయి. అలాంటి లక్షణాలమీద రచయిత్రి ఓ చిన్న పరిశోధన సాగించి వ్రాసిన కథ ‘వికారాలు’.

వాస్తవికతకు ఒకింత దూరంగా వున్నా హాస్యంగా సాగిన కథ 'తారకమంత్రం'. ఈ కథకు ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక కథల పోటీలో పురస్కారం లభించింది.

అంతర్గత హాస్యంతో నడచిన కథ పొదుపు లక్ష్మి. కథ ముగింపు ముచ్చటగా వుంది.

దురదృష్టమో అదృష్టమో కానీ అక్కడక్కడ అప్పుడప్పుడు కొన్ని జంటలు విడిపోతుంటాయి. అందుకు ఎవరి కారణాలు వారికుండి తీరుతాయి. ఎటొచ్చీ ఆ విడిపోయినవారు కొత్త బంధాలను వెతుక్కోగలిగినప్పుడు... క్రొత్తలో బాగున్నా చివరికొచ్చినప్పుడు... జరిగే సంఘటనలు మరో వియోగానికి అవకాశం కల్పిస్తుంటాయి. అలాంటి సంఘటనల చుట్టూ అల్లబడ్డ కథ 'ఆఖరి ఘట్టం'.

"నువ్వు నాకుచేసే మహోపకారం ఏమిటో తెలుసా? నాకు అపకారం తలపెట్టకుండా ఉండడమే!" అంటాడు ఓ రచయిత. బంధువులు, ఆప్తులు, ఆత్మీయులు, ఆప్తమిత్రులు... ఎవరైనా కావచ్చు అప్పుడప్పుడు కడివెడు అమృతంలో ఓ విషపుచుక్కను విదిల్చినట్లు ఏదో ఒక పనికిమాలిన పనిచేసి సంఘర్షణలు సృష్టించి వెళ్తుంటారు. అలాంటి వాటివల్ల ఉత్పన్నమయ్యే అపశృతుల వల్ల ఏర్పడే ప్రమాదాలను కొంతమేర వివరించే కథ 'చేశాక చెప్పు'.

సృష్టిలీలలు అతి విచిత్రం. ఎందుకు, ఎలా, ఎవర్ని కలుపుతుందో, ఎందుకు విడదీస్తుందో, చివరి మజిలీ ఎలా ఉంచుతుందో... అన్నీ చిత్రాలే! అలాంటి చిత్రమైన కథ "చాంద్ ఆహేఁ భరేగా!".

ఇలాంటి విభిన్నమైన కథలనెన్నింటినో అందించిన పుష్పాంజలి గారు చిత్తూరులో పదవీ విరమణ చెందిన తరువాత గత ఆరు సంవత్సరాలుగా మదనపల్లెలో విశ్రాంత జీవితం గడుపుతూ కథారచన గావిస్తున్నారు. అయితే ఇటీవలి కాలంలో వీరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. (మెదడు యందలి నరాల సమస్య, పాక్షిక పక్షవాతం, కిడ్నీ ప్రాంతపు ఇబ్బంది ఇలాంటి అనారోగ్యంతో) వరుసగా బెంగుళూరు, హైదరాబాదు, చెన్నయి, వేలూరు ఆస్పత్రులలో మృత్యువుతో మూడు పర్యాయాలు పోరాడి విజయం సాధించి కోలుకుంటున్న దశలో కూడా వీరు ఒక నవల, మూడు నవలికలు, కొన్ని కథలు వ్రాసి వివిధ పత్రికల ద్వారా వెలువరించారు. నిరంతర పఠనం, సాహితీ సృజనలతో కాలం గడుపుతూ ఆరోగ్యాన్ని పుంజుకుంటున్న పుష్పాంజలిగారు అభినందనీయులు.

**చిరునామా :** ఎ. పుష్పాంజలి
3, ఎగువ కురవంక
**మదనపల్లె - 517 325**
సెల్ : 9440077586, 9908219976
ఫోన్ : 08571 - 223586

## నాటక కడలిలో ఓలలాడి, కవితల ఒడిలో ఒదిగి అద్భుత కథలలో తేలిన సాహితీ సవ్యసాచి శ్రీ ఎస్. మునిసుందరం



**తి**రుపతి కోటకొమ్మల వీధి మీదుగా వెళ్ళే వారికి అరిటాకుల అంగడి ఎదుట 'కవితాలయ' అన్న భవంతి కన్పిస్తుంది. ఆ నివాసంలో చిత్తూరు జిల్లా మాత ధరించిన సాహితీ ఆభరణాలలోని ఒక మేలి ఆభరణం దాగుందని కొత్తవారికి తెలియదు. విలువైన ఆ ఆభరణం పేరు శ్రీ శ్రావణి మునిసుందరం. వారు గత ఏభయి సంవత్సరాలుగా శక్తివంతమైన కవితలు, గంభీరమైన లలిత గీతాలు, లోతయిన త్రిపదలు, ఆత్మీయ స్పర్శతో కూడిన భక్తి గీతాలు, హితకరమైన సామాజిక నాటికలు, నాటకాలు వందలాదిగా వ్రాసిన వారు. దాదాపు ఇరవై ఐదు పుస్తకాలు ప్రచురించిన విరామ మెరుగని కలం యోధులు! వీరిలో ఒక గొప్ప కథకుడు దాగున్నాడనీ, ముప్పయి అయిదు సంవత్సరాల క్రితమే మంచి కథలు వ్రాశారని వీరి రచనలను అభిమానించే, ఇష్టపడే వారిలో కూడా చాలమందికి తెలియదు.

1976లోనే... పురాతన భావాలకు, ఆధునిక ఘటనలకు మధ్యన ఉత్పన్నమయ్యే సంఘర్షణ ఇతివృత్తంగా ఒక నిర్దిష్టమైన కథ వ్రాసి 'మా రాజా' అన్న శీర్షికతో ఆకాశవాణి కడప కేంద్రంలో చదివారు మునిసుందరం గారు.

పటిష్టమైన నిర్మాణ సౌష్టవం, చక్కని శైలి, శిల్పాలతో వ్రాయబడ్డ ఆనాటి ఆ కథ నేటికీ కాలంతో పోటీపడి తాజాగా నిలుస్తోంది.

ఇంతమంచి కథకులు ఆపై తమ కలాన్ని కథలకు మాత్రం దూరంగా ఉంచడం నిజంగా చింతించాల్సిన విషయం. కారణాలు ఏవయినా కావచ్చు కానీ ఒక మంచి కథకుడు ఇంతకాలం పాటు ఇతర తెరల మరుగునే ఉండిపోవడం అన్నది నిజానికి ఓ చిన్న విషాదమే!

అయితే... నాటక కడలిలో ఓలలాడి, కవితలలో ఒదిగిపోయిన వీరు సవ్యసాచిలా ఇటీవల మళ్ళీ కథారచన కుపక్రమించడం ఆనందదాయకం.

ఇతర రచనలతో పాటు కథా రచనలో కూడా అనతికాలంలోనే కీర్తి ప్రతిష్టలు సంపాదించుకోగలిగిన వీరి కథలను కొన్నింటిని గూర్చయినా తెలుసుకోవడం సాహిత్యాభిమానులకు అవసరం.

మునిసుందరంగారి గుండెలో గొప్ప బాల్యం దాగుంది. వారి మనసులో అద్భుతమైన ఆ పసితనానికి చెందిన కొన్ని జ్ఞాపకాల తాలూకు వేదన కూడా ఎంతో గూడుకట్టుకుని ఉంది. అందువల్లే ఆయన 'సుబ్బులు' కథ వ్రాయగలిగారు. వారి గుండె లోతుల్లోని బాల్యం తాలూకు బాధ కన్నీరుగా కలం సిరాలో కలసి

విషాదాక్షరాలని చిలికించింది 'సుబ్బులు' కథలో. హృదయాల్ని కదిలించే కథ! ఎందుకంటే హృదయమున్న వాళ్ళకే బాల్యం గుర్తుకొస్తుంది. దూరమై పోయిన చిన్ననాటి నేస్తాలు అప్పుడప్పుడైనా లీలగా కళ్ళ ముందు కదులుతుంటారు. ఆ పసితనపు పసిడి జ్ఞాపకాలను గుండె తడి చేసుకుంటూ నెమరు వేసుకోవాలంటే 'సుబ్బులు' కథ చదవాల్సిందే! రెండంటే రెండయినా కన్నీటి చుక్కలతో కళ్ళు తడుపుకోవాల్సిందే!... నిజానికీ కథ పేరు 'మావూరు', 'నావూరు', 'మీవూరు' మరియు 'అందరి వూరు!'... ఎందుకంటే ప్రతి వూర్లోనూ 'సుబ్బులు' ఒక్కరయినా ఉండితీరుతారు మరి!!

మనిషికి పశువుకు ఎంతో తేడా! అయితే దాన్ని గుర్తించ గలిగేది ఏ కొద్దిమందో?!

ఎందుకంటే సమాజం ధ్వంసమైంది!

ప్రయత్నిస్తే బాగు చెయ్యవచ్చు!!

కానీ ప్రయత్నించే వారేరీ?

ఆ ప్రయత్నం చెయ్యకపోయినా 'ఎప్పటికైనా సమాజాన్ని బ్రతికించుకోవచ్చు'... అన్నట్లు ఆశాజనకంగా అక్కడొకరు, ఇక్కడొకరు నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుపోతూ కన్పిస్తుంటారు! కానయితే ఆ నిశ్శబ్దం వెనుక వారి కెన్నెన్ని ఎదురు దెబ్బలో? ఎన్నెన్ని అటుపోట్లో?, మరెన్నెన్ని సంఘర్షణలో?... ఎందుకంటే నిజాయతీపరులకు అడుగడుగునా ఆటంకాలే కద? అందుకే అలాంటి వారు చివరికంటా నడిచేశాక ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు... తమకు.. నిరాశా జనకమైన చీకటి మాత్రమే కన్పిస్తే వారిలో ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు జవాబులుండవు. మరి అలాంటి అయోమయ స్థితిలో నిలచిపోయిన ఓ 'మనిషి' కథ... 'జవాబు తెలియని వాడు'.

మనిషి ఎంత ఎదిగినా, మేధస్సును మరింత పెంచుకుని ఉన్నత శిఖరాల నధిరోహించినా పిరికితనం ఆవహిస్తే మాత్రం తనను తాను ఓడించుకోవడానికి సహజంగానే సిద్ధపడడం మాత్రం వాస్తవం. అయితే ఓ మెరుపు మెరిసినట్లుగా ఏదయినా అద్భుతం జరిగి ఆ పిరికితనం మాయమవడానికి అవకాశం లభ్యమైతే ఉత్తుంగ తరంగాలుగా ఎగసిపడే ఆనందోత్సాహాలకు అంతుండదు. ఆ గెలుపే పెద్ద అందమైన మలుపవుతుంది. ధైర్యం తోడవుతుంది. ఈ విషయాన్నే ఇతివృత్తం చేసుకుని మునిసుందరం గారు వ్రాసిన కథ 'అందం'. రచయిత తలచుకుంటే క్లుప్తతకు ప్రాధాన్యతనిచ్చి కథనెంత నిర్దిష్టంగా సునాయాసంగా చెప్పవచ్చో ఈ కథ ద్వారా తెలియజెప్పారు వారు.

మునిసుదరం గారి కథలలో ఎన్నదగిన కథ ‘ ఈ ఇంటర్వ్యూకు ముగింపు లేదు’. వ్యధాభరిత హృదయంతో చాల ఆర్ద్రంగా వ్రాయబడ్డ కథ ఇది. ఈ దేశమే రైతులది అని భావించే కొందరు మారుమూల గ్రామాల, పల్లెలలోని బడుగు రైతు కుటుంబాలను గూర్చి పంచరంగులలో ఊహించుకుంటుంటారు. కానీ వాస్తవాలు వేరుగానే ఉంటున్నాయి ప్రస్తుత పరిస్థితులలో! ఆ బక్కవాళ్ళ బడుగు బ్రతుకులలోని అసలు సిసలైన చీకటిని దృశ్యమానం చేసిన కథ ‘ ఈ ఇంటర్వ్యూకు ముగింపు లేదు’.

అరణ్యాలు అంతరించి సిమెంటు కాంక్రీటు అడవులు విస్తారంగా విజృంభిస్తున్న తరుణంలో ఆ అడవుల మధ్యన ఆఖరి జీవితాలు గడుపుతున్న వారిలో ఒక ఔత్సాహికుడు మాతృభాష పరిరక్షణకు తన పరిధిలో తన స్థాయిలో కృషి సల్పి భంగపడి వెల్లకిలా పడిన వైనాన్ని తెలిపే కథ “ఎవరిది తప్పు”. ఈ కథలో నిజాయతీతో కూడిన సజావైన జీవితం తాలూకు నడక కన్పిస్తుంది. తెలుగుభాష మీద తమకున్న మమకారాన్ని, వెనుకబడ్తున్న వైనం పట్ల బాధని ఈ కథలో హృద్యంగా వ్యక్త పరిచారు మునిసుందరం గారు. కృతకంగా జీవించడానికి అలవాటుపడ్తున్న ప్రతి మనిషీ చదవదగ్గ కథ ఇది.

నడక తప్ప మరో మార్గాంతరం లేని దార్లకవతల మారుమూల మరో ప్రపంచం లాంటి ప్రాంతంలోని తమపల్లెల్లో... వైద్యసేవలంటే కూడా తెలియని మనుషులు... కొద్దో గొప్పో తెలిసినా అవి లభ్యమయ్యే ప్రాంతాలకు సకాలంలో చేరుకోలేని దుస్థితి. వీటన్నింటి మధ్యనా సంభవిస్తున్న అకాల మరణాలు. వీటితో ఆవేదన చెందిన ఒక పేద మొరటు మనిషి... తన వాళ్ళలో ఎవరైనా ఒక్కర్ని వైద్యుడిగా తయారు చేయాలనే తపనతో తన వివాహం కూడా మానుకుని జీవితాంతం తన రక్తాన్ని చమటగా మార్చి ధారపోస్తూ గడిపిన గాథ ‘అంతరంగం’. ఆ ఆలోచనాపరుడి ఆత్మ తాలూకూ పంచరంగుల కల ఈ కథ. ఇందులో కథకుండాల్సిన నవరసాలు, కథానిక కుండాల్సిన పంచ లక్షణాలు... అన్నీ సమపాళ్ళలో మిళితం అయి కథకు పటిష్టతను చేకూర్చాయి.

ప్రస్తుత రైతుల్లా కాకుండా కాస్త అదృష్టాన్ని అడిగొచ్చిన రైతు శివయ్య. అతని కుమారుడు సప్తసముద్రాల కవతలి ఓ (ఆనంద) లోకంలో స్థిరపడి రెండు చేతులా ఆర్జిస్తున్నాడు. తల్లిదండ్రులు రాజభోగాలనుభవించటానికి వీలుగా ధనం... మనిషిని నడిపించే ఇంధనం... విస్తారంగా పంపుతున్నాడు. అయినా శివయ్యకు ఆయన భార్యకు అంతులేని దిగులుతో కూడిన లోటు. ఆ వైనానికి సంబంధించిన కథే ‘భ్రమ’. ఈ కథలో పాఠకుని గుండెను తడిమే కథనాన్ని ఉత్తమపురుష, ప్రథమ పురుషలను లెక్కచెయ్యనంత వేగంగా, ఉత్కంఠభరితంగా సాగించారు మునిసుందరంగారు. విషాదభరితమైన ముగింపు గలిగిన ఈ కథ ఆకాశవాణి నుండీ ప్రసారం అయి పలు ప్రశంసలు పొందింది.

ఒక రచయిత తన నవలలో ఒక చోట... "ఆనాటి మానవుడ్ని ఎందుకు తింటున్నావని అడిగితే ఆకలి అని స్పష్టంగా చెప్పేవాడు. ఈనాటి మానవుడయితే అలవాటు అంటాడు!" అని చెప్పాడు. నిజమే! ఆకలిని అలవాటు అని చెప్పగలిగిన మనిషి ఆ క్రమంలో పూర్తిగా మారిపోతూ వచ్చి దొరికిన ప్రతిదాన్నీ తినెయ్యడం లేదా సునాయాసంగా మ్రింగి నీళ్ళు త్రాగడం అలవరచుకున్నాడు. ప్రస్తుతానికి గుళ్ళూ, గోపురాలూ, చెరువులూ, కాలువలు, కాలువగట్లు, అడవులు అన్నీ ఆ అలవాటుకు ఆహుతయి పోయాక... చిట్టచివరికి శ్మశానాలు కూడా! ఆ వైనాన్ని అతిసహజంగా, అసహనంగా, బాధగా, ఆక్రోశంగా, ఆవేశంగా వెళ్ళగక్కారు మునిసుందరం గారు తమ 'సుడిగాడు' కథ ద్వారా.

వైవిధ్య భరితమైన ఇలాంటి కథల నెన్నింటినో రచించిన మునిసుందరం గారు తేది 14-9-1937 నాడు చిత్తూరు జిల్లా, రామచంద్రాపురం మండలం, పారకాల్వ గ్రామంలో జన్మించారు. శ్రీమతి లక్షుమమ్మ శ్రీ నాదముని నాయుడుగారు అను పుణ్య దంపతులు వీరి తల్లిదండ్రులు.

మెట్రిక్యులేషన్ నుండీ ఎం.ఎ. వరకూ ప్రయివేటుగా చదువు కొనసాగించిన ముని సుందరంగారు ఆపై తిరుపతి శ్రీ వేంకటేశ్వరా ప్రాచ్య కళాశాలలో (హిందీ) విద్వాన్ చేశారు. ఆపై దాదాపు 37 సంవత్సరాలపాటు కడప, ప్రొద్దుటూరు, చిత్తూరు, పీలేరులలో మరియు పుత్తూరు డిగ్రీ కళాశాలలో హిందీ ప్రాధ్యాపకులుగా పనిచేశారు.

ప్రస్తుతం తమను అనుక్షణం ఆరోగ్యపరంగా కాపాడుకుంటూ వస్తున్న తమ జీవిత భాగస్వామి మరియు సాహితీ సహచరి అయిన తమ శ్రీమతి ఎస్. లక్ష్మీరాజ్యం గారితో కలసి తిరుపతిలో విశ్రాంత జీవితం గడుపుతున్నారు.

ఈ సాహితీ సవ్యసాచి 'జవాబు తెలియని వాడు!' అన్న కథా సంపుటిని ఇటీవల విడుదల చేశారు. ఆ తదుపరి స్వల్ప వ్యవధిలో మరో కవితా సంపుటిని విడుదల చేశారు.

ఆ వెనువెంటనే వెలువడిన వీరి నవల 'ఒక యుద్ధం తర్వాత'. ఈ నవల భారతయుద్ధం తదుపరి పరిణామాల నేపథ్యంలో వ్రాయబడింది. నాటికీ-నేటికీ పరిస్థితులలో మార్పులేని వైనాల్ని చూపుతూ యుద్ధం తదుపరి క్రూరాతిక్రూరమైన నష్టాలకు దర్పణం పట్టిన నవల ఇది.

**రచయిత చిరునామా**

**ఎస్. మునిసుందరం**

'కవితాలయ'

10-190-A2, కోటకొమ్మలవీధి

**తిరుపతి - 517 501**

0877 - 2220769, 9701614947

# వినాయకుడి కథలతో కథాజగత్‌లో అడుగిడిన అల్దీ రామకృష్ణ కవి



**చి**త్తూరు జిల్లా కలికిరిలో జన్మించిన అల్దీ రామకృష్ణ గారు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరి తండ్రిగారు 'హుళక్కి'గారు. (పుట్టిన ప్రతి శిశువు పరమపదిస్తుండగా అల్ది రామకృష్ణగారి తాతగారు అల్ది రామకృష్ణగారి తండ్రి జననం జరిగినప్పుడు 'హుళక్కి' అని నామకరణం చేసి గ్రహపీడ వదిలిపోవునట్లు చేసుకోగలిగారట). అల్దీ రామకృష్ణగారి మాతృమూర్తి గారు చెర్లోపల్లె రెడ్డెమ్మ తల్లి అంశమున జన్మించిన రెడ్డెమ్మగారు.

చాల చిన్న వయస్సు నుంచే పఠనాసక్తి కలిగివున్న అల్దీ రామకృష్ణగారు వారి సహోదరి నాగరత్నమ్మ గారి ద్వారానూ, మరో సీనియర్ విద్యార్థి రెడ్డెప్పగారి ద్వారాను ఏడవ తరగతి ఉత్తీర్ణులయ్యే నాటికే ఛందస్సు నేర్చుకోగలిగారు. వారి ఇంట ఉండిన కామధేనువులాంటి ఆవు చనిపోతే దాని ఖననాన్ని చూసి ఆ రోజులలోనే 'పరితాపం' అన్న శీర్షికతో కొన్ని పద్యాలు వ్రాయగలిగారు. తొమ్మిదవ తరగతి కాలానికే కంద పద్యాల ప్రయోగం ప్రారంభించిన వీరు పదవ తరగతిలోపే 'వాణీదశకం' పేరిట సరస్వతీదేవిపై పదిపద్యాలు వ్రాసి ఉపాధ్యాయులను మెప్పించగలిగారు. ఆపై అంచెలంచలుగా ఎదిగారు.

అందువల్ల అల్ది రామకృష్ణగారు ప్రధానంగా పద్యకవి. అంతేకాక వచన కవితలు, శతకాలు, రూపకాలు, నాటకాలు కూడా నిరవధికంగా వీరి లేఖిని నుండి వెలువడ్డాయి. శ్రద్ధగా పరిశీలిస్తే వీరి రచనల వెనుక నిరంతర పరిశోధన, నిర్విరామ అధ్యయనం, లోతయిన ఆలోచనా సరళి కన్పిస్తాయి.

జానపద, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రక, శాస్త్రీయ కథలు, పాటలు మరియు పద్యాలు... ఇలా అన్ని సాహిత్య ప్రక్రియలలో కూడా బాలల మానసిక స్థాయిలో విద్యార్థినీ విద్యార్థులకు బాలల సాహిత్యాన్ని అందజేయాల్సిన సామాజిక బాధ్యత సాహితీకారులందరి పైనా ఉందని భావించే అల్ది రామకృష్ణగారు తమ రచనా వ్యాసంగంలో బాల సాహిత్య సృజనకు కూడా చాల పెద్ద పీటే వేశారు. బహుశా అదే ఆయనను కథకుడిగా నిలబెట్టింది.

"బాల సాహిత్యం బాలబాలికలకు జ్ఞాన, విజ్ఞానాలను అందజేయాలి. వారు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి పునాదులు వేయగలిగాలి" అని చెప్పే రామకృష్ణగారు బాల బాలికలలో పఠనాభిలాషను పెంపొందింప జేయగలగేలా వినాయకుడి కథలు వ్రాశారు. వీరి వినాయకుడి కథలు చదివే వరకూ వినాయకుడి గూర్చి అన్ని కథలున్నాయని చాలామందికి తెలియదు.

దాదాపు మూడు సంవత్సరాల పాటు బాలల మాసపత్రిక బుజ్జాయిలో వరుసగా ప్రచురితమైన వినాయకుడి కథలలో కొన్నింటిని పుస్తక రూపంలో తీసుకువచ్చారు రామకృష్ణగారు. 1998లో కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయంలో ఆవిష్కరింపబడిన 'వినాయకుడి కథలు' ఒక్కటే ఇన్నేండ్ల చరిత్రలోనూ ఆ ఆలయంలో ఆవిష్కరింపబడిన గ్రంథమైంది.

దేశ విదేశాలలోని అనేక పోర్టల్‌లలో ఈ కథలు ఫీడ్ చేయబడ్డాయి.

"బాల్యం లేని మనుషులుండరు. బాల్యం బంగారులోకం, కలల ప్రపంచం! ఆ కలలు కంటూ, ఆనందిస్తూ, ఆ ఆనందంలో లక్ష్యాలను నిర్దేశించుకుంటూ సాగే బాలబాలికల మనసులలో లక్ష్యసాధనలకు అసంకల్పితంగానే అయినా పునాదులు పడేది మాత్రం బాల్యంలోనే. అందుకు దోహదపడడానికి బాల సాహిత్యం ఖచ్చితంగా అవసరం" అంటారు రామకృష్ణగారు. ఈ నేపథ్యంలోనే, అమ్మ భాషలోనే వారి లేఖిని నుండి వెలువడిన 'తెనాలి రామకృష్ణుడి కథలు' ఆంధ్రభూమి దినపత్రిక తాలూకు బాలభూమిలో ధారావాహికంగా ప్రచురితమయ్యాయి. మరి కొన్ని ఇతర కథలు బాలల పత్రికలలో ప్రచురితమయ్యాయి.

గతంలో కొన్ని సాంఘిక కథలు వ్రాసిన రామకృష్ణగారు ప్రధానంగా పద్యాలు, కవితలు, నాటకాలు మీదే దృష్టి సారించడం వల్ల ఎక్కువ కథలు వ్రాయలేక పోయారు.

**కథా సంపుటాలుగా వెలువడిన వీరి రచనలు :** 1. వినాయకుడి కథలు 2. షిరిడీ సాయిబాబా సూక్తులు, గాథలు (మొదటి భాగం), 3. షిరిడీ సాయిబాబా గాథలు, సూక్తులు (రెండవ భాగం).

అల్దీ రామకృష్ణగారి రచనలలో బాలలకు ఉపయోగపడే విధంగా వ్రాయబడ్డ అమ్మలగన్న అమ్మ, విఘ్నరాజో వినాయక అన్న రూపకాలు రెండూ ఆకాశవాణి తిరుపతి కేంద్రం ద్వారా ప్రసారం అయ్యాయి.

గ్రంథ రూపాలు దాల్చిన వీరి రచనలనన్నింటినీ ఒక్కసారి పరిశీలిస్తే ...

1. హరిహరసుత శతకము – 1995
2. వినాయకుడి కథలు – 1998
3. కుమ్మరి భీమన్న నాటకం – 1999 (కురవరతి నంబి కథ)
4. దైవదర్శనం – ధర్మ సందేహాలు – 2006
   మరియు కలికిరి గ్రామదేవత కథ
5. శ్రీ షిరిడీ సాయిబాబా గాథలు – సూక్తులు – (మొదటి భాగం) 2008
6. శ్రీ షిరిడీ సాయిబాబా గాథలు – సూక్తులు (రెండవ భాగం) 2011

వీరి రచనలు గ్రంథ రూపాలుగా వెలువరించడానికి గాను తిరుపతి తిరుమల దేవస్థానం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజారాం మోహన్‌రాయ్ లైబ్రరీ లాంటి సంస్థలు సంపూర్తిగా ఆర్థిక సహాయ, సహకారాల నందించాయి.

'కుమ్మరి భీమన్న' నాటకం మరికొన్ని ఇతర రచనలు ఆకాశవాణి ద్వారా ప్రసారం కావడం జరిగింది.

వివిధ ప్రక్రియలలో సాగుతున్న అల్దీ రామకృష్ణగారి లేఖిని నుండి త్వరలో ఒక సాంఘిక కథా సంపుటిని ఆశించడం మాత్రం దురాశ కాదు.

**చిరునామా :**

**అల్దీరామకృష్ణ**
రైల్వేస్టేషనురోడ్డు
**కలికిరి – 517 234**
సెల్ నెం : 9703520064

## సమాజ శ్రేయస్సును ఆకాంక్షిస్తూ సాహితీ సృజన కావిస్తున్న కథకుడు మాన్యశ్రీ నాయుని కృష్ణమూర్తి



చిత్తూరు జిల్లా చౌడేపల్లె సమీపంలోని మేకలచిన్నపల్లెలో హెడ్మాస్టరుగా పనిచేస్తుండిన శ్రీ నాయుని రామయ్య, వారి ధర్మపత్ని శ్రీమతి నరసమ్మలకు నాలుగవ సంతానంగా 1951వ సంవత్సరంలో జన్మించిన శ్రీ నాయుని కృష్ణమూర్తిగారు తండ్రిగారి ప్రోద్బలంతో అతి చిన్న వయసులోనే తమ సోదరులతో కలసి భగవద్గీత శ్లోకాలను కంఠస్తం చేసిన వారు. వీరి విద్యాభ్యాసం మేకలచిన్నపల్లె, మదనపల్లె, చౌడేపల్లె, తిరుపతిలలో జరిగింది. చెన్నపట్టణంలో పత్రికా సంపాదకులుగా సాహితీరంగంలో కొంతకాలం, రచయితగా సినీరంగంలో కొంతకాలం పనిచేశారు. అపారమైన వీరి జీవితానుభవానికి అక్కడే పునాది పడివుండాలి.

రామాయణ, భాగవతాలను చక్కటి తెలుగు వ్యవహారంలో పరిష్కరించి ఆంధ్రదేశపు ఆధ్యాత్మిక పాఠక లోకానికి అందించి ప్రసిద్ధులయిన వీరు కొన్ని నవలలు, నాటికలు, కవితలు కూడా వెలువరించారు. తమ సాహితీ సృజనను కథలతోనే ప్రారంభించినా కథలు మాత్రం తక్కువగానే వ్రాశారని చెప్పవచ్చు. వీరి రచనలన్నింటిలో సమాజ శ్రేయస్సును గూర్చి వీరి ఆకాంక్ష అంతర్లీనంగా దృశ్య మానమవుతూ పాఠకులను ఉన్నతులుగా మలచడానికి అదృశ్య హస్తంలా ప్రయత్నిస్తుంది. గొప్ప నిజాయితీ కలిగిన రచయిత అని వీరి రచనలు తెల్పాయి. కథకు నిర్వచనం చెప్పడానికి తమ ఊహ సరిపోదనే ఈ గమ్మత్తయిన రచయిత తాము వ్రాసిన కథలలోంచీ అందుబాటులో వున్న పదహారు కథలను ఏర్చి, ప్రతి కథకూ కథ వెనుక నేపథ్యాన్ని కూర్చి ఖరీదైన కాగితం మీద చక్కటి ముద్రణతో, కన్నుల విందైన ముఖచిత్రంతో, కన్నుల కింపైన అర్థవంతమైన వెనుక అట్టతో... రెండు వందలా పది పేజీల పుస్తకాన్ని పాఠకులకు డెబ్బయి అయిదు రూపాయలకే అందజేస్తున్న వారి ఔదార్యం అభినందనీయం.

పేజీలు తిరగెయ్యగానే రచయిత జీవితంలోని కొన్ని అమూల్య జ్ఞాపకాలతో ముడిపడివున్న చిత్ర, విచిత్రమైన విషయాలతో ముందుమాట ఆకట్టుకుంటుంది. ఏభయి రెండు సంవత్సరాల క్రితం మదనపల్లె రామారావు అప్పర్ ప్రైమరీ

పాఠశాలలో అప్పటి హెడ్మాస్టరు స్వర్గీయ సి. రామచంద్రరావుగారు చెప్పిన 'మాండ్రేక్' బొమ్మల కథలు కలిగించిన ప్రేరణ, తూర్పు కొత్తపేట వీధిలో చిట్టచివర్న వుండిన శీకాయ, పసుపుపొడి పొట్లాల అంగడిగా పేరు పడ్డ అశ్వర్థం పచార్ల కొట్టులోని అర్దణా లైబ్రరీలో తమ సహోదరిగారి కోసం అపరాధ పరిశోధక నవలలు అద్దెకు తెస్తూ దార్లోనే చదవడం లాంటి విషయాలు కొన్ని, హృదయాన్ని అలవోకగా స్పర్శిస్తాయి. గ్రంథాన్ని తమ సహోదరికి అంకితం ఇవ్వడంలో గొప్ప ఔచిత్యాన్ని ప్రదర్శించారు రచయిత.

ఇక కథలలోకి అడుగుపెడితే కథలే కాక కథ వెనుకకథలూ కదిలిస్తాయి. కొన్ని చోట్ల అలా నిలబెట్టి ఆలోచింపచేస్తాయి.

**1. గాజుపెంకు :** ప్రపంచంలో సమర్థులకూ, అసమర్థులకూ మధ్యన పొంతన కుదరడం కష్టం. ఒకవేళ కుదిరినా అది కాస్తా కలకాలం మనగలగడం మరింత కష్టం. అలా మనగలగాల్సి వచ్చినప్పుడు కానీ... మనలేక విడిపోయినప్పుడు కానీ ఉత్పన్నమయ్యే మానసిక సంఘర్షణలు మాత్రం సామాన్యమైనవి కావు. సమర్థుడుగా, ప్రకాశవంతంగా వెలుగొందుతున్న ఓ అసమర్థుడయిన, వ్యక్తిత్వం లేని మనిషి ముంగిట నిలచిన ఇరువురు సమర్థవంతులైన, వ్యక్తిత్వమున్న మనుషులు... ముచ్చటైన ఈ మూడు పాత్రలతో అల్లబడ్డ చిత్రమైన కథ గాజుపెంకు! మానవుడిలోని శక్తి – అశక్తుల తాలూకు మానసిక సంఘర్షణలకు దర్పణం ఈ కథ.

నిజానికయితే గాజుపెంకు కథకూ ఆ కథ వెనుక వ్రాసిన కథ వెనుక కథకూ గొప్ప లింక్ లేదు. ఈ కథ వెనుక కథ నాయుని కృష్ణమూర్తిగారి జీవిత డైరీలోని తొలి అధ్యాయాలకు చెందిన కొన్ని పేజీలు అని అనవచ్చు. అయితే కథలోని సంఘటనలకన్నా ఈ పుటటలోని విషయాలే పాఠకులకు ఎక్కువ స్పందనను కలిగిస్తాయి.

**2. కథ :** ఆకలితో ఆరంభమయ్యే కథయినా చక్కటి గమ్మత్తయిన ఎత్తుగడ కలిగిన కథ. ఈ కథలో కొద్దోగొప్పో ముళ్ళపూడి వారి సెరిబ్రల్ సినేమియాను దాటి ముందుకు సాగిన ఘటనలున్నాయి. ఈ కథకూ – కథ వెనుక కథకూ కొంత లింక్ అయితే కన్పిస్తున్నది కానీ ఇది సైతం నాయుని కృష్ణమూర్తిగారి జీవన చిత్రంలోని కొన్ని అపురూప దృశ్యాల సమ్మేళనమేనని అన్పిస్తుంది.

**3. స్వామీజీ సొల్యూషన్ :** వాస్తవానికయితే ఇది ఒక అపరాధ పరిశోధక కథ. అయితే కథలోకి కాస్త వేదాంతం కలపబడడం వల్ల ఆ పరిధిలోంచి, వెలపల పడింది. ఈ కథకు సంబంధించిన కథ వెనుక కథలో సైతం రచయిత డైరీలోని ఒక పేజీ కన్పిస్తుంది.

**4. లక్షన్నొకటో రాముని కథ :** చాల లోతైన కథ. పాఠకుల గుండెల్ని పిండగలిగిన కథ! అట్టడుగు వర్గాల బలహీనతలను, తమను తాము స్వయంగా నాశనం చేసుకోగల వారి మానసిక స్థితిగతులను బట్టబయలు చేయడానికి ప్రయత్నించిన కథ. కథలో అక్కడక్కడ అధివాస్తవికత కన్పించినా వాస్తవానికి చేరువలోనే ఉన్న కథ. ఈ కథకు సంబంధించిన కథ వెనుక కథ నిజంగా కథకు సంబంధించిన కథ వెనుక కథే!

**5. డ్రామా :** నాయుని కృష్ణమూర్తిగారి మనసులో సమాజ శాంతికోసం ఎన్నో కలలున్నాయి. హృదయంలో ప్రపంచాన్నంతా ప్రశాంతంగా ప్రేమించగల ఔన్నత్యం వుంది. ఆ ఊహల క్రమంలో ఆచరణలో ఎదురయ్యే సంఘర్షణలను గూర్చి వ్రాయబడ్డ కథ డ్రామా! చాల మంచికథ. అయితే "రాఘవయ్య తన భార్యతో లేచిపోయాడు!" అన్న చోటే రచయిత కథను ఆపివేసి వుంటే ముగింపు హుందాగా వుండి కథ గొప్ప కథల జాబితాలో పడివుండేది. అలా కాకుండా 'ఉపశృతి' పేరిట కథలో జోక్యం చేసుకుని "లోకములో హిపోక్రసి అను ఒక స్వభావము కలదు" అన్న వాక్యాన్ని కలపడం ద్వారా కథను బలహీన పరచారని పిస్తుంది.

ఈ కథకు కథ వెనుక కథ సాధారణంగా వుంది.

**6. మంచిగంధం :** తమ పనికిమాలిన చర్యలతో ఎదుటి వారి జీవితాలను చిందరవందర చేసి రాక్షసానందాన్ని అనుభవించే శాడిస్టులు అప్పుడప్పుడు, అక్కడక్కడ కన్పిస్తుంటారు. కానయితే వారు విసిరేబాణాలకు బలయిపోకుండా తెలివిగా తప్పించుకోవడం మాత్రం పెద్ద కష్టమైన పనికాదు నిజానికి. ఆ వాస్తవాన్ని ఎరుకపరిచే కథే మంచిగంధం. ఈ కథకు కథ వెనుక కథతో బలీయమైన నేపథ్యం వుంది.

**7. మీరయితే ఏంచేస్తారు? :** నిజంగా ప్రస్తుతం నడుస్తున్న సమాజాన్ని నిలదీసి ప్రశ్నించే కథ 'మీరయితే ఏం చేస్తారు?' చదివించే గుణం కాస్త ఎక్కువగా కలిగి వున్న కథయినందున ఆసాంతం ఆసక్తిగా చదివింప జేస్తుంది. అద్భుతమైన ముగింపు కలిగిన కథ. ఈ కథకు కథ వెనుక కథ కాకతాళీయం.

**8. బలీయం :** ఇదో అలివికాని ప్రేమకథ! నాయుని కృష్ణమూర్తిగారు పెద్దగా ప్రేమ కథలు వ్రాసినట్లు లేదు కానీ ఈ కథ ఫక్తు ఆ కోవలోకే చెందుతుంది. క్రమశిక్షణ అనేది కథలోని వస్తువయినా దాన్ని ప్రేమరూపంలో అనుభూతి ఐక్యత డామినేట్ చేస్తుంది. కథ వెనుక కథలో కథకు పడ్డ పునాది బలంగా కన్పిస్తుంది.

**9. సారాజు కథ :** చూడడానికయితే ఓ రుషిలా కన్పిస్తారు కానీ నాయుని కృష్ణమూర్తిగారిలో ఒక గొప్ప రాజకీయ సాంకేతిక నిపుణుడు దాగున్నాడు. ప్రస్తుత సామాజిక కాలమాన పరిస్థితుల రాజకీయ కాన్వాసు మీది నల్లగీతలకు కళాత్మకంగా ఆయన అద్దిన చీకటి రంగుల తాలూకు ఇంద్రధనుస్సే సారాజు కథ.

ఇక ఈ కథ వెనుక కథ విషయానికొస్తే... నిజంగా ఇది కథ వెనుక కథే! "కులములోన ఒకడు గుణవంతుడుండిన, కులము వెలయు వాని గుణము చేత..." అన్నట్లు కొంతమంది నిజాయతీపరులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు కలసి సంపూర్ణ అక్షరాస్యతా ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళడమే కాక చిత్తూరు జిల్లా ఖ్యాతిని, కీర్తి ప్రతిష్టలను దేశ వ్యాప్తంగా ఇనుమడింప చేయడం మొదలయిన రచయిత స్వానుభవాలను చదువుతుంటే ఒళ్ళు పులకరిస్తుంది. కథ చదివినప్పుడు ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితుల పట్ల ఏర్పడిన నిరాశా నిస్పృహలు కథ వెనుక కథ చదివాక తొలగిపోయి సమాజాన్ని బ్రతికింప జేసుకోవచ్చుననే విశ్వాసం కలుగుతుంది.

**10. రేపటి మాట :** సమాజానికి చెందిన చాల ముఖ్యమైన విషయాలను అంతర్లీనం చేసుకుని ఈ కథలో సాగిన చర్చలో చాల అమూల్యమైన అభిప్రాయాలే వెలువరించబడ్డాయి! నిజంగానే ఈ కథ రేపు జరగబోగల వాస్తవానికి దివ్యదృష్టితో కూడిన దర్పణం.

కాలానికి నిలిచే ఈ కథ తాలూకు కథ వెనుక కథ క్రెడిట్ అంతా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ గ్రంథాలయాధికారి, సాహిత్యాభిమాని శ్రీ షణ్ముగం గారికే దక్కుతుందన్నది వాస్తవం.

**11. మాట్లాడరేమండీ :** స్త్రీవాద దృక్పథంతో రచయిత్రులు తప్ప రచయితలు లోతయిన రచనలు చేయలేరన్నది చాలమంది మగమహరాజుల అభిప్రాయం కూడా! అది కేవలం దురభిప్రాయం మాత్రమే అని చెప్పడానికి నికార్సయిన

ఉదాహరణ "మాట్లాడరేమండీ" కథ. కథలో కన్పించే సామాజిక దృష్టికోణం పాఠకులను బాగా ఆలోచింపజేస్తుంది. ముగింపు అద్భుతం. ఈ కథ వెనుక కథలో కన్పించిన రచయిత నిజాయితీకి హేట్సాఫ్ చెయ్యకతప్పదు.

**12. నిరంజనుడు :** అమలిన శృంగారం కూడా అవసరం లేకుండానే చక్కటి ప్రేమ కథలు కొందరే వ్రాయగలుగుతారు. నాయుని కృష్ణమూర్తిగారు ఆ కొందరిలో ఒక్కరని 'నిరంజనుడు' కథ చెప్పకనే చెపుతుంది. ఈ కథ వెనుక కథను గూర్చి చెప్పుకోవాల్సిందేమీ లేదు... రచయిత జీవిత డైరీలోని ఒక పేజీలోని ఒక పేరా కావచ్చు... బహుశా...

**13. తెలుగోడు :** విదేశీ సంస్కృతికి సునాయాసంగా బానిసలమై పోయినంతగానూ మనం తెలుగుభాషకు ఎంత సుదూరం అయిపోయామో వ్యంగ్యంగా చెప్పగలిగిన కథ. ఇది ఒక ప్రముఖ పత్రికలోనే గాక ఒక విదేశీ తెలుగు పత్రికలో కూడా ప్రచురితం కావడం ఆనందించదగ్గ విషయం.

ఈ కథ వెనుక కథలో నాయుని కృష్ణమూర్తిగారు ఆడిన తెలుగాటలు స్ఫూర్తిదాయకంగా వున్నాయి.

**14. అతడు–ఆమె–అది :** 'టీవీ'ల మీదా, వాటి ద్వారా ప్రజలకు సోకుతున్న సీరియల్ వైరస్‌ల మీదా ఇదివరకే చాల కథలూ, కమామీషులూ వచ్చాయి. ఆ దిక్కుమాలిన వాటిని బాసింపట్టేసుకుని మరీ చూసే వారి దృష్టికోణాల్లో మార్పొచ్చే మార్గాలు కన్పించడం లేదు ఎక్కడా! వీటి వీక్షణాలలో జీవితాలలోని విలువైన గంటలు వందల్లో, వేలల్లో వృథా అయిపోతున్న వైనాన్ని గ్రహించగలిగే వారూ కన్పించడం లేదు. నాయుని కృష్ణమూర్తిగారు కూడా ఈ విషయంలో తమ భావాలకు కథ రూపం ఇచ్చి వ్యంగ్యవైభవంతో పాఠకుల ముందుంచారు.

ఈ కథ వెనుక కథలోనికి వస్తే కథ కన్నా ఇందులోనే విషయం చాల, చాల వుంది. నాయుని కృష్ణమూర్తిగారిని భయపెడ్తున్న నాలుగు విషయాలు సమాజంలోని మేధావులందరినీ కలవరపెడ్తున్నవే! మరి!!

**15. నేను :** నేటి సమాజంలోని ప్రతి మనిషీ తప్పక చదవాల్సిన కథ. ప్రతి మనిషికీ అత్యవసరం అయిన కథ. కథ వెనుక కథకు కూడా జడభరతుడ్నే ఎన్నుకోవడంలో రచయిత ఎనలేని ప్రజ్ఞ మరెంతో విజ్ఞత ప్రదర్శించారు.

**16. అంతరాల వాసన :** ఈ కథలో బాధ్యత తెలిసిన కుటుంబాలు, వ్యక్తిత్వం వున్న మనుషులు, వాళ్ళమధ్య ప్రేమలూ కన్పించి సమాజానికి

సందర్భోచితమైన సూచనలేవో చేస్తున్నాయి. వారివారి జీవితాల పరిధిలో అర్థం చేసుకుని ఆచరించవలసిందిగా అంతర్లీనంగా బోధిస్తున్నాయి. చదవదగ్గ అద్భుతమైన కథ!! అందరికీ ఆమోదయోగ్యం కాగల ఈ కథ వెనుక కథ మూడుతరాలను రచయిత నిశితంగా పరిశీలించిన తీరును తెలియజేసి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఇంత మంచి కథా సంపుటిని అందించిన రచయిత అభినందనీయులు.

ఇటీవల వీరు 'ఏం లేదు' అన్న కథానికను వెలువరించారు. ఓరల్‌గా చూస్తే ఈ కథలో ఏంలేదు! కానీ ఎథికల్‌గా చూస్తే అంతర్గత తాత్విక దృష్టికోణం నిండిన 'జీవితం' కన్పిస్తుంది కథనంలో! నిజానికది వారి ముద్ర! ఆ ముద్ర వారి నవలలలోనే గాక అనేక కథలలో కూడా కన్పిస్తుంది.

వీరి రచనలన్నింటినీ చదవడం సమాజ శ్రేయస్సును కాంక్షించే పాఠకులందరికీ ఉపకరించగల అంశం.

**అందుబాటులోవున్న శ్రీ నాయుని కృష్ణమూర్తి రచనలలో కొన్ని...**

1. రామాయణం (వ్యవహారిక రూపం)
2. మహాభాగవతం (స్వేచ్ఛారూపం)
3. కథలు (కథాసంపుటి)
4. యామినీ కుంతలాలు (సాంఘిక నవల)
5. మనసు గుర్రమురోరి మనిషీ! (సాంఘిక నవల)
6. ప్రలోభం (సాంఘిక నవల)
7. తెలుగు – ఇంగ్లీషు బొమ్మల నిఘంటువు
8. తెలుగు – ఇంగ్లీషు సచిత్ర నిఘంటువు
9. తెలుగు – ఇంగ్లీషు విద్యార్థి నిఘంటువు.

**చిరునామా :**

**నాయుని కృష్ణమూర్తి**
విజయవాణి ప్రింటర్స్
గోసుల కురపల్లిరోడ్
**చౌడేపల్లె – 517 257**
ఫోన్ నెం : 08581 – 200660

## ప్రేమించే మంచి మనసున్న మధుర కథకుడు

## మధురాంతకం రాజారాం (05-10-1930::31-03-1999)



'కథకు కాళ్ళులేవు ముంతకు చెవులు లేవు!' అన్నది చాల పాత సామెత!! అయితే కథకు చకచకా నడిచే కాళ్ళూ, దిశా నిర్దేశం చేసే చేతులూ, ఆత్మీయ స్పర్శనందించే హృదయమూ, మంచిని ప్రబోదించే మనసూ ఉంటాయనీ, అలా ఉండడం వల్ల ఆ కథతో సమాజం ప్రభావిత మవుతుందని తెలుపడమే కాదు... అలాంటి అసలు సిసలైన తెలుగుకథలు వందలాదిగా వ్రాసి తెలుగు కథను విశ్వ వ్యాపితం చేసి మెప్పించిన గొప్ప కథకులు మధురాంతకం రాజారాం గారు.

చిత్తూరు జిల్లా మొగరాల గ్రామం రమణయ్యగారి పల్లెలో 5-10-1930 తేదీన వీరి జననం జరిగింది. శ్రీమతి ఆదిలక్ష్మమ్మ, శ్రీ విజయరంగపిళ్ళై అను పుణ్యదంపతులు వీరి తల్లిదండ్రులు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి చెందిన ఉత్తర ఆర్కాట్ జిల్లా చెంజి వెంకటాపురానికి చెందిన విజయరంగపిళ్లెగారు తెలుగు పాఠాలు బోధించడానికి, నాటకాలు వేయించడానికి గాను రమణయ్యగారి పల్లెకు కుటుంబంతో వలసవచ్చారు.

మధురాంతకం రాజారాం గారి పెద్దనాన్న పెద్దమునుస్వామి పిళ్ళైగారు అనేక మెలికలతో ఆసక్తికరమైన కథలు చెప్పేవారట. రాజారాం గారి రచనా వ్యాసంగానికి అక్కడే, అప్పుడే అంకురార్పణ జరిగి ఉండవచ్చు బహుశా.

చదువుకునే రోజులలోనే పద్యాలు వ్రాయగలిగిన రాజారాం గారి ఉద్యోగ జీవితం 1964 ప్రాంతంలో పాకాలలో సంక్షేమ హాస్టలు వార్డనుగా ప్రారంభమైంది. ఏడాదిపాటు ఆ ఉద్యోగం చేసిన రాజారాంగారు తరువాత ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు.

సభా, జయరాం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, మునిసుందరం, నూతలపాటి గంగాధరం, కలువకొలను సదానంద, కేశవరెడ్డి, వాకాటి పాండురంగారావు, మునిపల్లెరాజు, కాళీపట్నం రామారావు మొదలైన సాహితీ కుటుంబీకుల సాహచర్యం వీరికి పుష్కలంగా లభించింది.

సభాగారి ప్రభావం, ప్రేరణలతో కథా రచనకు పూనుకున్న రాజారాం గారి మొట్టమొదటి చిన్నకథ 'చిత్రగుప్త' అన్న పత్రికలో 1950 ప్రాంతంలో

ప్రచురితమైంది. పూర్తిస్థాయి కథ 1951లో ఆంధ్రపత్రికలో ప్రచురితమయ్యాక కథారచనలో వారు వెనక్కి తిరిగి చూసిన దాఖలాలు ఎక్కడా కన్పించవు. మూడు వందలకు పైగా కథలు వ్రాసిన వీరు వి. జయరాంగారి ప్రేరణతో చిత్తూరు ఆర్ట్ లవర్స్ యూనియన్ కోసం అద్భుతమైన తొమ్మిది నాటకాలు, ఆరు నృత్యగేయ నాటికలు వ్రాశారు. బాలబాలికల కోసం అనేక గేయాలనూ వ్రాశారు. తమిళభాష నుండీ కొన్ని రచనలను తెలుగు భాషలోకి అనువదించారు. వందకుపైగా వ్యాసాలను వ్రాసిన రాజారాంగారు 'మధు' అన్న కలం పేరుతో కూడా కొన్ని వ్యాసాలను వ్రాయడం జరిగింది. ఆ రోజులలోనే రమణయ్యగారి పల్లెలో ప్రతి ఆదివారం సాహితీ సదస్సులు జరిపిన సాహిత్యాభిమాని రాజారాం గారు.

వీరి అనేక కథలు ఆంగ్ల, హిందీ, తమిళ, కన్నడ, మళయాల భాషలలోనికి అనువదించబడ్డాయి. కేంద్ర సాహిత్య అకాడమీ కూడా వీరి రచనలను కొన్నింటిని ఇతర భారతీయ భాషలలోనికి అనువదించడం జరిగింది.

చదువుకోవడం నాకత్యంత ఇష్టమైన పని అని చెప్పే రాజారాంగారు సాహిత్యాన్ని చాల ఎక్కువగానే చదువుకున్నారు. ముఖ్యంగా 1950–60 మధ్యకాలంలో కథా సాహిత్యాన్ని చాల ఇష్టంగా బాగా చదువుకున్నారు.

మనుషుల్ని ప్రేమించే వారే మంచి కథలు వ్రాయగలరు అని నమ్మిన వీరు మనుషుల్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని ఎంతగా ప్రేమించారో వీరి రచనల్ని యిష్టంగా చదువుకునే పాఠకులకు, రచయితలకు, పరిశీలకులకు మాత్రమే తెలుస్తుంది. వృత్తిరీత్యా ఉపాధ్యాయులైన వీరు విద్యార్థులలో ఆసక్తి రేకెత్తించే విధంగా పాఠాలు చెప్పినట్లే పాఠకులను ఆకట్టుకునే విధంగా వందలాది కథలు వ్రాసి మెప్పించగలిగారు.

దాదాపు పండ్రెండేళ్ళ క్రితం ఒక తెలుగు దినపత్రిక నిర్వహించిన సర్వేలో తెలుగు కథా సాహిత్యంలో వంద ఆణిముత్యాలుగా వంద కథల్ని ఎంపిక చెయ్యడం జరిగింది. ఆ పట్టికలో రాజారాం గారి 'ఎడారి కోయిల' కథ చోటు చేసుకుంది. ఒక్క ఎడారి కోయిలే కాదు వారు వ్రాసిన అనేకానేక కథలు అదే స్థాయిలో ఉన్నాయన్నది వాస్తవం. వారి ప్రతి కథా ఓ దృశ్య కావ్యమే! సమాజానికి అత్యుత్తమ సందేశమే!!

ఎప్పుడైనా, ఎవరైనా ఆయన్ను చూడబోతే "నాయనా!" అంటూ భుజం మీద చెయ్యేసే ఆయన తాలూకు ఆ ఆత్మీయ కరస్పర్శలో హృదయ స్పర్శ ఎంత నిండుగా ఉండేదో ఆయన వ్రాసిన వందలాది కథలలో సైతం

అంతనిండుగానూ మృదుమధురమైన ఆ హృదయస్పర్శ తప్పక కన్పిస్తుంది. అదే ఆయన కలానికుండిన ఎన్నటికీ తరగని బలం.

వారి కథంటే ఒట్టి కథేనా?

మధురమైన మనిషిమాట, పసందైన మనసు పాట, పరవశింపజేసే ప్రకృతి సౌందర్యం, వెన్నపూస పూతలా హృదయానికి తాకే సౌకుమార్యం, మనసును లాలించి మలయమారుత స్పర్శను అందిస్తూ మైమరపింపజేయగల అంతర్గత సంగీతం... ఇవన్నీ కలగలసి పోయిన ఒక గొప్ప సాహిత్యామృత జీవధార... మధురాంతకం రాజారాంగారి అచ్చ తెలుగు కథ.

రాజారాంగారి కథా సాహితీ సాగరం ఓ అమృత కడలి. దాన్ని పరిశీలించడానికి పూనుకున్న చదువరి అపారమైన జీవితానుభవాన్ని పొందడమే కాదు... ఈ సమాజం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో గ్రహించి సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే అత్యుత్తమ పౌరుడుగా ఎదగగలడు.

ప్రసిద్ధ సాహితీకారులు తెలిపే నియమ నిబంధనలను కానీ, లాక్షణికులు తెలిపే లక్షణాలను కానీ, విమర్శకులు చెప్పే విధానాలను కానీ, భాష్యకారులు సూచించే క్రమపద్ధతులను కానీ పెద్దగా పరిగణన లోనికి తీసుకుని తమ రచనలలోకి చొప్పించే ప్రయత్నం చెయ్యని రాజారాం గారు తమదైన ముద్రతో తమ అనుభవంలోకి వచ్చిన విషయాలనే వస్తువులుగా తీసుకుంటూ, తమ పరిసరాలనూ, పరిస్థితులనూ, తమచుట్టూ సంచరించే మనుషుల మనస్తత్వాలను, వారివారి జీవన వైవిధ్యాలలోని కష్టసుఖాలనూ యధాతథంగా చిత్రిస్తూ, తాము సహజంగా మాట్లాడే భాషనే ఉపయోగిస్తూ రచనలు సాగించారు. అలా సాగిన వారి వందలాది కథలలో ఏ కథను తీసుకున్నా అద్భుతమే...

**సంక్రాంతి శంఖం :** పాతికేళ్ళ క్రితం కాబోలు ఈ కథ ఒక సంక్రాంతి నాడు ఆకాశవాణి కడప కేంద్రం నుండీ ప్రసారమైంది మధురాంతకం రాజారాం గారి సుస్వరంతో. ఆ కథవిన్న సాధారణ శ్రోతలే కాదు రచయితలు, సాహితీ విమర్శకులు సైతం కొందరు గుండెలు తడిచేసుకుంటే మరికొందరు కన్నీరు కార్చడం జరిగింది.

పల్లె సీమలో పుట్టిపెరిగి పరిస్థితులకూ, కాలానికీ కట్టుబడి పల్లెకు దూరమయి బస్తీలో స్థిరపడ్డ మనిషి పల్లెతో ఆఖరి అనుబంధాన్ని తెంచుకుపోయే చివరి అంకాన్ని కడు హృద్యంగా విన్పించిన ఆనాటి ఆయన కథను విన్నవారెవరూ ఎప్పటికీ మరచిపోలేరు.

ఒకనాటి పల్లెటూర్ల తాలూకు మధురమైన జీవితాలను, వైవిధ్యభరితమైన ఆనాటి జీవన విధానాలనూ... అప్పుడప్పుడే ప్రవేశిస్తున్న ప్రపంచీకరణ ప్రభావపు ఛాయలు నిర్దాక్షిణ్యంగా చిదిమేస్తున్న వైనం 'సంక్రాంతి శంఖం' కథలో అంతర్లీనంగా కనపడి పాఠకుడి గుండెను చెరువు గావిస్తుంది. ఈ కథను రాజారాంగారి కథా సంపుటాలలో విశాలాంధ్ర వారు ప్రచురించారు.

**రాతిలో తేమ :** దాదాపు ఇరవైయేళ్ళ క్రితం ఆంధ్రప్రభలో ఈ కథ ప్రచురితమైంది. జమీందారీ స్థాయికి చెందిన ఒక భూస్వామి, కొన్ని మధ్య తరగతి కుటుంబాలు మరికొన్ని పేద కుటుంబాలతో పాటుగా నిరుపేద జీవులు సైతం నివసించే ఒక గ్రామం తాలూకు గత ఏభయి సంవత్సరాల చరిత్రను కొన్ని పేరాలలో వర్ణించే ఎత్తుగడతో ప్రారంభమయ్యే ఈ కథ అనేక గ్రామాల తాలూకు ప్రజాజీవితాలకూ, పెద్ద మనుష్యుల ఆజమాయిషీకి, న్యాయా న్యాయాల విశ్లేషణలకూ దర్పణం! గ్రామం తాలూకు వర్ణన, భూస్వామి కుటుంబం తాలూకు స్థితిగతులు, వారి వ్యక్తిగత జీవితాలు, వ్యక్తిత్వాలను కళ్ళకు కట్టిస్తూ కథ ఆసక్తికరంగా సాగుతుంది. కథలో రెడ్డిసాని ఆలోచనా విధానం సమాజంలోని ప్రతి మనిషికీ ఆదర్శప్రాయం. కథలోని ఆక్రోశం, ఆర్ద్రతలు పాఠకుల గుండెలను కదిలిస్తాయి!! రాతిలోంచీ తేమను కాదు... తేనెను తీయగలిగిన ముగింపు అద్భుతం... అజరామరం!! ఈ కథ కొన్ని కథా సంకలనాలలో కూడా చోటు చేసుకుంది.

**త్రిశంకుడి స్వర్గం :** దాదాపు ముప్పై అయిదేళ్ళ క్రితం ఆంధ్రపత్రికలో ప్రచురితమైన కథ. ఎదుటివారిని ఇబ్బంది పెడ్తూ, తాను ఇబ్బందులు పడ్తూనే రాజయోగాలు అనుభవిస్తున్నట్లు తనను తాను భ్రమింపజేసుకుంటూ జీవితాన్ని గడిపివేసే ఒక (అ)సామాన్యుడి కథ ఇది. చిత్రమేమిటంటే తను అమాయకుడూ, అసాధ్యుడూ కాక పోవడం! దిగువ మధ్య తరగతి ప్రజానీకంలో కన్పించే కొందరి మనస్థత్వాలకు ప్రతీక ఈ కథ... ఇప్పటికీ నిత్యనూతనమే!

**పొద్దుచాలని మనిషి :** చిత్తూరు ఆర్ట్ లవర్స్ యూనియన్ నిర్వాహకులు వి. జయరాంగారితో, వారి జీవన విధానంతో మధురాంతకం రాజారాంగారికి విడదీయరాని ఆత్మీయ అనుబంధం చిరకాలం కొనసాగింది. 'పొద్దుచాలని మనిషి' కథలో వి. జయరాంగారి ఆదర్శవంతమైన జీవన విధానాన్ని, శ్రమైక జీవన సౌందర్యాన్ని రాజారాంగారు వర్ణించిన తీరు అద్భుతం, అమోఘం.

చాలమంది మనుష్యులలో పని సంస్కృతి కొరవడుతున్న దశ యిది! ఎక్కువ మంది మనుష్యులు ఏపనీ చెయ్యకుండా విలాసవంతమైన జీవితం

గడపాలని కోరుకుంటూ, ప్రయత్నిస్తూ సమాజానికి, దేశానికి హాని కలిగిస్తున్న తరుణమిది!! ఈ స్థితిలో సమాజశ్రేయస్సును ఆకాంక్షించే ప్రతి వ్యక్తీ తప్పక పదేపదే చదవాల్సిన కథ 'పొద్దుచాలని మనిషి'.

పిచ్చి వెంకట్రావు, తాను వెలిగించిన దీపాలు, సర్వమంగళ, యాత్రానందం, వక్రగతులు, జీవన్ముక్తుడు... ఇలా... వందలాది కథలలో ప్రతి కథను గూర్చీ గొప్పగా చెప్పుకోదగ్గ రచనలే చేశారు రాజారాంగారు. వారి ప్రతికథా మనిషిలోని మనిషితనాన్ని, మానవత్వాన్ని, మంచితనాన్ని పెంపొందింప జేసేవే. కాణీ, అర్ధణా, అణాల కాలం నుండి... రూపాయకు విలువేలేని నేటివరకూ నడచిన సామాజిక జీవన చరిత్రే వీరి కథలలో దృశ్యమానమయ్యే వస్తు వైవిధ్యం.

కథాచక్రవర్తి మధురాంతకం రాజారాం గారిని ఎదిగే రచయితలు ఏకలవ్య శిష్యులుగా పూజించారు, సమకాలీన రచయితలు ఆప్తునిగా ప్రేమించారు, విమర్శకులు ఆత్మీయంగా అనుశీలించారు. పాఠకులయితే అభిమానించారు, ఆరాధించారు, బ్రహ్మరథం పట్టారు!!

ఇక వారిని సన్మానించి, సత్కరించి తమను తాము గౌరవించుకున్న సంస్థలు ఎన్నో, ఎన్నెన్నో...

వీరు పొందిన అవార్డులలో కొన్ని... ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు. శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ డి.లిట్. కొండేపూడి శ్రీనివాసరావు అవార్డు. అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి ప్రతిభామూర్తి అవార్డు. తంజావూరు యూనివర్శిటీ అవార్డు.

వాజాలూ, ఇజాల ఊసెత్తకుండా, చల్లని వెన్నెలలో గోరుముద్దలు తినిపిస్తూ తల్లి పిల్లలకు కథలు చెప్పినంత నాజూకుగా, ఒడుపుగా వందలాది కథలు వెలువరించిన ఈ కథక బ్రహ్మ తెలుగు సాహితీ లోకాన్ని దుఃఖసాగరంలో ముంచుతూ 31-3-1999 నాడు... కాశీలాంటి పుణ్యక్షేత్రం తిరుపతిలో నిశ్శబ్దంగా నిష్క్రమించారు!

కానీ వారెప్పటికీ సజీవులే!!!

**వారి కుమారుని చిరునామా :**

**మధురాంతకం నరేంద్ర**

15-54/1, పద్మావతినగర్

**తిరుపతి (వెస్ట్) - 517 501**

ఫోన్ : 0877 - 2241588

సెల్ : 98662 43659

# నేనెందుకు వ్రాశాను? ఎలా??

## టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి



**త**రచు నాకు నేనే వేసుకుని జవాబులు వెతుక్కోవడానికి ప్రయత్నించే ప్రశ్నలివి! ఎందుకంటే, ప్రపంచంలోని తెలివి తక్కువ వాళ్ళలో నేనూ ఒకడినని నా ప్రగాఢ విశ్వాసం! నా చేతకానితనంతో నా జీవితంలో నేనెదుర్కొన్న అనేక కష్టనష్టాలూ, మానసిక క్లేశాలే అందుకు నిదర్శనం. పైగా... నాకు శ్రద్ధగా చదవడం రాదు నిజానికి. శ్రద్ధగా వ్రాయగలడమూ తక్కువే. గొప్పగా, తీక్షణంగా ఆలోచించ గలగడం కూడా అంతంతమాత్రమే! చాలని కొదవకు మతిమరుపు ఒకటి... ఈరోజు చూచిన, పరిచయం అయిన వ్యక్తి మూడు రోజుల తరువాత కన్పిస్తే జ్ఞాపకానికి రాకపోవడం... అదే విధంగా ఈరోజు ఏదో పనిలో వుండగా స్ఫురించిన ఒక మంచి ఆలోచన సైతం తరువాత కాస్సేపటికి గుర్తుండకపోవడం పరిపాటి. నాలో ఇంగిత జ్ఞానం, సమయస్ఫూర్తి, ఓపికా కూడా తక్కువే నిజానికి. అలాంటిది నేను కొద్దో, గొప్పో మంచికథలే డెబ్బయి అయిదుకు పైగా వ్రాయడం ఏమిటి? వ్రాసిన కొద్దిపాటి నవలలూ, నవలికలూ సైతం నాకు అవార్డులనూ, పురస్కారాలనూ తెచ్చిపెట్టడం ఏమిటి?? అన్న ఈ రెండు ప్రశ్నలూ నన్ను అబ్బురపరచేవే తరచు!

'పైనున్న దేవుడో, మరో అతీంద్రియ శక్తో నాచేత వ్రాయిస్తున్నది!' అని నాకు నేను జవాబులు చెప్పుకుంటుంటాను. అయితే 'ఏ అదృశ్య శక్తో తోడ్పడినా నీ ప్రయత్నమూ కొంతయినా ఉండితీర్తుంది కదా?' అని నిలదీస్తుంది నా మనసు. అప్పుడు నాకుతోచే జవాబు ఒక్కటే... గడచిన అరవై నాలుగు పైచిలుకు సంవత్సరాలలో నడచిన నా జీవనశైలే నా ప్రయత్నం అయివుంటుందని...

అరవై నాలుగేళ్ళ క్రితం ఆకుచాటు పిందెలాంటి అందమైన చల్లటి పుణ్యభూమి మదనపల్లె (చిత్తూరు జిల్లా)లో ఘోషా ఆస్పత్రి అని పిలవబడ్తున్న ఎం.ఎల్.ఎల్. ఆస్పత్రిలో నా జననం జరిగింది. పచ్చని ప్రకృతి మధ్యన లోయప్రాంతంలో ఒదిగివుండిన మదనపల్లెలోని తూర్పు కొత్తపేట వీధిలో మాదో సంపన్నమైన కుటుంబం అప్పటికి. మా తాత తొడిమెల్ల సుబ్బయ్యనాయుడుగారు ఇప్పటి కడప జిల్లా బద్వేలుకు చెందిన వారు. వృత్తిరీత్యా బ్రిటీషిండియా

కాలంలో ఫారెస్టు డిపార్టుమెంటులో హార్సు రన్నరుగా ఉండి, బదిలీపై తంబళ్లపల్లె ప్రాంతానికి వచ్చి, అక్కడ ఉద్యోగం వదిలివేసి వేలం పాటలలో ఆ ప్రాంతపు కల్లు దుకాణాలను పాడుకుని బాగా డబ్బు చేసుకుని మదనపల్లెకు వచ్చి స్థిరపడ్డారు. మా అవ్వ పాపులమ్మగారి జన్మస్థలం కుక్కరాసుపల్లె ప్రాంతం. మా జేజి శేషమ్మగారు బాగా ధనవంతురాలైన ధర్మవడ్డీ వ్యాపారి. మా జేజి, పెద్ద మేనత్త అంజనాదేవి గార్లు ఇరువురికీ భర్త అయిన మైలాపూరు శ్రీరాములు గారు పెద్దమండెం మీదుగా రాయచోటికి బొగ్గు బస్సు నడిపించి ఆపై మెకానిక్ ఆంజనేయులుగా గొప్ప పేరు పొందిన వారు. ఆయన పేరిట బర్మావీధి యందలి ఒక వీధికి శ్రీరాములు వీధి అని నేటికీ పేరు ఉన్నది. ఆ వారవడిలో మా తండ్రిగారైన టి.ఎస్. ఆంజనేయులు గారు ఇంటర్ మధ్యలోనే చదువుకు స్వస్థి చెప్పి కొద్దికాలం కండెక్టరుగా, చెకింగ్‌గా, డ్రయివరుగా పనిచేసి ఆపై స్వంతంగా లారీలు నడిపిస్తూ పెట్రోలు లారీల యజమాని అయ్యాడు. నా చిన్నతనంలో వారు మద్రాసు నుండీ మిలటరీ లారీలను వేలంలో కొనితెచ్చి వాటి ఇనుప బాడీలను తీసివేయించి చెక్క బాడీలను కట్టించుకుని మదనపల్లెలో మొట్టమొదట డీజలు వాహనాలను ప్రవేశపెట్టి పేరు పొందారు. ఆ రోజులలో లారీ, బస్ యజమానులకు గొప్ప గౌరవం ఉండేది. మా తల్లిగారు కమలాక్షి (కమలమ్మ) కడప ఆకులవీధిలో జన్మించిన వారు.

తూర్పు కొత్తపేట వీధిలో పెద్దంత ఇల్లు, పనిమనుషుల కోసం వెనుక రెండు చిన్నసైజు రేకుల ఇండ్లు. చిన్నసైజు బ్రిటిష్ బంగళాలా ఉండేది మా ఇల్లు. సమీపంలోని రామారావు అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఇ.ఎస్.ఎల్.సి. వరకు, ఆపై గిరిరావు దివ్యజ్ఞాన ఉన్నత పాఠశాలలో హైస్కూలు చదువు... సమాజ ప్రేమికులు, సంస్కారవంతులూ అయిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయుల వద్ద సాగింది. ఇప్పుడు నాలో కన్పించే మంచితనం, సంస్కారాలు, మనుషుల్ని ప్రేమించే గుణం... అన్నీ ఆ టీచర్లు పెట్టిన భిక్షగా భావిస్తుంటాను నేను. వారి జ్ఞాపకాలు అలాంటివి.

మా ప్రాంతానికి దగ్గరగా రైలుమార్గం లేదు. నా జీవితంలో మొట్టమొదట నేను బొగ్గు రైలును చూసింది మా మేనత్త బృందమాలాదేవి గారి మెట్టినిల్లు అయిన మల్లూరివారి పల్లె ప్రక్కనే వున్న తుమ్మణంగుట్ట రైల్వేగేటు దగ్గర. అదో మరపురాని మధుర ఘట్టం. ప్రకృతి మధ్యన సాగే బొగ్గు బండ్లను చూడడంలో అనిర్వచనీయమైన ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, అద్భుతమైన ఆలోచనలనూ, క్రొత్త ఊహలనూ పొందగలిగే వాడిని. అందుకే నా పాఠశాల సెలవులన్నీ

మల్లూరివారిపల్లెలో లేదా రైలుమార్గమున్న పీలేరులోని బంధువుల ఇండ్లలో గడచిపోయేవి. బొగ్గు రైళ్ళతో నా అనుబంధం నన్ను ప్రకృతి ప్రేమికుడిగా తయారుచేసింది.

నేను కథకుడు కావడానికి మొట్టమొదటి కారణం... చిన్నతనంలో రాత్రులందు అవ్వా, తాతల మధ్యలో పడుకుని వారు చెప్పిన అద్భుతమైన కథలను వినడం. రెండవ కారణం బొగ్గు రైళ్ళతో అనుబంధం ద్వారా ఏర్పడిన ప్రకృతి ఆరాధన. మూడవ కారణం పుస్తక పఠనం. (మా ఇంట్లోనే చిన్నసైజు మంచి లైబ్రరీ ఉండేది. మా ఇంటికి కొన్ని గజాల దూరంలోనే శాఖా గ్రంథాలయం ఉండేది). ఈ మూడు కారణాలూ కాక మరో ముఖ్యమైన కారణాన్ని కూడా చెప్పుకోవచ్చు. అది... దురదృష్టవశాత్తూ మా కుటుంబానికి నెమ్మదిగా సంప్రాప్తమైన పేదరికం!

కొత్తపేట వీధులలోని ఇండ్లూ, ఊరి వెలుపలి పొలాలు, లారీలు మొదలైనవన్నీ పోగట్టుకుని, ఓడలు బండ్లవును అన్నట్లుగా... బస్సు డ్రయివరుగా మా తండ్రిగారి సంపాదనతో, మా మేనమామ పి. రామాంజులు గారి సహాయ, సహకారాలతో కొంతకాలం మా కుటుంబం అనామకంగా కాలం గడపాల్సి వచ్చింది. ఆ స్థితిలో నేను ఎదుటి మనుష్యుల ముఖాలలో చకచకా మందహాసాలు మాయమయి రకరకాలుగా మార్పులు చోటు చేసుకొన్న, రంగులు మారిన విధానాలను గమనిస్తూ, మనుష్యుల మనస్తత్వాలను బేరీజు వెయ్యగల శక్తిని కొద్దికొద్దిగా సంపాదించుకో గలిగాను.

"పేదరికం గుమ్మంగుండా ప్రవేశిస్తే, ప్రేమ పక్షిలా కిటికీ గుండా ఎగిరిపోతుంది" అన్న ఆంగ్ల సామెతలోని వాస్తవాన్ని పూర్తిగా గ్రహించగలిగాను.

కొంతమంది సాహితీకారులు "మనుషుల్ని చదివి రచనలు సాగించడం ఏమిటి?" అని అంటూంటారు. మనుషుల్ని చదవడం ఒక గొప్పకళ! దాన్ని అలవర్చుకోగలిగి నప్పుడు ప్రపంచాన్నే చదివెయ్యవచ్చు అని అన్పించసాగింది నాకు.

ప్రకృతి ఆరాధన నా హృదయంలో అందమైన భావాలను రేకెత్తించి నాకు మనుష్యుల్ని ప్రేమించడం నేర్పిస్తే, పరిస్థితులలో వచ్చిన పెనుమార్పుల వల్ల నాలో కలిగిన సంఘర్షణలు మనుషుల మనస్తత్వాలను గూర్చి ఆలోచించేలా చేశాయి. ఆ అంతర్మథనం వల్లే నాలో ఓ రచయిత ఉత్పన్నమయి ఉండాలి బహుశా. అందువల్ల పదహారేళ్ళ వయసులోనే ఆవేశంగా కలం పట్టాను. 1968 నుండీ దాదాపు మూడేండ్ల పాటు ఏం వ్రాయాలో, ఏం వ్రాయకూడదో తెలియకుండానే రచనలు సాగించాను. నన్ను గైడ్ చెయ్యడానికి నాకు రచయితలు,

సాహితీవేత్తలు ఎవరూ తెలియదు. పరిచయం వున్న ఒకే ఒక అధ్యాపకులు డా॥ మల్లెల గురవయ్యగారు. నేను వ్రాసిన కాగితాలలోని అక్షర దోషాలను మాత్రమే సరిదిద్దేవారు...అంతే!

ఎట్టకేలకు మద్రాసు తంబుచెట్టివీధి నుండీ వెలువడుతున్న ఆంధ్రపత్రిక వారు నాకథ ప్రచురణకు స్వీకరించినట్లుగా శివలెంక శంభుప్రసాద్‌గారి సంతకంతో కార్డు అందింది. 1971 సెప్టెంబరు నెలలో రెండు వారాలపాటు కళానికేతన్ స్టూడియో వారు గీసిన గేవాకలర్ చిత్రాలతో ప్రచురితమైంది నా మొట్టమొదటి కథ 'ఐ కెనాట్ ఫర్‌గెట్ హర్'. ఆ రోజుల్లో ఆంధ్రపత్రిక వెల నలభయి పైసలు. ఆ కథకు నాకు అందిన పారితోషికం డెబ్బయి అయిదు రూపాయలు. ఆపై మూడు నాలుగేళ్ళు పిట్టకతలు, ప్రేమకతలే వ్రాశాను. తరువాత దానంతట అదే దృక్పథం మారుతూ వచ్చింది.

పేదరికం, ఆకలి, దురదృష్టకర సంఘటనలు నేపథ్యంగా నేను వ్రాసిన 'జీవితం సినీమా కాదు' కథ 1975లో ప్రచురితం అయి నాకు కొంత మంచి గుర్తింపునే తెచ్చిపెట్టింది. అక్రమ సంబంధాలు తెచ్చిపెట్టే అనర్థాలు నేపథ్యంగా హృద్యంగా వ్రాయబడ్డ నా పెద్దకథ 'తెగిపోయిన గాలిపటాలు' నన్నో వైవిధ్య భరితమైన రచయితగా నిలబెట్టింది ఆ రోజులలోనే! అలాగే నిరుద్యోగ సమస్యమీద నేను వ్రాసిన 'ది లాస్ట్ డేట్' కథ నాకో స్థాయిని కల్పిస్తే, వృద్ధాప్యం తాలూకు సమస్య మీద నేను వ్రాసిన 'వరండా' కథ ఆ స్థాయిని పటిష్ట పరచింది.

బాహ్య సౌందర్యం–మానసిక, అంతరంగిక సౌందర్యాల నేపథ్యంలో నేను వ్రాసిన పెద్ద కథ 'పెన్ ఫ్రెండ్', ప్రేమ–మానవ సంబంధాల మీద వ్రాసిన పెద్ద కథ 'అడ్డదారులు', వడ్డీ వ్యాపారిని దోషిగా చూపుతూ వ్రాసిన హాస్య నవలిక 'డి.డి.ల వల'. వడ్డీ వ్యాపారిని సమాజ సేవకుడిగా ప్రస్తుతిస్తూ వ్రాసిన పెద్ద కథ 'వడ్డీ' మొదలైనవి నాకు కీర్తి ప్రతిష్టలను కలిగించినవిగా భావిస్తాను నేను. అప్పటికి ఆవేశం కాస్తతగ్గింది నాలో!

ఇక ఆపై వెనుతిరిగి చూసుకోలేదు నేను! ఓ గిరగీసుకుని అందులో కూర్చోనూ లేదు!! వాదాలు, ఇజాలు వగైరాల జోలికి వెళ్ళనూ లేదు. విషాదంగా కన్పించిన ప్రతి ముఖాన్నీ పరిశీలిస్తూ, ఎదురయ్యే ప్రతి సమస్యకూ మూలాల్ని అన్వేషిస్తూ ముందుకు సాగాను. నాకు తారసపడ్డ ఆనందాలు, విషాదాలు, అద్భుతాలు, అసహ్యాలు... అన్నీ కూడా నా కలానికి మంచి బలాన్నిస్తూ వచ్చాయి.

జీవన పోరాటంలో బ్రతకడానికి నేను చేసిన చిన్నచిన్న ఉద్యోగాలు, పనులూ... వాటిలో తారసపడ్తూ వచ్చిన దిగువ మధ్యతరగతి, పేద ప్రజలూ, ప్రదేశాలూ నాకెన్నో కథా వస్తువుల నందించాయి. ఇహ పురపాలక శాఖలో

చిన్న ఉద్యోగం సంపాదించుకుని నెమ్మదిగా పైకెదిగే క్రమంలో నా జీవనప్రయాణం పూర్తిగా ప్రజాసంబంధాల మధ్యనే నడవడం రచయితగా నా ఎదుగుదలకు పెద్దకారణం.

ఆలస్యంగా అయినా వల్లంపాటి వెంకటసుబ్బయ్య, ఆర్.ఎస్. సుదర్శనం, ఆర్. వసుంధరాదేవిగార్లలాంటి సాహితీవేత్తలతో, ఎ. మల్లేశ్వరరావుగారి లాంటి సాహిత్యంపై మంచి పట్టున్న మానవతా వాదులతో సాన్నిహిత్యం జీవితానుభవాన్ని మరింత పెంచి పెద్ద చేసింది. అందువల్ల మరిన్ని సాహిత్య ప్రక్రియలను చేపట్టగలిగాను.

ఇహ నవలల విషయానికి వస్తే నేను వ్రాసిన మొట్టమొదటి నవల 'జవాబు లేని ప్రశ్న'. 1988 చివర్లో విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగు ఎదుటనున్న ఐ.ఏ.ఎస్. ప్రొడక్షన్స్ అనే టీ.వి. సీరియల్స్ వారికి పంపి పోగొట్టుకున్నాను. నావద్ద కాపీ లేకపోయింది. రెండవ నవల 'కలువ విరిసింది' స్వాతి మాసపత్రిక అనుబంధ నవలగా వెలువడి నాకు కుప్పం రెడ్డెమ్మ సాహిత్య సొసైటీ వారి ప్రోత్సాహక అవార్డును తెచ్చిపెట్టింది. తరువాత ఆ నవలను హైదరాబాదు జయంతి పబ్లికేషన్స్ వారు పునర్ముద్రించారు. యేడాది క్రితం అనంతపురం నుండి ఒక వ్యక్తి వచ్చి సినిమా తీస్తానని అనుమతి తీసుకువెళ్ళాడు. తరువాత రాలేదాయన. మూడవ నవల 'ఆయుధం' ఇంకా ముద్రింపబడలేదు! నాలుగవ నవల 'కొత్త బంగారు లోకం' ఆంధ్రభూమి సీరియల్. తరవాత నవలగా ముద్రింపబడింది. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ 'ఉత్తమ నవల 2008' అవార్డును పొందింది. పునర్ ముద్రణను కూడా పొందింది ఈ నవల. ఐదవ నవల 'కలల రాజ్యం'... ఒక పత్రిక పరిశీలనలో వుంది. దాదాపు మరో పది నవలికలు, హాస్య నవలికలు పత్రికా ముఖంగా వెలువడ్డాయి.

నేను అమితంగా ప్రేమించే చల్లని నా జన్మభూమి మదనపల్లెలో వచ్చిన విషపరిణామాలు నేపథ్యాలుగా 'ఘటోద్గజపురం గాథలు' అన్న వ్యంగ్య కథనాలు సిరీస్‌గా వ్రాస్తున్నాను. ప్రచురితమైన వాటిలోంచి కొన్ని కథలను ప్రఖ్యాత కార్టూనిస్టు రాగతిపండరి గారి చిత్రాలతో చిన్న సంపుటిగా విశాలాంధ్ర వారు విడుదల చేశారు. పుస్తక రూపంగా లభ్యమవుతున్న నా రచనలు...

1. టి.ఎస్.ఎ. కష్ణమూర్తి కథలు - కథా సంపుటి - 2003
2. కొత్తబంగారు లోకం (రెండు ముద్రణలు) - నవల - 2006, 2010
3. అడ్డదారులు - కథా సంపుటి - 2006

| | | | | | |
|---|---|---|---|---|---|
| 4. | కలువ విరిసింది | - | నవల | - | 2009 |
| 5. | ఈ గాలినాది... ఈ నేలనాది | - | కథా సంపుటి | - | 2010 |
| 6. | ఘటోద్గజపురం గాథలు | - | హాస్యకథా సంపుటి | - | 2011 |
| 7. | దృశ్యకావ్యం | - | కథా సంపుటి | - | 2012 |
| 8. | టి.ఎస్.ఎ. కథ – 2012 | - | కథా సంపుటి | - | 2013 |

ఇంకా అనేక కథా సంకలనాలలో నా కథలు, ఇతర రచనలు చోటుచేసుకున్నాయి. చాల పుస్తకాలకు ముందు మాటలు వ్రాయగల భాగ్యం దక్కింది. చిత్తూరు జిల్లా రచయితలను గూర్చి కూడా కొంతమేర వ్రాస్తున్నాను. మొదటిభాగం విడుదల అయింది.

శ్రీమతి కుప్పం రెడ్డెమ్మ సాహిత్య సొసైటీ, భరతముని ఆర్ట్స్ అకాడమీ, మెక్సా, రచన, ఆంధ్రజ్యోతి, పీలేరు కల్చరల్ అకాడమీ, చిరసం, మరసం, మదనపల్లె చైతన్య భారతి, కొడవలూరు బలరామయ్య ట్రస్ట్, సోమేపల్లి సాహితీ ట్రస్ట్, హైదరాబాదు సి.పి. బ్రౌన్ అకాడమీ, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మొదలైన వారి ద్వారా విలువైన అవార్డులు, పురస్కారాలు లభ్యమయ్యాయి. పలుకథలకు బహుమతులు లభ్యమయ్యాయి.

వయసు ఉడుగుతున్న నేను చదవాల్సిందీ, వ్రాయాల్సిందీ చాలచాల ఉంది. కానీ విరామ మివ్వని నిరంతర జీవన సంగ్రామానికి అంతం కన్పించడం లేదు... వయసు ప్రభావం కూడా తన పని మొదలు పెడ్తున్నట్లుంది. ఏది యేమయినా అధ్యయనం చేస్తూ, వ్రాస్తూ చివరి క్షణాల వరకూ గడపాలన్నదే నా ప్రగాఢ ఆకాంక్ష. అందుకు నా శ్రీమతి కళావతి, నా పిల్లలు శివభారత్ మూర్తి, ప్రసన్నలక్ష్మిల సహకారం సదా లభ్యమవుతుండడం ముదావహం.

మేమిద్దరం! మాకిద్దరు!! వారిద్దరికీ ఇద్దరు! వారికి చిన్ని కృష్ణార్జునులు! ఇప్పటికి భగవంతుడు నాకిచ్చిన వరాలివి!

**చిరునామా :**

**టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి**

III - 169-16, రామారావు కాలనీ

బాపూజీ మునిసిపల్ స్కూలులేన్

**మదనపల్లె – 517 325**

ఫోన్ : 08571 – 221963

సెల్ : 93472 98942

## తక్కువ కథలతో కథకులుగా ప్రసిద్ధులయిన కవిపండితులు, నవలాకారులు... భాషాప్రవీణ కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై



**చి**త్తూరు తాలూకా లోని 'తలుపులపల్లె' అనే గ్రామంలో తేది 1-2-1936 నాడు కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైగారి జననం జరిగింది. శ్రీమతి కృష్ణమ్మ, కుమారస్వామిపిళ్ళై అను పుణ్యదంపతులు వీరి తల్లితండ్రులు.

మదనపల్లె, పలమనేరులలో ఉన్నత పాఠశాల విద్య ముగించుకున్న వీరు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ద్వారా పి.యు.సి. పూర్తి చేసుకుని ఆపై ఆంధ్రాయూనివర్సిటీ నుండీ భాషా ప్రవీణ పట్టం పొందారు.

ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించిన కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైగారు చిత్తూరు జిల్లాలోని అనేక ఉన్నత పాఠశాలలలో తెలుగు పండితులుగా పనిచేసి 1994వ సంవత్సరంలో 'కలిచెర్ల'లో పదవీ విరమణ పొందారు. అపారమైన జీవితాను భవాన్ని గడించిన వీరు ఏళ్ళ తరబడి ఉత్తమోత్తమ సాహిత్యాన్ని చదవడంలోనూ, అధ్యయనం చెయ్యడంలోనూ గడిపిన విద్వాంసులు.

కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైగారి మొట్టమొదటి చిరుపొత్తం "కలిచెర్ల పట్టాభి రామ సుప్రభాతం, సీతాష్టకం, పోలేరిమాతాస్తోత్రం" అన్న సంస్కృత స్తోత్ర కావ్య గుచ్ఛం. ఈ చిరుగ్రంథం 1992లో ప్రచురితమైంది. తగిన గాయకుడి కోసం, న్యాయం చెయ్యగల వైణికుడి కోసం పదహారు సంవత్సరాల పాటు అన్వేషించిన వీరు చివరికి ఋషీవ్యాలీ పాఠశాల సంగీత పండితులు శ్రీ టి.ఎస్. శేషాద్రిగారి సంగీతంతో మరియు అమృత గాత్రంతో ఈ స్తోత్ర కావ్యాన్ని సంగీతపు పళ్ళెంగా తయారు చేయించడం జరిగింది. జిల్లాలోని కొన్ని దేవాలయాలలో ఈ స్తోత్రగానం సుప్రభాత సమయాన వినవచ్చుచున్నది.

చాలకాలం క్రితం కరణంగారు ఆంధ్ర మహాభారతం చదివినపుడు... ఉద్యోగ పర్వంలోని రాయబార ఘట్టంలో, తన తండ్రి యయాతి ద్వారా ఘోరమైన అన్యాయాలకు గురి అయిన మాధవి గాథ వారిని కలచివేసింది. హృదయమున్న కవి అయిన కరణం గారిని ఆ విషాదగాథ చాలయేళ్ళపాటు వెంటపడి తరిమి వుండాలి బహుశా... అందుకే వారి కలం నుండీ 'విషాద మాధవి' పద్యకావ్యం వెలువడింది.

విశ్వామిత్రుడు, అతని శిష్యుడు గాలవుడు, అయోధ్యరాజు ఇక్ష్వాకుడు, కాశీరాజు దివోదాసు, భోజదేశపు రాజు ఊశానరుడు, ముఖ్యంగా ఆమె తండ్రి

యయాతి... వీరందరి ద్వారా తనకు జరిగిన అన్యాయాన్ని మాధవి స్వయంగా చెప్పుకున్న వైనాన్ని తెలిపే పద్యకావ్యం 'విషాదమాధవి'. హృదయాన్ని స్పర్శించి, బాధించి, ఆలోచింపజెయ్యగలిగేలా రమణీయమైన 109 పద్యాలలో వ్రాయబడ్డ లఘుకావ్యం ఇది.

ఈ గ్రంథానికి ముందుమాట వ్రాసిన వల్లంపాటి వెంకటసుబ్బయ్య గారు బాల సుబ్రహ్మణ్యంగారు 'పద్యవిద్య రహస్యం తెలిసిన కవి' అని ప్రశంసించారు. అదే విధంగా ప్రఖ్యాత కవిపండితులు గాడేపల్లి శివరామయ్యగారు... "పద్యరచనలో శ్రీ కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైగారు సిద్ధహస్తులు" అని కితాబివ్వడం జరిగింది. ప్రసిద్ధ చారిత్రక పరిశోధకురాలు, బహు గ్రంథకర్త, రచయిత్రి డా॥ జోలిపాళెం మంగమ్మగారు విషాదమాధవి గ్రంథాన్ని గూర్చి వివరిస్తూ... "కవిగా బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైగారు అభినందనీయులు. తన విషాదగాథను స్వీయచరిత్రగా మాధవి చేతనే వివరింపజేయడంలో కవితాశిల్పం వర్ణమాలలో అద్దిన కుంచెతో తీర్చిన వర్ణచిత్రంగా మన కట్టెదుట కనపడుతూ ఉంది. ప్రతి సంఘటనలోని భావాలలో అంతరార్థం ఒక్కటే అయినా మాధవినోట అయిదు విధాలుగా దానిని వర్ణించిన కవినీ, కవి చాతుర్యాన్నీ అభినందించ కుండా ఉండలేము" అన్నారు.

ఇలా అనేక విధములుగా చాలమంది సాహితీవేత్తల నుండీ ప్రశంసలనూ, కొద్ది మంది కవిపండితుల నుండీ విమర్శలనూ పొందింది విషాద మాధవి పద్యకావ్యం.

ఆ ఊపుననే కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైగారు మహాభారత యుద్ధం ముగిసి పదహారు సంవత్సరాలయిన తరువాత వ్యాసమహర్షి అనుగ్రహంతో భారత యుద్ధంలో మరణించిన వీరులందరూ గంగానది నుండీ వెలుపలికి వచ్చి ఒక్కరోజు తమ వారందరితో గడిపి తిరిగి గంగానదిలోకి నిష్క్రమిస్తుండగా వారివారి భార్యలందరూ వారి ననుసరించి గంగలో కలసిపోయిన ఘట్టాన్ని 211 పద్యాలలో "చరిత్ర కెక్కని మారణహోమం" పేరిట పద్య కావ్యంగా వెలువరించారు.

**"జలములందు పడిన గులకరాళ్ళ విధాన**
**విధవలెల్ల జాహ్నవీ జలాల**
**మునిగి యణగిపోవ బుడబుడమని పొంగి**
**యణగె విస్తరంగ మగుచు నదియు"**

హృదయాల లోతులను తాకి ద్రవింపజేస్తూ అడుగడుగునా ఆలోచింపజేసే ఇలాంటి విషాదభరిత పద్యాలతో సాగిన ఈ గ్రంథం కూడా పండితుల రచయితల ప్రశంసలకూ, విమర్శకులకూ గురయింది.

పై రెండు పౌరాణిక పద్య కావ్యాలలో స్త్రీవాదం పుష్కలంగా కన్పిస్తుంది. రెండింటిలో "విషాదమాధవి" స్త్రీవాదానికి పరాకాష్ట.

వీరి తదుపరి పద్యకావ్యం "ఒక రాఘవరెడ్డి కథ". ఇది సాంఘిక పద్యకావ్యం. మూడు వందలా అరవై రెండు పద్యాలతో నిండిన ఈ పద్యకావ్యం 2004లో వెలువడింది. ఒకవైపు మావోస్టులు మరోవైపు పోలీసులు... వీరిరువురి పదఘట్టనల క్రింద నలిగి, నిట్టనిలువునా మునిగి నిర్వీర్యమైపోతున్న అడవి ప్రాంతాలపల్లెల తాలూకు ప్రజల సాధక బాధకాలను దృశ్యమానం చేసిన పద్యకావ్యమిది. ఉత్తమ సామాజిక నేపథ్యం కలిగిన ఈ కథా వస్తువుతోటే ఆరు సంవత్సరాల తరువాత "మఱ్ఱిమాను సాక్షిగా" అన్న శీర్షికతో నవలను కూడా వెలువరించారు కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళైగారు. మే 2010 చతుర మాసపత్రిక అనుబంధ నవలగా వెలువడింది ఈ నవల.

నవల మధ్యలో మావోయిష్టుల పరంగా, పోలీసుల పరంగా సాగిన అంతరంగిక చర్చలు ప్రస్తుత సామాజిక పరిస్థితులకు అద్దంపడ్తాయి. ప్రపంచాన్నీ, మారుమూలపల్లెల్లోని పేద ప్రజల జీవితాలనీ అట్టుడికిస్తున్న అతిపెద్ద సామాజిక సమస్య ఈ నవల ఇతివృత్తం. అయినా 'ఒక రాఘవ రెడ్డి కథ' పద్యకావ్యంలో కానీ, 'మఱ్ఱిమాను సాక్షిగా' నవలలో కానీ రచయిత అటు నక్సలైట్లను గానీ, ఇటు పోలీసులను కానీ సమర్థించడమూ, వ్యతిరేకించడమూ చెయ్యలేదు. చాల బ్యాలన్సుగా రచనలు సాగించారు.

కరణంగారు అనేక సంవత్సరాలపాటు మనుస్మృతి, భగవద్గీత, పురాణాలు, రామాయణ భారతాలు, ఇంకా వర్ణవ్యవస్థపై వచ్చిన అనేక ప్రమాణిక గ్రంథాలను ఎన్నింటినో పరిశీలించి, పరిశోధించి, లోతుగా అధ్యయనం చేసి వెలువరించిన గొప్ప పరిశోధాత్మక పౌరాణిక నవల 'చండాలుడు'. పంచమ వర్ణం యొక్క ఆవిర్భావాన్ని గూర్చిన రచయిత ఆలోచనలకు ప్రతిరూపమే ఈ నవల. త్రిశంకుడి స్వర్గాన్ని భూమిమీద దృశ్యమానం చెయ్యడంలో రచయిత కృతకృత్యులయ్యారు. 2007వ సంవత్సరంలో విడుదలయిన ఈ నవల అనేకానేక ప్రశంసలనూ కొన్ని విమర్శలనూ ఎదుర్కొని సంచలనాన్ని కలిగించింది. ఈ నవలను కరణంగారే ఆంగ్లంలోకి అనువదించారు.

ప్రతిష్టాత్మకమైన సహృదయసాహితి, వరంగల్లువారి అవార్డును పొందిన నవల చండాలుడు.

నేటి తెలుగుభాష స్థితిగతులపై సమగ్ర పరిశీలనతో కరణంగారు వ్రాసిన వ్యాసాలు మొదట ఒక దినపత్రికలో వెలువడ్డాయి. తదుపరి ఆ వ్యాసాలన్నీ

'వెలుగు తగ్గిన తెలుగు' పేరిట 2006లో గ్రంథ రూపంలో వెలువడ్డాయి. ఆ వ్యాసాలను ఆలోచించండి మాసపత్రిక సీరియల్‌గా ప్రచురించింది.

ఇవన్నీ ఒక ఎత్తయితే కరణంగారి వైవిధ్యభరితమైన కథలు మరో ఎత్తు. చాల తక్కువ కథలు వ్రాసిన వీరు తమ 'జింకపిల్ల' కథతో ఆంధ్రదేశంలోనే కాక విదేశాలలో సైతం ప్రసిద్ధులయ్యారు.

అడవిలో ఓ యానాది ఓ జింకపిల్లను పట్టడానికి పదిహేనురోజులుగా పడ్డపాట్లు...

యానాది కుమార్తె 'చుక్క'ను చేజిక్కించుకోవడానికి ఆరునెలలపాటు పొంచి ప్రయత్నించిన నాయుడోళ్ళ అబ్బాయి...

పర్యవసానం...

ఇంతే కథ! అయితే ఈ చేయి తిరిగిన రచయిత తాలూకు శైలీ, శిల్పాలు కథను బలోపేతం చేసి పాఠకుల కళ్ళను పంక్తుల వెంట పరుగుపెట్టేలా చేశాయి. చాల పెద్ద కథ... అయినా ఎక్కడా విసుగనిపించకుండా గొప్ప నడకతో సాగిన ఈ కథ అమెరికా తెలుగు అసోసియేషన్ వారి 2006 కథల పోటీలో బహుమతిని పొంది 'ఏటిఏ కబురు 2006'లో ప్రచురితమైంది. తదుపరి కొన్ని కథా సంకలనాలలో చోటు చేసుకుంది. కథకులుగా కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె వారికి ఒక ప్రత్యేక స్థానాన్ని అందించింది ఈ కథ.

ఇటీవల విడుదలయిన కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారి రచనలు :

1. ఓరుగల్లు – వీరగల్లు (పద్యకావ్యం)
2. యక్షప్రశ్నోపాఖ్యానం–ఘోషయాత్ర (రెండు సంస్కృతనాటకాల గ్రంథం)
3. రెండు శ్రవ్య నాటకాలు (అన్వేషణ – అంభి)
4. బోయకొట్టములు పంద్రెండు (చారిత్రక నవల)

అనేక కళా, సాహితీ సంస్థలు వీరికి అవార్డులు, పురస్కారాలు అందించి తమ్ము తాము గౌరవించుకున్నాయి.

హృదయ స్పర్శతో కూడిన వైవిధ్యభరితమైన రచనలనందించే కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారి కలం నుండి మరిన్ని మంచి కథలనూ, నవలలనూ, పద్యకావ్యాలనూ ఆశించడం పేరాశకాదు.

**చిరునామా :** కరణం బాలసుబ్రహ్మణ్యంపిళ్ళె
'శ్రీసాగరం'
2–253–, కాలనీ రింగ్‌రోడ్డు లేన్
**మదనపల్లె – 517 325**
ఫోన్ : 0871 – 220833,
సెల్ : 9502304027

# అలుపెరుగని కలంయోధుడు మాన్యశ్రీ కాణిపాకం లింగన్న



**చి**త్తూరు పట్టణం గిరింపేట దాటి వళ్ళియప్పనగర్‌లో ప్రవేశిస్తే మెయిన్‌రోడ్ ప్రక్కన వున్న 4-2154 నెంబరు ఇంటికి 'సాహితీక్షేత్రం' అన్న చిన్నబోర్డు కన్పిస్తుంది. ఆ గృహంలోకి ప్రవేశిస్తే కుడిచేతి వైపున్న ఓ పెద్దగదిలో పుస్తకాలతో నిండిన బీరువాల మధ్యన, పుస్తకాల గుట్టల ప్రక్కనున్న ఓ టేబులు ముందర ఓ పాతకాలపు కుర్చీలో డెబ్బయి ఎనిమిది సంవత్సరాల వయసున్న వ్యక్తి కూర్చుని కళ్ళజోడు సహాయంతో చదువుకుంటూనో, వ్రాసుకుంటూనో కన్పిస్తారు. నిజానికయితే ఆయన ఆరోగ్య పరిస్థితి అంతంతమాత్రం... శరీరంలో చక్కెర కర్మాగారం యేదో నెలకొని ఉన్నట్లుంది, రక్తప్రసరణలో కూడా కొద్దిపాటి ఇబ్బందులున్నాయోమో అని అన్పిస్తుంది. వారి పాదములకు స్పర్శజ్ఞానం ఒకింత కొరవడినది కాబోలు... ఒక్కో పర్యాయం ఒక కాలికి పాదరక్ష ఊడిపోయినా వారికి తెలియడంలేదు. అలాగే నడక సాగించడం జరుగుచున్నది. అయినా... వారి సాహితీ జిజ్ఞాన కొరవడడం లేదు... సాహిత్య జీవనయానం ఆగడం లేదు... ఆయనే... మాన్యశ్రీ కాణిపాకం లింగన్నగారు.

బాలసాహిత్యం ఎనిమిది పుస్తకాలు, కవితా సంపుటులు పండ్రెండు, వ్యాస సంపుటులు ఎనిమిది, రెండు శతకాలు, ఒక పోలీసు కథా సంపుటి, పది నవలలు ప్రచురించిన నిరంతర సాహితీ కృషీవలుడు లింగన్నగారు. తమ ఇరవయ్యవ ఏటనే ఉద్యోగం పొందిన వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ఎక్కువ సంవత్సరాలు పూతలపట్టులో పనిచేసి 1996వ సంవత్సరంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపును పొందినవారు.

అరగొండ (అర్ధగిరి ఆంజనేయస్వామి వారి క్షేత్రం)కి దగ్గరలోని దిగువ తడకర గ్రామంలో తేదీ 22-5-1936 నాడు శ్రీమతి లక్ష్మమ్మ, శ్రీ వరదపిళ్ళై అను పుణ్య దంపతులకు ఐదవ సంతానంగా జన్మించారు. బ్రహ్మీ సమయంలో నిద్రలేచి, స్నానాదులు ముగించుకుని భక్తితో సంకీర్తనలు, పద్యాలు, శతకాలు వల్లించే వీరి తండ్రిగారి నుండీ లింగన్నగారికి క్రమశిక్షణతో కూడిన కట్టుబాటు

జీవితం అలవడింది. వీరి తండ్రిగారే వీరికి తొలి గురువుగారు. దురదృష్టవశాత్తు వీరి ఎనిమిదవ యేటనే వీరి తండ్రిగారు మరణించడంతో తల్లిగారి నీడలో చదువు సంధ్యలు సాగించాల్సి వచ్చింది. అరగొండ ఉన్నత పాఠశాలలో విద్యార్థిగా ఉన్నప్పుడు లింగన్న గారు తమ అభిమాన గురువైన తెలుగు పండితులు, అష్టావధాని అల్లసాని రామనాథశర్మగారి ప్రభావంతో తమ పండ్రెండవ యేటనే సాహిత్యం పట్ల ఆకర్షితులయ్యారు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండీ తెలుగు ఎం.ఎ., మద్రాసు దక్షిణ భారత హిందీ ప్రచారసభ నుండి హిందీ భాషాప్రవీణ పట్టాలను పొందిన కాణిపాకం లింగన్నగారు గాంధీగారి ఆత్మకథ, ప్రేమచంద్ నవలలు, టాల్‌స్టాయ్ రచనలతో ప్రాభావితులై 1960లో రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టారు. వెనువెంటనే వీరి రచనలు ఆంధ్రపత్రిక, భారతి మాసపత్రికలలో వెలుగు చూడడం మొదలు పెట్టాయి. భారతి నుండీ వెలువడిన గేయాలను 1. నేను సూర్యుడనైన వేళ, 2. వెలుగు, 3. పిలుపు, 4. స్వేచ్ఛాగానం అన్న నాలుగు గేయ సంపుటాలుగా వెలువరించారు.

పేదరికం, స్త్రీల సమస్యలు, గాంధీగారి సిద్ధాంతాలు, తమ యొక్క జీవితానుభవాలు ముఖ్యాంశాలుగా వీరి రచనా జీవితం కొనసాగుతూ వచ్చింది.

వీరి ఎన్నదగిన నవలలలో ముఖ్యమైనది 'చిత్ర'. తమ చుట్టూవున్న మనుషుల స్వార్థానికి, సమాజంలో వ్రేళ్లూనుకుపోయిన పురుషాహంకారానికి దగాపడే అందమైన అతివ జీవితాన్ని లింగన్నగారు దృశ్యమానం చేసిన తీరు పలు ప్రశంసలను పొందగలిగింది.

జీవితాంతం బాధల ననుభవిస్తూ బానిస బ్రతుకు గడిపిన స్త్రీ తాలూకు జీవన గాథ 'చినబాబు' నవల. ఈ నవల 1986వ సంవత్సరపు 'భారతి' చిన్న నవలల పోటీలో సాధారణ బహుమతిని పొందింది.

కట్టుబాట్ల పేరిట అట్టడుగు వర్గాల హక్కులను అణచివేసి హరించే క్రమంలో... మారుమూల గ్రామీణ దళిత జీవితాలలో ఎదురయ్యే కష్టనష్టాలను అధిగమించి ఉన్నతికి చేరుకునే ఓ దళితుడి జీవనగాథ 'కొత్తమలుపు' నవల.

ఇక వీరి కథల విషయానికి వస్తే 2009 విడుదలయిన పోలీసు కథలు కథా సంపుటిని గూర్చి చెప్పుకోవచ్చు. "ఈ దేశాన్ని కాపాడుతున్నది సైనికులైతే, ఈ సమాజాన్ని రక్షిస్తున్నది పోలీసులు" అని అంటారు లింగన్నగారు ఈ

పుస్తకం ముందు మాటలో ఈ కథలు వీరు బాలబాలికలను దృష్టిలో ఉంచుకుని వ్రాశారని అన్పిస్తుంది.

కులాంతర వివాహాలు తమకు అంగీకారం కాకపోయినా, తమ బిడ్డల మీద మాత్రం మమకారం ఓ పట్టానపోదు తల్లిదండ్రులకు. అయితే చుట్టూ వున్న సమాజానికి, మరమనుష్యులకు భయపడి కులాంతర వివాహాలు చేసుకున్న పిల్లల మీద విరోధం ప్రకటించి, శతృత్వం వహిస్తూ యుద్ధ వాతావరణాన్ని సృష్టించి, అనుబంధాల్ని త్రోసిరాజని మానవత్వాన్ని మంటగలపడానికి ప్రయత్నిస్తారు. అలాంటి సందర్భాలలో పోలీసులు తలచుకుంటే తమ శక్తియుక్తులతో ఆ సమస్యను సులభంగా పరిష్కరించి తల్లిదండ్రులు– పిల్లలు మధ్య ప్రేమానుబంధాలు యధాతథంగా కొనసాగ గలిగేలా చేయగలరని తెల్పుతుంది 'వివాహం' కథ.

వయసు వేడిలో తప్పటడగు వేసి విధిలేని పరిస్థితులలో పసిపిల్లల్ని చెత్తకుండీలలోనో, ముళ్ళపొదలలోనో పడవేసే యువతీయువకుల్ని పోలీసులు తలచుకుంటే... వారి వారి తప్పులు సరిదిద్దుకుని సక్రమమార్గంలో ప్రయాణించేలా చేయగలరని తెలిపే కథ 'పరిష్కారమార్గం'.

పెళ్ళయిన వెంటనే పిల్లలు కలుగలేదనే నెపంతో ఇల్లాలిని వీధిపాలుచేసే మెట్టినింటివారు – పట్టించుకోని పుట్టింటివారు... ఈ పరిస్థితులలో జీవితాన్ని ఛాలెంజ్‌గా తీసుకున్న స్త్రీకి పోలీసులు అండగా నిలబడి సహకరిస్తే తన జీవితాన్ని ఎలా మలచుకోగలదో తెలిపే కథ 'జయమ్ము నిశ్చయము'.

ఇలా 'పోలీసు కథలు' సంపుటిలోని పదహైదు కథలూ పోలీసుల సహకారంతో సులభంగా సాధ్యంకాగల చక్కటి పరిష్కారాలను సూచిస్తూ సమాజంలో మార్పుచెందాల్సిన కొన్ని అంశాలను తెలియపరుస్తాయి.

ఆకాశవాణి ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీ మల్లేశ్వరరావు గారి ప్రోద్భలంతో, వారి సూచనలు, సలహాలు పాటిస్తూ లింగన్నగారు వెలువరించిన పదహారు వ్యాసాలు సంపుటిగా 'వ్యాసదీపిక' పేరిట వెలువడ్డాయి. అదేవిధంగా 'పరావర్తన కిరణాలు' అన్న గ్రంథంలో లింగన్నగారి రచనలపై వచ్చిన కొన్ని సమీక్షలు, వారి జీవితంలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాలు చోటుచేసుకున్నాయి.

నిరంతర సాహితీ శ్రామికులైన కాణిపాకం లింగన్నగారిని గూర్చి డా॥ కొత్వాలు అమరేంద్రగారు 'సీమ సాహిత్య రత్నాలు' వ్యాసావళిలో ప్రముఖంగా

ప్రస్తావించడం జరిగింది. కొన్ని పత్రికలు వారి చిత్రపటాన్ని ముఖ చిత్రాలుగా వేసి వారిని ప్రస్తుతిస్తూ వ్యాసాలు వెలువరించడం జరిగింది. ఢిల్లీ భారతజ్యోతి అవార్డు నుండీ స్థానిక శ్రీమతి కుప్పం రెడ్డెమ్మ సాహిత్య సొసైటీ అవార్డు వరకూ వీరు పలు అవార్డులు, పురస్కారాలు పొందడం జరిగింది.

ఇటీవల కాలంలో వయసు పైబడడం వల్ల ఏర్పడిన శారీరక అస్వస్థత వల్ల కావచ్చు... వీరి రచనలలో శైలీ, శిల్పాల మీద పట్టు సడలడం కన్పిస్తుంది. 'అతడు గాంధీ' గ్రంథంలో మరియు పోలీసు కథలలో ఆ విషయం కాస్త స్పష్టంగానే కన్పించింది. వారు తమ ఆరోగ్యాన్ని మెరుగు పరచుకుని మరింత దీక్షగా, దీటుగా మరిన్ని విలువైన రచనలని అందించగలరని ఆశించడం పేరాశకాదు.

కాణిపాకం లింగన్నగారి రచనలను పొందగోరువారు ఉత్తరాల ద్వారా సంప్రదించవలసిన చిరునామా :

**శ్రీ కాణిపాకం లింగన్న,**
సాహితీ క్షేత్రం, 4–2154.
వళ్ళియప్ప నగర్,
గిరింపేట,
చిత్తూరు– 517 002

## నిశ్శబ్ద తరంగంలా ముందుకు సాగుతున్న సాహితీ గళం

## శైలజామిత్ర కలం



**చి**త్తూరు జిల్లాలో పుట్టి, పెరిగి, గొప్పగా చదువుకుని... లేదా... గొప్పగా లోకాన్ని చదివి ఉద్యోగరీత్యానో, వృత్తి వ్యాపారాలరీత్యానో ఎక్కడెక్కడో స్థిరపడిన రచయితల్ని గూర్చి తెలిసినప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. అలాంటి వారిలో శ్రీమతి శైలజామిత్రగారు ఒకరు.

చిత్తూరుజిల్లా భాకరాపేటకు సమీపంలోని చిన్నగొట్టిగల్లు అన్న చిన్నవూర్లో తేది 15-1-1969నాడు శైలజామిత్రగారి జననం జరిగింది. తెలికిచెర్ల శేషగిరిరావు, శ్రీమతి అనసూయాదేవి అను పుణ్యదంపతులకు ఐదవ సంతానంగా జన్మించిన శైలజా మిత్రగారి విద్యాభ్యాసం చిత్తూరులో ప్రారంభమైంది. ఆ రోజులలో వీరి తండ్రిగారు ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా చిత్తూరులో పనిచేస్తూనే కథారచయితగా, రేడియో నాటక రచయితగా గుర్తింపును పొందినవారు. వారి నుండీ శైలజామిత్రగారికి చక్కటి క్రమశిక్షణ అలవడింది.

1వ తరగతి నుండి ఐదవ తరగతి వరకూ కొంగారెడ్డిపల్లె పురపాలక ప్రాథమిక పాఠశాలలో, 6వ తరగతి నుండీ పదవ తరగతి వరకూ షర్మన్ మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో, ఇంటర్‌మీడియట్ కణ్ణన్ జూనియర్ కళాశాలలో, బి.ఏ. ఇంగ్లీషు పి.వి.కె.ఎన్. ప్రభుత్వ కళాశాలలోనూ చదివారు.

శ్రీ సత్యమిత్రగారితో వివాహం తదుపరి హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీ నుండీ ఎం.ఏ. తెలుగు పూర్తిచేసి, జర్నలిజంలో పి.జి. డిప్లమా పొందారు.

కర్నాటక సంగీతం లలిత సంగీతంలో దాదాపు ఐదు సంవత్సరాల ప్రావీణ్యం కలిగివున్న వీరు కొన్ని అనుకోని సంఘటనల కారణంగా గాత్రం మూగబోవడంతో అప్పటికే ప్రారంభించిన రచనా వ్యాసంగాన్ని 1996 నుండీ ప్రవృత్తిగానే గాక వృత్తిగా మలచుకుని చాల తక్కువ సమయంలోనే ఎక్కువ రచనలను గ్రంథ రూపాలుగా కూడా వెలువరించగలిగారు.

1. శంఖారావం (కవితా సంపుటి) 1997, 2. మనోనేత్రం (కవితా సంపుటి) 1999, 3. నిశ్శబ్దం (కవితా సంపుటి) 2002, 4. సిల్వర్ లైన్స్

(ఆంగ్ల కవితాసంపుటి) 2004, 5. అంతర్మథన వేళ (కవితా సంపుటి) 2006, 6. అగ్నిపూలు (మినీ కవితా సంపుటి) 2010, 7. అడ్డా (కథా సంపుటి) 2012

వచన కవితా రచనలో మంచి పట్టు సాధించిన శైలజామిత్రగారు కథా రచన మీద కూడా దృష్టి సారించి వివిధ పత్రికల ద్వారా 125 కథలకు పైగా వెలువరించారు. 2005వ సంవత్సరంలో వీరి తొలి కథా సంపుటి 'తరంగాలు' వెలువడింది.

అనువాదాల మీదకూడా ఆసక్తి కలిగిన వీరు Voice of Water, How to speek in Telugu, Glowing flowers, Hard Working Earth మొదలైన గ్రంథాలను అనువదించారు.

ఇక వీరి నవలల విషయానికి వస్తే... నాకు నువ్వే, గాలిలో నక్షత్రాలు, నిశ్శబ్ద పోరాటం, ఆకుపచ్చని జాబిలి మొదలయిన నవలలు వివిధ పత్రికలలో ప్రచురింపబడినవి. ఇంకా వీరు 426 పుస్తక సమీక్షలు, 122 ఆధ్యాత్మిక, సాంఘిక వ్యాసాలు కూడా వెలువరించినట్లు తెలుస్తున్నది.

వీరి నిరంతర సాహితీ కృషికి గుర్తింపుగా...

1. రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం – 2006
2. అఖిల భారతీయ భాషా సమ్మేళనం, భోపాల్ వారి 'సాహిత్యం' బిరుదు.
3. విశ్వసాహితి వారి నుండీ 'సాహితీ యువరత్న' పురస్కారం.
4. రంజని కుందుర్తి, కవన వేదిక పురస్కారం.
5. ఎక్స్‌రే పురస్కారం.
6. దేవులపల్లి కృష్ణశాస్త్రి పురస్కారం.
7. ఆరుద్ర పురస్కారం.
8. ప్రతిభామూర్తి పురస్కారం.
9. జ్వాలాముఖి పురస్కారం.
10. మదర్ తెరిస్సా పురస్కారం.
11. పెనుగొండ రమ్య సాహితీ సమితి ఉత్తమకథా సంపుటి పురస్కారం.
12. మచిలీపట్టణం ఉత్తమ మినీ కవితా పురస్కారం.
13. కేంద్ర సాహిత్య అకాడమీ ట్రావెల్ గ్రాంట్ అవార్డు.
14. జి.వి.ఆర్. సాహిత్య పురస్కారం.

15. ఎన్.టి.ఆర్. మెమోరియల్ అవార్డు.

16. మయూరీ ఆర్ట్ థియేటర్స్ వారి లిటరరీ అవార్డు.

... మొదలైన గౌరవాలను, గుర్తింపులను పొందారు.

ఎక్కువగా ఏకాంతాన్ని అభిలషించే వీరు మనిషిగా పుట్టినందుకు మంచిగా ప్రవర్తించడమే సమాజానికి చేయగలిగిన అమూల్యమైన సేవ అని భావిస్తారు.

బెంగుళూరు, విశాఖ, ఆగ్రా మొదలైన నగరాలలో జరిగిన కొన్ని సాహిత్య సభలలో, సమ్మేళనాలలో పాలుపంచుకున్న వీరు కొన్ని టీవీ ఛానల్సులో ఇంటర్వ్యూలు తదితర కార్యక్రమాలలో పాల్గొంటుండటం జరుగుతున్నది.

వీరి కవితలను పరిశీలించినప్పుడు చాల కవితలు అంతర్లీన విషాదాలతో నిరాశాజనకంగా కన్పించినా పాఠకుల గుండెల్ని తాకుతాయి, హృదయాలను స్పందింపజేస్తాయి. ఉదాహరణకు... నిశ్శబ్దంగా నిష్క్రమించే మనుష్యులను గూర్చి వీరు వ్రాసిన ఓ కవిత... చివరి మజిలీ...

- ఉన్నవాడూ, లేనివాడూ, రోగగ్రస్తుడూ, ఆరోగ్యవంతుడూ అందరినీ ఆదరించేది చివరికి శ్మశానమే!
  ఎవరికి ఎవరూ లేరు. చివరికి తోడుగా ఎవరూ రారు కాకపోతే, నీయింటి గేటుదాకా వచ్చి... అంతటితో నీతోటి అనుబంధాలు అంతం!!
  చివరికి నీకు మిగులుతుంది ఒంటరిగా, ఏకాకిగా బూడిదలో బూడిదగా, మట్టిలో మట్టిగా... అందరికీ చివరి మజిలీ శ్మశానమే!!!
- వారు గజ ఈతగాళ్ళు సాగరంలోకి ఉదయమనగా వెళ్ళి రాత్రి వెలుపలికి వచ్చారట! నేనే నయం ఇరవై ఏళ్ళ క్రిందట లోపలికి వెళ్ళి ఇప్పటిదాకా రానేలేదు!!
- నేను రెండేసార్లు మరణించాను!
  ఒకసారి పుట్టినప్పుడు – మరోసారి ప్రేమించినప్పుడు!!
- ఆకాశమంత అత్తిల్లు, భూదేవంత పుట్టిల్లు... అందుకే నాకు మిగిలింది శూన్యం!
- ఒక్క కన్నీటి బొట్టు వెనుక సముద్రమంత సంక్షోభం!
  ఆ సముద్రం వెనుక ఒక సంసారం!!
- మాతృత్వపు తీయదనాన్ని మరయంత్రం నరుకుతోంది!
  మనసులేని యంత్రాలే పుడుతున్నాయి!!

ఇక కథల విషయానికి వస్తే వీరి కథలలో స్త్రీవాద దృక్పథంతో సాగిన కథలు ఎక్కువగానే కన్పిస్తాయి... పాఠకుల హృదయాలను స్పర్శిస్తాయి.

**మరమనుషులు :** మనసున్న శ్రీమతి, హృదయం లేని శ్రీవారు, 'అరవై తరువాత అరులు మరులు' అన్నట్లుగా ప్రవర్తించే ప్రక్క ఇంటి మామ్మగారు... ముచ్చటగా మూడేపాత్రలతో... ప్రపంచీకరణ ప్రభావం తాలూకు పరోక్ష పోకడల ఒరవడిని లీలగా చూపుతూ, మనిషి అంతర్గత మానసిక సంఘర్షణలను దృశ్యమానం చేసిన కథ. వస్తువు పాతదైనా చదివించే గుణం కలిగివున్న కథనం ముగింపు వరకూ పాఠకుల్ని వేగంగా వెంటదీసుకువెళ్తుంది. ఈ కథకు ఇటీవలే 'రచన' కథా పీఠం పురస్కారం లభ్యమవడం ముదావహం.

**కళ్ళు :** అద్భుతమైన కథా వస్తువును కలిగిన కథ. జీవానికీ – జీవితానికీ మధ్యన కన్పించీ, కన్పించని లోతయిన అస్పష్టతను స్పష్టంగా చెప్పగలిగిన కథ. పైకి కన్పించే మనిషికీ, అంతరంగంలో విజృంభించి వీర విహారం చేసే మనసుకూ మధ్యవున్న తేడాలను అభివ్యక్తీకరించిన కథ.

**నిర్ణయం :** ఆశల ఆకాశంలో ఊహల గుర్రాలమీద స్వారి చెయ్యాలని ఉబలాటపడే మనిషి నేలమీద రెండుకాళ్ళూ ఆనించి నిటారుగా నిలబడి కాస్త క్రిందికి చూడగలిగితే ఈ భూమిమీదే తనకో స్వర్గం నిర్మించుకోవచ్చుననే ఊహ తోస్తుంది. ఆ విషయాన్ని తెలియజెప్పే కథ.

**నాన్న మంచం :** మధ్య తరగతి జీవితాలలో ఉండే సమస్యల్ని, స్త్రీల మనసులలో వుండే వెలితిని, అసంతృప్తుల్ని, వేదనలను తెలియజేస్తూ... వాటన్నింటి మధ్యనా తనకు తన తండ్రి నుండీ సంక్రమించిన పాత మంచం మీద ఆత్మ సంతృప్తిని వెతుక్కునే ఓ ఇల్లాలి దీనగాథ.

**విలువ :** "ప్రజలు మాత్రమే నటీనటులను తయారు చెయ్యగలరు. అంతేకానీ ఆ క్రియేటివిటీ ప్రపంచంలోని ఏ గొప్ప వారికి కానీ, మరే గొప్ప సంస్థలకు కానీ సాధ్యంకాని పని!" అంటూ నిర్మొహమాటంగా సంచలనాత్మక ప్రకటన చెయ్యగలిగిన అలనాటి సుందర తారమార్లిన్ మన్రో మొదలుకుని ఇటీవలి కాలానికి చెందిన మహానటి సావిత్రి మొదలైన ఎందరో నటీనటులు ఆకాశానికి ఎదిగి ఆపై నేలరాలి మట్టిలో మట్టయి పోయారు. అలాంటి అభాగ్యురాలైన ఓ కళాకారిణి కళ్ళెదుట వున్నా గుర్తించలేని గ్రుడ్డిలోకం నీడలకు పట్టం కట్టే వైనాన్ని తెలియజెప్పే కథ.

ఇటీవలి సంవత్సరాలలో వివిధ పత్రికలలో ప్రచురితమైన శక్తివంతమైన తమ కథలను ఇరవయి ఎంపికచేసి 'అడ్డా' అన్న కథా సంపుటిని వెలువరించారు శైలజామిత్రగారు. పాలపిట్ట బుక్స్‌వారు ప్రచురించిన ఈ గ్రంథం మార్కెట్‌లో లభ్యమవుచున్నది. సాహిత్యాభిమానులు చదవదగ్గ పుస్తకమిది.

శైలాజా మిత్రగారు మధ్యతరగతి జీవితాలను బాగా ఆకళింపు జేసుకున్న రచయిత్రి. ఎక్కువ కథలు మధ్య తరగతి మందహాసాలతో, విషాదాలతో దర్శనమిస్తాయి. అయితే స్త్రీవాద దృక్పథం ఎక్కువగా కన్పిస్తుంది. నిజానికయితే నిశ్శబ్ద తరంగంలా సాగుతున్న సాహితీగళం శైలజామిత్రగారి కలం.

**చిరునామా :**

**శ్రీమతి శైలజామిత్ర**
98, సౌజన్య ఎవెన్యూ,
ఎస్.బి.ఐ. కాలని, గాంధీనగర్
**హైదరాబాదు - 500 080**
ఫోన్ : 040 - 27531193
సెల్ : 9290900879.

## అడుగడుగునా అగ్నిపరీక్ష లెదుర్కొనే అబలల సమస్యల పట్ల స్పందించిన కలం... శ్రీమతి పి. శైలజ సాహితీ గళం



**1975** - 1990 సంవత్సరాల మధ్య కాలంలో... పదిహేను సంవత్సరాల పాటు వివిధ పత్రికలలో తరచు శ్రీమతి పి. శైలజగారి వైవిధ్య భరితమైన కథలు కన్పిస్తుండేవి. ఎక్కువ కథలయితే స్త్రీల సమస్యలను ప్రతిబింబిస్తూ స్త్రీవాద దృక్పథంతో సాగినా, అన్నింటిలో సామాజిక స్పృహ, పరిస్థితుల పట్ల మంచి అవగాహనా తప్పని సరిగా కన్పించేవి. పురుషుల బుద్ధిలో ఉత్పన్నమయే విషయాలను ఈ రచయిత్రి మాయాదర్పణంలోంచి చూడగలుగుతోందా అన్నట్లుగా పురుష దృష్టికోణంతో కూడా నేర్పుగా కొన్ని కథలు వ్రాయగలిగిన ఈ రచయిత్రి కలం గత ఇరవైయ్యేళ్ళుగానూ దాదాపు పూర్తిగా మూగబోవడానికి కారణాలు తెలియవు. ప్రపంచీకరణ ప్రభావం, రాజకీయ అనిస్థితి, పెచ్చు మీరిన స్వార్థం, అవినీతి మొదలైన కారణాల వల్ల గత ఇరవై ఏళ్ళలోనూ సమాజంలో, దేశంలో చాల దురదృష్టకరమైన సంఘటనలు, దుష్పరిణామాలు ఎన్నో చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితుల పట్ల వారి కలం స్పందించకుండా మూగబోవడం బాధాకరం.

తేది 30-6-1958 నాడు చిత్తూరు జిల్లా మదనపల్లెలో వీరి జననం జరిగింది. శ్రీమతి అమృతమ్మ, శ్రీ పొగాకు లక్ష్మీపతి అను పుణ్యదంపతులు వీరి తల్లిదండ్రులు. వీరి తండ్రిగారు న్యాయవాద వృత్తిలో కీర్తి ప్రతిష్టలు పొందినవారు. వీరి భర్తగారైన ఆర్. రమేష్‌బాబుగారు పేరెన్నికగన్న వైద్యులు. చాల సంవత్సరాల పాటు తిరుపతి రుయా ఆస్పత్రిలో వివిధ హొదాలలో సేవలందించిన తదుపరి ప్రస్తుతం వీరు గుంటూరులో రీజనల్ డైరెక్టరుగా వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పి. శైలజగారి విద్యాభ్యాసం పదవ తరగతి వరకూ మదనపల్లె బాలికల ఉన్నత పాఠశాలలో జరిగింది. ఇంటర్, బి.ఎ.లను తిరుపతి పద్మావతీ స్త్రీల కళాశాలలో పూర్తి చేశారు. ఆపై శ్రీ వేంకటేశ్వరా యూనివర్శిటీ నుండీ పొలిటికల్ సైన్సులో ఎం.ఎ. పట్టా పొందారు.

చిన్నతనం నుండీ సాహిత్యం పట్ల మక్కువ పెంచుకున్న శైలజగారు ఆధునిక కథా, నవలా సాహిత్యాన్ని ఎక్కువగా చదివారు. చలం, శరత్‌ల రచనల పట్ల అభిమానం ఎక్కువ. కళ్ళ ముందు కన్పించే స్త్రీల సమస్యల పట్ల అవగాహన పెంచుకున్న వీరు చిన్నవయసులోనే రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టారు. వీరి కథలను కొన్నింటిని పరిశీలిస్తే...

**1. అమృతహస్తం :** గూడులోని గ్రుడ్డు పొదగబడి వెలికి వచ్చిన ప్రాణికి రెక్కలొచ్చి గూడు వదిలి ఎగరడం మొదలు పెట్టే వరకూ కూడా దాని జనన కారకులైన పక్షులు రెండూ ఎక్కడెక్కడో తిరిగి పురుగులు, గింజలు, మెతుకులు తెచ్చి తినిపిస్తాయి. ఒక్కసారి పైకెగిరాక పెరిగిన పక్షి వాటికి దొరకదు... ఉపకరించదు! ఈ జీవిత సత్యం మానవ జనజీవన స్రవంతిలో తరచు దృశ్యమానమవుతూ ఉంటుంది. అందులోని హృదయవేదన, ఆత్మక్షోభలను తెలియజేసే కథ 'అమృతహస్తం'.

**2. విరజాజులు :** మధ్య తరగతి జీవితాలలో మందహాసాలు తక్కువ. ఆవేశాలూ, ఆక్రందనలూ, విషాదాలూ ఎక్కువ! ఐదేళ్ళకోసారి ప్రలోభపెట్టే ప్రభుత్వాలూ, ప్రజాప్రతినిధులూ దృష్టి సారించని సమస్యలెన్నో ఆ జీవితాలకు? ఆ సమస్యల్ని ఎవరికివారు పరిష్కరించుకునే ప్రయత్నం ఎంత ఆనందదాయకమో తెలియజేసే కథ 'విరజాజులు'.

**3. మానస పుష్పం :** భార్యాభర్తల బంధాలు–అనుబంధాలు చాల గొప్పవి నిజానికి. మరి ఆ మమకారాలు, ప్రేమల మధ్యన చోటు చేసుకునే నీలి నీడలకు కారణాలేమిటి? మనుషులు దగ్గరవుండీ దూరదూరంగా ఎందుకు జీవిస్తారు? ఈ సమస్యల సుడిగుండాల పర్యవసానాలు ఒక్కోసారి ఎందుకంత విషాదంగా పరిణమిస్తాయి? అన్న ప్రశ్నలను ఇతివృత్తం చేసుకుని వ్రాయబడ్డ కథ 'మానవ పుష్పం'. హృద్యమైన కథ!

**4. ఆటోగ్రాఫ్ :** "యవ్వనంలో మనుషులు ఒక ప్రత్యేక జీవులు. మనిషి మీద యవ్వన ప్రభావం చాల వుంటుంది. ఏదో నూతనత్వం కోసం మనస్సు తహతహలాడ్తూ ఉంటుంది. ఈ ఫేజులో జీవితంలోని ముఖ్యమైన సమస్యల్ని నిర్లక్ష్యం చేసి, ఊహించుకున్న విలువలకు ప్రాధాన్యత ఇచ్చి ఆ ఊహ ప్రకారం జరగకపోతే అసంతృప్తి, వెల్తి ఫీలవ్వడం పరిపాటి." అంటారు డా॥ కొమ్మూరు వేణుగోపాలరావు తమ సంచలనాత్మక నవల గోరింటాకులో. అచ్చు అలాంటి స్థితిలోనే నడచిన ఒక అమాయకురాలి... మరియు... ఆమె మిత్రురాలి కథ 'ఆటోగ్రాఫ్'. యువ హృదయాల స్పందనలను, మనసుల ఊహలను కళ్ళకు కట్టించిన కథ.

**5. అలక :** ఊహలు వేరు–వాస్తవాలు వేరు. యవ్వనంలో అడుగిడిన మనిషి కనే పంచరంగుల కలల్లో అక్కడక్కడ రంగురంగుల చీకటి దాగి ఉంటుందనే విషయం అనుభవిస్తే తప్ప తెలియదు. నలభై ఏళ్ళు వచ్చేలోపు శ్రమంతా ధారపోసి వీలైనంత ఎక్కువ ధనం సంపాదించుకుని ఆపై భార్యాపిల్లల్తో

ఆనందమయమైన ప్రశాంత, విశ్రాంత జీవితం గడపాలని భావిస్తూ ఎక్కువ కాలం పనిలో గడిపే భర్తను అర్థం చేసుకోలేక అపోహపడి ఆపై తన తప్పు తెలుసుకున్న ఓ సౌందర్యరాశి కథ!

**6. కోరిక :** మగవారిలో చాలమంది కామానికి బానిసలు. అలాంటి వారికి భార్యాబిడ్డల మీద ప్రేమ ఉండదు... వాళ్ళేమయిపోయినా చింతలేదు! తాము తమ విలాసాలు చూసుకోవడంలోనే జీవితం గడిపేస్తారు. 'పాపము వల్ల వచ్చు జీతము మరణం...' అంటుంది బైబిల్. తాము చేసిన పాపాలకు నిష్కృతిగా చివరి మజిలీలో మరణించే లోపువారు అనుభవించే బాధలకూ, కష్టాలకూ, కన్నీళ్ళకూ అంతే ఉండదు. తాము పోగొట్టుకున్న వారి నుండీ అమూల్యమైన సేవలను పొందగలిగే అవకాశం వున్నా అందుకోగల అదృష్టం మిగిలివుండదు.

ఒక నవలగా వ్రాయగలిగిన ఇంతటి విషయాన్నీ చిన్న కథా వస్తువుగా స్వీకరించి కంటతడి పెట్టించేలా గొప్ప హృదయస్పర్శతో కూడిన అద్భుత కథనంతో వ్రాయబడ్డ కథ 'కోరిక'. కథ చివర్న రచయిత్రి జోక్యం చేసుకోకుండా... "ఆమె కోరిక ఏమిటో?" అని శశిరేఖ ప్రశ్నించుకున్న చోట కథ ముగించి వుంటే కథ మరింత శక్తివంతంగా ఉండి వుండేది.

**7. వెన్నెల్లో చీకటి మరకలు :** ఆడవాళ్ళకన్నీ అగ్ని ప్రమాదాలే! ఈ ప్రయోగాలతోటే భూమి బ్రద్దలయిపోతుందని సాంప్రదాయవాదులు భయపడ్తోంటే, కొత్తగా ఈ మారణకాండలోకి కొత్తకోణాలు చొచ్చుకు వస్తూ రూఫ్‌కన్వర్లను అగ్నికి ఆజ్యంగా అందించడం మొదలు పెట్టేశాయి.

అపూర్వంగా ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఓ జంట మధ్యకు పై అగ్నిగుండం తాలూకు వేడి నీడలు ప్రసారం అయితే ఉత్పన్నం అయ్యే పరిస్థితులను కళ్లకు కట్టించిన కథ "వెన్నెట్లో చీకటి మరకలు".

**8. స్నేహం సిగ్గుపడిన వేళ :** "అపవాదుకు వున్న ఆకర్షణ ఈ ప్రపంచంలో ఆడదానికి లేదు. అపవాదు ఇచ్చే ఆహ్లాదం మరి ఒకటి ఇవ్వలేదు!" అంటారు త్రిపురనేని గోపీచంద్. అయితే అది మగవాడు స్త్రీమీద వేసే అపవాదుకు సంబంధించిన విషయంగా తోస్తుంది. కానీ ఒక స్త్రీ ఒక పురుషుడి మీద వేసే అపవాదు పరిస్థితి ఏమిటి? దాని పర్యవసానం ఏమిటి? అన్న విషయం మీద లోతయిన ఆలోచనతో వ్రాయబడ్డ కథ 'స్నేహం సిగ్గుపడిన వేళ'.

**9. థ్రిల్ :** ఉన్నదానిపై నిర్లక్ష్యం... లేని దానిపై వ్యామోహం మనిషికి సహజం. పురుష పుంగవులకైతే ఈ జాడ్యం ఒకింత అధికం. అందమైన స్త్రీ కనపడితే అబగా చూసే మగవాడికి ఆ సమయంలో తన భార్య జ్ఞాపకానికి

రావడం అరుదు. అథవా జ్ఞాపకానికి వచ్చినా, రొటీన్ లైఫ్‌కు ఊహలలో అయినా భిన్నత్వం వద్దా? అని సమర్థించుకోవడం కూడా కద్దు! కానయితే ఓ భార్య ఆ భిన్నత్వాన్ని అభివ్యక్తీకరించేలా కొద్దిపాటి తేడాను ఏకరవుపెడ్తూ భర్త వీపుమీద ఓ చరుపు చురుగ్గా చరిస్తే?... పర్యవసానాన్ని వ్యక్తీకరించే కథ 'థ్రిల్'.

**10. తోడు–నీడ :** "A friend comes in when the whole world has gone out" అంటారు ఒక ఆంగ్ల రచయిత. అపజయాలవల్లో, పరిస్థితుల ప్రభావాలకో తల ఒగ్గి వంటరి అయిన మనిషి నుదుటికి చల్లటి చేతి స్పర్శ నందించి ఓదార్చకపోయినా నష్టం లేదు కానీ అతని వీపుమీద ఓ పోటు పొడిచి మరింత కృంగదీస్తే...? దాని పర్యవసానం... వంటరి అయిన ఆ మనిషి మళ్ళీ వెలుగులోకి వచ్చి విజృంభించినప్పుడు చాల తీవ్రంగా ఉంటుంది! ఆ వైనాన్ని తెలిపే కథే 'తోడు–నీడ'.

**11. ఖరీదైన ఆదర్శం :** వ్రాయడం వేరు... వ్రాసిన దాన్ని జీవితానికి అన్వయించుకోవడం వేరు. నిజానికి తాము వ్రాసే ఆదర్శాలని ఆచరిస్తూ జీవించే రచయితల సంఖ్య చాల తక్కువ. చాల ఉదాత్తంగా జీవిస్తున్నట్లు నటిస్తూ, ఎంతో విలువైన ఆదర్శాలను వ్యక్తీకరిస్తూ రచనలు సాగించే ఓ రచయిత కథ ఇది. అతనిలోని అంతర్గత వాస్తవిక భావాల తాలూకు యదార్థాలను గుర్తించిన అతని భార్య పడే వేదనను, ఆమె మానసిక సంఘర్షణలను అద్భుతంగా చిత్రీకరించి దృశ్యమానం చెయ్యడంలో రచయిత్రి చూపిన ప్రతిభ అభినందనీయం.

**12. తెగింపు :** ఆడదానికి అడుగడుగునా అగ్ని పరీక్షలే! ఇహ దురదృష్టవశాత్తు ఆడదానికి ఎక్కడైనా నిజంగానే అపకారం జరిగిపోతేనో? అయిన వాళ్ళే తను చచ్చిపోయినా చాలనుకోగల దురదృష్టకర పరిస్థితులు ఏర్పరిస్తే! సమాజం నేటికీ అలా తప్పటడుగులు వేస్తూనే వుంది. అయితే అలాంటి స్థితి ఏర్పడ్డ స్త్రీకి... నేను నీకు ఎప్పటికీ అండగానే ఉంటాను" అని చెప్తూ, పురుషుడు తెగింపుగా నిలబడగలిగితే... ఆ అతివ జీవితం పువ్వుల బాటే! లోతయిన సమస్యమీద నికార్సయిన రచయిత్రి చేవ్రాలు 'తెగింపు' కథ.

**13. కల :** మనిషి మనుగడలోని భయాలు, ఆహారపు గడబిడలు, శారీరక ఆరోగ్య పరిస్థితులు మొదలైనవి కలలకు కారణాలంటుంటారు శాస్త్రజ్ఞులు, విశ్లేషకులు. కానీ అక్కడక్కడ, అప్పుడప్పుడు కలలు వాస్తవమవడమూ కద్దు. అలాంటి వాస్తవిక కలతాలూకు కథ 'కల'.

**14. గడ్డిపువ్వులే మేలు :** ఎక్కువ వేతనాల నాశించి డబ్బు సంపాదించే యంత్రంలా మారి లిబియా చేరి పదేళ్ళు గడిపిన శ్రీరాం అనే వ్యక్తి తాలూకు కుటుంబ గాథ ఇది. నిజానికి ఈ కథ ఒక్క శ్రీరాం కథే కాదు. భారతదేశాన్ని, భార్యాపిల్లల్ని, తల్లిదండ్రుల్ని, బంధుమిత్రుల్ని వదిలి వెళ్ళి వచ్చే అనేక వందల, వేల, లక్షల మంది కథ ఇది. వారి జీవితాలను తిరగేస్తే ఎన్నెన్ని విషాదాలు? మరెన్నెన్ని మంటలు తెలియని మారణ హెూమాలు??... ఎంతో లోతయిన కథా వస్తువుతో ప్రపంచీకరణ ప్రభావం పెద్దగా లేని రోజులలోనే శైలజగారు కుటుంబ యజమాని దేశాంతరం వెళ్తే కుటుంబం మీద పడే ప్రభావాన్ని, ఉత్పన్నమయ్యే సమస్యలను విమర్శనాత్మకంగా విశ్లేషిస్తూ, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో దృశ్యమానం చేశారు ఈ కథ ద్వారా.

**15. వీడ్కోలు :** కొందరు మనుషులెందుకంత నిశ్శబ్దంగా నిష్క్రమిస్తారో తెలియదు. అదే తెలిస్తే ఈ ప్రపంచంలో మరణం అనే ఓ పెద్ద మిష్టరీ విడిపోవచ్చు బహుశా. అలా చాలా చిన్న వయసులో నిష్క్రమించబోతున్న ఓ యువతి తన చివరి కోరిక తీర్చుకోవడం కోసం ఓ పేద యువకుడితో తాత్కాలిక వివాహం అనే కాంట్రాక్టు కుదుర్చుకోవడం – అగ్రిమెంటు ముగిశాక విడిపోవడం ఇందులోని కథా వస్తువు! కానయితే హృదయమున్న ఓ స్త్రీ అనుకోకుండా వీరి కాంట్రాక్టు కార్యక్రమం మధ్యన ప్రవేశించడంతో కథ పెద్ద మలుపే తిరుగుతుంది. ఆత్మీయ హృదయ స్పర్శతో నడిచే ఆర్ద్రత నిండిన కథ. కథ ముగించే సరికి పాఠకులకు దేవదాసు నవల ముగింపులో శరత్‌చంద్రచట్టోపాధ్యాయ జోక్యం కల్పించుకుని చెప్పిన మాటలు మననానికి వస్తాయి.

మంచి సామాజిక స్పృహ, విశాలమైన ఆలోచనా దృక్పథం, పరిస్థితుల పట్ల అవగాహనా కలిగివుండి ఇలాంటి కథల నెన్నింటినో వెలువరించిన శ్రీమతి పి. శైలజగారు తమ లేఖినికి ఇంత విరామమివ్వడం విచారం కలిగిస్తున్న విషయం. ప్రస్తుత సామాజిక సమస్యలపట్ల స్పందనతో, పరిష్కారమార్గాలను సూచిస్తూ పి. శైలజగారి కలం మళ్ళీ చమరిస్తుందని, మంచి కథలనూ, నవలలనూ అందిస్తుందనీ ఆశించడం పేరాశ కాదు కద?!

**శ్రీమతి పి. శైలజ, ఎం.ఏ.**
W/o డా॥ ఆర్. రమేష్‌బాబు
ప్లాట్ నెం. 125, న్యూ బాలజీ కాలనీ
**ముత్యాలరెడ్డిపల్లి, తిరుపతి – 517 502**
సెల్ : 9052108836, 9885429733

**బాహ్య అంతరంగిక శతృవుల బాధితుడు, కరువు కాటకాల పీడితుడు, సామాజిక రుగ్మతల శాపగ్రస్తుడు... 'భారతరైతు' గుండె లోతుల్ని ఆవిష్కరించిన అద్భుత రచయిత...**

## డా॥ లంకిపల్లె కన్నయ్యనాయుడు



సమాజం ఎలా వుండాలో, ఎలా వుండకూడదో, ఎలావుంటే బావుంటుందో, సుస్పష్టంగా తెలిసిన రచయిత డా॥ లంకిపల్లె కన్నయ్యనాయుడు గారు. అపారమైన జీవితానుభవం, మట్టితో విడదీయరాని బంధం, సమాజం పట్ల స్పష్టమైన అవగాహన సామాజిక పరిస్థితుల పట్ల... ముఖ్యంగా గ్రామీణ సాంఘిక, సామాన్య స్థితిగతులపట్ల ఒకింత బాధ, ప్రపంచం, ప్రజలూ బాగుండాలనే కోరికా కలిగివున్న రచయిత డా॥ లంకిపల్లె కన్నయ్యనాయుడు గారు. వీరు గత నలభై సంవత్సరాలుగా తమ ఊహలనూ, భావాలనూ తమ రచనల ద్వారా విశదీకరించిన తీరుతెన్నులు సర్వదా అభినందనీయం.

పల్లెలో పుట్టి, పల్లెలో పెరిగి – పల్లెకు ఒకింత దూరమైనా... పల్లెతో అనుబంధాల్ని కొనసాగించగలిగిన హృదయాలు ఈ అత్యాధునిక కాలంలో అరుదయిపోతున్నాయి. అలాంటి అరుదైన హృదయమున్న మనుషులు ఎక్కడున్నా, ఏంచేస్తున్నా, ఎంత విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నా... వారి మనసులు మాత్రం ఎప్పుడూ పల్లెల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. వారి ఊహలు పల్లెల అభివృద్ధి, పల్లె ప్రజల సంక్షేమాలను గూర్చిన ఆలోచనలతోనే నిండి వుంటాయి. మట్టి వాసన వారికెంతో ఇష్టం. ఏపుగా పెరిగే పైరుమీద ప్రేమ. పచ్చని ప్రకృతి అంటే ప్రాణం. అలాంటి అరుదైన వ్యక్తులలో ఒక అద్భుత వ్యక్తి డాక్టర్ లంకిపల్లె కన్నయ్య నాయుడుగారు.

చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, తోటవారిపల్లెలో తేదీ 4-4-1940 నాడు ఒక సామాన్య రైతు కుటుంబంలో వీరి జననం జరిగింది. శ్రీమతి లంకిపల్లె లక్ష్మమ్మ, శ్రీ లంకిపల్లె నారాయణస్వామి నాయుడు అను పుణ్యదంపతులు వీరి జననీ జనకులు.

వీరి ప్రాథమిక విద్యాభ్యాసం ఎల్లంపల్లి ఎలిమెంటరీ పాఠశాలలో, హైస్కూలు చదువు పాకాల ఉన్నత పాఠశాలలో సాగిన పిదప శ్రీ వేంకటేశ్వర

విశ్వవిద్యాలయం కళాశాల నుండీ బి.ఎస్సీ., మైసూరు యూనివర్శిటీ నుండి ఎం.ఎస్సీ., తదుపరి పి.హెచ్‌డి. చేశారు. హిందీలో కూడా రాష్ట్ర భాషా విశారద పట్టం పొందిన వీరు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశాలలో 1964లో రీడర్‌గా, ప్రొఫెసర్‌గా గణితం, సాంఖ్యాశాస్త్రం, ఎకనమిక్స్ శాఖలలో పనిచేసి 2000 సంవత్సరంలో ఎకనమిక్స్ విభాగంలో పదవీ విరమణ పొందారు. వీరి పర్యవేక్షణలో ఏడుగురు పిహెచ్.డి., పద్నాలుగురు ఎం.ఫిల్. పొందడం జరిగింది. వీరి పరిశోధక వ్యాసాలు 36, రిసెర్చి ప్రాజెక్టులు 8, పుస్తకాలు 8.

1984వ సంవత్సరంలోనే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషియల్ సైన్సస్ రిసెర్చి, న్యూఢిల్లీ వారి నుండీ టీచర్స్ అవార్డు పొందిన వీరు పదవిలో ఉన్నప్పుడూ, పదవీ విరమణ పొందిన తదుపరి కూడా అనేక సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన పలు సంస్థలకు సెక్రటరీగా, డైరెక్టరుగా, ట్రస్టీగా వ్యవహరించడం జరిగింది... జరుగుతోంది.

ఎన్ని పదవులు అధిరోహించినా, ఊపిరి సలుపని పనులలో కాలం గడిపినా కూడా... ఆయా ప్రాంతాలలో, ఆయా కాలాలలో... వర్షాభావం, కరువుకాటకాలు, దుర్భిక్షం ఒక విధంగానూ... ఇంకా దుష్ట క్రిమికీటకాదులు, నకిలీ మందులు, ఎరువులు, పసలేని గింజలు, లోపభూయిష్టమైన ఆర్థిక విధానాలు రైతు జీవనాన్ని, పల్లె ప్రజల బ్రతుకులనూ ఎలా అతలాకుతలం చేస్తున్నాయో సంవత్సరాల తరబడి సమగ్రంగా పరిశీలించిన పరిశోధకులు వీరు. అందువల్లే పై రైతు సమస్యలన్నీ వీరి నవలలలో, కథలలో ప్రతిఫలిస్తూ కన్పిస్తాయి.

అనాదిగా ఈ దేశమే రైతుల దేశం! రైతే రాజుగా భావింపబడిన దేశం!! అయితే మారిపోయిన కాలంలో, వాతావరణంలో రైతుకు సామాజిక న్యాయం దూరమయి, చట్టపరమైన రక్షణ కరువయిపోయింది. అందువల్ల నిస్సహాయంగా మార్కెట్ మాయాజాలంలో పరాజితుడయి పరాభవింపబడ్తున్నాడు రైతు. ఈ విషయాల గురించి మధనపడిన రచయితలలో డా॥ లంకిపల్లెగారు ముఖ్యులు. అందుకే వీరి రచనలన్నింటిలో అత్యధికభాగం రైతు జీవనం, పల్లెప్రజల జీవన విధానాలు, వృత్తిపనులూ, వారి సాధక బాధకాలూ గొప్ప స్పందనతో, హృదయస్పర్శతో దర్శనమిచ్చి ఆలోచింపజేస్తాయి.

దాదాపు నలభై కథలు, ఐదు నవలలు వీరి లేఖిని నుండీ వెలువడ్డాయి. వివిధ పత్రికలలో ప్రచురితమైన వీరి కథలు కొన్ని 1) జీవనం. 2) బ్రతుకుబాట

కథా సంపుటాలుగా వెలువడ్డాయి. అదే విధంగా 1) పచ్చగా నూరేళ్ళు, 2) జీవకోన, 3) తొలిసంధ్య నవలలు పుస్తకరూపాలుగా వెలువడ్డాయి.

మంచి కథకు నిర్దేశింపబడిన మంచి లక్షణాలలో ఒకటైన సంఘర్షణకు సంబంధించి రెండు విషయాలను ప్రస్తావించుకోవచ్చు ఇక్కడ...

కొన్ని కథలు చదువుతున్నప్పుడు ఆ కథలలోని సంఘర్షణలు ఆసాంతం పాఠకుడికి కొద్దో గొప్పో భయాన్ని కలిగిస్తాయి. ఈ ప్రపంచం ఏమవుతుందా? అన్న దిగులు పుట్టించడమే కాక, ఈ సమాజాన్ని మనం బ్రతికించుకోగలమా? అన్న సంశయంలో పడవేస్తాయి! అంతేగాక ఆ కథలలోని వాస్తవాన్ని జీర్ణించుకున్న పాఠకుడు నిరాశలో కూరుకుపోగల అవకాశాలూ ఎక్కువ.

రెండవ తరహా కథలు సైతం చివరివరకూ భయపెట్టినా, ముగింపు ఆశాజనంగా మారి ఆనందాన్ని కలిగిస్తూ ఈ సమాజాన్ని, సంస్కృతిని ఏదో ఒక విధంగా జీవింపచేసుకోవచ్చుననే విశ్వాసాన్ని కలిగిస్తాయి.

మొదటి తరహాకు చెందిన... 'సంఘమిత్ర' గారు వ్రాసిన 'భీక్‌మాంగ్' లాంటి గొప్ప కథలు చదివినప్పుడు వాటిలోని సంఘర్షణలతో కూడిన నగ్నవాస్తవికతలు అడుగడుగునా పాఠకుల గుండెలను భయభ్రాంతులకు గురిచేస్తాయి. హృదయాలు చలించిపోతాయి, మనసులు మూగగా కన్నీటి పర్యంతాలవుతాయి! చివరగా పాఠకులను కొంతమేర నిరాశకు గురిచేస్తూ రోజుల తరబడి, నెలల తరబడి వెన్నంటి తరుముతాయి.

డాక్టర్ లంకిపల్లెగారి కథలలో అత్యధిక భాగం రెండవ తరహాకు చెందుతాయి. వీరి కథలలో... తేరు, ముంగారివాన, విజేత, వెన్నెల బొమ్మలు, జీవనం మొదలైన కథలను చదివినప్పుడు పాఠకులు దాదాపు ముగింపు వరకూ కూడా భయ భావానికీ, బాధకూ, నిరాశకూ గురవుతారు. ఏదో మార్పు జరగాలనే ఆవేశానికీ, అందుకు భిన్నమైన నిస్సహాయతతో కూడిన నిర్లిప్తతకూ కూడా గురవుతారు. అయితే రచయిత ఇచ్చే గొప్ప ఆశాజనకమైన ముగింపులతో... అభాగ్యజీవులందరికీ సామాజిక భద్రతతోకూడిన సరయిన న్యాయం లభ్యమవుతుందనే ఆశలనూ, నమ్మకాలనూ పొందిన పాఠకులు ఆలోచించడానికి అవకాశం లభిస్తుంది. వీరి కథలలో కొన్నింటినయినా పరిశీలిస్తే...

**తేరు :** పల్లెలో ఎన్నికల తంతు రగిలించిన కక్షలకు బలై, పల్లె వదిలి, పట్టణం చేరి ఓ తేరుక్రింత భార్యాపిల్లలతో తలదాచుకున్న ఓ చర్మకారుని కథ 'తేరు'. తన జీవితంలో ఏర్పడిన విషాదంతో సమాజం మీద పెరిగిన అసహనాన్ని

అణుచుకుంటూ అనేక బాధలు పడినా చివరికి ఆ పట్టణంలో తల ఎత్తుకుని జీవితం గడపడానికి అవకాశం లభిస్తుంది అతనికి. సాటి మనిషికి సహకరించగల మనుషులు ఎక్కడైనా ఉంటారని తెలిపిన కథ.

**విజేత :** మారుమూల పల్లెల ప్రజలు ఎలా అణగద్రొక్కబడి, ఎంత అస్వతంత్రంగా జీవిస్తున్నారో తెలుపుతుంది ఈ కథ. ఆ చీకటి నుండీ వెలుపలపడి వెలుగుకేసి సాగిన ఓ సామాన్యుడి కథ విజేత.

**ముంగారివాన :** అణగారి వుండిన పల్లె ప్రజల్లోంచీ ఓ వ్యక్తి తెగించి వెలుపలపడి పల్లెకు దూరంగా, వంటరిగా జీవనపోరాటం సాగిస్తూ క్రమంగా పైకెక్కివచ్చి ప్రశాంత జీవనం గడుపుతూ... జీవనపోరాటంలో సదా తనను దెబ్బతీస్తూనే వచ్చిన శత్రువు ప్రాణాపాయంలో ఉన్నప్పుడు రక్షించి చెడుమీద, మంచి గెలిచినప్పుడు ఉత్పన్నమయ్యే పరిస్థితిని చూపిన వైనం ముంగారివాన.

**కడియాలు :** మట్టితో రైతు అనుబంధం గొప్పది. విడదీయరానిది! తన రక్తాన్ని చమటగా మార్చి భూమికి ధారపోసిన ఓ రైతుకు... నగరాల, పట్టణాల సరిహద్దులు దాటి రైతులకు మేలు చెయ్యడానికి గ్రామంలోకి ప్రవేశించిన బ్యాంకు తాలూకు ఉద్యోగులు చేసిన అపకారంతో ఆత్మాభిమానం దెబ్బతిన్న ఆ రైతు మట్టితో అనుబంధాన్ని, నమ్ముకున్న నేలను, ఊరిని వదలడానికి సిద్ధపడి పోయిన దీనగాథ. రైతువెతలను, భూ సమస్యలను స్పష్టంగా దృశ్యమానం చేసిన కథ.

**జీవనం :** రాయలసీమ రైతు నైజం, వెలుగు, ఆత్మసంతృప్తి, ధైర్యం, ఆశలు, ఆధారాలు, ఎదురుచూపులు... అన్నింటినీ కళ్ళకు కట్టించే కథ జీవనం. ఎలుకలు, పక్షులు లాంటి పంట శత్రువులతోపాటు మానవత్వంలేని ఉద్యోగులతో, గ్రామీణాధికారాలను హస్తగతం చేసుకున్న అంతరంగిక శత్రువులతో సంఘర్షణలకు గురయ్యే ఓ రైతు చంద్రుని కోసం ఎదురుచూసే చకోరపక్షిలా కరంటుకోసం ఎదురుచూస్తూ భూమిని జీవింపచేసుకోవడానికి పడే ఆరాటం, అతని కుటుంబం సైతం అందుకోసం పడే తపన దృశ్యమానమైన కథ జీవనం!

ఇహ నవలల విషయానికి వస్తే... విలువైన అవార్డులతో ఆకాశానికి ఎత్తబడాల్సిన నవలలు నిజానికి! ప్రతి నవలలో రచయిత హృదయం ఆవిష్కృత మవుతుంది. పాఠకుడిలో గొప్ప స్పందనను కలిగిస్తాయి.

**జీవకోన :** నీతి కేంద్రబిందువుగా, ధర్మం పరిధిగా నడక నియమబద్ధంగా సనాతన ధర్మ స్వరూపం నీడన నడిచిన ఓ అత్యున్నత అసాధారణ వ్యక్తి యొక్క జీవనయానం ఈ నవల. అయితే ఆ ఉత్తమ పాత్ర చుట్టూ చుట్టుముట్టిన పాత్రలూ, ఉపపాత్రలూ, మానవ సంబంధాలూ అనేకం. వీటి తాలూకు

సంఘర్షణలను ఆ వ్యక్తి తన వ్యక్తిగత డైరీలో వ్యక్తపరచిన తీరు అద్భుతం. డైరీలోని విషయాలు చదువుతున్నప్పుడు ఇనుప గుండె అయినా ద్రవించక తప్పదు!! మంచి సామాజిక స్పందనను కలిగిస్తూ, విషాదరేఖల మధ్య సాగినా గొప్ప ఆశాజనకమైన ముగింపుతో సంతృప్తినిచ్చే సజీవమైన చక్కటి కుటుంబగాథ 'జీవకోన' నవల.

**తొలిసంధ్య :** భూమి, గ్రహాలు వలయాకారంలో తమచుట్టూ తాము పరస్పర ఆకర్షణ శక్తితో ఒక క్రమపద్ధతిలో తిరుగుతున్నట్లే మనిషి చుట్టూ మనుషులు, మనుషుల చుట్టూ మనిషి... చావుపుట్టుకల, అనురాగ విరాగాల, ఆశనిరాశల, ఆశయాల ఆటంకాల, కల్పన వికల్పనల, జయాపజయాల, సుఖదుఃఖాల, శాంతి అశాంతుల, మంచిచెడుల తాలూకు వలయాల మధ్యన పరిభ్రమిస్తున్నారంటారు డా॥ లంకిపల్లెగారు తమ 'తొలిసంధ్య' నవలలో... మనిషి జీవిత పరిధిని, విలువలను విశ్లేషిస్తూ!

(ఆనాటికే) స్వాతంత్ర్య సమరయోధులమని చెప్పుకునే వారిలో స్వాతంత్ర్యం రాకూడదని అడ్డుకున్నవారూ, స్వాతంత్ర్యం రావడం ఇష్టంలేని వారూ, స్వాతంత్ర్య పోరాటంలో కొంతవరకే ముందుకు వెళ్ళి వెనుతిరిగినవారూ కూడా ఉన్నారన్న వింతవైనాన్ని, సత్యాన్ని తెలుపుతూ, స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను, ఆస్థిపాస్తులను, కుటుంబాలను కూడా కోల్పోయిన త్యాగధనులను, మహనీయుల్ని గూర్చి కూడా ప్రస్తావిస్తూ... "ఆనాడు రాజకీయం అంటే త్యాగం! ఈనాడు స్వార్థం!!" అంటూ ఇతివృత్తంలో ఓ భాగాన్ని క్లుప్తంగా విశదీకరిస్తారు రచయిత తొలిమాటలో.

నలభై సంవత్సరాల క్రితం వ్రాయబడి, త్యాగధనులకు, స్వాతంత్ర్య సమరయోధులకు అంకితం ఇవ్వబడ్డ ఈ నవల సంక్షిప్తీకరించబడినా, ఆనాటి దేశ, కాలమాన పరిస్థితులు గ్రామీణ జీవితాలతో ముడిపడి కళ్ళకు కట్టిస్తూ కాలానికి నిలిచే గొప్ప నవల తొలిసంధ్య.

**పచ్చగా నూరేళ్ళు :** రైతు నాడి తెలిసిన గొప్ప వైద్యుడు డా॥ లంకిపల్లె కన్నయ్యనాయుడుగారు. ఆ విషయం ఈ నవల ఎత్తుగడలోనే అవగతమవుతుంది పాఠకుడికి. తాము నవలను నడిపించబోతున్న పల్లెకు 'పంటపల్లె' అని నామకరణం చెయ్యడంలోనే గ్రామస్వరాజ్యం పట్ల రచయిత యొక్క ఆశలూ, ఆశయాలూ, ఆలోచనలూ దృశ్యమానమవుతాయి. ఈ నవలలో కథనం ఎంత నెమ్మదో, మూడు తరాలకు చెందిన రైతు జీవన దృశ్యమానం అంత వేగం, మరింత లోతు! ఈ దేశంలోని ప్రతి రైతు ఇంటా భగవద్గీతలా అధ్యయనం చెయ్యాల్సిన, పూజింపబడాల్సిన నవల ఇది నిజానికి.

రైతులను పీడించి ఏడ్పించే అప్పులు, నేలరాలని చినుకులు, పశువుల ఆకలి, ఒక ఎద్దు మరణిస్తే రెండవ ఎద్దు రోజుల వ్యవధిలో కృంగి, కృశించి జీవనం చాలించే దీనాతి దీనమైన దృశ్యం, ఆకలి మరణాలు మొదలైన వాటిని హృద్యంగా చిత్రీకరించిన రచయిత... "కరువు జ్వరం!, తిరుగులేని వ్యాధి!!, మృత్యువు!!!" అంటూ కరువు కాటకాలను వివరించడం ద్వారా పాఠకుడి గుండెలో ఆలోచనాత్మక విషాదాన్ని నింపుతూ అనేక సామాజిక నగ్న సత్యాలను తెలియజేస్తారు.

అధికారులు, ఫ్యాక్టరీల యజమానులు, దళారులు, నాయకులు మొదలైన వారు రైతుల పట్ల ప్రవర్తించే తీరుతెన్నులు, చూసే చిన్నచూపులు, విపరీతంగా పెరిగిన వ్యవసాయ వ్యయం, పంట బాగా పండినప్పుడు కనీస గిట్టుబాటు ధర కూడా లభ్యం కాని దుస్థితీ, రైతు కేమాత్రం సహకరించలేని స్థితిలోవున్న రాజకీయ, విజ్ఞాన, ఆర్థిక శాస్త్రాలు, సిద్ధాంతాలు మొదలైన విషయాలన్నీ ఈ నవలలో హృద్యమంగా కళ్ళకు కట్టబడి మనసులను ఆలోచింపజేస్తాయి.

గొప్ప అవార్డులెన్నో పొందవలసిన నవల ఇది. ఇలాంటి నవలలను శ్రద్ధగా చదవగల నాయకులు, అధికారులు తగినంత సంఖ్యలో లేకపోవడం దురదృష్టకరం.

విద్య, వైజ్ఞానిక, పరిశోధక రంగాలలో ఉన్నత స్థాయికి చేరుకుని, అత్యున్నత ఆలోచనలతో, భావాలతో, చక్కటి సామాజిక స్పృహతో సంఘశ్రేయస్సును ఆకాంక్షిస్తూ రచనలు సాగిస్తున్న డా॥ లంకిపల్లె కన్నయ్యనాయుడు గారి కలం నుండీ మరిన్ని విలువైన, శక్తివంతమైన, ఆశాజనక రచనలకు ఎదురు చూడడంలో గొప్ప ఆనందం వుంది.

**చిరునామా :**

**డా॥ లంకిపల్లె కన్నయ్యనాయుడు,**

195, సరస్వతి సదనము

న్యూ బాలాజీ కాలనీ

**తిరుపతి – 517 502**

ఫోను : 0877 – 2240108

సెల్ : 9052465032

## అల్లూరి అమ్మణ్ణి, కురబలకోట కవయిత్రి, కళల కాణాచి...
## అయినా... ప్రచారం కోరని రచయిత్రి శ్రీమతి లక్ష్మీరాఘవ



సాహిత్యానికి సంబంధించిన గ్రంథాలు, పత్రికలు లభ్యంకాని ఓ చిన్న గ్రామంలో, సాహితీ వ్యాసంగం కొరవడిన రాజకీయ కుటుంబంలో జన్మించిన శ్రీమతి లక్ష్మీరాఘవగారు తమకు బుద్ధి తెలిసినప్పట్నుండీ చాలకాలంపాటు చూసిందంతా రాజకీయమే! అలాంటి స్థితిలో ఆమె కళలూ, సాహిత్యం వైపు ఆకర్షితులు కావడమే ఒక వింత అనుకుంటే... తమకు పద్దెనిమిది సంవత్సరాలు వచ్చేసరికే నాట్యం నేర్చుకుని హైస్కూలు వార్షికోత్సవాలలో ప్రదర్శనలివ్వడం, నాటకాలలో నటించడమే కాక ప్రాపంచిక దృక్పథంతో సామాజిక సమస్యల పట్ల స్పందిస్తూ కవితలూ, కథలూ, వ్యాసాలూ వ్రాయగలగడం, అవన్నీ పత్రికలలో ప్రచురింపబడ్తూ రావడం కూడా ఒక గొప్ప విశేషమనే భావించక తప్పదు.

చిత్తూరు జిల్లా, మదనపల్లె తాలూకా "గట్టు" గ్రామంలో 1948లో జనన మందిన ఆ కళాపిపాసి శ్రీ అల్లూరి (గట్టు) నరసింగరావు, స్వర్ణమ్మ అను పుణ్యదంపతుల తృతీయ సంతానం. వీరి తండ్రిగారు మదనపల్లె నియోజకవర్గం నుండీ రెండు పర్యాయాలు ఎం.ఎల్.ఎ.గా కొనసాగినవారు.

శ్రీమతి లక్ష్మీరాఘవ గారి ప్రాథమిక విద్యాభ్యాసం గట్టు ప్రాథమిక పాఠశాలలోనూ, హైస్కూలు చదువు మదనపల్లె గిరిరావు దివ్యజ్ఞాన ఉన్నత పాఠశాలలోనూ సాగింది. తదుపరి హైదరాబాదులో బి.ఎస్సీ. చదువుతున్నప్పుడు ఇంటర్ కాలేజి కాంపిటీషన్సులో ఉత్తమ నటిగా అవార్డు పొంది తమ ప్రతిభను చాటుకున్నారు. 1965 సం॥లో ఎన్.సి.సి. క్యాడెట్‌గా ఢిల్లీ రిపబ్లిక్ డే పెరేడ్‌కు ఎన్నికయి, ఢిల్లీ వెళ్ళి పాల్గొనడమేగాక అప్పటి రాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రిగార్లను వ్యక్తిగతంగా కలుసుకోవడం కూడా జరిగింది.

హైదరాబాదులోనే యం.ఎస్సీ., పిహెచ్.డి. పూర్తిచేసిన శ్రీమతి లక్ష్మీరాఘవగారు అక్కడే 'వనితా మహావిద్యాలయ' కాలేజిలో లెక్చరర్‌గా, రీడర్‌గా 30 సం॥లపాటు పనిచేసిన పిదప శ్రీవారికి రాజధాని నుండీ

సుదూరప్రాంతానికి బదిలీ కావడం వల్ల స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. లక్ష్మీరాఘవగారి మెట్టినిల్లు మదనపల్లె తాలూకా కురబలకోట గ్రామం. వారి భర్త డా॥ రాఘవరావుగారు. వృత్తిరీత్యా వారు లెదర్ ఇండస్ట్రీకి సంబంధించిన ఫారిన్ కొలాబరేషన్ కంపెనీలో మేనేజింగ్ డైరెక్టరుగా పనిచేశారు. అంకితభావంతో, క్రమశిక్షణతో వృత్తి బాధ్యతలు నిర్వహించిన వారు. వ్యక్తిగతంగా గొప్ప సామాజిక స్పృహ, ఉన్నత ఆదర్శభావాలు కలిగి యున్న వారాయన.

శ్రీవారి సహకారం వల్ల లక్ష్మీరాఘవగారు పెయింటింగ్, పెన్సిల్ స్కెచింగ్, మట్టితో కళాకృతులు తయారుచెయ్యడం, చీరలమీద బ్లాక్ ప్రింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ మొదలైన చేతి పనులకు సంబంధించిన కళలలో పరిణితిని పొందారు. భర్తగారి ఉద్యోగరీత్యా వీరి కుటుంబం కలకత్తాలో ఉన్నప్పుడు చెత్త (వ్యర్థ పదార్థాల) నుండీ రకరకాల ఆకృతులను సృష్టించి క్రియేటివ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. సొరకాయలతో రకరకాల కళాకృతులు చేయడం వీరి ప్రత్యేకత.

మొట్టమొదట్లో వారు తమ రచనా వ్యాసంగాన్ని "అల్లూరి అమ్మణ్ణి" (పుట్టింటి) పేరుతో ప్రారంభించి వివాహం తదుపరి 'లక్ష్మీరాఘవ' పేరిట కొనసాగించడం జరిగింది. వీరు అమెరికాలో ఉన్నప్పుడు 'బామ్మ గారి మాట' అన్న స్వంత బ్లాగులోనూ, కొన్ని వెబ్ పత్రికలలోనూ వీరి కవితలు, కథలు, వ్యాసాలు వెలువడి పలువురి ప్రశంసలు పొందాయి.

అధ్యాపకురాలిగా వృత్తి బాధ్యతలు, ముగ్గురు ఆడపిల్లల తల్లిగా మాతృమూర్తి కర్తవ్యాలు, ఇల్లాలుగా కుటుంబ వ్యవహారాలు నిర్వహిస్తూనే సృజనాత్మక కళల లోనూ రాణించగలిగిన వీరి కథలను కొన్నింటినయినా పరిశీలిస్తే...

**1. ఇదీ జీవితం** : అలసిపోయిన మానవ శరీరాలకు, మనసులకు వృద్ధాప్యం ఒక వరం ఒకనాడు. అదో హోదా! పూజింపబడే భాగ్యం!!... మరి ఉరుకుల పరుగుల జీవితాల మధ్యన నేడో?... ఆనాడు అమూల్యమైనవే అయిన బాల్యం, వృద్ధాప్యం రెండూ భారమైనవయిపోతున్నాయి నేడు! వృద్ధాప్యం అయితే మరీనూ!!... కోల్పోయిన శారీరక శక్తితో, పోగొట్టుకున్న విలువలతో, కృంగదీసే మానసిక ఆవేదనలతో... క్షణాలు, నిముషాలు, గంటలు, రోజులు, నెలలూ లెక్కపెట్టుకుంటూ త్వరగా దరిజేరని అమూల్యమైన మృత్యువు కోసం ఎదురు చూస్తూ గడపడం ఎంత విషాదం?

ఆ ఆవేదనా భరితమైన వైనాన్ని తెలిపే కథ... 'ఇదీ జీవితం'.

**2. ఒంటరి :** ప్రపంచంలో అక్కడక్కడ దురదృష్టవంతులు తారస పడ్తుంటారు. జననం నుండీ మరణం వరకూ వారి జీవన యానంలో ప్రతిదీ విషాదమే! వారిని గూర్చి బాధపడడం లేదా గతజన్మ కర్మఫలం కాబోలు అనుకుని సరిపెట్టుకోవడం తప్ప ఇతరులు చెయ్యగలిగిందేమీ ఉండదు! అలాంటి వారి ఆలోచనలు పరస్పర విరుద్ధ భావాల కలయికగా కన్పిస్తాయి. అలా విషాదరేఖల మధ్యన తారట్లాడుతూ జీవితం గడిపిన ఒక నష్టజాతకుడి కథ 'ఒంటరి'. వైవిధ్యభరితమైన ఈ కథకు 'కౌముది – రచనల' సంయుక్త కథల పోటీలో ఉత్తమ కథ పురస్కారం లభ్యమైంది.

**3. తద్దినం :** తత్‌దినం లేదా తద్దినం అంటే 'ఆ దినం' అని అర్థం. భారతదేశంలో అతి పవిత్రమైన దైవకార్యం ఈ తద్దినం. తల్లినో, తండ్రినో లేక ఇరువురినీ లేదా ఇతర ఆత్మీయులను కోల్పోయిన వాళ్ళు మాసికాలు, అమావాస్యలు, సంవత్సరీకాలు అంటూ ఆ తిథి ( ఆరోజు) నాడు ఎంతో భక్తితో, ప్రేమతో, అశ్రుతర్పణలతో ఆ కార్యక్రమాన్ని చాల శ్రద్ధగా నిర్వర్తించేవారు ఒకప్పుడు. అందుకే శ్రద్ధతో చేయబడేదే శ్రాద్ధకర్మ అనబడుతుండేది.

కాలం మారింది. కాలంతోపాటు మనుషులూ మారారు. మనిషి నడక వేగవంతమై పోయింది. ప్రేమాభిమానాలు కుంటుబడ్డాయి. జీవించివున్న తల్లిదండ్రులే  నిర్లక్ష్యం చెయ్యబడ్తున్నారు. ఇహ తద్దినాలు పెట్టి తర్పణలు వదలాల్సిన వారిలో కొందరి ప్రవర్తనలు చూస్తే......

ఆ వింత వైనాన్నే గొప్ప హృదయ స్పర్శతో పాఠకుల కంట కన్నీరొలికేలా చెప్పబడ్డ కథ 'తద్దినం'. కథలో అక్కడక్కడ కన్పించిన ఆంగ్ల పదాలు ఆంధ్రీకరింపబడి వుంటే కథ మరింత శక్తివంతంగా వుండి ఉండేది.

**4. అనుకోకుండా :** పిల్లల్ని ప్రేమించే తల్లిదండ్రులు ఎక్కడైనా ఉంటారు. అంతగానూ వృద్ధాప్యంలో పెద్దల్ని ప్రేమించి అపురూపంగా చూసుకునే పిల్లలూ అక్కడక్కడ కన్పిస్తుంటారు! తల్లిదండ్రులు పిల్లల్ని ప్రేమించినంతగానూ పిల్లలందరూ తల్లిదండ్రుల్ని వారి చివరి దశకాలలో చూసుకోగలిగితే ఎంత బావుండును? శరణాలయాలలో అనాథలూ, రోడ్లమీద, చెట్లక్రింద, బ్రిడ్జిల క్రింద హీనమైన దుస్థితిలో అభాగ్యులూ కన్పించరు కద??

భారతీయ కుటుంబ సంస్కృతిని నరనరానా జీర్ణించుకున్న పిల్లలు, బంధు మిత్రులు కలసి ఓ తల్లికి జరిపిన అద్భుత, అపురూపమైన జన్మదిన వేడుక 'అనుకోకుండా' కథ.

**5. ఐ హేట్ మై మమ్మీ :** కథా సీరీస్‌లో 1999వ సంవత్సరంలో వెలువడిన 'కథ 98' పుస్తకానికి ముందుమాట వ్రాస్తూ వాసిరెడ్డి నవీన్‌గారు వర్తమాన భవిష్యత్ చిత్రపటాన్ని ఇలా ఆవిష్కరించారు... "జీవన పోరాటంలో తుదికంటా నిలబడడానికి ఎంతో ఆత్మవిశ్వాసం కావాలి. అందుకు అనువైన సామాజిక విశ్వాసం ఆలంబన కావాలి. దురదృష్టవశాత్తు ఆత్మ విశ్వాసం కొరవడుతున్న దశ యిది. విశ్వాసాలు మృగ్యమైపోతున్న వేళ యిది. ఈ సంధి దశలో నిలబడి ఒక్కసారి ఆలోచించుకుంటే భవిష్యత్తు అగమ్యగోచరంగా కనపడుతుంది. ఎవరికీ ఏ విశ్వాసాలూ అవసరం లేదు. సాటి మనిషితో ఆత్మీయానురాగాలు పంచుకోనవసరం లేదు. ఒకరికొకరు దూరం కావడమే కాదు మనిషి తనకు తానే దూరమైపోతున్నాడు... పరుగు.. పరుగు... ఒక్కటే పరుగు! ఎక్కడికెళ్తున్నాడో, గమ్యం ఏమిటో పూర్తిగా తెలీదు. అంతా వేట... అధికారం కోసం వేట, కెరీర్‌కోసం వేట... ఈ వేటలో ఎన్నెన్ని అక్రమాలు... ఎంతెంత రక్తతర్పణం... ఇన్ని వేల ఏళ్ళ నాగరికత మనిషికి ప్రసాదించిన నాగరికతా విలువల్ని తోసిరాజని ఎక్కడెక్కడికో అందని లోకాలకు ప్రయాణమై పోవడం..."

1999లో వారు స్కెచ్‌లా చూపిన ఆ వర్తమాన భవిష్యత్ చిత్రపటం కాస్తా ఆపై ఎగసిపడే మంటల రంగులలో భయానక, భీభత్స అభద్రతాభావ చిత్రమాలికయి సమాజంలో సదా దృశ్యమానమవుతూనే వస్తున్నది.

ఆ పుస్తకం విడుదలవడానికి దాదాపు ఎనిమిది సంవత్సకాల క్రితమే... అనగా... 1991లోనే ప్రచురితమైన లక్ష్మీరాఘవ గారి "ఐ హేట్ మై మమ్మీ" కథ పైన తెల్పిన వర్తమాన–భవిష్యత్ చిత్రపటానికి ముందే దృశ్యమానమైన ప్రతీకలా కన్పిస్తుంది. తను సాధించుకోవాల్సిన వాటి పట్ల పూర్తి దృష్టిని ఉంచి పరుగులు తీసిన ఓ స్త్రీ తన ఆ కెరీర్ వేటలో తన బిడ్డను ఒకింత అలక్ష్యం చేసిన ఫలితం ఎంత భయానకంగా ఆ బిడ్డ తన తల్లిని అసహ్యించుకునేలా చేసిందో తెలియజెప్పిన కథ.

దాదాపు ఇరవైరెండేళ్ళ క్రితమే ప్రపంచపు పోకడనూ, మనిషి నడకనూ, మానవ సంబంధాలలో వస్తున్న మరియూ రాబోయే మార్పులనూ గూర్చి సుదూర దృష్టికోణంతో వ్రాయబడ్డ ఈ కథ లక్ష్మీరాఘవగారి సునిశిత ఆలోచనా విధానానికి దర్పణం. అంతేకాదు... అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ... తల్లిదండ్రులకో గట్టి హెచ్చరిక ఈ కథ!

**6. నిర్ణయం :** ఒక గీత క్రింద మరో చిన్నగీత గీస్తే మొదటి గీత పెద్దదయి కూర్చుంటుంది. అదే మొదటి గీత క్రింద ఓ పెద్ద గీత గీస్తే అది చిన్నదయి పోతుంది! ఈ చిన్న విషయం మానవ జీవిత గమనాలకు ఎంతగానో వర్తిస్తుంది!! ఒక గీత క్రింద అంతే నిడివితో మరో గీత గీచినప్పుడు మాత్రమే రెండూ చక్కగా సమానమవుతాయి. తన వివాహ విషయంలో అలా ప్రణాళికా బద్ధంగా వ్యవహరించిన ఓ యువకుడి కథ 'నిర్ణయం'.

**7. దేవుడూ-దెయ్యమూ :** మనిషి మనసు సంశయాల పుట్ట. ఇహ అందులోకి ఇతరత్రా పాములు ప్రవేశిస్తేనో? ఆ వైనాన్ని తెలిపే కథ దేవుడూ-దెయ్యమూ. మంచి మానసిక విశ్లేషణ కలిగివున్న కథ. అయితే 'చెట్టు ముందా? లేక విత్తు ముందా?' అన్న చిక్కుముడి మాత్రం యథాతదంగా అలాగే ఉండిపోయింది ఈ కథలో.

**8. ఎడబాటు :** పదిమంది పిల్లల్నయినా తామే పదిమంది పెట్టయి సంతోషంగా పెంచి పెద్దజేసేవారు తల్లిదండ్రులు. కానయితే ఆ పదిమందీ కూడా ఆ పెద్దలిద్దర్నీ వారి చివరి దశలో ఆదరించలేకపోవడం కూడా కద్దు! అది గతం అనుకుంటే వర్తమానం మరీ నిరాశా జనకం. వారిద్దరు... వారికిద్దరు అనుకుంటే... వారిద్దరూ తమ పిల్లల్ని ప్రాణసమానంగా పెంచి పోషించినా, వీరిద్దరూ చివరికి వారిద్దరినీ అనాథ శరణాలయాలకో, మరో చోటికో, నడిరోడ్డు మీదకో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చేర్చడం కన్పిస్తుంది.

బంధాలూ, అనుబంధాలూ, ప్రేమలూ మృగ్యమయి... స్వార్థం పెరిగిన రోజులలో పండుటాకుల అభిమానాల్ని, ఆత్మాభిమానాల్ని, మానసిక ఆవేదనలనీ, గుండె లోతులనూ దృశ్యమానం చేసిన కథ 'ఎడబాటు'.

**9. శాంతమ్మ :** "కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, రూపేచలక్ష్మీ, క్షమయా ధరిత్రీ, భోజ్యేషు మాతా, శయనేషు రంభా... షట్కర్మయుక్తా కులధర్మపత్నీ" అన్న పద్యం మగువ కుండాల్సిన ఆరు ఉత్తమ లక్షణాలను తెలియజేస్తున్నది. ఈ ఆరింటిలో 'క్షమాయా ధరిత్రి' అన్న లక్షణం చాల కష్టమైనది, క్లిష్టమైనది. దుర్మార్గుడైన భర్త ఆగడాలను భరిస్తూ ఓర్పునందు భూదేవిలా ఉండడం ఎంతటి మానసిక హింసో?... ఆ హింసను అనుభవిస్తూ భూమాతకు ప్రతిరూపంగా జీవించిన ఓ అతివ జీవనగాథ 'శాంతమ్మ'.

**10. అమ్మ మనసు :** తల్లికి పిల్లలందరూ సమానము! కానయితే బాధ్యత తెలిసిన తల్లికి... ఆర్థికంగా కానీ, ఆరోగ్య పరంగా కానీ వెనుకబడివున్న పిల్లల మీదే ఎక్కువ ఆసక్తి, ప్రేమ ఉంటుంది. ఆ విషయాన్ని తెలిపే చిన్న కథ 'అమ్మ మనసు'.

**11. సరోజ :** 'అల్లూరి అమ్మణ్ణి' పేరుతో లక్ష్మీరాఘవ గారు వ్రాసిన తొలి కథలలో ఒకటి 'సరోజ'. ఈ కథ 1966లో ఆంధ్రపత్రికలో ప్రచురితమైంది. ఆ రోజులకు, అప్పటి పరిస్థితులలో ఎన్నదగిన కథ 'సరోజ'.

జీవితంలో పరిచయం అయ్యే వ్యక్తులలో కొందరు నచ్చకపోవచ్చు. అందుకు రకరకాల కారణాలు ఉండనే ఉంటాయి. ఒక్కోసారి ఆ నచ్చక పోవడం సంఘర్షణకు దారితీయడమే కాక భయం, అపోహలని కూడా కలిగించవచ్చు. అలాంటి ఓ స్థితిని ఇతివృత్తంగా తీసుకుని వ్రాయబడ్డ కథ 'సరోజ'.

ఇలాంటి వైవిధ్యభరితమైన కథలను, కవితలను, వ్యాసాలను ఎన్నింటినో వెలువరించిన ప్రచారం కోరని ఈ రచయిత్రి కలం ఇటీవల వెలువడిన కొన్ని కథలతో కథా సంపుటి వెలుగు చూడబోతున్నది. లక్ష్మీరాఘవగారి స్వహస్తాలతో తయారయిన అనేక కళాకృతులతో ప్రదర్శనలు ఏర్పరచబోతుండడం ముదావహం.

**రచయిత్రి చిరునామా :**

**శ్రీమతి లక్ష్మీరాఘవ**

(కె.వి. లక్ష్మి, ఎం.ఎస్సీ., పిహెచ్.డి.)

3-99, అప్పారావు వీధి,

**కురబలకోట - 517 350**

చిత్తూరు జిల్లా. సెల్ : 9440124700

## అలానాడు హలాన్ని కలాన్ని కదిలించి ధాన్యం పాతరలు, సాహితీ సిరులు నిండించిన సవ్యసాచి మాన్యశ్రీ సి.వేణు



ఆయన వయసు ఎనభై ఎనిమిది... మనసు ఇరవయ్యారు... వణకుతున్న చేతిలోని కలం కదలిక పదహారు... ఆయనే శ్రీ సీకల వేణుగోపాలరెడ్డి... లేక... 'చిత్రభాను'... కాక సి.వేణు! అతి చిన్నవయసులోనే గాంధీజీ ఖద్దరు ఉద్యమంలోను, గ్రంథాలయోద్యమంలోను, హరిజనోద్యమంలోను పాలుపంచుకుని అనేక కష్టనష్టాలకు ఎదురొడ్డి నిలచిన దేశభక్తులు, ఉత్తమ ఉపాధ్యాయులు, కవి, కథకులు, నాటక కర్త!!

చిత్తూరు జిల్లా గుడిపాల మండలం, మందికృష్ణాపురంలో ఒక సాధారణ రైతు కుటుంబంలో తేది 10-2-1926 నాడు శ్రీ సి.వేణు గారి జననం జరిగింది. శ్రీమతి అమ్మణ్ణమ్మ, శ్రీ గంగిరెడ్డి అను పుణ్యదంపతులు వీరి జననీ జనకులు. వ్యవసాయాధారిత కుటుంబమైనందున ఐదవ తరగతిలోనే చదువుకు నమస్కారం పెట్టి నాగలిని చేతికి తీసుకోవాల్సి వచ్చింది వేణుగారికి. అయినా వారికి చదువంటే ప్రాణం.

'యద్భావం తద్భవతి' అన్నట్లుగా, దేవుడు పంపిన దూతలా కుప్పయ్య మాదిగ అను వ్యక్తి వచ్చి వారి ఇంట జీతానికి కుదిరి వేణుగారి చేతినుండీ ఎద్దులను, మడకను తీసుకోవడంతో వారికి మళ్ళీ చదువు కొనసాగించే మహాభాగ్యం లభ్యమైంది. తండ్రికి, కుప్పయ్యకు సేద్యపు పనులలో సహకరిస్తూనే అంచెలంచలుగా చదివి విద్యాన్ పట్టం పొంది ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉద్యోగ జీవితం, వ్యవసాయపు పనులతో రైతు జీవితం, 'చిత్రభాను' అన్న కలం పేరుతో సాహితీ జీవితం ఒక్కసారిగా ప్రారంభించాడు.

విద్యార్థి దశలో వీరికి ఓ.న మాలు దిద్దించిన గురువు చంగల్రాయపిళ్ళై గారు. ఎక్కాలను బుర్రకెక్కించినవారు దొరస్వామి యాదవ్‌గారు. సాహితీ యానానికి తొలి అడుగులు వేయించిన వారు పూతలపట్టు శ్రీరాములుగారయితే, గేయఛందస్సును వంటబట్టించిన వారు పి.రాజగోపాలనాయుడుగారు. పద్యరచనలో వీరికి మెలకువలు నేర్పిన వారు శ్రీయుతులు పైడిపాటి అప్పిరెడ్డి, చేబ్రోలు సుబ్రహ్మణ్యశర్మ, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ మొదలైనవారు.

కాలక్రమాన శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, ఎస్.పి. చంగల్రాయనాయుడు మొదలైన వారితో ఏర్పడిన సాన్నిహిత్యం వల్ల రాజకీయ శిక్షణా కార్యక్రమాల్లో, స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన కార్యక్రమాలలోనూ పాల్గొన్నారు.

శ్రీ కె.సభా, బి.ఎన్.రెడ్డి, మధురాంతకం రాజారాం, కలువకొలను సదానంద, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, కట్టమంచి బాలకృష్ణారెడ్డి, కె. రామకృష్ణ మొదలైనవారి సాహచర్యంతో సాహిత్యం మీద శ్రద్ధ పెరిగింది. రచనా వ్యాసంగం ఊపందుకుంది.

విద్యమీద ఎంత శ్రద్ద కలిగి వుండేవారో, అంతకు రెండింతల పట్టుదలతో సాహిత్యాన్నీ వంట బట్టించుకున్నారు. అయితే నేలతల్లినీ నిర్లక్ష్యం చెయ్యలేదు ఎప్పటికీ... తండ్రిగారైన గంగిరెడ్డి నుండీ వ్యవసాయపు మెలకువలన్నీ గ్రహించి చేయితిరిగిన రైతుబిడ్డగా కూడా పేరుపొందారు.

ప్రారంభదశలో నాగేలు పత్రికలో "చిత్తూరు నగరం" అన్న శీర్షికతో దేశభక్తి గేయం వ్రాసినందుకుగాను వీరు చిన్న వయసులోనే పోలీసు దాష్టీకాన్ని, కస్టడీని చవిచూడాల్సి వచ్చింది. అదేవిధంగా ఖద్దరు టోపీ ధరించినందుకు ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ నుండీ బహిష్కరణకు గురికావాల్సి వచ్చింది. అయితే అదృష్టవశాత్తు ఉపాధ్యాయసదస్సులో వీరు ఇచ్చిన 'విరాటపర్వం' ఉపన్యాసానికి విద్యాశాఖ డైరెక్టరు శ్రీ బుల్లయ్యగారి ప్రశంసలు లభ్యమవడం వల్ల ఆ గండం గడచి గట్టెక్క గలిగారు.

అరగొండ రైతాంగ శిక్షణా శిబిరంలో పాల్గొన్నప్పుడు చదివిన "పొలికేక" గేయం ఆచార్య రంగాగారిని ఆకర్షించింది. వారి నుండీ, పాల్గొన్న మేధావుల నుండీ పలు ప్రశంశలను అందించగలిగింది.

విధి నిర్వహణలో కనపరచిన అంకిత భావానికి, బోధనకు ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వ గుర్తింపు లభ్యమైంది.

కథల విషయానికి వస్తే... వీరి మొట్టమొదటి కథ 1950 ప్రాంతంలో చిత్రగుప్త పత్రికలో ప్రచురితమైంది. తదుపరి ఆనందవాణి, నాగేలు, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ మొదలైన పత్రికలు, స్థానిక పత్రికలు వీరి గేయాలతో పాటుకథలను కూడా ప్రచురిస్తూ వచ్చాయి. ఆకాశవాణి కడప, తిరుపతి కేంద్రాలు వీరి పలు కథలను ప్రసారం చేశాయి.

వీరి తొలి కథలలో 'మారెమ్మ గుడి' అన్న కథ చాల ప్రాచుర్యం పొందింది. ఈ కథ వ్రాత ప్రతిగా ఉన్నప్పుడు ఆ కథ విన్న వేణుగారి చిన్నాన్న వెంకటరామిరెడ్డి గారు అందులోని విషాదాన్ని భరించలేక కన్నీరు కారుస్తూ కథను సుఖాంతం

చెయ్యవలసిందిగా ప్రాధేయపడ్డారట. 1961 సంవత్సరంలో ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురితమైన ఈ కథ ఎత్తుగడలోనే సి. వేణుగారు ప్రాంతీయ మాండలికంతో పాఠకులను తన గుప్పిట్లోకి తీసుకుంటారు ఇలా...

పొలెద్దు గుండ్లు దాటి, బొమ్మినాయుడు చెరువు దాటి, మిన్నా లచ్చిమి కనుమ దాటి, సింగారపు జొన్న చేన్లో అడ్డంగా పడి గారమాకుల కొండ అందుకుంది గంగు. నచ్చుగుట్టను చుట్టి వంకరగా తిరిగి పరిగెత్తే కొండవాగు గట్టెక్కి వెనుదిరిగి చూసింది. తను చాల దూరం వచ్చేసింది. కొండదరిలో వడివడిగా అడుగులు వేసుకుంటూ ముందుకు సాగిపోయింది. అలికిడికి 'బెళగువ్వ' (అడవి పావురం) పటపట రెక్కలల్లార్చి పారిపోయింది. ఎండిన రెల్లు దుబ్బుల్ని తొలగదోసుకుంటూ జాలారిచెట్ల లోయలో అడుగుపెట్టింది ఆ పడుచు...

పాఠకులు ఆ పడుచుతోపాటు ఆ లోయలో జారి పడాల్సిందే. ఆపై ఇసకదిబ్బలలో వడదేరి తేటయై తీయనైన సెలయేటి నీటి యూటలా పాఠకుల దాహం దీరుస్తూ సాగిపోతుంది కథంతా! కలవారి అక్రమాలకు ఆకారణంగా బలయ్యే ప్రేమికుల విషాదాంత దీన ప్రేమగాథ 'మారెమ్మ గుడి'.

సి. వేణుగారు 1960వ సంవత్సరంలో వ్రాసిన మరోకథ 'నవ్విన ధాన్యరాశి' కూడా మంచి గుర్తింపు పొందిన కథ. గ్రామాలలోకి పంచాయతీలు అడుగిడని కాలానికి సంబంధించి, పార్టీలు, గ్రామకక్షలు పచ్చని పల్లెటూర్లను కుదిపెయ్యని రోజులలో ఓ చల్లని పల్లెటూర్లో జరిగిన ప్రేమకథగా ఈ కథను నడిపించారు వేణుగారు. పెద్దగా కక్షలు కార్పణ్యాలు లేని కాలంలో నాయికా, నాయకుల ప్రేమవల్ల అంతర్గతంగా రగులుకునే కక్షలు, తద్వారా దహించివేయబడే గడ్డివామిలు, హరించి వేయబడే హరిత వనాలు... చివరికి నిర్దాక్షిణ్యంగా తీయబడే ప్రాణాలూ కథాంశంగా కలిగిన గొప్ప ప్రేమకథ ఇది. అవసరం అయిన చోట మాత్రమే, తగిన మోతాదులోనే ప్రాంతీయ మాండలికాన్ని ఉపయోగించి కథను నడిపించిన తీరు అద్భుతం. ఈ కథ కథానాయిక వర్ణనతో ప్రారంభమవుతుంది.

... బాణావరం కోటకొమ్మంచుల చీర సింగారించుకొంది. నుదిటిపై చెందిరపుబొట్టు. గంగిరేణి పూవు కైసేసిన జట్టు అందాన్ని అందిస్తూ ఉన్నవి. పెసులు కాయల్లాంటి పలుచని పెదాలు, నాణెమైన నాసిక, జిలిబిలి చూపులు, విరిసిన ఇంద్రచాపంలా చిరుదరహాసం... ఎవరో ఈ చిన్నది? మిన్నున మెరిసిన మెరుపు చెమక్కు. ఆ జాతరలో, కోలాహలంలో, బలిపీఠానికి సమీపంగా రూపుదాల్చిన సౌందర్య రసజగత్తులా నిలుచుకొని ఉంది...

ఆ పడతి వర్ణనలాగే పల్లె ప్రజల జీవనానికి ప్రతిబింబంలా సాగే ఈ కథలో అమిత సౌందర్యరాశి అయిన నాయిక, బలాఢ్యుడయిన నాయకుడు ఒకరికొకరు సమ ఉజ్జీలుగా భావించుకుని ఒకర్నొకరు ఇష్టపడ్తారు. ఆపై ప్రేమించుకుని పెద్దల మూర్ఖత్వానికి, అనాగరికతకు హృదయ విదారకంగా అంతం అయిపోతారు. ఈ విషాదాంత కథ ఆనాటి పాఠకుల మనసులలో చెరగని ముద్ర వేసింది. ఆంధ్రప్రభ తొలి పర్యాయం నిర్వహించిన కథల పోటీలో ప్రథమ బహుమతిని, పలు ప్రశంశలను పొందింది. ఈ కథ శీర్షికతోటే ఒక కథా సంపుటిని తీసుకువచ్చారు వేణుగారు. ఒక పక్షపత్రికను గూడా చాలా కాలం నిర్వహించారు.

దాదాపు ఏభయియేళ్ళ క్రితమే తరచు కరువుల బారిన పడే రాయలసీమ రైతుల వెతల్ని కథలుగా వెలువరించిన కథకులలో వేణుగారు ముఖ్యులు. వారి లేఖిని నుండీ వెలువడిన 'వానొచ్చె గంగు' లాంటి కథలు అందుకు తార్కాణంగా నిలుస్తాయి.

విభిన్న కథాంశాలతో కథలు, వైవిధ్యభరితమైన గేయాలు, లోతయిన కవితలు, ప్రజారంజక నాటకాలు, ఆలోచింపచేసే వ్యాసాలు వెలువరించి చిత్తూరు జిల్లా ఖ్యాతిని రాష్ట్ర వ్యాపితం చేయడానికి ప్రయత్నించిన వేణుగారి రచనలలో మరో ముఖ్యగ్రంథం 'తెలుగు పలుకుల వేల్పుగిడ్డి... సురవరం ప్రతాపరెడ్డి". బహు గ్రంథకర్త, తెలుగుభాష ప్రచారోద్యమ సారథి, తెలుగు సంస్కృతి వికాసానికి నిరంతరం కృషి చేసిన కృషీవలుడు, చరిత్రకారుడు శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారి జీవిత విశేషాలతో ఈ గ్రంథాన్ని పరిపుష్టంచేశారు వేణుగారు.

ఇంకా 'ఆదర్శ అధ్యాపకుడు కొండా మునిరెడ్డి' అను గ్రంథం, 'అక్షర భిక్ష' అను పిల్లల కథలు, బాపూజీ దండకం, బాలభటుడు గేయాలు మొదలైన వీరి పుస్తకాలను ప్రముఖంగా ప్రస్తావించుకోవచ్చును. చిత్తూరు జిల్లా రచయితల సంఘం ప్రచురించిన కథా, గేయ సంకలనాలలో కూడా వీరి కథలు, గేయాలు చోటు చేసుకున్నవి. వీరి నాటకాలలో కాలచక్రం, బడిపంతులు మొదలైన వాటిని గూర్చి చెప్పుకోవచ్చును.

"జుట్టు పండిపోవచ్చు... గెడ్డం నెరిసిపోవచ్చు... కానీ కవి నిత్యయవ్వనుడు" అంటారు రవీంద్రనాథ్ ఠాకూర్. నిజమే మరి... ఎనభయి ఎనిమిదేళ్ళు దాటిపోతున్న దశలో వేణుగారు వ్రాసిన 'రమణీయ జానపద గేయాలు' అన్న జానపద సాహిత్య వ్యాసం జనవరి 2012 'మిసిమి' మాసపత్రికలో ప్రచురింపబడి వారి కలం ఒరవడిని మళ్ళీ నూతనంగా ఎత్తి చూపింది.

జానపదుల రసనాదాలలో జీవం పోసుకుని, కాలప్రవాహపు ఆటుపోట్లను తట్టుకుంటూ, మన సాంఘికాచారాలను, సంస్కృతిని గ్రామీణ జనజీవన గతిని తమలో నిక్షిప్తపరచుకుని, పల్లెటూరి పసిడి భోషాణాలలో పదిలపరచబడి వున్న జానపద కవితలను గూర్చి విలోవరిగా, రసకందాయకంగా వివరిస్తూ వ్రాయబడిన వ్యాసమిది. జానపద కవుల హృదయాలను ఈ వ్యాసంలో దృశ్యమానం చేసిన తీరు విలక్షణం!

అదేవిధంగా 2012 జనవరిలోనే 'ఆశ' మాసపత్రికలో ప్రచురితమైన వీరి కథానిక 'రెడ్డెప్ప తీర్పు' ఎన్నదగినది.

అమాయకులు అన్యాయంగా బలయిపోకుండా తెలివైన, న్యాయమైన, ప్రజారంజకమైన తీర్పును అందించిన ఒక గ్రామ రాజకీయాధికారి కథ 'రెడ్డెప్ప తీర్పు'! ప్రస్తుతం రగులుతున్న అగ్నిపర్వతంలా, అధర్మ గోపురంలా కన్పిస్తున్న మన సంఘానికి ప్రతీకగా – ఓ చిన్న గ్రామంలో ఘటనను చూపుతూ... న్యాయస్థానాలు ఎలావుండాలో, సమాజంలో ఎలాంటి మార్పులు రావాలో అతి సూక్ష్మంగా చెప్పారు రచయిత ఈ కథానికలో. బెంగుళూరులో కుమారుని ఇంట కొద్ది రోజుల క్రిందటే ఎనభయి ఎనిమిదవ పుట్టిన రోజు వేడుకను జరుపుకున్న వీరు ఈ రోజులలో విలువైన రచనలందివ్వడం ముదావహం. వీరి వణికే చేతులకు, సడలిపోని వీరి కలం బలానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాడు ఈ వ్యాసకర్త.

పాఠకులముందు తమ హృదయాన్ని పరుస్తూ ఇటీవల వీరు వెలువరించిన అపూర్వ అద్భుత గ్రంథం 'మల్లెలు తూరుపెత్తిన వేళ'.

శతవసంతాలూ వారి అక్షర తూణీరం నుండి పుంఖాను పుంఖాలుగా రచనలు వెలువడాలని ఆశిద్దాం. వేణుగారి రచనలకు ఆదినుండి ప్రేరణ వారి శ్రీమతి జయలక్ష్మిగారు. వ్యాసకర్త హృయాభినందనలు వారికి గూడా.

**శ్రీ వేణుగారి చిరునామా :**

**C. VENU GOPAL REDDY**

19, 'Ceekalas'

H.S.R. 2nd Sector

Garden Layout

Parangl palya

**Bangalore - 560102**

Ph : 080 – 26849819

## చిరు కొలనులా గోచరించే సదానందగారి సాహిత్యం ఒక అగాథ సాహితీ సాగర సామ్రాజ్యం



ప్రపంచంలో ప్రతి మనిషి జీవితమూ వడ్డించిన విస్తరి అయిపోదు. కొందరి జీవితాలయితే బాల్యం నుండీ కూడా ఎంతో సంక్లిష్టంగా సాగడం కూడా తరచు దృశ్యమానమవుతుంటుంది. అనేక కష్టనష్టాలతో, పేదరికం నిండిన ఆర్థిక ఇబ్బందులతో, శారీరక శ్రమతో, బాధలతో, మానసిక ఒత్తిడులతో, హృదయవేదనలతో క్షణమొక యుగంలా అతిభారమైన జీవితాలు గడిపే వారిలోంచీ అక్కడక్కడ, అప్పుడప్పుడు ఒక మహానుభావుడు నిటారుగా నిలబడి దినదిన గండంలాంటి నిరంతర జీవన సంగ్రామంతో పోరాడుతూనే క్రమ క్రమంగా మహోన్నతుడుగా ఎదిగి సమాజానికి ఒక ఆభరణంలా ప్రకాశించడం జరుగుతుంటుంది. అలా స్వయంకృషితో ఎదిగి సంఘంలో ఒక మేలి ఆభరణంలా ప్రకాశిస్తూ, సమాజానికి ఏది అవసరమో, శ్రేయస్కరమో దానిని మాత్రమే వ్రాస్తూ తెలుగు సాహితీ లోకంలో ఒక ధృవతారగా వెలుగొందిన, వెలుగొందుతున్న మహామనీషి మాన్యశ్రీ కలువకొలను సదానంద.

కలువకొలను సదానంద గారి జననం 22-2-1939 చిత్తూరు జిల్లా పాకాలలో జరిగింది. శ్రీమతి నాగమ్మ, శ్రీ కృష్ణయ్య అను పుణ్యదంపతులు వీరి తలిదండ్రులు. దురదృష్టవశాత్తు సదానందగారి పెద్దలకు బాధ్యతల పట్ల శ్రద్ధ, ప్రేమ లేకపోవడం వల్ల చాల చిన్నవయసునుండే ఆయన ఓ అనాథలా జీవితాన్ని గడపాల్సివచ్చింది. అప్పుడప్పుడు ఆకలితోనూ, ఎక్కువ కాలం ఆసరాలేని వంటరితనంతోనూ కాలం వెలిబుచ్చాల్సి వచ్చింది. అలా నిరాశామయమైన జీవితం గడుపుతున్న రోజులలో వీరు కొద్దికాలం విద్యుత్‌శాఖలో రోజువారీ కూలీగా పనిచేశారు. తరువాత బ్రాకెట్ కంపెనీలలో కూడా పనిచేశారు. పని లభ్యంకాని రోజులలో పేకాట ఆడుతూ క్లబ్బులలో గడిపి కడుపు నింపుకోవడానికి జీవితంతో పందెం కాశారు. భారత్ సేవక్ సమాజ్, ఎన్.ఎస్.ఎస్. క్యాపులు, ఇలా ఎన్నింటిలోనో కాలం నెట్టుకు వచ్చారు. ఓ విషాదభరిత నవలలా సాగిన అప్పటి వీరి జీవనయానంలో... సమాజంలో అట్టడుగు వర్గాలకు చెందిన కూలీలు, భిక్షకులు, దొంగలు, జూదరులు, రౌడీలు, త్రాగుబోతులు, వేశ్యలు

మొదలైన వారెందరితోనో వీరికి పరిచయాలు, స్నేహాలు ఏర్పడ్డాయి. అందువల్ల సాంఘిక, సామాజిక, దేశ, కాల పరిస్థితులపట్ల అవగాహన, ఆలోచన పెంపొందింపజేసుకోవడానికి, అపారమైన జీవితానుభవాన్ని గడించడానికి అవకాశం లభ్యమైంది. సరిగ్గా ఆ ఫేజులోనే ఒక మలుపులా జీవితం పట్ల ఆశలను, ఆకాంక్షలను రేకెత్తించ గలిగింది సాహిత్యం. ఆ తరువాతి క్రమంలో సాహిత్యమే జీవితం అయిపోయింది సదానంద గారికి.

వీరి విద్యా విషయానికి వస్తే... మూగవాడు అమ్మా అన్న చందంగా స్వయంకృషితో పాకాలబోర్డు ఎలిమెంటరీ పాఠశాలలో ప్రాథమిక విద్య, జిల్లా బోర్డు హైస్కూల్లో హైస్కూలు విద్య ముగించారు. ఎస్.ఎస్.ఎల్.సి. తదుపరి దారి కన్పించని బాటసారిలా తయారయిన వారి స్థితి కొంత కాలం పాటు దారితప్పి పోవడమే కాదు... దారి చూపే పటాన్ని కూడా పోగొట్టుకున్న మనిషి పరిస్థితిలా మారిపోయింది. తల్లిదండ్రులు, అన్న, బంధువులు... అందరూ వుండికూడా దిక్కులేని జీవితం అయిపోవడం వల్ల రోజులు గడవడం గగనమైపోయింది.

చివరికి ఎలాగో తిరుపతి దగ్గరి అలివేలు మంగాపురంలో ఉండిన టీచర్సు స్కూలు లీవింగ్ సర్టిఫికేట్ ఎమర్జన్సీ కోర్సులో టీచరు ట్రైనింగ్ పొందడానికి సదానందగారికి అవకాశం లభ్యమైంది. అయినా ట్రైనింగ్ తాలూకు మూడు సంవత్సరాలూ అదఃపాతాళపు అంచులలో నడక అయిపోయింది వారి జీవితం. ఎన్నో సమస్యల మధ్యన సదానందగారు అనేక పోటీలలో పాల్గొని బహుమతులు పొందుతూ వచ్చారు. అదృష్టవశాత్తు వారికి అభ్యమైన బహుమతులలో ఎక్కువ భాగం సాహిత్యానికి సంబంధించిన మంచి గ్రంథాలవడం వల్ల పఠనాసక్తిని పెంచి, సాహిత్యం పట్ల అభిరుచిని పెంచి పెద్దచేస్తూ వారి జీవితాన్ని ఓ మంచి మలుపుకు తిప్పగలిగాయి. అందువల్ల అర్థం పర్థం లేని వృథాభరిత బ్రతుకుగా సాగుతున్న వారి జీవితానికి సాహిత్యమే ఊపిరీ, మార్గమూ అయి ఒక దాపుగా నిలబడగా, పత్రికా రచన ఊతమయి నిలచింది!

బాపు చిత్రాలపట్ల చిన్నతనం నుండీనే ఆకర్షితులయి ఉండిన సదానందగారు ఆ స్పందనతో కార్టూన్లు, చిత్రాలు గీయడం మొదలు పెట్టారు. బాలల గేయాలు, చిన్న పిల్లల కథలతో వీరి కలం కదలిక కూడా మొదలయింది. ఆపై తరచుగా వీరి కార్టూన్లు, గేయాలు, బాలల కథలు పత్రికలలో కన్పించడం మొదలుపెట్టాయి. ఆపై అచిరకాలములోనే ఊపందుకున్నాయి.

ఎట్టకేలకు 1959-60వ సంవత్సరంలో ట్రైనింగ్ ముగించుకుని టీచర్సు స్కూలు లీవింగ్ సర్టిఫికేట్ పొందిన వీరు తేది 15-7-1961న గానుగపెంట సమితి ఎలిమెంటరీ పాఠశాలలో ఉపాధ్యాయులుగా కాలుమోపి నెలకు 74 రూపాయల జీతంతో స్వేచ్ఛా జీవనాన్ని ప్రారంభించారు.

పగలు వృత్తి బాధ్యతలు నిర్వహిస్తూ, రాత్రులందు సాహితీ కృషిని కొనసాగిస్తూ కవిగా, కథకునిగా, నవలాకారునిగా, చిత్రకారునిగా, నాటకకర్తగా అచిరకాలంలోనే మంచి గుర్తింపు పొందగలిగారు.

నీతి, నిజాయతీ, క్రమశిక్షణ, సత్ప్రవర్తనలు వీరి సిద్ధాంతానికి మూలస్థంభాలు. ఈ సిద్ధాంతంతో జీవితంలో పలుమార్లు పరాజయాలు పొందినప్పటికీ విశ్వాసం సడలనివ్వని, మడమ తిప్పని యోధుడు ఆయన. ఉద్యోగ జీవితానికి సంబంధించి విధి నిర్వహణలో కానీ, రచయితగా తమ సామాజిక బాధ్యతలలో కానీ వారు తమ సిద్ధాంతానికి ఎప్పుడూ, ఎక్కడా దూరం కాకుండా ఉత్తమోత్తమ జీవితాన్ని గడిపారు.

1956 నుండీ 1958 వరకూ బాలల కథలు, గేయాలతో పాఠకులకు పరిచయం అయిన వీరు వ్రాసిన మొట్టమొదటి సాంఘిక కథ 'రచన'. 1958 ఆంధ్రప్రభ సంక్రాంతి ప్రత్యేక సంచికలో ఈ కథ వెలుగు చూసింది. ఆపై తెలుగు స్వతంత్ర, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, భారతి, చిత్రగుప్త, ఆనందవాణి, చందమామ, బాలజ్యోతి, సైనిక సమాచార్ మొదలైన పత్రికలన్నింటిలో వీరి సాహితీ ప్రస్థానం వేగంగా కొనసాగింది. ఆ రోజులలో వెలువడుతుండిన పిల్లల పత్రికలన్నింటిలో వీరి రచనలు ప్రచురింపబడేవి. భారతిలో వరుసగా వీరి సీరియల్స్ రెండు వెలువడడంతో రచయితగా వీరి గుర్తింపు తారాస్థాయికి చేరింది.

1963 నవంబరు, డిసెంబరు నెలలలో వీరు వ్రాసిన పిల్లల నవల 'బంగారు నడచిన బాట' 1964-65 మధ్య ఆంధ్రపత్రికలో సీరియల్‌గా వెలువడింది. నిజానికి ఇది పిల్లల నవల కాదు! పెద్దల కోసం, మేధావుల కోసం కూడా వ్రాయబడ్డ నవల!!

అరణ్యంలో మంచితనానికి, మృగత్వానికి మధ్యన నడిచే సంఘర్షణ నవలాంశం. సాంఘిక, ఆటవిక జీవనాల మధ్యన కదిలే న్యాయాన్యాయ విచక్షణను విలక్షణంగా చూపిన నేర్పు అద్భుతం. ఇందులోని ముఖ్య పాత్రలు:

ఒక మనిషి, నాలుగు కుక్కలు, కొన్ని అడవి జంతువులు!! అద్భుతమైన అంతరార్థ కథనంతో సాగే ఈ నవల చివరగా...

"నువ్వు దుర్మార్గానికి గురైనప్పుడు ఆత్మరక్షణ చేసుకోవడం నీ తక్షణ కర్తవ్యం! ఆత్మరక్షణకు ఉపకరించే ప్రతి పనినీ పాటించు. ఆత్మరక్షణకు అడ్డంకిగా నిలబడే ఏ నీతినైనా సరే, ఏరి అవతల పారవేయి! అదే నీ క్షేమానికి బంగారు బాట!" అన్న సందేశాన్ని అందిస్తుంది. దురదృష్ట వశాత్తు నేటికీ ఈ సందేశాన్ని గ్రహించలేని, గ్రహించినా ఆచరించలేని కోట్లాది మంది నిర్భాగ్యులతో, లక్షలాది మంది పాలకులతో నిండి వుంది ఈ దేశం!

ఈ ఉత్తమ గ్రంథాన్ని 1965లో పద్మశ్రీ అండ్ కో, చిత్తూరు వారు రెండువేల కాపీలు ముద్రించగా, 1966లో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ వారి ద్వారా ఉత్తమ బాల సాహిత్య గ్రంథ పురస్కారం పొందింది. దాదాపు నలభై మూడేండ్ల తరువాత కడప పేన్నేటి పబ్లికేషన్సు వారు ఈ నవలను పునర్ముద్రణ గావించారు.

సదానందగారి మరో పిల్లల నవల 'అడవి తల్లి'.

1985 – 86 మధ్యకాలంలో ఆంధ్రపత్రిక వారి 'బాలరంజని' మాసపత్రికలో సీరియల్‌గా వెలువడింది. 2007 సంవత్సరంలో మొదటి ముద్రణ పొందిన ఈ గ్రంథానికి 2010వ సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ వారి ఉత్తమ గ్రంథ పురస్కారం లభ్యమైంది.

'అడవి తల్లి' నవలకు మూలం భారత, రామాయణ గాథలకు మునుపటి రోజులలో పుట్టిన ఒక జానపద కథ.

'జీవారణ్యం' అనే పెద్ద అడవిలో ఐకమత్యమూ, ఉమ్మడి నాయకత్వమూ లేకుండా నివసించే అనేక అటవిక జాతుల తాలూకు అనాగరికపు మనుషుల జీవనయానం ఈ నవలకు ఎత్తుగడ. అడవికూనల ఆటపాటల, చిన్నచిన్న దండయాత్రల మధ్యన అడవితల్లి ఒడిలో, ప్రకృతి పాఠాలతో కాపవ్యుడనే అడవి బిడ్డ ఎదుగుదల నడక, కాలక్రమాన కాపవ్యుడు అసుర సంహారంతో వీరుడుగా గుర్తింపు పొంది ఆటవికులకు ధర్మాధర్మ విచక్షణను బోధిస్తూ సదాచారాలను అలవాటు చేసి, స్త్రీలకు మానరక్షణ ఏర్పరచి, తన ప్రాంతపు అడవి తాలూకు వన సంపదను పరిరక్షిస్తూ ఉపయోగంలోకి తెచ్చుకుని, తన పరిధిలోని వారిని నాగరికత వైపు మళ్లించడం ఒక ముఖ్యాంశం.

అదే అడవిలో మరొక ప్రాంతంలో ఉన్న ఇంకో ఆటవిక తెగవారు తమ కాళ్ళు తాము నరుక్కున్నట్లుగా అడవిలోని చెట్లన్నింటినీ నరికి వేసి, వన్య

ప్రాణులనూ, పశువులనూ, ప్రకృతి వనరులనూ దాదాపు పూర్తిగా కోల్పోయి వెండి బంగారాలు, రత్నరాసులు, సువర్ణటంకాలు చేర్చుకోగలుగుతారు. అయితే తినడానికి తిండి గింజలు, త్రాగడానికి నీళ్ళూ, ప్రకృతి ప్రశాంతతా కరువయి పోతాయి క్రమంగా.

నేడు భారతదేశ సామాజిక స్థితి నిజంగా ఈ దశవైపు పురోగమిస్తోంది.

పై రెండు తెగల మధ్య జరిగే ఘటనల ద్వారా సదానందగారు అందించిన సందేశం అమూల్యమైనది. ఈ నవల కూడా బాలబాలికలకే కాదు పెద్దలకు, మేధావులకు కూడా సమాజహితకరమైన చక్కటి ఆలోచనలను అందించగలిగింది.

సదానందగారు బాల బాలికలకు అందించిన గ్రంథాలలో ఆణిముత్య మనదగ్గ గ్రంథం "శివానందలహరి"

దాదాపు ముప్పయి ఎనిమిది సంవత్సరాల క్రితం తమచే సత్కథలుగా పరిష్కరింపబడి వివిధ పత్రికలలో ప్రచురితమైన ముప్పయి ఒక్క పౌరాణిక గాథలను కూర్చి, బాపుగారి పంచరంగుల ముఖచిత్రంతో, తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహకారంతో 1983 ఆగష్టు మాసంలో వెలువరించిన గ్రంథమిది.

రామాయణ, భారత, భాగవతాలతో పాటుగా తప్పక పిల్లలకు చదివి విన్పించవలసిన అపూర్వ, అమూల్య, అద్భుత గ్రంథమిది. బాలబాలికల మానసిక వికాసానికి, క్రమశిక్షణకు, భక్తిభావాల పెంపుదలకు పునాదులు వెయ్యగల గ్రంథం అయినందున ప్రతి ఇంటా భగవద్గీత వలె పూజా మందిరంలో ఉంచుకోదగ్గ గ్రంథమిది.

శివానందలహరి గ్రంథం సదానందగారి తండ్రికి అంకిత మివ్వబడింది.

ఇక వీరి సాంఘిక నవలల విషయానికి వస్తే ప్రతి నవలా కాలానికి నిలిచేదే! విభిన్న కోణాలతో సామాజిక దర్శనాన్ని గావించేదే!!

అన్నింటిలో ఎన్నదగిన నవల 'గందరగోళం'. దిగువ మధ్యతరగతి, అట్టడుగు వర్గాల మనుష్యుల జీవితాలలోని సాధక బాధకాలను, విషాదాలను, అస్వతంత్రాన్ని, దోపిడిని నగ్న వాస్తవికతతో దృశ్యమానం చేసిన విశిష్ట నవల ఇది. "ఈ ప్రపంచంలో దారుణంగా దోపిడికి గురవుతున్నది స్త్రీ" అన్న లెనిన్ మాటని అత్యంత హృద్యమంగా నవలలోని సంఘటనలలో కళ్ళకు కట్టించారు సదానంద. ఈ నవలకు చాల విలువైన పీఠిక వ్రాశారు కొడవటిగంటి కుటుంబరావు గారు. ఈ సమాజం, ఈ దేశం ఏం కాబోతోంది? అని నిలదీసి

ప్రశ్నించే నవల ‘గందరగోళం’. ప్రఖ్యాత అనువాదకులు సహవాసి మొదలైన వారు పరిశోధించి “వందేళ్ళ నవలా సాహిత్యంలో ఎనభై ఉత్తమ నవలలు” అంటూ నిర్ణయించిన పట్టికలో స్థానం పొందిన నవల ఇది.

వీరి ‘బంగారుమామ’ నవల ‘బంగారు బావ’ చలనచిత్రంగా నిర్మితమైంది.

పది పిల్లల నవలలు, ఏడు సాంఘిక నవలలు, ఒక కవితా సంపుటి, ఏడు కథా సంపుటాలు వెలువరించిన సదానందగారి లేఖిని నుండీ శక్తివంతమూ, వైవిధ్యభరితమూ అయిన కథలు వందలాదిగా వెలువడ్డాయి. వీరి ‘నవ్వే పెదవులు – ఏడ్చే కళ్ళు’ కథా సంపుటికి 1976వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభ్యమైంది. ఆంధ్రజ్యోతి దినపత్రిక వారు వందమంది సాహితీవేత్తల సహకారం అర్థించి, వారిలో నలభై నాలుగు మంది అభిప్రాయాల ననుసరించి జనవరి 2000లో వెలువరించిన ‘తెలుగు కథా సాహిత్యంలో వంద ఆణిముత్యాలు’ పట్టికలో వీరి కథ ‘తాత దిగిపోయిన బండి’ చోటుచేసుకుంది.

వీరి కథలలో కొన్నింటినయినా అలా పరామరిస్తే...

**ఉప్పులేని కూడు :** యవ్వనవతి, రూపవతి, సర్వాభరణ భూషిత, సర్వాలంకార శోభిత అయిన స్త్రీ నడి నిశిరాత్రి నగర వీధులలో అయినా కాలిబాటలలో అయినా నిర్భయంగా నడవ గలిగిన నాడే నిజమైన స్వాతంత్ర్యం అన్నాడు గాంధీజీ. ఆయన్నలా పంపెయ్యగానే “ఆడదానికి, అందునా అందమైన దానికి అర్ధరాత్రి వీధులూ, కాలిదార్లూ, పట్టి తిరిగే పనేమిటి”? అన్నారు ఆనక వచ్చిన వాళ్ళు!! అంతటితో ఆగారా? “ఎ క్లాసు నుండీ జడ్ క్లాసు” వరకూ వ్యభిచార గృహాలను ప్రోత్సహిస్తూ ‘స్త్రీ’కి కావాల్సినంత స్వేచ్ఛనివ్వడానికి ప్రయత్నించారు. మరికొంత మంది ఔత్సాహికులు వేశ్యావృత్తిని చట్టబద్ధం చేసేయాలంటూ నొక్కి వక్కాణిస్తున్నారు.

ఓ చిన్నగ్రామంలో వ్యభిచార గృహాన్ని పెట్టి పోషిస్తూ లబ్దిపొందే ఓ ఛోటానాయకుడి కథ ఉప్పులేని కూడు.

అట్టడుగు వర్గంలోని మనిషి సైతం అసహ్యించుకునే అధికృత మనిషి కథ వ్రాయబడి ముప్ఫై సంవత్సరాలు గడచిపోయాక కూడా నేటికీ నిత్యనూతనంగా వుంది. ఎందుకంటే పరిస్థితులలో మార్పులేదు ఇప్పటికీ!!

**వికృతవాణి :** అనుమానం ప్రాణసంకటం అన్నారు పెద్దలు. నిరాశా నిస్పృహలను ఎక్కువగా అనుభవిస్తున్న వారిలో అయితే ఈ అనుమాన పిశాచాలు మరింత ఎక్కువగా పట్టి పీడిస్తుంటాయి.

అనుక్షణం, అడుగడుగునా అనుమానాలతో భయాలతో కాలం గడిపిన ఓ నష్టజాతకుడి కథ వికృతవాణి. మనిషి యొక్క మానసిక క్లేశాల తాలూకు భయాలు, ఆలోచనలు ఎలా వుంటాయో చూపే కథ. పేదవాడి లేదా దిగువ మధ్యతరగతి జీవనానికి సంబంధించిన చక్కటి ఎత్తుగడతో ప్రారంభమయ్యే ఈ కథ ముగింపు వరకూ పాఠకుడ్ని తనవెంట శరవేగంగా లాక్కుపోతుంది. అవసరం అయిన చోట మాత్రమే మాండలికం ఉపయోగింప బడడం ఈ కథకెంతో వన్నె తెచ్చింది.

**రక్తయజ్ఞం :** అసారేఖలు సంసారే
సారం శ్వ సుర మందిరం
హిమాలయే హర శ్శేతే
హరిశ్శేతే మహోదధౌ॥

"సంసారం నిస్సారమైనదైనా మామగారిల్లు సారవంతమైనదనీ అందుకే విష్ణుమూర్తి మామగారి స్థానమైన పాలసముద్రమందూ, శివుడు హిమాలయా పర్వతమందు నివసిస్తున్నారు" అంటూ పై ఆర్యశ్లోకం వివరిస్తున్నది. సారవంతం మాట ఏమిటో కానీ ఇల్లరికంలోని సాధక బాధకాలు మాత్రం అనుభవించే వారికే తెలుస్తాయి. వారి అంతర్గత ఆలోచనలూ, భావాలనూ గూర్చి తమదైన వ్యంగ్య వైభవంతో కూడిన అద్భుతమైన కథన పద్ధతితో సదానందగారు చెప్పిన కథ రక్తయజ్ఞం.

చక్కటి చదివించే గుణంతో కూడిన శైలి, "జగత్పావనియైన క్షీరసాగర తనయ (డబ్బు)" లాంటి చిక్కటి పదప్రయోగాలతో కూడిన శిల్పం, ఏ కాస్త గందరగోళం అయినా కన్పించని సజావయిన నడకతో కూడిన ఈ కథ అలనాటి నల్లుల సామ్రాజ్యాలలో బాధింపబడే జీవితాలను చూపుతుంది.

వ్రాయబడి దాదాపు ఏభయి సంవత్సరాలు గడచిపోయినా నేటికీ నూతనంగా ఉంది ఈ కథ.

విశాలాంధ్రవారు, విశ్వప్రభ పబ్లిషింగ్‌వారు, పెన్నేటి పబ్లికేషన్స్ వారు, సదానందగారు స్వయంగానూ ప్రచురించిన పాతిక వరకూ గ్రంథాలలో కొన్ని అందుబాటులో లేకపోవడం విచారించదగ్గ విషయం. ఏ సాహితీ సంస్థ అయినా పూనుకుని "సదానందగారి సాహితీ సర్వస్వం"ను వెలుగులోకి తీసుకురాగలిగితే ఆంధ్ర పాఠకలోకానికి, సమాజానికి, భావితరాలకు ఎంతో మేలు చేసిన వారవుతారు.

సదానందగారి జీవితంలో కొన్ని అమృతానంద తరంగాలూ ఉన్నాయి. వాటిలో అతి ముఖ్యమైనది తేది 20-10-1961 నాడు శ్రీమతి కస్తూరీబాయి గారితో జరిగిన వీరి వివాహం. వారి వైవాహిక జీవితం సదానందగారికి వెలుగురేఖలను ప్రసాదించినా వారి సిద్ధాంతం ఆర్థిక ప్రగతి సాధించడానికి అవరోధంగానే ఉండిపోయింది. నిజాయతీ కలిగిన రచయితగానే నడచిన వారికి నిరంతర జీవన సంగ్రామం తప్పలేదు. ముగ్గురు కుమారులను, కుమార్తెను చదివించి వివాహాలు చెయ్యడంలో గృహస్థ ధర్మాలను చక్కగానే నిర్వర్థించ గలిగారు కానీ వీరికి నేటికీ స్వగృహం లేదు! పాకాలలో నలభయి అద్దె ఇండ్లు మార్చిన ఘనత ఈ నిజాయతీపరుడైన, 1990వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండీ సాహితీ పరమైన పెక్కు అవార్డులుపొందిన ఈ పెన్షన్‌దారునికే చెందుతుంది.

సాహిత్యంలో కూడా ఏర్పడిపోయిన గ్రూపు రాజకీయాలు, హిపోక్రసీ మొదలైె వాటిని జీర్ణించుకోలేకపోయిన సదానందగారు పిల్లల కోసం మాత్రమే వ్రాస్తున్నారు ప్రస్తుతం.

బెంగుళూరు 'చర్చ' వారు 'చర్చ-2012' పురస్కారాన్ని ఈ నిరంతర కృషీవలునికి 15-4-2012 నాడు తిరుపతిలో అందజెయ్యడం సాహిత్యాభి మానులందరూ ఆనందించ దగ్గ విషయం.

ఇటీవలికాలంలో దురదృష్టవశాత్తు సదానందగారు తమ రెండుకళ్ళ చూపునూ పూర్తిగా కోల్పోయారు. "తినగా తినగా విషంకూడా అమృతంలా తియ్యగా అలవాటైనట్లుగా చూపు లేకపోవడం బాగా అలవాటయిపోయి హాయిగావున్నాను!" అని నవ్వుతూ చెప్పే ఈ స్థితప్రజ్ఞుడైన డెబ్బయి అయిదేళ్ళ సరస్వతీ పుత్రునికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాడు ఈ వ్యాసకర్త.

**చిరునామా :**

**కలువకొలను సదానంద**

భారతం మిట్ట

**పాకాల - 517 112**

ఫోన్ : 08585 - 222 723

## మానవీయ విలువలకు పట్టం కడ్తూ, సమాజానికి సందేశాలనందిస్తూ సరళమైన భాషతో, సాఫీగా సాగే రాచపూటి రమేష్ కథలు



సరళమైన భాషను ఉపయోగిస్తూ, మానవీయ విలువలకు ప్రాధాన్యత నిస్తూ, వేగవంతమైన, ఉత్కంఠ పూరితమైన నడకతో వైవిధ్య భరితమైన, సామాజిక విలువలతో కూడిన కథలనందిస్తున్న కథకుడు శ్రీ రాచపూటి రమేష్. వృత్తిరీత్యా ప్రస్తుతం ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ చేనేత – జౌళి శాఖలో సహాయ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న వీరు గతంలో కొంతకాలం ఇండియన్ నేవీలో డిఫెన్స్ అకౌంట్సు ఆడిటర్‌గా కూడా పనిచేశారు.

దాదాపు పాతికేళ్ళ క్రితం సాహితీ సృజనకు శ్రీకారం చుట్టిన రాచపూటి రమేష్‌గారు మొదట్లో ఐదారు సంవత్సరాల పాటు తెలుగు నుండీ ఆంగ్లంలోకి, ఆంగ్లం నుండీ తెలుగులోకి అనువాదాలు చేశారు. తదుపరి కథలు వ్రాయడం ప్రారంభించారు. కీర్తి కండూతి లేని రచయితలలో ఒకరుగా ఆశాజనకంగా కన్పిస్తున్న రమేష్‌గారి జననం చిత్తూరు జిల్లాలో పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో 27–6–1967 నాడు జరిగింది. శ్రీ రాచపూటి సుబ్బారావు, శ్రీమతి పద్మావతమ్మ అను పుణ్యదంపతులు వీరి జననీ జనకులు.

రాచపూటి సుబ్బారావుగారు వృత్తిరీత్యా న్యాయవాది. పద్మావతమ్మగారు ఆ కాలంలోనే బి.ఎ. డిగ్రీ పొందిన వారయినా గృహానికే పరిమితమయ్యారు. పద్మావతమ్మగారి చిన్నాన్నగారు మైనంపాటి సుబ్రహ్మణ్యంగారు (కడప జిల్లా రైల్వేకోడూరు మండలం, బుడుగుంటపల్లెకు చెందినవారు) గొప్ప సంస్కృతాంధ్ర పండితులు. సి.పి. బ్రౌన్ వర్ణచిత్రాన్ని చిత్రించిన చిత్రకారులు కూడా! వారు 'శ్రీకృష్ణతాండవం – గోపికా లాస్యం' లాంటి గ్రంథాలను వెలువరించినవారు. అంతేగాక ఆకులు చెప్పిన అరవై నాలుగు కథలు పేరిట సాంఘిక కథలను కూడా రచించినవారు. వీరి ప్రభావం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రాచపూటి రమేష్‌గారి మీద కొంతవరకూ ఉందని చెప్పవచ్చు. ఇహపోతే రాచపూటి రమేష్ గారి జీవిత భాగస్వామి శ్రీమతి వేదాల చంద్రవదన. కడప జిల్లా జమ్ములమడుగుకు చెందిన వీరు ప్రస్తుతం అడ్వకేటుగా, సైకాలజిస్టుగా వృత్తిబాధ్యతలు నిర్వహిస్తున్నారు.

తిరుపతి యస్.వి.యు. క్యాంపస్ స్కూలులో పదవ తరగతి వరకూ రమేష్‌గారి విద్యాభ్యాసం జరిగింది. ఎస్.వి. జూనియర్ కాలేజిలో ఇంటర్,

ఎస్.వి. ఆర్ట్స్ కాలేజ్‌లో బి.కామ్. పూర్తయిన పిదప దూరవిద్య ద్వారా శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ నుండీ ఆంగ్లంలో ఎం.ఎ. (లిట్) పట్టా పొందారు. తరువాత నెల్లూరు వి.ఆర్. లా కాలేజిలో చేరి బి.ఎల్. పట్టా పొందారు. ఆపై హెచ్.డి.సి.ఎం., ఐ.ఆర్.పి.ఎం. మరియు యోగాలలో డిప్లమాలు పొందారు.

ప్రాథమిక విద్యాభ్యాస దశనుండీ కూడా వీరికి సాహిత్యం పట్ల ఎక్కువ మక్కువ. శ్రీయుతులు మధురాంతకం రాజారాం, మునిపల్లె రాజు, మల్లాది, డా॥ కేశవరెడ్డి, సలీం, నరేంద్ర, భ.రా.గో. మొదలైన వారి రచనలతో ప్రభావితం అయ్యారు. ఆంగ్ల రచయితలలో కూల్రిడ్జ్, వర్డ్స్‌వర్త్, ఆర్.కె. నారాయణ్, థామస్ హార్డీ, డబ్ల్యు.బి. ఈట్స్‌గార్ల రచనలు, షేక్స్‌పియర్ నాటకాలు సాహిత్యాభిలాషను పెంచి పెద్దచేశాయి. భమిడిపాటి రామగోపాలం (భ.రా.గో.) గారితో చాల సాన్నిహిత్యం వున్నది. వారు రాచపూటి రమేష్ గారిని ఒక ముఖ్యమిత్రుడుగా తమ ఆత్మకథలో ప్రస్తావించడం జరిగిందంటే ఇరువురి అనుబంధాన్ని ఊహించవచ్చు.

ఓ. హెన్రీ కథ మెమన్ అండ్ ది ఆర్చర్ ను తెలుగులోకి 'గెలుపు' పేరిట అనువదించడంతో 1989లో అనువాదకులుగా రాచపూటి రమేష్‌గారి సాహితీయానం మొదలయింది. 1994 ఆంధ్రప్రభ దీపావళి ప్రత్యేక సంచికలో 'జననీ జన్మభూమిశ్చ' అన్న రమేష్‌గారి కథ ప్రచురితమవడంతో తెలుగు కథకులుగా వీరి ప్రస్థానం ప్రారంభమైంది.

2002వ సంవత్సరం నుండీ వీరి కథల ఉధృతి పెరిగింది. అనేక పత్రికల నుండీ బహుమతులు లభ్యమవుతూ వచ్చాయి. చాలకథలు ఆకాశవాణి తిరుపతి, కడప కేంద్రాల నుండీ ప్రసారం అయ్యాయి. కొన్ని కథలు తమిళ, ఆంగ్ల భాషలలోనికి అనువదించబడ్డాయి. ఇప్పటి వరకూ దాదాపు 120 కథలు, దొంగలు బాబోయ్ దొంగలు!, అజ్ఞాతపర్వం అన్న రెండు నవలలు వీరి లేఖిని నుండి వెలువడ్డాయి. ప్రచురితమైన కథలలోంచీ కొన్నింటిని ఏర్చికూర్చి నాలుగు కథా సంపుటాలు వెలువరించారు.

1. గాలిగోపురం 2007 విడుదల.
2. అందమైన అబద్ధం 2008 విడుదల.
3. నిర్ణయం 2011 విడుదల.
4. వలయం 2013 విడుదల.

వియోగి (శ్రీ కోపల్లె విజయప్రసాద్) ఎ.వి.యం. (శ్రీ ఎ.వి. మోహన్‌గుప్త) గార్ల సహసంపాదకత్వంలో, సుప్రసిద్ధులైన కథకుల కథలతో రాచపూటి గారు రెండు కథా సంకలనాలను కూడా వెలువరించారు.

1. రమణీయ కథలు (39 కథల సంకలనం) 2007 విడుదల

2. మినీ కథా సౌరభం (145 కథల సంకలనం) 2009 విడుదల.

మినీ కథా సౌరభంలో సుప్రసిద్ధులు, లబ్ద ప్రతిష్టులు అయిన ముఖ్య రచయిత(త్రు)ల ఫోటోలు ప్రత్యేకంగా ప్రచురించబడ్డాయి. వందేళ్ళ తెలుగు కథకు సంబంధించిన వేదగిరి రాంబాబుగారి వ్యాసం మినీకథా సౌరభంలో చోటు చేసుకుంది. అంతేకాక ప్రచురితమైన 145 మినీ కథల తాలూకు రచయిత(త్రు)ల ఫోటోలు, చిరునామాలు కూడా ఫోను నెంబర్లతో కూడా ప్రచురింపబడడం ముదావహం. ఆ సంకలనంలో చెప్పుకోదగ్గ మరో విశేష మేమిటంటే చైనా దేశంలో, బీజింగ్ నగరంలోని సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో పదిలపరచబడివున్న ఓ చార్టు నమూనాను సేకరించి ముద్రించడం. పద్దెనిమిది పైబడి ముప్పై అయిదు సంవత్సరాలలోపు వయసున్న స్త్రీ గర్భవతి అయిన నెల, ఆమె వయసు స్పష్టంగా తెలిస్తే చాలు ఏ స్కానింగూ అవసరం లేకుండా గర్భంలో వున్న శిశువు ఆడశిశువా, మగశిశువా అన్నది అంకెలు, గుర్తులతో ఆ చార్టు ద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. ఏడు వందల సంవత్సరాల పూర్వపు చైనా రాజవంశీయుల సమాధుల నుండీ ఈ చార్టు తాలూకు ఫలకం లభ్యమైందట! వాస్తవం కోసం చార్టును ఉపయోగించి తెలుసుకోవాల్సిందే.

రాచపూటి రమేష్‌గారు గొప్ప ప్రకృతి ప్రేమికులు. ప్రయాణాలన్నా, క్రికెట్ ఆట అన్నా ఎక్కువ ఇష్టం. వీరు కొన్ని పుస్తకాలకు సద్విమర్శలతో కూడిన సమీక్షలను అందించారు. 'వలయం' లాంటి మంచి కథలనందించారు.

వీరి కథలలో కొన్నింటినయినా పరిశీలిస్తే...

**1. కలకానిది :** కావాలనుకున్నవి కోల్పోయి, మానసికంగా అణచి వేయబడిన స్థితికి చేరువయి ఒత్తిడిలో వున్న మనుషులలో ఎక్కువ మంది సాంత్వన కోసం మద్యాన్ని ఆశ్రయిస్తుంటారు. ఇహ ఆ పతనం పాతాళం వైపే! ఆ దుస్థితిలో వున్న మనిషికి తనకన్నా ఎక్కువ కోల్పోయినవారు ఆత్మ విశ్వాసంతో, ఉదాత్తంగా ముందుకు సాగుతూ జీవిస్తుండడం కన్పించినప్పుడు తమ తప్పు గ్రహించి జీవితాన్ని సరిదిద్దుకునే అవకాశం లభ్యమవుతుంది. ఆ వైనాన్ని గొప్పగా తెలియజెప్పిన కథ 'కలకానిది'.

**2. అంచనా :** కొవ్వొత్తి తాను కాలిపోతూ తన పరిసరాలకు వెలుగు నిస్తుంది. దీపం తను కొడిగడ్తూ కూడా చివరి వెలుగులు మరింత ఎక్కువగా అందివ్వడానికి ప్రయత్నిస్తుంది. అరుదుగా కొందరు మనుషులు కూడా అదే విధంగా తమ ఆఖరి రక్తబిందువు నీటి బిందువుగా మారి ఆవిరయిపోయేవరకూ కూడా ఇతరులకు సహకరించడానికే ప్రయత్నించి అంతరించి పోతుంటారు. అలాంటి వైనాన్ని తెలిపే హృద్యమైన కథ 'అంచనా'.

**3. మా విడాకులు :** అనాగరిక మానవుడు సంస్కారాలు అలవరచుకోవడం మొదలయ్యాక కుటుంబ వ్యవస్థలో భార్యాభర్తల బంధం ఓ ప్రత్యేకతను సంతరించుకోవడానికి వందల, వేల సంవత్సరాలే పట్టి వుంటుంది. పటిష్టమైన భార్యాభర్తల అనుబంధాలకు భారతదేశం ప్రసిద్ధి పొందింది. వెర్రితలలు వేస్తున్న ఆధునికత, పాశ్చాత్యదేశాల అనుకరణలు, ప్రపంచీకరణ ప్రభావం వేగవంత మవడం మొదలైన దుష్పరిణామాలు తెచ్చిపెడ్తున్న పెనుమార్పులు భారతదేశ వివాహ వ్యవస్థను కూడా అక్కడక్కడ అతలాకుతలం చేస్తున్నాయి. దంపతులు విడిపోవడానికి వికృతమైన దార్లు ఏర్పరుస్తున్నాయి. ఇది చాల శోచనీయం. ఆ ఇతివృత్తంతో సాగిన కథ 'మా విడాకులు'

విడిపోవాలనుకునే ముందు... లేదా... విడిపోయాకయినా... ఆ దూరమైన మనసుల తాలూకు మనుష్యులు కాస్త ఆగి ఆలోచించగలిగితే ఎంత బావుంటుందో అద్భుతంగా తెలియజెప్పిన కథ.

తెంచుకోవాలని భావిస్తున్న... లేక... తెగతెంపులు చేసుకుని నూతనంగా విడిపోయిన జంటలు తప్పక చదవాల్సిన కథ!! సమాజానికో మంచి సూచన ఈ కథ!

**4. చేదునిజం :** ఏ మనిషికైనా వృద్ధాప్యం శాపం. వెన్నెముక లేని పిల్లలున్న వృద్ధుల పరిస్థితయితే నరకమే! నోరులేని ఒకే ఒక్క కుమారుడు, నోరుగల కోడలు వుండి భార్యను కోల్పోయిన మనిషి వృద్ధాప్యంలో జీవించి వుంటే ఇహ చెప్పాల్సిన పనేలేదు. అనాథ శరణాలయం ఉన్న వూరికి బస్సెక్కక తప్పదు. కానయితే ఆ అనాథ శరణాలయమే ఓ రహస్యాన్ని దాచి వుంచిన దేవాలయం అయినప్పుడు జరిగే పరిణామం తాలూకు విషయమే... 'చేదునిజం' కథానిక.

**5. చందు :** హృదయం అనేది గొప్పది. అది కొందరిలో మాత్రమే కన్పిస్తూ ఉంటుంది. ఐశ్వర్యవంతుడిలో కన్పించని హృదయం, విశాల దృక్పథం తిండికి కూడా కష్టపడే పేదవాడిలో కన్పించవచ్చు. వాడు తన రేపటిని గూర్చి ఆలోచించకుండా తన సర్వస్వాన్నీ కష్టంలో వున్న వాడికి ధారపోయవచ్చు. అక్కడక్కడ, అప్పుడప్పుడు అత్యంత అరుదుగా కన్పించే ఆ వింతమైనాన్ని హృదయ స్పర్శతో తెలియజెప్పిన కథ 'చందు'.

**6. కక్ష-రక్ష :** జర్మనీని ఉద్ధరించడానికే తాను జన్మించానని ఒక బలమైన నమ్మకం ఏర్పడ్డాక హిట్లర్‌లోని రాక్షసుడు మరింత విజృంభించి లక్షలాది మంది మరణానికి కారకుడయ్యాడని చరిత్ర చెపుతోంది. ప్రస్తుతకాలంలో అలాంటి

వాళ్ళు అక్కడక్కడ దర్శనమిస్తూనే ఉన్నారు. కొన్ని పల్లెలలో అయితే కొంతమంది హిట్లర్ ఆత్మపూనిన వాళ్ళలా తయారయి అమాయకుల్ని బలిపెడ్తుండడం కద్దు. ఆ ఫాక్షనిజం తాలూకు లోతుల నిజానిజాలను గుర్తించగలిగిన వారు అదృష్టవంతులు. ఆ వైనాన్ని తెలిపే కథ 'కక్ష-రక్ష'.

**7. నీడలు-నిజాలు :** కులం మతం అన్నీ మానవులు కల్పించుకున్నవే. అంతేకాదు ఒక్కో మతానికి ఒక్కో నమ్మకం. అంతవరకూ బావున్నా ఆపైనే మనిషితనం అంతరిస్తూ వచ్చింది మనిషిలో! పరస్పర విశ్వాసం మృగ్యమయి అభద్రతా భావాలు పెరిగాయి. అన్నింటికన్నా పెద్ద విషాదం... మతం మత్తులో మనిషి నవ్వు మరచిపోవడం, ఆ వైనాన్ని ఎత్తుగడగా చేసుకుని వ్రాయబడ్డ కథ 'నీడలు-నిజాలు'. ఈ కథలో చోటుచుసుకున్న మధ్య తరగతి మందహాసాలూ, విషాదాలూ పాఠకుడి హృదయానికి తాకి, కళ్ళకు కడ్తాయి! మానవత్వం ముందు మతమే కాదు ఏదయినా తలవంచాల్సిందేనని తెలిపే కథ.

**8. హాలాహలంలో అమృతం :** హెచ్.ఐ.వి., ఎయిడ్స్ మొదలైన ప్రాణాంతక జబ్బులను గూర్చి పాఠకులకు తెలియపరుస్తూ, కేవలం అనైతికత వల్లనేకాక మానవ లోపాల వల్ల కూడా అవి సంక్రమించ గలవనే నిజాలను ప్రచారంలోకి తెచ్చి మనుషులను మానవతా దృక్పథంతో చైతన్యవంతులను చెయ్యగలిగే కథలు చాల తక్కువగా వచ్చాయి... వస్తున్నాయి. 'హాలాహలంలో అమృతం' ఆ కోవలో వచ్చిన సహజమైన కథ. మనుషుల మానసిక అసంబద్ధ స్పందనలను తెలియజెప్పిన కథ!

**9. ట్రంప్‌కార్డు :** కథా వస్తువు చాల చిన్నదయినా నడిపించిన తీరు అద్భుతం. మంత్రానికి పనికిరాని అక్షరమూ, ఔషధానికి పనికిరాని మూలికా, అయోగ్యుడయిన పురుషుడూ ఉండడు. ఉపయోగించుకో గలిగిన చాతుర్యం కలవారు దొరకడం కష్టం. ఎందుకూ పనికిరాడనుకున్న మనిషి అత్యవసరాలలో ఎలా ఆదుకోగలడో తెల్పిన కథ!

మరింత శక్తివంతమైన, లోతయిన, సమాజ హితకరమైన కథలను, నవలలను రాచపూటి రమేష్‌గారి నుండీ ఆశించవచ్చును.

**రచయిత చిరునామా :**

**రాచపూటి రమేష్**

10-73, రాయల్‌నగర్, ఆర్.సి.రోడ్డు,

**తిరుపతి -517 501**

సెల్ : 98667 27042.

ఫోను : 0877 - 6563903

## మనుష్యులు ఎందుకింత నిశ్శబ్దంగా నిష్క్రమిస్తారు?
## గాడేపల్లి శివరామయ్య



**నా** చిన్నతనం నుండీ కూడా గాడేపల్లి శివరామయ్య గారు తెలుసు. కానయితే అప్పట్లో ఒక అయ్యవారిగా మాత్రమే!

వారిని తరచు మా వూర్లోనే చూస్తుండేవాడిని. క్రమబద్ధంగా దుస్తులు ధరించడం అన్నది వారిలోని ప్రత్యేకత. ప్యాంటు లోనికి పొడుగు చేతుల చొక్కా టక్ చేసుకుని చేతిరెట్టలు మడచి, మంచి బెల్టు పెట్టుకుని, చక్కటి సులోచనాలు, కాలిజోళ్ళు ధరించి టిప్, టాపుగా కన్పింస్తుండే వారు. వారి బుద్ధ ముఖంలో ముచ్చటైన చిరునవ్వు ముద్దొచ్చేలా కన్పిస్తుండేది ఆ రోజుల్లో.

వారు మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నప్పుడు వారి డ్రెస్ మానర్ చాలమంది పిల్లలకు ఎంతగానో నచ్చేది (వారి స్కూలు పిల్లలు కాకపోయినా).

ప్రారంభదశలో శానటోరియం దగ్గరి పోతపోలు లాంటి చిన్న పల్లెలలో చిన్నచిన్న పాఠశాలలలో పనిచేసిన పిదప వారి ఉద్యోగ జీవనయానం అంతా గట్టు, మదనపల్లె, కలిచెర్లలలోని ఉన్నత పాఠశాలలలో తెలుగు పండితులుగా సాగింది.

దాదాపు ఇరవయి సంవత్సరాల క్రితం మదనపల్లె రచయితల సంఘం ఆవిర్భావ సందర్భంగా వారిని తరచు కలవడం జరిగింది. వారు ప్రసిద్ధ పద్యకవి అని తెలిశాక నాకు వారిమీద అభిమానం పెరిగింది. ఒక ఆశ్చర్యం ఏమిటంటే... నేనేదో కథలు, నవలలు వ్రాసే సాధారణ వ్యవహార భాషారచయితను. పైగా వయసులో బాగా చిన్నవాణ్ణి వారికన్నా. అయినా వారు నన్ను గౌరవించి, ఆదరించిన తీరు, అభిమానించిన విధానం మరచిపోలేనివి.

కర్నూలు జిల్లా దైవము దిన్నె రామారెడ్డి గారి ఆస్థానములో గొప్ప పండితులుగా పేరుగాంచిన శతావధాని, బహుగ్రంథకర్త అయిన బ్రహ్మశ్రీ గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారి పుత్రులే గాడేపల్లి శివరామయ్యగారని అప్పటికి నాకు తెలియదు నిజానికి. ఆ రోజులలోనే... కవిభూషణ, కవితిలక కల్లూరు అహోబలరావు గారిచే రచింపబడి, శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల, హిందుపురం

వారిచే 1975 ప్రాంతంలో ప్రచురితమైన 'రాయలసీమ రచయితల చరిత్ర' గ్రంథములు మూడు భాగములను శ్రీ కల్లూరి రాఘవేంద్రరావుగారు నాకు బహూకరించడం జరిగింది. అందులో మొదటి భాగం అధ్యయనం చేస్తున్నప్పుడు ముప్పయి ఐదవ పుట నుండీ ప్రచురితమయిన శతావధాని గాడేపల్లి వీరరాఘవ శాస్త్రిగారి విద్యాభ్యాసం మొదలుకుని వారి సాహితీ విశ్వరూపం వరకూ వారి జీవితంలోని, సాహితీయానంలోని విలువైన వివిధ విషయాల వరకూ విలువైన వివిధ సాహితీ విషయాలను తెలుసుకుని నిర్ఘాంతపోవడం నా వంతైంది.

"అమ్మో!" అనుకుంటూ అప్పటికప్పుడు బయల్దేరి గాడేపల్లి శివరామయ్య గారింటికి వెళ్ళాను. అప్పటికి గాడేపల్లి శివరామయ్యగారి మాతృమూర్తిగారు జీవించి యున్నారు. చూడగానే చేతులు జోడించి నమస్కరించాల్సిన నిండైన మాతృ స్వరూపం వారిది. ఆ తల్లికి పాదాభివందనచేసి ఆశీస్సులు పొందగలిగిన అదృష్టం లభ్యమైంది నాకు ఆనాడు.

ఇహ అప్పట్నుండీ అప్పుడప్పుడు వారింటికి వెళ్ళేవాడిని. చాల అమూల్యమైన సాహిత్య విషయాలను ప్రస్తావించి వాటిని విరిస్తుండేవారు గాడేపల్లి శివరామయ్యగారు. ఒకటి రెండు పర్యాయాలు గద్వాల ఆస్థానంలో ఆధునిక కవులలో అగ్రగణ్యులుగా వెలుగుతూ తమ తండ్రిగారు చూపిన పాండిత్య ప్రతిభా పాటవాలను గూర్చి తెలియజేశారు.

శ్రీ నాగేశ్వరరావు పంతులు, శ్రీ వనం కృష్ణమూర్తిశర్మ లాంటి పండితుల వద్ద తెలుగు చదువుకునీ బాల్య చాపల్యానికి చెందిన ఆటలతో, అశ్రద్ధతో నేను పద్యరచన నేర్చుకోలేక పోయాననీ, పద్యం చదవడంలో కూడా ఇబ్బందుల నెదుర్కుంటున్నాననీ నేను బాధపడినప్పుడు వారు... 'కృష్ణమూర్తీ కథా, నవలా రచనలో నీవు మంచి పరిణతి సాధించావు... పద్య రచన చేయలేనంత మాత్రాన కించపడాల్సిన అవసరం లేదు. నీవు చేస్తున్న కృషి నిన్నోనాడు అందల మెక్కిస్తుంది... తప్పక!" అంటూ ప్రోత్సహించిన తీరు మరువరానిది. ఆ రోజులలోనే వారు నాకు "శ్రీ వేంకటేశ్వర భావలీల" అను వారి తొలి ముద్రిత గ్రంథాన్ని ఇవ్వడం జరిగింది.

కొన్ని సాయంకాలాలలో గాడేపల్లి శివరామయ్యగారు, వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు కలసి జిజ్ఞాసా కల్చర్ క్లబ్ వెనుక అరుగుమీద కూర్చుని సాహిత్య విషయాలనెన్నింటినో చర్చించుకుంటూండగా "మౌనమె భూషణము మూఢ మానవునకు" అన్న చందాన మౌనంగా, శ్రద్ధగా వినడంలో చాల

ఆనందాన్ని చాల పర్యాయాలు అనుభవించగలిగాను. అలా కొద్దో గొప్పో విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి అవకాశం లభించింది నాకు.

ఆ రోజులలో హఠాత్తుగా వారికెందుకో కంటిచూపు మందగించి చాల ఇబ్బందులు పెట్టింది. అత్యవసరంగా కర్నూలు వెళ్ళి కంటికి సంబంధించిన శస్త్ర చికిత్సలు చేయించుకోవాల్సి వచ్చింది. అయినా ఓ కంటి చూపును పూర్తిగా, శాశ్వతంగా కోల్పోయారు వారు. మిగిలిన కన్నయినా కొద్దిగానే సహకరిస్తుండేది. అయినా ఎప్పుడు వెళ్ళినా ఏదో ఒకటి చదువుతూనో, వ్రాస్తూనో కన్పించేవారు. ఒక్కకంటి చూపుతోనే వారు చేసిన కృషి సామాన్యమైనది కాదు.

వారు వ్రాసిన పద్య కావ్యాలేన్నో అముద్రితంగా అటకల మీద ఉండడం నాకు తెలుసు. ఆ విషయంగా నేనెప్పుడయినా బాధపడ్తే... "శ్రమపడి ముద్రించినా చదివేవారు ఎందరున్నారు?" అంటూ నవ్వేసేవారు.

మాన్యశ్రీ సనగరం నాగభూషణం, బ్రహ్మశ్రీ కట్టా వెంకటసుబ్రహ్మణ్యం వారి లాంటి సాహితీ మిత్రుల ప్రోద్బలంతో ఐదేళ్ళ క్రితం ఉద్దండ సంస్కృత పండితులు అప్పయ్య దీక్షితుల వారి సంస్కృత కవితా ఖండికకు తెలుగు పద్యానువాదం గావించారు గాడేపల్లి శివరామయ్యగారు. "ఆత్మార్పణ స్తుతి" పేరిట ముద్రింపబడి విడుదలవగానే పలుప్రశంశలు పొందింది ఆ చిరుగ్రంథం.

నలభై సంవత్సరాల క్రితం వారు పల్లెటూర్లలో ఉపాధ్యాయులుగా జీవితం గడుపుతున్న కాలం నుండీ కూడా 'విరాటపర్వ పఠనం' వారి జీవితంలో ఒక ముఖ్య భాగమయింది. లెక్కలేనన్ని పర్యాయాలు విరాటపర్వ పఠనం, కథనం కావించిన వారిని "అమలోదాత్త మనీష... పారగుడన్ కళావిదుడ" అని చెప్పుకున్న ఉభయకవి మిత్రుని శక్తివంతమైన పద్యబంధ నిర్మాణశైలీ విన్యాసం, కథన నైపుణ్యం, నాటకీయత, అభివ్యక్తి ప్రౌఢిమ, ప్రత్యక్ష దృశ్య కావ్య రచనా శిల్పం ఎంతగానో ఆకర్షించేవట పదేపదే.

తరచు పఠించడం వల్ల కథాంశం పట్ల, కవి పట్ల కలిగిన గౌరవ అభిమానాలతో, ఎంతో కాలంగా వారి మనసులో ఏర్పడి వుండిన కోరిక "ఉత్తర విజయం" పద్యకావ్యంగా రూపు దిద్దుకుని గ్రంథరూపం దాల్చింది.

విరాటపర్వం లోని ఉత్తర గోగ్రహణ ఘట్టాన్ని (కవిత్రయ మహా భారతంలోని తిక్కన సోమయాజి విరచిత విరాటపర్వంలోని చతుర్థ, పంచమాశ్వాలలోని ఉత్తర గోగ్రహణ ఘట్టాన్ని) పై తెల్పిన 'ఉత్తర విజయం'

పద్యకావ్యంగా ఆంధ్ర పాఠక లోకానికి అపురూప కానుకగా అందించారు గాడేపల్లి శివరామయ్యవారు. 2011 జనవరిలో విడుదలయిన ఈ అద్భుత పద్యకావ్యం కవిపండితుల, మేధావులచే ప్రస్తుతింప బడడంతో పాటు సామాన్యుల మన్ననలను కూడా పొందగలిగింది.

గాడేపల్లి శివరామయ్యగారి అముద్రిత రచనలలో కొన్ని...

1. విశ్వనాథ నాయకుడు (నాటకం)
2. తాతాచార్యుల కథలు (సిపి. బ్రౌన్ గారి తాతాచార్యుల కథలకు తెలుగు పద్యానువాదం)
3. నెహ్రూ జీవిత చరిత్ర (పద్య కావ్యం)
4. పద్యకవితా ఖండికలు (రెండు భాగాలు)
5. సమస్యా పూరణములు.

కాలక్రమంలో నిరంతర జీవన సంగ్రామం విరామ మివ్వకపోవడం వల్లా, కొనితెచ్చుకున్న పనుల ఒత్తిడి వల్లా ఈ మధ్యకాలంలో వారిని కలవడం పూర్తిగా తగ్గిపోయింది. అరుదుగా ఎప్పుడైనా వారిని కలిసినప్పుడు ఒకటి రెండు గంటలు సాహిత్యపరమైన విషయాలతోనే గడచిపోయేవి.

"అప్పుడప్పుడు వస్తుండండి!" అనే వారాయన.

"తప్పకుండా!" అనే వాడిని.

కానీ మాట నిలబెట్టుకోలేదు నేను.

వారీమధ్యన చేసిన అష్టావధానాలకూ వెళ్ళలేకపోయాను.

మాన్యశ్రీ సిహెచ్. వెంకటరత్నం గారితో కలసి మూడు నాలుగు పర్యాయాలు గాడేపల్లి గారింటికి వెళ్లిరావడం ఆ మధ్య కాలంలో అనుకోకుండా కలిసి వచ్చిన అదృష్టం. వెళ్ళిన ప్రతిసారీ నేను శ్రోతగా ఒకటి రెండు గంటలపాటు సాహితీ చర్చలు... విషయాలు!! మాటల మధ్యన తరచు బుంగమూతితో వారు నవ్వే నవ్వులలోని అలనాటి ఆకర్షణ మాత్రం తగ్గనేలేదు.

వారిలో ఎప్పుడూ ఏ వ్యాధి లక్షణాలు కన్పించేవి కావు.

కానీ ఇటీవల హఠాత్తుగా... వారికి జబ్బు చేసిందని కర్నూలు వెళ్ళారనీ ఆపై హైదరాబాదు వెళ్ళారనీ తెలిసింది.

చాల కొద్దిరోజుల తరువాత థైరాయిడ్ ఆపరేషన్ అయిందనీ త్వరలో మదనపల్లెకు వచ్చేస్తారనీ వినపడింది.

అయితే అలా జరగలేదు. థ్రోట్ క్యాన్సర్ అనీ, తెరపీ తీసుకుంటున్నారనీ తిరిగి రావడానికి రెండు మాసాలు పట్టవచ్చునీ వార్త!

రెండు వారాలు కూడా జరగలేదు... తేది 02-06-2012 శనివారం నాటి ఉదయాన్నే కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారి నుండీ ఫోను... గాడేపల్లి గారు ఇహలేరని!

అంతా కలలోలాగా జరిగిపోయింది!

అయినా మనుషులెందుకింత నిశ్శబ్దంగా నిష్క్రమిస్తారు?

తెలియదు!

అయినా రససిద్ధి గావించిన ఆ సమర్థ కవికి కూడా మరణమా? తప్పదేమో?!

ప్రకాశం జిల్లాలో ఎక్కడో ఎర్రగొండపాలెం మండలంలోని గడ్డమీద పల్లెలో జననమంది, చిత్తూరు జిల్లా మదనపల్లెలో స్థిరపడి ముప్పాతిక జీవితం ఇక్కడే గడిపి చడీచప్పుడు లేకుండా కర్నూలులో వున్న కుమార్తెనూ, మదనపల్లెనూ, సదా నీడలా వెన్నంటి ఉండినవారి సతీమణి శ్రీమతి కామేశ్వరమ్మ వారినీ, బంధు మిత్రులనూ, సాహితీ ఆప్తులనూ వదిలి వారెక్కడికి వెళ్ళారో?

బహుశా అక్కడ సర్వశ్రీ మేడవరం నారాయణశర్మ, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కవికులం నారాయణాచార్య, డబ్ల్యు. రఘునాథ్, డి.వి. శాస్త్రి మొదలైన వారందరితో సాహితీ సదస్సులలో మునిగి తేల్తున్నారేమో!?

మా మనసులలో మెదిలే ఆ బుంగమూతి చెదరని చిరునవ్వుతో, కళ్ళముందున్న విలువైన వారి రచనలతో వారు మా కెప్పటికీ సజీవులే!

వారి గ్రంథములు పొందగోరు వారు సంప్రదించవలసిన చిరునామా:

**శ్రీమతి గాడేపల్లి కామేశ్వరమ్మగారు**

3-145-6-12, సప్తగిరి నగర్

కదిరిరోడ్డు,

**మదనపల్లె - 517 326**

సెల్ : 98493 62567

## అరవైయోపట కలం పట్టి సాహితీ గళంతో అలరిస్తున్న కవి, కథకులు మాన్యశ్రీ కలవకుంట్ల గురునాథ పిళ్ళై



ప్రభుత్వ గుర్తింపు పొందని ఉత్తమోత్తమ ఉపాధ్యాయుడు, సామాజిక హితం కోరే మంచి మనిషి, మానవతా వాది, నిగర్వి, సత్సంప్రదాయ ప్రేమికుడు, అరవైయేళ్ళ వయసులో కలం చేబూని గతపాతికేళ్ళుగా సాహితీ గళం విన్పిస్తున్న ఔత్సాహిక కళాభిమాని మాన్యశ్రీ కలవకుంట్ల గురునాథ పిళ్ళై.

పదవీ విరమణ చెందిన పిదప పద్యంతో ప్రారంభించి, వచన కవితలతో అలరించి, సాంప్రదాయక విలువలకు పెద్దపీట వేస్తూ హృదయాలను స్పర్శించే కథలతో పాఠకుల మనసులను రంజింప జేస్తున్న రచయిత వీరు.

డెబ్బయి రెండేళ్ళ క్రితం చల్లని పుణ్యభూమి లాంటి చిన్న టవున్ మదనపల్లెలో తేది 1-7-1940నాడు కలవకుంట్ల గురునాథ పిళ్ళైగారి జననం జరిగింది. శ్రీ కె. రత్నపిళ్ళై, శ్రీమతి స్వర్ణమ్మ అను పుణ్యదంపతులు వీరి జననీ జనకులు. వీరి తండ్రిగారు కొంతకాలంపాటు ఓ బస్ కంపెనీలో చెకింగ్ ఉద్యోగిగా పనిచేసి తరువాత అదే కంపెనీలో మేనేజరు స్థాయిలో కొనసాగినవారు. వీరి తల్లి సాధారణ గృహిణి.

కలవకుంట్ల గురునాథపిళ్ళైగారి సతీమణి శ్రీమతి కె. మోహనాంబ. ఈమె భర్త కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ శ్రీవారు పెద్ద జబ్బుకు, శస్త్ర చికిత్సకు గురయినప్పుడు మొక్కవోని ధైర్యంతో వెన్నంటే వుండి వారిని రక్షించుకుని, దక్కించుకున్న ఆదర్శ సహధర్మచారిణి.

కలవకుంట్ల గురునాథపిళ్ళైగారి ప్రాథమిక విద్యాభ్యాసం మదనపల్లె పంచాయతీకి చెందిన హోప్ ఎలిమెంటరీ పాఠశాలలో (కోట బడిలో) జరిగింది. తదుపరి క్రిస్టియన్ మిషన్‌కు చెందిన హోప్ హైస్కూలులో చదువు కొనసాగించి ఎస్.ఎస్.ఎల్.సి. ఉత్తీర్ణులయ్యారు.

తండ్రిగారి ఉద్యోగ విరమణతో వీరి చదువుకు రకరకాల ఆటంకాలు ఏర్పడుతూ వచ్చాయి. అయినా పట్టుదలతో చదివి ఎస్.వి. యూనివర్శిటీ నుండి పి.యు.సి. పూర్తి చేశారు. తదుపరి చదువుకు ఎన్నో కడగండ్లు!,

అటకాయింపులు!! అందువల్ల ఉన్నత చదువుల ఆశలు వదులుకుని తిరుపతి దగ్గరి అలివేలు మంగాపురంలో ఉండిన టీచర్సు స్కూలు లీవింగ్ సర్టిఫికెట్ ఎమర్జన్సీ కోర్సులో టీచరు ట్రైనింగ్‌లో చేరారు.

ట్రైనింగ్ తదుపరి 1961వ సంవత్సరంలో చిత్తూరు జిల్లా, చిన్నగొట్టిగల్లు సమితిలో తాత్కాలిక టీచరుగా కాలుమోపి దుస్సావారిపల్లె, ఎల్లమంద దగ్గరి కర్నవారిపేట ఎలిమెంటరీ పాఠశాలలలో పనిచేశారు. తదుపరి డి.ఎస్.సి.లో ఎంపికయి 1963వ సంవత్సరంలో మదనపల్లె సమితిలో శాశ్వత ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. వీరి ఉద్యోగయానం మొత్తం పల్లెటూర్లలోనే గడచిపోయింది.

ఏ గ్రామంలో, యే పల్లెలో ఉద్యోగం చేయాల్సివస్తే అదేచోట కాపురం వుంటూ నిబద్ధతతో, అంకితభావంతో గ్రామీణ బాల, బాలికలకు ఉత్తమ విద్యను అందించడానికి ప్రయత్నించిన ఆదర్శ ఉపాధ్యాయులు వీరు. పనిచేసిన ప్రతిచోటా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు, విద్యార్థుల, తల్లిదండ్రుల మన్ననలు, ఉన్నత ఉద్యోగుల నుండీ ప్రశంసలు పొందారు.

పదవీ విరమణ చెందిన పిదప తమ గతజీవితంలోని అనుభవాలను, అనుభూతులను నెమరు వేసుకుంటూ రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు.

“శ్వాసతో మొదలయ్యే జీవితం శ్వాస ఆగిపోవడంతో అంతమౌతుంది. ఆ మధ్యనున్న కొద్ది కాలంలోనే ఏదో సాధించాలన్న తపన తప్పకుండా ప్రతి మనిషికీ ఉండితీరాలి! అందుకే ఉద్యోగ విరమణ తదుపరి నా విశ్రాంత జీవితంలో నా సాహితీ ప్రస్తానం ప్రారంభమైంది!!” అని చెప్పే గురునాథ పిళ్ళైగారి మొట్ట మొదటి కథ ‘ఓ ప్రేమ కథ’. ఈ కథ ఆంధ్రభూమి వారపత్రిక ద్వారా సెప్టెంబరు 2000 సంవత్సరంలో వెలుగు చూసింది. ఆ సందర్భంలోనే వీరికి మదనపల్లె రచయితల సంఘంతో అనుబంధం ఏర్పడింది. పద్యాలు, వచన కవితలు, గేయాలు వ్రాయడం మొదలు పెట్టారు.

పద్యం వ్రాసినా, గేయం వ్రాసినా, కథ వ్రాసినా, కవిత వ్రాసినా... తమ ప్రతి రచనలో సమాజ హితకరమైన ఓ సూచన లేదా సున్నితమైన పరోక్ష సలహా ఉండి తీర్తుంది. వీరి కథలలో కన్పించే ప్రాంతీయత కథా వస్తువును దృశ్యమానం చెయ్యడంలో పెద్ద పాత్ర పోషిస్తుండడం ఒక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఇహ వీరి కవితల విషయానికి వస్తే "వాళ్ళ తంతు–నీళ్ళతంతు", "చట్టం ఎవరికి చుట్టం?" లాంటి శక్తివంతమైన వీరి కవితలలో ఈ రచయిత ప్రస్తుత సమాజాన్ని చూసి నిర్ఘాంతపోవడం కన్పిస్తుంది.

వీరి కథలను పరిశీలిస్తే...

**1. కొత్తదారి :** మదనపల్లె ప్రాంతపు మాండలికం అవసరమైన చోట మాత్రమే ఉపయోగించి వ్రాయబడ్డ అద్భుతమైన కథ 'కొత్తదారి'. మదనపల్లె వెంకటేశ్వరాలయం ముంగిట యాచనతో జీవించే ఇద్దరు అనాథల అంతర్మథనంతో ప్రారంభమయ్యే ఈ కథ ఎత్తుగడ నుండీ చిట్టచివరి వాక్యం వరకూ కూడా అత్యంత ఆసక్తికరంగా సాగుతుంది. తమ జీవితాలలో నిండివున్న చీకటికి భగవంతుడే కారణం అనుకునే స్థితి నుండీ మనిషి బయటపడి ఎదగడానికి కొత్తదార్లు వెతుక్కోవడం లోని ఔచిత్యాన్ని సూచిస్తుంది ఈ కథ.

**2. ముందుచూపు :** తమ ఇంటి ఆడబిడ్డను ఆస్థీ, అంతస్తులలో తమకన్నా గొప్పగా వున్న కుటుంబానికి ఇవ్వాలన్న ఆలోచనలే ఎక్కువగా ఉంటాయి సగటు తల్లిదండ్రులకు. అంతకుమించి ఆ కుటుంబం పూర్వాపరాలను గూర్చి గానీ, అబ్బాయి మంచి చెడ్డలను గూర్చిగానీ లోతుగా అధ్యయనం చెయ్యడానికి ప్రయత్నించరు చాలమంది. పైగా పైపై మెరుగులకే భ్రమపడి పోతుంటారు ఎక్కువమంది. తన తల్లిదండ్రుల ఆలోచనలన్నీ పై విధంగానే ఉన్నా తను మాత్రం తనకు కాబోయే భర్త యొక్క అంతరంగిక ఆత్మసౌందర్యాన్ని ప్రత్యేకంగా పరిశీలించి ఆపై ముందుకు అడుగేసే ఓ మధ్య తరగతి యువతి యొక్క అంతరంగం 'ముందుచూపు'.

**3. పరిష్కారం :** పండ్రెండేళ్ళ క్రితం ప్రచురితమైన కథ. పదిహేనేళ్ళ క్రితం నాటి పరిస్థితులూ, పరిసరాలూ కన్పిస్తాయి కథలో. ఎత్తుగడలోనే రచయిత తాలూకు అంతర్గత ఆధ్యాత్మికతకు చెందిన తాత్వికత కొంతమేర కన్పిస్తుంది. ఈ కథలో మూడు తరాలకు చెందిన కథ కదులుతుంది. పరిస్థితులు మనిషిని ఎలా, ఎంతలా మార్చివెయ్యగలుగుతాయో చక్కగా చెప్పగలిగిన ఘటనలున్నాయి ఈ కథలో. చిత్రమైన ప్రేమలూ, వాటి తాలూకు సంఘర్షణలూ కూడా అభివ్యక్తమవుతాయి. చక్కటి నడకతో సాగి పాఠకుడికి మంచి సంతృప్తి నందించి ముగిసే కథ.

**4. లక్ష్యం :** నూనూగు మీసాల నూతన యవ్వనం కన్నా ముందే ప్రేమలో పడే, పడాలనేకునే యువత తప్పక చదవాల్సిన కథ. ప్రేమంటే ఏమిటి? దానికి నిర్వచనం ఏమిటి?? అన్న విషయాలను ప్రస్తావించక పోయినా

కూడా ఇది ఒక చిత్రమైన ప్రేమకథే! యువత ఆలోచనలకు సరయిన పదును పెట్టగలిగిన కథ. ప్రతి మనిషీ తన జీవితానికి ఓ లక్ష్యం దానికో గమ్యం పటిష్టంగా నిర్దేశించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణించే కథ 'లక్ష్యం'.

**5. పీడా వదిలింది :** దిగువ మధ్య తరగతి కుటుంబాల వారు అద్దెల కుండే సాధారణ ఉమ్మడి వాటాలలో మనుషుల మధ్యన సయోధ్య ఎంతో, సమస్యలూ అంతలానే ఉత్పన్నమవుతుంటాయి. ఇహ ఆ కుటుంబాల మధ్యన యవ్వనంలో వున్న వంకర మనుషులుంటే చెప్పాల్సిన పనేలేదు. పైకి చెప్పుకోలేని ఆ సాధక బాధకాలను, కొంతమేర వాటి నివారణోపాయాలను తెలియజెప్పిన కథ 'పీడా వదిలింది'.

**6. ప్రేమ అమరం :** ఇదో నిలువెత్తు ప్రేమ కథ. కవి హృదయానికీ కథకుని మనసుకూ వృద్ధాప్యం అంటూ ఉండదేమో బహుశా!? తమ అరవై నాలుగో ఏట పాతికేళ్ళ యువకుడి మనసుతో కలవకుంట్ల గురునాథ పిళ్ళై గారు వ్రాసిన అమూల్యమైన ప్రేమకథ ఇది.

**7. అమ్మ మనసు :** పెళ్ళి విషయంలో పెద్దలు 'ఈడూ–జోడూ' అన్నారు. దాని అర్థం ఎంతో ఉంది! ఎంత దూరమైనా ఉంది!! అనాకారి వరుడికి అద్భుత సౌందర్యరాశిని ఇచ్చి చేస్తే... అతనిలో తాను ఆమె ముందు అల్పుడనన్న భావన ఏర్పడి అంతర్గతంగా కృంగిపోతే, ఆమెకు లొంగిపోతే... పర్యవసానంగా ఆమె అజమాయిషీ అన్నింటా అధికమయి ఏర్పడే దుష్పరిణామాలను తెలియజేసిన కథ. ఈ కథలో తల్లి హృదయాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు రచయిత.

**8. మనసున మల్లెలు :** ప్రపంచీకరణ ప్రభావం, దానికి తోడు పాశ్చాత్య దేశాలను అనుకరించడం వల్ల విస్తారంగా ఏర్పడిపోతున్న ఆధునిక పోకడలు మనుషులను, మానవ సంబంధాలను ఎలా మార్చేస్తున్నాయో, పవిత్రమైన 'ప్రేమ' కూడా చాల సందర్భాలలో లాటరీ లాంటి వ్యాపార వస్తువుగా ఎలా మారిపోతోందో తెలియజెప్పిన కథ! దురాలోచనలు అధికమై పోతున్న ఈ కాలంలో సదాలోచనలు, సంస్కారాలు కలిగిన వ్యక్తుల తాలూకు భావాలు ఎలా వుంటాయో తెలియజేసిన కథ 'మనసున మల్లెలు'.

**9. అమ్మో! ఇదో పరమ రహస్యం :** గడచిన తరాల వారికి కాపీకొట్టి పాస్ కావడం ఏమిటో తెలియదు. మారిన కాలంలో కాపీలు అడ్డదారులయి పోయాయి. అవి కాస్తా రహదారులు కాకూడదని భావించే మహానుభావులూ

అక్కడక్కడ అడ్డుకట్టలు కడ్తూనే ఉన్నారు. ఆ ప్రయత్నాలలో వారు స్వధర్మమా! వృత్తిధర్మమా?? అన్న సంఘర్షణలకు గురి కావాల్సి వచ్చినా వెరవడం లేదు. అలాంటి ఒక ఉత్తమ ఉపాధ్యాయుని జీవితంలోని ఓ చిన్న ఘటన ఈ కథ.

**10. కాకులు :** పేపరు తీస్తే, టి.వి. చూస్తే... అక్కడో ప్రైవేటు బ్యాంకు మూతపడిందనో, ఇక్కడో చీటీల వ్యాపారి కోటి రూపాయలతో ఉడాయించాడనో, మరెక్కడో ఓ పెద్దమనిషి పదిమంది సొమ్ము కోట్లాదిగా దిగమింగి నీళ్ళు తాగి ఐ.పి. పెట్టాడనో రకరకాల వార్తలు ప్రతిరోజూ వింటున్నాం, కంటున్నాం! అయినా ఎక్కువ లాభాలనే ఆశిస్తూ ప్రయివేటు వ్యక్తులను, ప్రైవేటు బ్యాంకులను ఆశ్రయిస్తుంటారు జనులు!! వారిలోనూ విద్యాధికులే ఎక్కువ. ఆ వైనాల్ని ఇతివృత్తం చేసుకుని వాస్తవిక యధార్థ గాథలకు రూపమిస్తూ వ్రాయబడ్డ కథ కాకులు.

ఆకలి దాహాలకు పరిమితి పెట్టుకున్న మనిషి ధన దాహానికి పరిమితి వహించకపోవడాన్ని, స్వలాభం, పరవంచనలతో జీవించడాన్ని జీర్ణించుకోలేని కలవకుంట్ల గురునాథ పిళ్ళైగారు సమాజ హితంకోరి క్రమశిక్షణతో, కట్టడి తప్పకుండా ఇలాంటి కథలెన్నో వ్రాశారు.

ప్రస్తుతం వీరు కొన్ని ఆరోగ్యపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అందువల్ల వ్రాయడం, చదవడం కొంతవరకూ తగ్గింది. అయినా వీరి కలం ఆగడం లేదు. ఇటీవల "కలవకుంట్ల కవితా కదంబం" అన్న కవితా సంపుటిని ముద్రించి విడుదల చేశారు. త్వరలో ఒక కథా సంపుటిని, ఒక కవితా సంపుటిని వెలువరించే ప్రయత్నాలలో ఉన్నారు. త్వరలో వీరు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారనీ సమాజహితకరమైన కథలూ, నవలలూ మరిన్ని అందిస్తారనీ ఆశించడం అత్యాశ మాత్రం కాదు.

'కలవకుంట్ల కవితా కదంబం' కవితా సంపుటి వెల రూ॥లు 40/- సంపుటి పొందగోరువారు రచయితను సంప్రదించగలరు.

**రచయిత చిరునామా :**

**కలవకుంట్ల గురునాథ పిళ్ళై**

3-145-6-13-1, సప్తగిరి నగర్

**మదనపల్లె - 517 325**

చిత్తూరు జిల్లా.

సెల్ : 99859 17364.

## అలనాడే వైవిధ్యభరితమైన కథల నందించిన కథకురాలు
## శ్రీమతి కానాల నాగలక్ష్మమ్మ (అమృత)



**చి**త్తూరు జిల్లాలో పుట్టి, పెరిగి, విద్యనభ్యసించి, రచనలు సాగించి... వృత్తిరీత్యానో, ఉద్యోగరీత్యానో, వివాహం వల్లనో, మరికొన్ని ఇతర కారణాల వల్లనో ఇతర జిల్లాలలో, రాష్ట్రాలలో, దేశాలలో స్థిరపడ్డ కథకులు చాలమందే ఉన్నారు. దురదృష్టవశాత్తు ఆయా రచయితల చిరునామాలు సులభంగా లభ్యం కావడం లేదు.

ఒకప్పుడు చిత్తూరు జిల్లాలో చల్లని పుణ్య భూమిగా పేరుపొంది, మహనీయులకు, కారణజన్ములకు, సాహితీవేత్తలకు నిలయమయి ఉండిన మదనపల్లెలో జన్మించి, చాలకాలంపాటు 'అమృత' అన్న కలం పేరుతో రచనలు సాగించి, ప్రస్తుతం విశాఖపట్టణంలో స్థిరపడిన కథా రచయిత్రి శ్రీమతి కానాల నాగలక్ష్మమ్మగారు. 1954–1990 సం॥ల మధ్య కాలం లోని పాఠకులకు వీరు తప్పక గుర్తుండే ఉంటారు.

శ్రీమతి కె. నాగలక్ష్మమ్మగారి జననం మదనపల్లెలో తేది 18–8–1939 నాడు జరిగింది. కీ.శే. కానాల కృష్ణశర్మ, కీ.శే. లక్ష్మీనరసమ్మ అను పుణ్యదంపతుల తొమ్మండుగురు సంతానంలో నాగలక్ష్మమ్మగారు నాలుగవ వారు. వీరి తండ్రిగారు మదనపల్లెలో అడ్వకేటుగా ప్రాక్టీసు చేస్తూండేవారు. వీరి తల్లిగారు గృహిణి.

శ్రీమతి కె. నాగలక్ష్మమ్మగారి ప్రాథమిక విద్యాభ్యాసం ఆనాటి మదనపల్లె పంచాయతీకి చెందిన హోప్ ఎలిమెంటరీ పాఠశాలలో (కోట బడిలో) జరిగింది. తదుపరి బిసెంట్ థియొసాఫికల్ ఉన్నత పాఠశాలలో హైస్కూలు చదువు ముగిసింది. అప్పట్లో మదనపల్లె బాలికల పాఠశాలలో ఉండిన సెకండరీ గ్రేడు టీచరు ట్రైనింగ్ ఎమర్జన్సీ కోర్సులో 1956–57 సం॥లో టీచరు ట్రయినింగ్ పూర్తి చేసిన నాగలక్ష్మమ్మగారు మదనపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా వృత్తి బాధ్యతలు స్వీకరించారు.

అప్పటికే వివిధ పత్రికలు, నవలలు, ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడం ద్వారా ఆధునిక సాహిత్యం మీద అవగాహన ఏర్పరచుకుని ఉండిన వీరు 1953వ సంవత్సరంలోనే రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టడం జరిగింది. వీరి మొట్టమొదటి కథ 'జంట టెలిగ్రాములు'. ఈ కథ 1954లో ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురితమైంది.

ఆ రోజులలో ఆంధ్రప్రభ ద్వారా వెలువడుతుండిన శ్రీమతి మాలతీ చందూర్ గారి 'ప్రమదావనం', లతగారి 'ఊహాగానం' లతో ప్రేరణ పొందిన నాగలక్ష్మమ్మగారు మహాకవి పోతన మొదలుకొని ఆధునిక కవులు, రచయితలు సర్వశ్రీ... దేవులపల్లి కృష్ణశాస్త్రి, గుర్రం జాషువా, ఉషశ్రీ, పుట్టపర్తి నారాయణా చార్యులు, బుచ్చిబాబు, ముప్పాళ రంగనాయకమ్మ, మధురాంతకం రాజారాం, యండమూరి వీరేంద్రనాథ్ మొదలైన వారి రచన లెన్నింటినో చదివి ప్రభావితం అయ్యారు.

1962వ సంవత్సరం వరకూ టీచరుగా చక్కగా విధి నిర్వహణ కావిస్తూనే, ప్రవృత్తిగా కథా రచనతోపాటు కవితలు, చిన్నచిన్న వ్యాసాలు వ్రాయడం కొనసాగించారు.

ఎం.ఎ. సైకాలజీ చదివి రైల్వేలో మంచి ఉద్యోగంలో ఉండిన శ్రీ నూతలపాటి సుబ్బారావుగారితో కె. నాగలక్ష్మమ్మగారి వివాహం 1962 మార్చిలో జరిగినది. దాంతో వారి వృత్తి, ప్రవృత్తులకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. శ్రీవారితో కలసి శ్రీకాకుళం జిల్లాకు తరలివెళ్ళిన నాగలక్ష్మమ్మగారు దాదాపు పది సంవత్సరాలపాటు గృహిణిగా కుటుంబ కార్యక్రమాలకే పరిమితం అయ్యారు. ఉపాధ్యాయురాలిగా, రచయిత్రిగా సమాజానికి ఏదయినా సేవ చెయ్యాలన్న ఉబలాటాన్ని ఒక మధ్య తరగతి పెద్ద కుటుంబంలో గృహిణిగా బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడంలో, రచనలు సాగించడం, తద్వారా సమాజానికి కొంతమేర సూచనల్విడం ద్వారా తీర్చుకొనగలిగారు. తదుపరి 1972 లో ఇచ్ఛాపురం పురపాలక సంఘానికి చెందిన పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేశారు.

పిల్లలకు కేవలం పాఠాలు నేర్పడం మాత్రమే కాకుండా వారిచే రకరకాల నాటకాలు వేయించడం, కళలూ, సారస్వతం పట్ల అభిరుచి పెరిగేలా వారికి చక్కటి ఉపన్యాసాలివ్వడం, ఉత్తమ విద్యార్థులుగా వారిని తీర్చిదిద్దడానికి ప్రయత్నించడం మొదలైన కార్యక్రమాలను పదవీ విరమణ చెందేవరకూ నిర్వర్తించారు.

వీరి నలుగురు పిల్లలూ ప్రస్తుతం దేశ, విదేశాలలో స్థిరపడి ఆనందంగా కాలం గడుపుతున్నారు. ఏడు పదుల వయసులో సైతం గృహిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ సమాజానికి పనికి వచ్చే పనులు చేయాలని తాపత్రయపడే వీరి అలనాటి కథలలో అందుబాటులో ఉన్నవాటిని కొన్నింటినయినా పరిశీలిస్తే...

**1. పంకజం నవ్వింది :** "ఈ ప్రపంచంలో అతి దారుణంగా దోపిడికి గురువుతున్నది స్త్రీ!" అని ఏనాడో చెప్పాడు లెనిన్. తరువాత, తరువాత అలాంటి వాస్తవాలు చాలమంది చెప్పుకొచ్చారు! వేదికలెక్కి ఉపన్యసించారు!! కానీ ఎక్కడా

ఆ దోపిడీ ఆగకపోగా మరింతగా ఎక్కువయింది. వ్యభిచారిణి అనడం అనాగరికంగా భావించి "సెక్స్‌వర్కర్" అని ఆంగ్లంలో అఘోరించడం అలవాటయి పోయింది క్రమంగా.

"వ్యభిచారాన్ని చట్టబద్ధం చేస్తే ఏమి?" అనే నాయకులూ, "చేసేస్తే పాయె!" అనే వినాయకులూ పాలకులలో చోటుచేసుకుంటూ వచ్చారు. ఇహ ఈ దేశంలోని పాలితులలో నిర్భాగ్యులైన స్త్రీలకు దిక్కెవరు? "దేవుడు!" అనడానికి లేదు. ఎందుకంటే వారి నుదుట గీసిన ఆయన ఆ గీతదాటి కలుగజేసుకోడు.

పోనీ ఈ వేదికలెక్కి ఉపన్యాసాలిచ్చే వారయినా కలుగజేసుకుని ఆ నిర్భాగ్యులకు ఏదయినా న్యాయం చేస్తారా? అనే ఆశయినా లేకుండా వారు కూడా అట్టహాసాలతో, ఆర్భాటాలతో, స్త్రీవాదులుగా పత్రికల్లో పేరుకోసం ప్రాకులాడుతున్నారు.

ఇంత పెద్ద సమస్యపై కె. నాగలక్ష్మిగారు అలనాడే వ్రాసిన కథ "పంకజం నవ్వింది".

ఈ కథలో ఆధునిక మానవుడు తనకున్న ఆండదండలతో అండలేని ఆడదాన్ని ఎంతగా దోపిడి చెయ్యడానికి ప్రయత్నిస్తాడో సుస్పష్టంగా దృశ్యమానం చేశారు రచయిత్రి.

నాడు–నేడు–రేపు... ఎప్పటికీ కూడా అన్యాయానికి గురయిన, గురవుతున్న, గురికాబోయే అబలల నిశ్శబ్ద ఆర్తనాదం ఈ కథ. ఈ కథను కలం పేరుతో కాకుండా కె. నాగలక్ష్మి పేరుతోటే వ్రాశారు రచయిత్రి. జూలై 1980 వనితాజ్యోతిలో ప్రచురితమైంది ఈ కథ.

ముప్పై మూడేళ్ళ క్రితమే ఇంత పెద్ద సమస్య మీద అంతటి స్పందనతో గొప్ప కథను వెలువరించిన రచయిత్రి తరువాతి కాలంలో రచనా వ్యాసంగానికి దూరమవుతూ రావడం నిజంగా విచారించాల్సిన విషయం.

**2. సెకండ్ హ్యాండ్ :** మందహాసాల కన్నా విషాదాలే ఎక్కువగా కదలాడే మధ్య తరగతి గృహాలలో బండి నడవడం కోసం తీసుకొనబడే పొదుపు చర్యలు కుటుంబంలోని కొందరు పిల్లలకు ఆనందాన్ని కలిగిస్తే కొందరు పిల్లలకు అంతులేని అసంతృప్తుల్ని మిగిలిస్తాయి. అవి పెరిగి పెద్దవయి చివరికి ఒక్కో సందర్భంలో జీవితాల మీదనే విసుగు పుట్టించేలా తయారవుతాయి ఆ వైనాల్ని హృద్యంగా తెలియజెప్పిన కథ 'సెంకడ్ హ్యాండ్'. ఈ కథ తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) వారి 1986 మినీ కథల పోటీలో ఎన్నిక కావడం ముదావహం. 21–11–1986 ఆంధ్రజ్యోతి వీక్లీలో ప్రచురితమైంది ఈ కథ.

**3. చీకట్లో చిరుదీపాలు :** 1979వ సంవత్సరంలో 'యువ' మాసపత్రికలో ప్రచురితమైన కథ. అప్పటి పరిస్థితులలో మధ్య తరగతి జీవితం ఎంత కష్టంగా, క్లిష్టంగా ఉండేదో కళ్ళకు కట్టినట్లు తెలియజెప్పిన కథ.

అప్పుడప్పుడే తీవ్రమవుతున్న నిరుద్యోగ సమస్యలు, మారుతున్న కాలంలో ఆధునికత పేరిట జరుగుతున్న అనుకరణలు!... అవి తెచ్చిపెడ్తున్న సమస్యలు, తలెత్తుతున్న దౌర్జన్యాలు, స్త్రీని తూలనాడడం, బానిసలా చూడడం, క్రమంగా ముదురుతున్న సినిమా పిచ్చి మొదలైన విషయాలను కళ్ళకు కట్టించి ఆపై పరిష్కార మార్గాలనూ అన్వేషించిన కథ.

**4. నమ్మకం :** హిందూవులు కోటి దేవుళ్ళను పూజిస్తుంటారని అన్యమతస్తులు పరిహసిస్తుంటారు. కొందరు హిందువులు సైతం నాస్తికులుగా మారి ఆస్తికులను పరిహిస్తుండడం కద్దు. సూర్య నమస్కారాలను పరిహసించేవారు కూడా వరుసగా పదిరోజులు వర్షం వదలకుండా పట్టుకుంటే ఇక సూర్యుడు కన్పిస్తాడా? అన్నంతగా దిగులు పడిపోతారు! నాగప్రతిష్టలను, పూజలను విమర్శించే వారికి పాములు పంటలను నాశనం చేసే ఎలుకలు మొదలైన వాటి నుండీ, దొంగల నుండీ కాపాడుతూ రైతుకు పరోక్షంగా సహకరిస్తుంటాయని తెలియదు. ఈ ఆరాధనలన్నింటి వెనుకా సామాన్య శాస్త్రం ఉందని గుర్తించరు. పై వైనాల్ని ఒక మంచికథగా మలచి 'నమ్మకం' పేరిట పాఠకులకు అందించారు కె. నాగలక్ష్మమ్మ గారు.

**5. కడలికి కోపం వచ్చింది :** ముప్ఫయి ఏడేళ్ళ క్రితం దివిసీమ ప్రాంతంలో ఉప్పెన చేసిన ప్రళయతాండవం, భీభత్సం ఎవరూ మరచిపోయి ఉండరు బహుశా. ఆ ఉప్పెనలో సంభవించిన భయానక ఘటనలను, ఆ పెను ఉప్పెన మిగిల్చిన విషాదాలను చాలమంది రచయిత(త్రి)లు తమ కవితలతో, కథలతో దృశ్యమానం చేసి గుండెలు కరిగించారు. శ్రీమతి నాగలక్ష్మమ్మగారు కూడా 'అమృత' కలం పేరుతో ఉప్పెనలా సంభవించిన విషాదాలను మానవ సంబంధాలలోని రాగద్వేషాలతో మిళితం చేసి 'కడలికి కోపం వచ్చింది!' అన్న కథ ద్వారా పాఠకులకు అందజేశారు. ఈ కథ 1978 ఫిబ్రవరి 'మహిళ' మాసపత్రికలో ప్రచురితమైంది.

వైవిధ్య భరితమైన ఇలాంటి కథల నెన్నింటినో వెలువరించిన నాగలక్ష్మమ్మగారు సంవత్సరాల తరబడి విరామం ప్రకటించడం, ఆపై కూడా కవితలకు, వ్యాసాలకు పరిమితం కావడం విచారించదగ్గ విషయం. వారి కలం మళ్ళీ చమరిస్తూ విలువైన రచనలను అందిస్తుందనీ, కథా సంపుటాలను సైతం వెలువరిస్తారనీ ఆశిద్దాం.

**చిరునామా : శ్రీమతి కె. నాగలక్ష్మమ్మ**
ప్లాట్ నెం. 6, అన్నపూర్ణ అపార్ట్‌మెంట్స్
ఎల్.బి. కాలనీ, **విశాఖపట్టణం-17**
సెల్ : 98482 70998

## భావజాల ప్రకటనలకు రచనకు మించిన మాధ్యమం లేదని గుర్తించిన రచయిత్రి, ప్రకృతి ప్రేమికురాలు శ్రీమతి సి. ఉమాదేవి



**చి**త్తూరు జిల్లాలోని చల్లని పుణ్యభూమి మదనపల్లెలో జన్మించి, చిత్తూరు జిల్లా కలికిరిలో ప్రాథమిక విద్య నభ్యసించి, విశాఖపట్టణంలో హైస్కూలు, కళాశాల విద్యలు ముగించుకుని ఆపై హైదరాబాదులో ఉన్నత విద్యనభ్యసించిన పిదప వృత్తిరీత్యా విద్యారంగానికి అంకితమైన రచయిత్రి శ్రీమతి సి. ఉమాదేవి. వీరు హైదరాబాదులోని ఓ పాఠశాలలో కో ఆర్డినేటర్‌గా, వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన తదుపరి ఆ విద్యాసంస్థకే చెందిన జూనియర్ కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లెక్చరర్‌గా తమ సేవలను అందించారు. ఆపై శ్రీనగర్ విద్యానికేతన్ వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గా పదిహేడు సంవత్సరాల పాటు పనిచేసి హైదరాబాదులోనే స్థిరపడ్డారు.

శ్రీ బి. నారాయణరెడ్డి, శ్రీమతి సరస్వతీదేవి అను పుణ్యదంపతులు వీరి తల్లిదండ్రులు. సి. ఉమాదేవిగారి తండ్రిగారు చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూకా చింతలవారిపల్లెకు చెందినవారు కాగా తల్లిగారి స్వస్థలం కలికిరి. ప్రొఫెసర్ సి. ఈశ్వరరెడ్డి గారితో ఉమాదేవిగారి వివాహం 17-08-1969 నాడు జరిగింది. తదుపరి ఉమాదేవిగారి తండ్రిగారు జాయింటు డైరెక్టరుగా (వ్యవసాయ శాఖలో) పదవీ విరమణ చెందినారు.

విశాఖ సెయింట్ జోసెఫ్ కళాశాలలో చదువు సాగిస్తుండిన రోజులలోనే వీరిలో అంతర్గత పరిశీలనాసక్తి, శక్తి మొగ్గ తొడిగాయి. చిన్నతనం నుండీనే తమ మనసులో సజీవ చిత్రాలుగా ముద్రింపబడి వున్న అనేక సంఘటనలు తమ వయసు, ఊహ, పరిశీలనాసక్తులు విస్తరించే కొలదీ విశ్లేషణలతో కూడిన విమర్శనాత్మక భావచిత్ర కదలికలుగా రూపుదిద్దుకోవడం మొదలుపెట్టాయి. వాటి ప్రభావం వల్ల స్పష్టమైన ఆలోచనలు, నిర్దిష్టమయిన అభిప్రాయాలు కుటుంబ సభ్యులతో, స్నేహితులతో సాగే సంభాషణలు, చర్చల ద్వారా వ్యక్తమవడం మొదలైంది. ఇహ ఆపై సాహిత్యానికి సంబంధించిన పఠనం ద్వారా ఆ భావాలు, సామాజిక స్పృహతో కూడిన అవగాహనలు విస్తారమవసాగాయి.

చిన్నతనం నుండీ ప్రకృతి ప్రేమికురాలైన సి. ఉమాదేవిగారి జీవితంలో మరపురాని ఘట్టం అరకులోయ సందర్శనం. ఆ ప్రాంతపు జలపాతాల పరవళ్ళు, లోయల లోతులు, తూర్పు కనుమల తాలూకు ఎత్తయిన కొండలు ఆపై అనంతగిరుల తాలూకు ప్రమాదకరమైన మలుపులతో కూడిన పల్లాలు, దండకారణ్య దర్శనం మొదలైనవన్నీ వారిలోని భావపరం పరలను ఉత్తేజ పరచి రచనా వ్యాసంగం వైపు దృష్టి సారించడానికి దోహదపడ్డాయి. అలా వారు 1968లో రచనలకు శ్రీకారం చుట్టారు.

"సేవారంగంలో గృహిణి పాత్ర" అన్న వ్యాసం ప్రచురింపబడ్డ వీరి మొట్టమొదటి రచన. ఈ వ్యాసం 05-08-1970 ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రమదావనం శీర్షికలో వెలుగు చూసింది. మొట్టమొదటి పర్యాయం ఆంధ్రప్రభ వారి నుండీ పదిహేను రూపాయల చెక్కు అందుకోవడం అద్భుతమైన అనుభూతిగా, పదిలమైన జ్ఞాపకంగా నిలచిపోయింది వారి జ్ఞాపకాలలో.

భావజాల ప్రకటనకు రచనకు మించిన మాధ్యమం మరొకటి లేదని అప్పటికే గుర్తించిన సి. ఉమాదేవిగారు ఇహ వెనక్కి తిరిగి చూసుకోలేదు. వ్యాసాలు, కథలు, కవితలు, నవలికలు వారి లేఖిని నుండి నిరవధికంగా వెలువడడం మొదలు పెట్టాయి.

(ఉద్యోగపరమైన వృత్తి బాధ్యతలు, ఇల్లాలిగా కుటుంబ బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేసినా రచనా వ్యాసంగాన్ని నిర్లక్ష్యం చెయ్యకుండా కొనసాగించడంలో కృతకృత్యులయ్యారు వారు.)

తొలిదశలో దైనందిన జీవితంలో వ్యక్తిగతంగా తమను కదిలించిన సంఘటనలు, విషయాలు, సామాజిక పరంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలు మొదలైన వాటిమీద స్పందిస్తూ వ్యాసాలను వెలువరించిన సి. ఉమాదేవిగారు ఆ తరువాత కథలకు అగ్రతాంబూలాన్ని అందించారు. వాటిద్వారా మమతకూ, మానవత్వానికీ నీరాజనాలు అర్పించి పాఠకుల హృదయాలలో మంచి స్పందనలు కలిగించే ప్రయత్నం చేశారు.

చదువులకు దూరమైన చిన్నారులను గూర్చి, స్త్రీలను గురించి ఎంతో బాధపడే ఈ రచయిత్రి పలు సామాజిక సమస్యల, రుగ్మతల మీద దృష్టి సారించి హృద్యమైన రచనలను అందించడం జరిగింది.

2000 సంవత్సరం వరకూ ప్రచురితమైన తమ కథలలోంచి ఎన్నిక చెయ్యబడ్డ ముప్ఫయి ఒక్క కథలతో 'చిన్ని గుండెల చప్పుళ్ళు' అన్న కథా సంపుటి, 'శిలా పుష్పాలు' అన్న నవల ప్రచురించారు. ఈ రెండు గ్రంథములు 2001 జూన్ మాసములో వెలువడ్డాయి. అనేక సాహితీ, కళాసంస్థలు వీరి ప్రతిభను గుర్తించి కొన్ని అవార్డులను, పురస్కారాలను అందివ్వడం జరిగింది.

అందుబాటులో వున్న శ్రీమతి సి. ఉమాదేవిగారి రచనలలో కొన్నింటినయినా పరిశీలిస్తే...

**1. విముక్తి :** పాతికేళ్ళ క్రితం వ్రాయబడ్డ కథయినా కాలానికి నిలచిన కథ! నిలవాల్సిన కథ!! పురుషాహంకారం బుసలు కొడ్తూ వరకట్నం కోసం అబలల ఉసురు తీస్తుంటే... సబలలుగా మారలేని ఎందరో అభాగ్యురాళ్ళకు ఓ కనువిప్పు, "కట్టుబట్టలతో అయినా సరే మన ఇంటికి వచ్చెయ్యి తల్లీ!" అని ధైర్యంగా అనలేని దీనులైన పిరికి తల్లిదండ్రులందరికీ ఓ కొత్త వెలుగు, అతివల అకాల మరణవార్తలు విని 'అయ్యో' అనుకుని అటువైపు వెళ్ళిపోయే సగటు మనుషులకు ఓ పెద్ద ఆలోచన 'విముక్తి' కథ. ఈ కథ 1988 ఆగస్టు వనితాజ్యోతి మాసపత్రికలో ప్రచురితమైంది.

**2. అంచనా :** కాలం మారింది! మనుషులలో మార్పులు సరేసరి!! ఆ మార్పులు తెచ్చి పెట్టిన స్వార్థపూరిత ప్రవర్తనలను గూర్చి గొప్ప హృదయస్పర్శతో తెలియజెప్పిన కథ 'అంచనా'.

మనుషులు మరణించడం సహజం.

కొన్ని సందర్భాలలో మరణించిన మనిషి చుట్టూ మిగిలిన మనుషులలో కొందరు చేసే స్వార్థపూరిత చర్యలు చిత్రవిచిత్రంగా ఉండడం కన్పిస్తుంటుంది అక్కడక్కడా! అరుదుగా అయినా అప్పుడప్పుడు మరణించిన వ్యక్తి యొక్క పిల్లలు సైతం ఏ మాత్రం మానవత్వం లేకుండా అనురాగ స్పర్శలు మరచి ప్రవర్తించడం కూడా కద్దు. అలాంటి సంఘటనలు కళ్ళ ముందు కన్పించినప్పుడు... "ఎక్కడ్నుండి ఎక్కడికి వెళ్తున్నాం మనం?" అన్న ప్రశ్న కలవరం కలిగిస్తుంది.

'అంచనా' కథలో మరణించిన మనిషి దగ్గరున్న అతని పిల్లలు బాధ్యతలు మరచి మానవత్వం లేకుండా ప్రవర్తించినా అతనికి దూరంగా ఎక్కడో సప్త సముద్రాల కవతలున్న అతని మరో కుమారుడు అంత్యక్రియలకు హాజరు కాలేక విమర్శలకు గురి కావల్సి వచ్చినా, దూరం నుండీనే ఎంతో బాధ్యతతో

అన్నిరకాలుగా తండ్రి రుణం తీర్చుకున్నవైనం పాఠకులకు కళ్ళనీరు తెప్పిస్తుంది ఒక మంచి కథ చదివిన అనుభూతిని మిగిలిస్తుంది. ఈ కథ 6-2-2000 ఈనాడు ఆదివారం అనుబంధంలో ప్రచురితమైంది.

**3. అవతార పురుషుడు :** ఉన్నాడో లేడో, ఉంటే ఎక్కడున్నాడో తెలియని దేవుడు తను ఎవరికీ ఎక్కడా కన్పించక పోయినా కూడా తన విధులను తాను సక్రమంగా నిర్వర్తిస్తున్నాడని అన్పిస్తుంటుంది పలు సందర్భాలలో. ఆయన ఎవరినుండీ ఏమీ ఆశించడన్నదీ పండిత, పామరులకూ తెలిసిన వాస్తవమే! కానీ ఆయనకు ఏదో ఒకటి ఎలాగో ఒకలా ఇవ్వాలన్నది సామాన్య మానవుడి నుండీ మేధస్సు కలిగిన వారి వరకూ ఎందరికో చెందిన తాపత్రయం. అది ఒక విచిత్రం నిజానికి.

ఈ వైచిత్రాన్నే చక్కగా సొమ్ము చేసుకుంటున్నారు దేవదూతలు, దేముడి ప్రతినిధులుగా చెప్పుకుంటున్న మహానుభావులు. ఈ అవతారు పురుషులు అనుభవిస్తున్న వైభవాలు... ఆ అవతారపురుషుల అసలు రంగు అక్కడక్కడ అప్పుడప్పుడు వెలుగులోకి రావడం జరుగుతుంటుంది. అయినా జయజయ ధ్వనులకు అంతం అంటూ ఉండదు.

ఉమాదేవిగారు పండ్రెండు సంవత్సరాల క్రితమే ఆ వైనాన్ని పాఠకుల కళ్ళకు కట్టించారు తమ 'అవతారపురుషుడు' కథలో. ఈ కథ 4-6-2000 ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో ప్రచురింపబడింది.

**4. ఎంతెంత దూరం :** జీవితంలో ఎక్కడెక్కడి వాళ్ళో వచ్చి ఎలాగో కలుసుకుని ఒకటిగా అయిపోతుంటారు. దీనినే స్నేహమనే పేరుతో పిలుస్తారు! అంటారు ఒక ప్రఖ్యాత (స్వర్గీయ) నవలా రచయిత తమ ఒక నవలలో. నిజమే... స్నేహం భగవంతుడిచ్చిన వరం... లేదా... ప్రకృతి ప్రసాదించిన వసంతమే!

ఉద్యోగికి దూరభూమి లేదు అన్నది నానుడి. తాలూకాలు దాటి, జిల్లాలు దాటి, రాష్ట్రాలు దాటి భాషకాని భాష, దేశంకాని దేశం అన్నట్లుగా బదిలీలపై సుదూర ప్రాంతాలకు వెళ్తుంటారు ఉద్యోగులు. అక్కడ వాళ్ళ వాళ్ళ కుటుంబాలకు కొత్తకొత్త కుటుంబాలతో, మనుషులతో పరిచయాలు, ఒక్కోసారి మంచి ఆత్మీయ స్నేహ సంబంధాలు ఏర్పడుతుంటాయి. మళ్ళీ బదిలీ అయ్యేసరికి రైల్లో

పరిచయాలు, స్నేహాలులాగా బాధగా అయినా చప్పున తెగిపోతుండడం ఒక క్రూరమైన విషాదం నిజానికి. స్నేహశీలుర కయితే మరీ దుఃఖకారణం!

భర్త ఉద్యోగరీత్యా ఎక్కడో ఢిల్లీలో ఎక్కువ కాలం నివసించిన ఒక స్నేహశీలురాలు అక్కడి కొన్ని కుటుంబాలతో ఆత్మీయ స్నేహనుబంధాలను పెంచుకుని ఆనందంగా జీవిస్తున్న సమయంలో భర్తకు స్వరాష్ట్రానికి... అందునా రాష్ట్ర రాజధానికి బదిలీ అయేసరికి విషాదానందాల మధ్యన అక్కడి బంధాలను బాధతో వదులుకొని... స్వంతనేల, స్వభాష అక్కడ అనుబంధాలకు కరువా అని అనుకుంటూ వచ్చి... తీరా స్వంత రాష్ట్రంలో పొందిన అనుభవాల, అనుభూతుల దర్పణం 'ఎంతెంత దూరం?'. ఈ కథ 25-2-2000నాడు ఆంధ్రభూమి దినపత్రికలో ప్రచురింపబడింది.

**5. డబుల్ రొట్టె :** "భగవంతుడు కొంతమందిని స్రష్టలుగా, కొంతమందిని ద్రష్టలుగా, కొంతమందిని పతితులుగా, కొంతమందిని కార్యశూరులుగా సృష్టిస్తే బావుండేది!" అంటారు ఒక ప్రఖ్యాత (స్వర్గీయ) రచయిత తమ ఒక నవలలో. నిజంగానే భగవంతుని సృష్టి అలా జరిగివుంటే ఎంత బావుండేది?

అలాకాక ప్రపంచంలో ఎక్కడ చూసినా నిరుపేదలు, పేదలు, దిగువ మధ్య తరగతి వారు, ఎగువ మధ్య తరగతి వారు, సంపన్నులు, సుసంపన్నులు, కుబేరులు, అపర కుబేరులు మాత్రమే ఎక్కువగా కన్పిస్తున్నారు. అందరికన్నా నిరుపేదల జీవితాలలోని చీకట్లయితే మరీ కనాకష్టంగా కునారిల్లుతున్నాయి.

'ఏరుకు తినే కోడిముక్కులో ముళ్ళు విరిగె' అన్నట్లుగా నిరుపేదల జీవితాలలో విషాదాలు జరిగితే కాలే కడుపుకు మాడే గంజి కూడా కష్టమే అన్న వాస్తవాలని దృశ్యమానం చేస్తూ వ్రాయబడ్డ కథ 'డబుల్ రొట్టె'. పై తెలిపిన విషాదకర పరిస్థితిలో వున్న నిరుపేద కుటుంబంలో జబ్బుపడ్డ ఓ పసికందు 'డబుల్ రొట్టె (పెద్ద నాన్‌రొట్టె లేక పెద్ద బ్రెడ్డు) కావాలని కోరితే అతని కోరిక తీర్చడానికి తల్లిదండ్రులు పడిన శ్రమ సంఘర్షణలను కళ్ళకు కట్టించిన కథ. ఈ కథ నవంబరు 1988 కలువబాల పక్షపత్రికలో ప్రచురితమైంది.

**6. సాలీడు :** క్రమశిక్షణా రాహిత్యం, అపరిశుభ్రత, అవినీతి... ఇవి ఏ సంస్థనయినా అధమస్థితికి చేరుస్తాయి. అలా కానీయకుండా అవినీతికి అడ్డుకట్ట వెయ్యగలిగిన వాడే నిజమైన అధికారి. అలాంటి అధికారులైతేనే దేశాన్ని

అభ్యున్నతివైపు నడిపించి అత్యుత్తమ దేశంగా ప్రపంచంలో గుర్తింపును తీసుకు రాగలుగుతారు అన్న విషయాన్ని వస్తువుగా చేసుకుని వ్రాయబడ్డ కథ 'సాలీడు'.

దేశంలో ఉత్తమ ఉద్యోగులున్నట్లే అవినీతి ఉద్యోగులూ ఉన్నారు. నిజానికి అవినీతి ఉద్యోగుల సంఖ్యే అధికమై పోతుండడం సామాజిక పరంగా భయాందోళనలను కలిగిస్తున్న అంశం. వారు ప్రగతి నిరోధకులవుతుంటారు ఎక్కువగా. వీరివల్ల వివిధ సమస్యలతో కూడిన సంఘర్షణలను ఎదర్కొన్న ఒక అత్యుత్తమ అధికారి కథ సాలీడు. 2-6-2000 'మయూరి' వారపత్రికలో ప్రచురితమైంది ఈ కథ.

వైవిధ్య భరితమైన వస్తువులను స్వీకరిస్తూ ఇలాంటి శక్తివంతమైన కథలను ఎన్నింటినో అందించిన రచయిత్రి శ్రీమతి సి. ఉమాదేవిగారు అభినందనీయులు. వారి లేఖిని నుండి మరింత శక్తివంతమైన రచనలు నిరవధికంగా వెలువడి సమాజానికి శాంతి సందేశాలను అందించగలవని ఆశించడం పేరాశ కాదు.

**రచయిత్రి చిరునామా :**

**శ్రీమతి సి. ఉమాదేవి,** ఎం.ఎ., బి.ఇడి.
8-3-960/6/2, WINGS
శ్రీ నగర్ కాలనీ,
హైదరాబాదు - 5000 073
ఫోను : 98858 09250

## స్వార్థం పురులు విప్పుకుని నృత్యం చేస్తున్న సమాజానికి సమర్పించదగిన రచనలను అందించిన కవి, కర్షకులు మరియు సమాజ సేవకులు శ్రీ కె. రామకృష్ణ



**పం**డితులనేకాక పామరులను సైతం ఆకట్టుకోగల సున్నితమైన భాష, ఇబ్బంది లేకుండా చదివించగలిగే సులభశైలి, ఏ విషయాన్నైనా మనసుకు హత్తుకునేలా చెప్పగల నేర్పు, ఆయన కలానికున్న బలం! కథ వ్రాసినా, కవిత వ్రాసినా, వ్యాసాన్ని వెలువరించినా అందులో అపారమైన జీవితానుభవం అంతర్గతంగా కన్పించడం ఆయన రచనలలోని ప్రత్యేకత. దాదాపు ముప్ఫయి అయిదు సంవత్సరాలపాటు ఉపాధ్యాయులుగా పనిచేసిన అనుభవం తాలూకు క్రమశిక్షణ, కట్టడి వారి రచనలలోనూ దోబూచులాడుతుంటాయి. ఏ సాహితీ కార్యక్రమాన్నయినా క్రమబద్ధంగా నడిపించడంలోనూ ఆయనకు ఆయనే సాటి. ఆయనే విద్యారంగంలో, సాహితీరంగంలో, వ్యవసాయరంగంలో కూడా వెలుగొందుతున్న డెబ్బయి తొమ్మిదేళ్ళ నవయుకులు శ్రీ కె. రామకృష్ణగారు. కవిగా, కథకులుగా, నాటక రచయితగా, నవలాకారులుగా, బాలసాహితీవేత్తగా, రేడియో కళాకారులుగా, లెక్కలేనన్ని వ్యాసాలు వెలువరించిన వారుగా పాఠకులకు, శ్రోతలకు పరిచితులు! చిత్తూరు జిల్లా రచయితల సంఘ కార్యదర్శిగా, ఆపై ఉపాధ్యక్షులుగా సుపరిచితులు!!

చిత్తూరు జిల్లా, తవణంపల్లె తాలూకాలోని పవిత్ర పుణ్యక్షేత్రం అరగొండ అర్ధగిరి ఆంజనేయస్వామి ఆలయ పరిధిలోని దిగువమాఘం గ్రామంలో తేది 15-6-1935 నాడు శ్రీ కె. రామకృష్ణగారి జననం జరిగింది. శ్రీమతి సాయమ్మ, శ్రీ కె. లక్ష్మయ్యనాయుడు అను పుణ్యదంపతులు వీరి తల్లిదండ్రులు. వీరిది వ్యవయసాయ ఆధారిత సాంప్రదాయ కుటుంబం. తండ్రి శ్రీ లక్ష్మయ్యనాయుడు గారు వ్యవసాయం చేస్తూ, గ్రామంలో భజన మండలిని నిర్వహించేవారు. తల్లి సాయమ్మగారు సాధారణ గృహిణిగా కుటుంబ బాధ్యతలను నెరవేర్చేవారు.

శ్రీ రామకృష్ణగారి ప్రాథమిక విద్యాభ్యాసం దిగువమాఘంలోనే జరిగింది. ఉన్నత పాఠశాల విద్య అరగొండలో, కళాశాల విద్య తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో సాగింది.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి 'విద్వాన్' పట్టా పొందిన తరువాత మైసూరు రీజనల్ కళాశాల ద్వారా 'కళ–సంస్కృతి' అన్న అంశం మీద ప్రత్యేక శిక్షణ పొందారు. పండితశిక్షణ రాజమండ్రి ప్రభుత్వకళాశాల నుండి పొందారు. చిత్తూరు జిల్లా వారికి తెలుగు రాదని తోటి విద్యార్థులు అవహేళన చేశారట. వారందరిని తలదన్నుతూ పరీక్షలో ప్రథములుగా నెగ్గారట.

చిత్తూరు జిల్లా పుంగనూరు బోర్డు హైస్కూలులో తెలుగు పండితులుగా శ్రీ కె. రామకృష్ణగారి ఉద్యోగ జీవనయానం ప్రారంభమైంది. కొద్ది నెలలు గడిచాక వారు చిత్తూరు కణ్ణన్ ఉన్నత పాఠశాలకు మారారు. తదుపరి 1958వ సంవత్సరం నవంబరు మాసములో శ్రీ కె. రామకృష్ణగారికి చిత్తూరు మునిసిపాలిటీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులుగా శాశ్వత ప్రాతిపదికపై ఉద్యోగం లభ్యమైంది. ఆపై వారు చిత్తూరు ఉన్నత పాఠశాలలలోనే ఉపాధ్యాయులుగా పనిచేసి 1993లో పదవీ విరమణ చెందడం జరిగింది.

రైతు కుటుంబం నుండీ ఎదిగిన రామకృష్ణగారు ఉద్యోగిగా కొనసాగినా వ్యవసాయాన్ని మాత్రం నిర్లక్ష్యం చెయ్యలేదు. తమ పొలాల వ్యవహారాలు తామే చూసుకుంటూ వచ్చారు. పదవీ విరమణ తదుపరి పూర్తిస్థాయిలో వ్యవసాయంపై దృష్టి సారించారు.

విద్యార్థి దశలోనే కళాశాల సారస్వత సంఘానికి కార్యదర్శిగా కొనసాగిన రామకృష్ణగారికి సాహిత్యం పట్ల అభిరుచి పెరగడానికి మాన్యశ్రీ పి. రాజగోపాలనాయుడు, వీర రాఘవన్, అవధాని అల్లసాని రామనాథశర్మ లాంటి సాహితీవేత్తలతో ఏర్పడుతూ వచ్చిన పరిచయాలు సహకరిస్తూ వచ్చాయి. సాహిత్య అధ్యయనంతో తమ మేధస్సుకు మెరుగులు దిద్దుకుంటూ రచనా వ్యాసంగంలోకి అడుగిడే ప్రయత్నం చేశారు.

వీరి మొట్టమొదటి వచన కవిత 'లోకంపోకడ' తిరుపతి నుండీ వెలువడుతుండిన 'వెలుగు' పత్రికలో 1955వ సంవత్సరంలో వెలుగు చూసింది. మొట్టమొదటి కథ 'జననీ జన్మభూమిశ్చ' రాజమండ్రి నుండి వెలువడుతుండిన 'ఆంధ్రరత్న' దినపత్రికకు చెందిన ఆదివారం అనుబంధంలో తేది 20–5–1962 నాడు ప్రచురితమైంది. ఆకాశవాణిలో ప్రసారమైన వీరి మొట్టమొదటి కవిత 'ప్రగతి ప్రయాణం'. ఈ కవితతో కడప రేడియో కేంద్రం ద్వారా రామకృష్ణగారి స్వరం శ్రోతలకు పరిచయం అయింది. శ్రీ రామకృష్ణగారు తమ జీవితంలో మొదటి ఉపన్యాసాన్ని చవటపల్లెలో ఇవ్వడం జరిగింది. ఆవూరి పాఠశాల యొక్క స్వంత భవన నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం జరిగినప్పుడు ప్రఖ్యాత

జర్నలిస్టు, సాహితీవేత్త అయిన శ్రీ జి. కృష్ణగారి అధ్యక్షతన జరిగిన ఆ సభకు ముఖ్య అతిథిగా శ్రీ కె. రామకృష్ణగారు హాజరయ్యారు.

చిత్తూరులో ఉపాధ్యాయులుగా స్థిరపడే సమయానికే శ్రీ కె. రామ్కృష్ణగారి చుట్టూ ఒక మంచి సాంస్కృతిక వాతావరణం స్థిరపడి ఉంది. అప్పటికే వారికి సాహితీరంగంలో నిష్ణాతులయిన గౌరిపెద్ది రామసుబ్బశర్మగారిలాంటి ప్రముఖుల వద్ద శిక్షణ కూడా లభ్యమయివుంది. 1920 నుండీ నాటకరంగానికి చేయూతనిస్తూ సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు జయప్రదంగా నిర్వహించిన శ్రీ రామ విలాస సభ స్థబ్దతతో వున్నా ప్రభావాన్ని పూర్తిగా కోల్పోలేదు అప్పటికి.

1950లో ఆవిర్భవించిన ఆర్ట్లవర్స్ యూనియన్ మంచి ఊపుమీద ఉన్నది. అక్కడ శ్రీ రామకృష్ణగారికి సర్వశ్రీ శ్రావణి మునిసుందరం, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, సి. హెచ్. వెంకటరత్నం (ద్వారకా), మధురాంతకం రాజారాం, వి. జయరాం, ముంగర శంకరరాజు, ఇరువారం లోకనాధం, రామకృష్ణ కటాక్ష, సి. వేణు, ఎం.ఆర్. చంద్ర, కానిపాకం లింగన్న, అనంతనారాయణ, జనాబ్ రహీం మొదలైన రచయితల సాన్నిహిత్యం తోడు కావడంతో రచనా వ్యాసంగాన్ని మరింత మెరుగు పెట్టుకొనడానికి అవకాశం లభ్యమైంది.

ఆనాడు ప్రముఖంగా వస్తుండిన ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికలతోపాటు మధ్య తరగతి పత్రికలు మరియు చిన్న పత్రికలు చాల వాటిలో రామకృష్ణగారి రచనలు చోటు చేసుకుంటూ వచ్చాయి. విదేశాలలో సైతం వీరి రచనలు వెలుగుచూశాయి. తెలుగు జగతి, తెలుగు పలుకు, తెలుగు వసుధ మొదలైన విదేశాల తెలుగు సావనీర్లలో, పత్రికలలో వారి రచనలు ప్రచురింపబడ్డాయి.

ఆకాశవాణి కడప, తిరుపతి, మద్రాసు కేంద్రాల నుండీ వారి సూక్తులు, కవితలు, సారస్వత ప్రసంగాలు ప్రసారమవుతూ వచ్చాయి. వీరి నవల 'స్వయంకృతం' ఆకాశవాణి తిరుపతి కేంద్రం తాలూకు నవలా స్రవంతి కార్యక్రమంలో ప్రసారమైంది.

"సౌందర్య గ్రహణము పెద్దలకు వలెనే పిల్లలూ చేస్తారు. కావ్యానందాన్ని పెద్దలకు వలెనే పిల్లలూ పొందుతారు" అన్న చింతా దీక్షితుల వారి వాక్కులతో ప్రభావితులైన రామకృష్ణగారు... "బాలబాలికలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలంటే వారికి సాహిత్యంపట్ల అభిరుచిని కలిగిస్తూ వారికి ఉత్తమోత్తమ మైన బాల సాహిత్యాన్ని అందించడమే మంచిమార్గం!" అని భావిస్తూ వచ్చారు. అందుకు తమవంతు ప్రయత్నంగా మానసిక వికాసాన్ని, ఆలోచనా పరిధిని విస్తరింపజేయగల బాలల కథలు వ్రాస్తూ వారిని జాగృతి పరచే ప్రయత్నం మొదలుపెట్టారు. అలా ప్రచురితమైన అనేక కథలలోంచి కొన్నింటిని ఎన్నిక

చేసి 'కథా గుచ్ఛము' అన్న శీర్షికతో గ్రంథ రూపంలో వెలువరించగా దాని విలువను గుర్తించిన ప్రభుత్వం 1961వ సంవత్సరంలో చిత్తూరు జిల్లా ఆరవ తరగతి విద్యార్థులకు 'కథాగుచ్ఛము'ను ఉపవాచకంగా నిర్ణయించడం జరిగింది. వీరి కథ ఒకటి మహారాష్ట్రలోని తెలుగు వాచకాల్లో నాలుగు సంవత్సరాలుగా వస్తున్నదట.

వీరి రచనలలో 'స్వయంకృతం' నవల వీరికి పేరు ప్రఖ్యాతులను తెచ్చి పెట్టింది. చిత్ర విచిత్రమైన మానవ మానసిక స్థితిగతులను, సంఘర్షణలను, పురుషులలో అంతర్గతంగా వున్న శారీరక, మానసిక బలహీనతలవల్ల స్త్రీలపట్ల వారి ప్రవర్తనలలో అందుకు తలవొగ్గే స్త్రీల మానసిక స్థితిని, వాటి పరిణామాలనూ ఈ నవలలో చిత్రించారు రామకృష్ణగారు.

ఈ నవలలో కొన్ని సంఘటనలను పరిశీలించినప్పుడు ఒక ప్రఖ్యాత సాహితీవేత్త ఒక సందర్భంలో అన్న... "ఒక పురుషుడు తాను పురుషుడిననీ, ఒక స్త్రీ తాను స్త్రీననీ మరచిపోయి స్నేహం చెయ్యగలిగితేనే వారి మధ్య స్నేహం హర్షించదగ్గ స్నేహ సౌశీల్యంగా మారుతుంది" మాటలు మననానికి వస్తాయి.

స్త్రీ పురుషులు తమ జండర్‌లను మరచి పోలేకపోతూ స్నేహంగా ఉండడం వల్ల జరిగే అనర్థాన్ని చాల చక్కగా చెప్పడానికి ప్రయత్నించారు రామకృష్ణగారు 'స్వయంకృతం' నవలలో.

"స్వార్థం పురులు విప్పుకుని నృత్యం చేస్తున్న సమాజానికి సమర్పించ దగిన నవల 'స్వయంకృతం' అన్నారు ప్రఖ్యాత కథా, నవలా రచయిత శ్రీ కె. సభాగారు. ఆనాటి మేధావులు, పత్రికల ప్రశంసలు పొందిన నవల స్వయంకృతం.

కథల విషయానికి వస్తే... పెద్దలనూ, పిల్లలనూ, వృద్ధులనూ కూడా ఆలోచింపజేయగల కథలు వారివి. ఉదాహరణగా వారి కథ 'విజేత'ను తీసుకుందాం. క్లుప్తతకు ప్రాధాన్యత ఇస్తూ, శిల్పపరంగా లోపాలు తలెత్తకుండా మంచి నిర్మాణ సౌష్టవంతో వ్రాయబడ్డ చిన్నకథ ఇది!... ఒక ఆటలో సెంచరీ చేసి, ఆ విజయంతో అనేక బహుమతులు పొందవచ్చనే స్థిర నిశ్చయంతో ముందుకు సాగే ఓ విద్యార్థి తన పెద్ద ఆశను, విజయకాంక్షను పక్కన పెట్టి సమాజ హితకరమైన ఓ చిన్న చర్యకు ప్రాధాన్యతనిచ్చి అందులో పాల్గొనడం కథాంశం. ఈ కథలో మనిషితనానికి చెందిన అంతర్లీన సందేశం ఒకటి అవగతమవుతుంది. కథా నిర్మాణపరంగా కూడా రచయిత చాల జాగ్రత్త తీసుకుని శ్రద్ధగా రచన సాగించారు. వీరి కథలలో ఈ మంచి లక్షణాలు కన్పిస్తాయి.

ఇహ వీరి వ్యాసావళి విషయానికి వస్తే... పత్రికా రచయితగా, రేడియో కళాకారులుగా వందలాది వ్యాసాలు, ప్రసంగాలు వెలువరించారు. అనేకమంది విద్యావేత్తలు, మేధావులచే ప్రశంశలను పొందారు.

వారు తమ వ్యాసాలలోంచీ కొన్నింటిని ఎంపిక చేసి దాదాపు పంద్రెండు సంవత్సరాల క్రితం 'సంస్కార శోభ' అన్న పతాక శీర్షికతో గ్రంథముద్రణ గావించి విడుదల చేశారు. ఈ గ్రంథములోని ప్రతి వ్యాసం నూతన విషయాలను విశదీకరించే ప్రయత్నం చేసి పాఠకుల మన్ననలను పొందగలిగింది.

ఆచార్య పి.వి. అరుణాచలం, శ్రీ మేడసాని మోహన్, ఆచార్య కె. సర్వోత్తమరావు, డా॥ యన్.గోపి, పండిత పణతుల రామేశ్వరశర్మ, డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి లాంటి ప్రముఖుల ప్రశంశలు పొందిన ఈ గ్రంథానికి 2000 సంవత్సరానికిగాను ప్రతిష్టాత్మకమైన శ్రీమతి కుప్పం రెడ్డెమ్మ సాహిత్య సొసైటీవారి సాహితీ అవార్డు లభ్యమైంది.

1981వ సంవత్సరంలో సాహిత్య అకాడమీ సభ్యులుగా కొనసాగిన శ్రీ కె. రామకృష్ణగారు అనేక సంఘాలకు, అకాడమీలకు అధ్యక్షులుగానో, కార్యదర్శిగానో, సభ్యులుగానో, సలహాదారులుగానో అనేక సేవలందించారు. ప్రభుత్వ పరంగానే గాక ప్రయివేటుగా కూడా అనేక విలువైన అవార్డులనూ, పురస్కారాలనూ పొందగలిగారు... పొందుతున్నారు...

అందుబాటులో వున్న శ్రీ కె. రామకృష్ణగారి గ్రంథాలు :

1. స్వయంకృతం – నవల
2. సంస్కార శోభ – వ్యాస సంపుటి
3. కథా తోరణం – పిల్లల కథా సంపుటి
4. కథా గుచ్ఛము – బాల సాహిత్యం (ఉపవాచకము)
5. కన్నెపూలు – కావ్యం
6. సుమరాణి, గౌతమ బుద్ధుడు – నాటికలు
7. తేనె చినుకులు – వ్యాససంపుటి

శ్రీ కె. రామకృష్ణగారు సమాజ హితకరమైన రచనలు చేస్తూ నిండు నూరేండ్లు ఆనందంగా గడపాలనీ, మరిన్ని ప్రశంసలూ, పురస్కారాలు, అవార్డులు పొందాలనీ కోరుకుందాం.

**శ్రీ. కె. రామకృష్ణగారి చిరునామా :**

**విద్వాన్ కె. రామకృష్ణ**

3–431, పగడమాను వీధి, గిరింపేట, చిత్తూరు – 517 002

ఫోన్ : 08572 – 240189.

**చక్కటి చదివించే గుణంతో, మానవత్వపు విలువలు గుబాళిస్తూ... గుండెల్ని కదిలించి ఆలోచింపజేసే కథల నందించిన కథకుడు శ్రీ సి.ఎన్. చంద్రశేఖర్**



డార్విన్ సిద్ధాతం తదుపరి 19వ శతాబ్దంలో సామాజిక వ్యవస్థలో అంతకు ముందుండిన భావాలలో ఎక్కువ వాటిని ఆలోచనాపరులు సవాలు చెయ్యడం ప్రారంభమైంది. విదేశాలలో కారల్ మార్క్స్, సైకాలజిస్ట్ ఫ్రాయిడ్ మొదలైన వారిలాగే మనదేశంలో కూడా రాజారాంమోహన్‌రాయ్, వీరేశలింగం పంతులు మొదలైన వారు నూతన ఆలోచనా విధానాలకు, సామాజిక హితకరమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఆయా ప్రభావాలన్నింటిలోంచీ మొదట నవల తరువాత కథ ఉద్భవించాయి.

20వ శతాబ్దంలో భారతదేశంలో ఆధునిక సాహిత్య ప్రక్రియ అయిన కథ మొదటిసారిగా పైకి రావడం జరిగింది. అంతకు ఏభయి సంవత్సరాలకు ముందే రష్యా, అమెరికాలలో ఏకకాలంలో కథా ప్రక్రియ తన ప్రభావాన్ని చూపడం మొదలయ్యిందని అంటారు ప్రఖ్యాత సాహిత్య విమర్శకులు స్వర్గీయ వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి తొలి కథకులుగా తాతాచారి (నేలటూరు వెంకటాచలం పంతులు), భండారు అచ్చమాంబ, గురజాడ అప్పారావు గార్లు కన్పిస్తున్నారు.

గౌరవనీయులు సి.పి. బ్రౌన్‌గారు 1855లోనే తాతాచారి కథలను ప్రచురించగా, తమ ముప్పయ్యవ యేట (18–1–1905 నాడు) మరణించడానికి మూడేండ్లకు మునుపే 1902లో భండారు అచ్చమాంబ గారు వ్రాసిన 'ధన త్రయోదశి' అన్న కథ వెలుగు చూసినట్లు తెలుస్తున్నది. ఇక 1910లో ప్రచురితమైన గురజాడ అప్పారావుగారి 'దిద్దుబాటు' కథ జగత్ప్రసిద్ధము.

'దిద్దుబాటు' కథ వెలువడిన తరువాత 34 సంవత్సరాలకు గానీ చిత్తూరు జిల్లాలో ఆధునిక కథ వెలుగు చూడలేదు. 1944 ఏప్రియల్ 'చిత్రగుప్త' మాస పత్రికలో వెలువడిన కె. సభాగారి కథ 'కడగండ్లు' చిత్తూరు జిల్లాలో తొలి ఆధునిక కథగా భావింపబడ్తున్నది. అయితే ఇటీవల తవ్వావెంకటయ్య, పొదిలి నాగరాజులాంటి పరిశోధక విద్యార్థుల ద్వారా వెలుగుచూస్తున్న విషయాలనుబట్టి 1927 ప్రాంతంలోనే చిత్తూరుజిల్లా మదనపల్లె నుండీ ఎం.వి. పాపన్నగుప్త అను స్వాతంత్ర సమరయోధుడు కథలు, నవల వెలువరించినట్లు వెలుగులోకి వచ్చినది.

ఆహా అక్కడ్నుండీ ఎందరో చిత్తూరు జిల్లా కథకులు తమ, తమ సాహితీ సృజనలతో తెలుగు సాహిత్య 'కథావనాన్ని' సుసంపన్నం చేస్తూ వచ్చారు.

ఇటీవలి కాలంలో అతి తక్కువ వ్యవధిలో వందలాది కథలను, కొన్ని నవలలను వ్రాయడమేగాక ఆరు కథా సంపుటాలను, రెండు నవలలను గ్రంథ రూపాలుగా వెలువరించిన ఘనత చిత్తూరు రచయిత శ్రీ సి.యన్. చంద్రశేఖర్ గారికి దక్కుతుంది.

కథ వ్రాయడం సామాన్యమైన విషయం కాదు. కథా నిర్మాణానికి అవసరమైన వస్తువు, పాత్రలు, సంఘటనలు మొదలైన వాటి కూర్పుకు సంబంధించిన నిర్దిష్టమైన చట్రం ఉండదు నిజానికి. కథను నడిపించే సిద్ధాంతం కూడా కథలో వెలుపలికి కన్పించదు. వీటన్నింటినీ సమన్వయ పరచగల మానసిక శక్తి సామర్థ్యాలు రచయిత కలిగివుండాలి. ముఖ్యంగా రచయితకు వాస్తవిక జీవితం పట్ల సదవగాహన, మనుషుల ప్రవర్తనలలో వచ్చే మార్పులను గమనించగల నేర్పు, సామాజిక సంబంధాలు మారుతున్నప్పుడు మార్పు చెందే సామాజిక నిర్మాణాల (Social Formations) ను అర్థం చేసుకోగల స్థాయి తప్పకుండా ఉండాలి.

పైన తెలిపిన విషయాలన్నింటి మీద అధికారాన్ని సంపాదించి ఆశాజనంగా వ్రాస్తూ కన్పిస్తున్న రచయితలలో ఒకరు సి.యన్. చంద్రశేఖర్. తంతి తపాలా శాఖలో కొంతకాలం, మెడికల్ రెప్రజెంటెటివ్‌గా కొంతకాలం, సిండికేట్ బ్యాంకులో కొంతకాలం పనిచేసిన పిదప గత 28 సంవత్సరాలుగా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తుండడం వీరికి అపారమైన జీవితాను భవాన్ని, రకరకాల మనుషుల మనస్థత్వాలను పరిశీలించి ఆకళింపు చేసుకోగల చాతుర్యాన్ని కలిగించాయి. రచయితగా ఎదగడానికి ఎంతో సహకరించాయి.

వీరి జీవితాన్ని పరిశీలిస్తే ... చిత్తూరు పట్టణానికి చెందిన శ్రీ.సి. నారాయణరావు, శ్రీమతి కామాక్షీబాయి అను పుణ్యదంపతులు శ్రీ సి.యన్. చంద్రశేఖర్‌గారి తల్లిదండ్రులు. వీరి తండ్రిగారు తహసీల్దారుగా పనిచేసే వారు. కామాక్షీబాయిగారు గృహిణి. 2-9-1958నాడు నెల్లూరులో మాతామహుల ఇంట సి.యన్. చంద్రశేఖర్‌గారి జననం జరిగింది.

చిత్తూరు గిరింపేట పురపాలక ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్య, గిరింపేట పురపాలక ఉన్నత పాఠశాలలో హైస్కూలు చదువు, పి.సి.ఆర్. ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఇంటర్, చిత్తూరు ప్రభుత్వ కళాశాలలో బి.ఎస్‌సి. పూర్తి చేశారు.

తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీలో ఎం.ఎస్‌సి. (మ్యాథ్స్) చేస్తున్నప్పుడు తొలి ఉద్యోగం లభ్యమవడంతో చదువుకు అంతరాయం ఏర్పడింది.

ఉద్యోగ జీవితం ప్రారంభమయ్యాక తండ్రిగారితో కుటుంబ బాధ్యతలను పంచుకుని సహకరించారు. ఒక తమ్ముడు కార్పొరేషన్ బ్యాంకు మేనేజరుగా, మరో తమ్ముడు ఇన్సూరెన్సు కంపెనీలో ఆఫీసరుగా స్థిరపడ్డారు. చెల్లెలు గృహిణి.

చిరంజీవి రాధిక గారితో వీరి వివాహం 6-2-1984 నాడు హైదరాబాదులో జరిగింది. పట్టభద్రురాలైన ఆమె సహధర్మచారిణిగా ఆ గృహానికి వన్నె తెచ్చింది. ఆదర్శ దంపతులుగా గుర్తింపు పొందిన వీరి పుత్రుడు చి॥ కృష్ణచైతన్య ఎం.టెక్ చేసి చెన్నైలో సాఫ్టువేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. గాయకులుగా, కీబోర్డు ప్లేయర్‌గా కళామతల్లికి సేవలందిస్తున్నారు. కుమార్తె చి॥ హిమబిందు బి.టెక్. చదివి బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తూ గాయనిగా హైదరాబాద్‌లో పలు టి.వి. కార్యక్రమాలలో పాల్గొంటూ వుంటారు. వీరి భర్త ఎం.ఎస్. మోహన్‌రావుగారు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు.

సాహిత్య విషయానికి వస్తే... సి.యన్. చంద్రశేఖర్‌గారి తండ్రిగారు మంచి సాహిత్యాభిమాని. చందమామ మొదలుకుని వార, మాస పత్రికలన్నీ కొని తెచ్చేవారు. తెలుగు నవలలే కాక జేమ్స్ హేడ్లీ చేజ్, హెరాల్డ్ రాబిన్స్ మొదలైన వారి ఆంగ్ల నవలలను కూడా లైబ్రరీల నుండీ, మిత్రుల నుండీ తెచ్చేవారు. వారు చదివిన పిదప కుటుంబ సభ్యులు కూడా చదివేవారు. ఒక్క పుస్తకాన్నీ వదలకుండా చదువుతూ వచ్చిన చంద్రశేఖర్ గారికి కొంతమేర తెలుగు, ఆంగ్ల సాహిత్యాలను అధ్యయనం చెయ్యడానికి చిన్నతనంలోనే అవకాశం లభ్యమైంది. క్రమంగా రచయితగా ఎదగడానికి తోడ్పడింది.

రచనా ప్రస్థానం... మయూరి వారపత్రికలో 1991వ సం॥లో ప్రచురితమైన 'బంద్' అన్న కార్డు కథ వీరి మొట్టమొదటి రచన. 2001వ సంవత్సరం నుండీ విస్తృతంగా వ్రాయడం మొదలు పెట్టారు. దాదాపు అన్ని పత్రికలలోనూ వీరి రచనలు ప్రచురింపబడ్డాయి. కొన్ని కథలు కడప, తిరుపతి ఆకాశవాణి కేంద్రాల నుండీ ప్రసారం అయ్యాయి. 'షాక్' అన్న కథ టెలిప్లేగా సప్తగిరి ఛానెల్‌లో ప్రసారం అయింది.

పాతిక కవితలు, రెండు నవలలు, నూట ఏభైకి పైగా కథలు వివిధ పత్రికలలలో ప్రచురితం అయ్యాయి.

గ్రంథ రూపాలుగా...

1. నీకోసమే, కథా సంపుటి 2004, 2. కనులు మాటలాడునని, కథా సంపుటి 2004, 3. స్రవంతి, నవల 2005, 4. ఊటిలో ఓ సాయంకాలం,

కథా సంపుటి 2005, 5. అతడే హీరో, నవల 2006, 6. నీ మనసు నాకు తెలుసు, కథా సంపుటి 2007, 7. మన్నించుమా ప్రియా, కథా సంపుటి 2008, 8. స్వాతిముత్యం, కథా సంపుటి 2009.

వీరికి లభ్యమైన పురస్కారాలు ...

1. శ్రీ సుద్దపల్లి వెంకయ్య నాయుడు సాహితీ అవార్డు. 2. శ్రీమతి కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డు 2008. 3. చిత్తూరు లయన్స్ క్లబ్ వారి ప్రోత్సాహక పురస్కారం. 4. ప్రజాహిత సేవాసంస్థ చిత్తూరు వారి అభినందన పురస్కారం. 5. హరివిల్లు సాంస్కృతిక సంస్థ చిత్తూరు వారి అభినందన పురస్కారం. 6. ఘంటసాల కళాంజలి సంస్థ అభినందన సన్మానం.

చక్కటి చదివించే గుణంతో, మానవత్వపు విలువలు గుబాళిస్తూ పాఠకుల్ని చదివించి, గుండెల్ని కదిలించి ఆపై ఆలోచింపజేసే వీరి కథలలో కొన్నింటి నయినా పరిశీలిస్తే...

**1. స్వాతిముత్యం** : మంచి లక్షణాలు సంతరించుకున్న కథ. ఈ కథలో ప్రధానంగా ఐదే అయిదు పాత్రలు కనిపిస్తాయి. సమాజం ఎలా ఉండాకూడదో కథానాయిక తండ్రి పాత్ర తెలియజేస్తుంది. సమాజాన్ని సరిజేసి జీవింప జేసుకోవచ్చుననే నమ్మకాన్ని కథానాయిక తల్లిపాత్ర ఉద్బోధిస్తుంది. సమాజాన్ని ఎలా ఉంచుకోవాలో కథానాయకుడి స్నేహితుడి పాత్ర సూచిస్తుంది. సమాజాన్ని అత్యవసరంగా సంస్కరించుకోవాల్సిన అతి ముఖ్యమైన విషయాన్ని కథానాయిక పాత్ర తెలుపుతుంది. సమాజం ఎలా వుండాలో, ఎలా వుంటే బావుంటుందో సంస్కారవంతంగా తెలుపుతుంది కథానాయకుడి పాత్ర. ఆధునిక సంఘానికి అద్భుతమైన సందేశాన్నందించిన కథ.

**2. శుభ సంకల్పం :** మానవుల మనుగడకు, కొనసాగింపుకు స్త్రీ పురుషుల కలయిక అనేది సృష్టి ధర్మం. ఆటవిక దశనుండీ నాగరికత వైపు మనిషి అడుగులు పడ్డాక స్త్రీ పురుషులకు వైవాహిక బంధాలు ఏర్పరచబడి క్రమబద్ధమైన సాంఘిక వ్యవస్థతో ఉత్తమ సమాజాలు నిర్మితమవుతూ వచ్చాయి.

నాగరికత ఎంత పెరిగినా, సామాజిక వ్యవస్థ ఎంత మహోన్నత స్థితికి చేరినా కొద్ది శాతం మనుషులలో మాత్రం మానవుడి మొదటి దశ తాలూకు అనాగరికపు లక్షణాలు దూరం కాకపోవడం ఒక పెద్ద విషాదం. ఆ అనాగరికపు లక్షణాలలో అతిహీనమైనది విశృంఖలమైన శృంగారకాంక్ష. సంఘహితం కాని, సమాజం హర్షించని స్త్రీ, పురుష అక్రమ సంబంధాల తాలూకు పర్యవసానాలను

వివరించే ఇతివృత్తంతో వ్రాయబడ్డ కథ శుభ సంకల్పం. శారీరక కాంక్షలు రగులుతున్నప్పుడు లోతయిన ఆలోచనా విధానం మృగ్యమయి మనిషివేసే తప్పటడుగుల యొక్క ఫలితాలు కొంతమేర విశదంగానే చర్చించబడ్డాయి ఈ కథలో. ఆధునిక సమాజంలోని కొంతమంది మనుషులకు పరోక్షంగా కొన్ని మంచి సూచనలు, సలహాలు అందించిన రచయిత అభినందనీయులు.

**3. ఆమె :** "చెడిపోయిన వారి చరిత్రలన్నీ ఒక్కమాదిరిగా ఉండవు. వాళ్ళ జీవితాలను తిరగేస్తే వాటి నుండీ గ్రహించవలసింది కూడా కొంత కన్పిస్తుంది. అసలు చెడిపోవడం కూడా అందరికీ సాధ్యంకాదు. ఈ భూమ్మీద కొందరు బుద్ధిమంతులుగా ఉండడానికి కారణం... వాళ్ళకు చెడపోవడం చేతకాకపోవడమే!" అని అంటారు డా॥ కొమ్మూరు వేణుగోపాలరావు గారు తమ గోరింటాకు నవల ఎత్తుడలో. నిజానికి గొప్ప మాటలు అవి.

చెడిపోవడం చేతగాని ఇద్దరు యువతీ యువకుల వింతకథ 'ఆమె'. వారిద్దరి మధ్యనా తన అబద్దాలతో సమాజానికి అపకారం చేసే ఒక ఉపపాత్ర కూడా వుంది. ఆ పాత్రను పరిశీలించేటప్పుడు... "అపవాదుకున్న ఆకర్షణ ఈ ప్రపంచంలో ఆడదానికి లేదు. అపవాదు ఇచ్చే ఆహ్లాదం మరి ఒకటి ఇవ్వలేదు!" అన్న త్రిపురనేని గోపీచంద్ గారి మాటలు మననానికి వస్తాయి. ఈ కథలో 'ఆకలి' ప్రస్తావన కూడా హృద్యంగా కన్పిస్తుంది. సమాజం పట్ల రచయితకున్న అవగాహనను ఈ కథ అభివ్యక్తీకరిస్తోంది.

**4. ప్రేమించే హృదయం :** ఆధునిక యుగంలో ఉమ్మడి కుటుంబాలు కరువయిపోతూ, చిరుకుటుంబాలు విస్తరిస్తున్నాయి. మనుషుల మధ్యన ప్రేమాభిమానాలూ అంతంత మాత్రంగానే కన్పిస్తున్నాయి. ఈ కథలో హృదయమున్న మనుషులతో కూడిన, ప్రేమలూ, అనుబంధాలూ, ఆప్యాయతలూ నిండిన ఓ గృహం కన్పిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఏనాడో రవీంద్రుల వారన్నట్లు సంకుచితపు గోడలతో నిజంగానే ముక్కచెక్కలయిపోతున్న నేటి నిరాశా జనకమైన అత్యాధునిక సంఘానికి కనువిప్పు కలిగించడానికి వెలసినట్లుగా అక్కడక్కడ అలాంటి కుటుంబాలు, మనుషులు కన్పిస్తుండడం ఒకింత ఆశాజనకం. 'ప్రేమించే హృదయం' కథ మనం మన సమాజాన్ని బ్రతికించుకోవచ్చుననే నమ్మకాన్ని కలిగిస్తుంది. మంచిని, మానవత్వాన్ని, మనిషితనాల్ని కలబోసి ఈ కథను వెలువరించారు రచయిత.

**5. పిత్రార్జితం :** కథా వస్తువు పాతదే. కానీ గొప్ప హృదయస్పర్శతో చెప్పిన విధానం చాల బావుంది. తరాల అంతరాలను... ముఖ్యంగా... ఆధునిక

జీవన విధానం తెచ్చిపెట్టిన మనుషుల మధ్యని దూరాలను దృశ్యమానం చెయ్యడంలో రచయిత చాల నేర్పుచూపారు. మనిషి మరణించిన తదుపరి మళ్ళీ జీవించడం ఏమిటో చదువరి కంటనీరు తిరిగేలా చెప్పగలిగింది ఈ కథ. ఈ కథలో తల్లి అనాథాశ్రమం చేరివుంటే నిజానికి కథ మరింత శక్తివంతమయి వుండేది. అయితే రచయిత పాఠకుల సానుభూతికి కానీ, కథా బలానికిగానీ పాకులాడకుండా చాల ఆశాజనకమైన ముగింపును ఇచ్చి ఆధునిక సమాజానికి సామాజిక బాధ్యతతో కూడిన ఒక మంచి సందేశాన్ని అందించారు.

**6. కలుపు మొక్క :** రచయితలలోని బలహీనతలను, స్త్రీ వ్యామోహాన్ని ఎత్తిచూపుతూ, వారిని అభిమానించే వారిలో ఉండాల్సిన వ్యక్తిత్వం, హుందాతనాల్ని విశ్లేషణాత్మకంగా దృశ్యమానం చేసిన మంచి కథ. ప్రతి రచయితా, రచయిత్రీ, ప్రతి అభిమానీ తప్పక చదవాల్సిన కథ.

ఇలాంటి కథలు వందలాదిగా వ్రాశారు సి.ఎన్. చంద్రశేఖర్‌గారు. నేటి సమాజంలోని అనైక్యత, అనైతికత, హింస, మోసాలు, తగ్గిపోతున్న మానవత్వపు విలువలు, మృగ్యమౌతున్న మానవ సంబంధాలు... ఇవన్నీ ఈ రచయితను కలతపెట్టే అంశాలు. అందుకే వీరి రచనలలో అంతర్లీన వేదనలతో కూడిన సూచనలు, సలహాలు అభివ్యక్త మవుతుంటాయి.

సీనియర్ గాయని శ్రీమతి ఎస్. జానకి, ప్రఖ్యాతికవి డా॥ సి. నారాయణరెడ్డి, ప్రఖ్యాత రచయిత శ్రీ త్రిపురనేని మహారథి, డా॥ వాసిరెడ్డి సీతాదేవి, అపర అన్నమయ్య శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ లాంటి పెద్దల ఆశీస్సులు పొందిన ఈ రచయిత కలం నుండీ సమాజ హితకరమైన రచనలు మరిన్నింటిని ఆశించడం పేరాశ కాదు.

**రచయిత చిరునామా :**

**సి.ఎన్. చంద్రశేఖర్,**

4-1042/4, గ్రీమ్స్‌పేట,

గాయత్రి నగర్ కాలనీ,

**చిత్తూరు - 517 002**

ఫోను : 08572-240860

సెల్ : 9490050214

# సమకాలీన సామాజిక సమస్యలపట్ల ప్రతిస్పందిస్తున్న రచయిత్రి శ్రీమతి యం.ఆర్. అరుణకుమారి



ఆడపిల్ల పుష్పవతి అయితే ఇక ఆపై ఆమె వీధి ముఖం చూడకూడదు!... పూర్వమెప్పుడో జమీందారీ ఛాయాలో సాగిన ఆ ఇంటి ఆచారం అది!!.. అందుకే ఆ అమ్మాయి పుష్పవతి కాగానే ఆమె చదువుకు మోకాలడ్డాడు ఆమె మేనమామ! కానీ అభ్యుదయవాది అయిన ఆమె తండ్రి బావమరిదిని వారించి అమ్మాయి చదువుకు పచ్చజండా వూపారు. కానీ పదోతరగతి ఉత్తీర్ణురాలవగానే ఆమె చదువుకు మళ్ళీ అడ్డు తగిలాడు మేనమామ. ఈ పర్యాయం ఇక ఆలస్యం చెయ్యకుండా పెళ్ళి చేసెయ్యాలన్నది ఆయన అల్టిమేటం! అయినా తోసిరాజన్నారు ఆమె తండ్రిగారు... తల్లిగారు కూడా బిడ్డ చదువునే సమర్థించారు. ఇహ ఆపై ఆమె చదువు నిరాటంకంగా సాగిపోయింది! చదువుతోపాటు పరిస్థితులనూ, పరిసరాలనూ, సంఘటనలనూ, జీవితాలనూ చదవడమూ మొదలయింది. ఆ అమ్మాయే 2001 సం॥లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయినిగా ప్రభుత్వ గుర్తింపును, 2007వ సం॥లో లయన్స్ క్లబ్ అవార్డును పొంది ఒక మంచి టీచరుగా, సామాజిక స్పృహతో సమాజానికి మంచి రచనల నందిస్తున్న రచయిత్రిగా, జిల్లా అధికార భాషా సంఘ సభ్యురాలిగా, చి.ర.సం. ఉపాధ్యక్షురాలిగా పేరుపొందిన శ్రీమతి యం.ఆర్. అరుణకుమారి.

తేది 28-5-1960 నాడు చిత్తూరులో అరుణకుమారి జననం జరిగింది. నాటక రచయితగా, నవలాకారులుగా, పద్యకవిగా ప్రసిద్ధి చెంది ప్రజాకవి బిరుదును పొందిన శ్రీ యం.ఆర్. చంద్ర వీరి తండ్రి. ఆయన అరుణకుమారి జన్మించినయేడే 'పల్లెసీమ' అను వారపత్రికను ప్రారంభించి చాలాకాలం నడిపారు. మాజీ రాష్ట్రపతి డా॥ నీలం సంజీవరెడ్డి గారిచే "ఆంధ్రాబ్లిడ్జ్" అన్న బిరుదు పొందింది 'పల్లెసీమ' వారపత్రిక.

అరుణకుమారిగారి తల్లిగారు అలివేలమ్మ. ఆదర్శభావాలూ, ఉదార హృదయమూ కలిగిన గృహిణి. పెద్ద కుటుంబాన్ని చక్కగా తీర్చిదిద్దిన మాతృమూర్తి. ఆ పుణ్యదంపతుల నాలుగవ సంతానము, ఏకైక పుత్రిక అయిన యం.ఆర్. అరుణకుమారిగారి విద్యాభ్యాసం మొత్తం చిత్తూరు యందే జరిగింది.

ప్రాథమిక విద్యాభ్యాసం ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ పాఠశాలలోనూ, హైస్కూలు విద్య బి.జడ్. హైస్కూలులోనూ, ఇంటర్ చదువు పి.సి.ఆర్. ప్రభుత్వ జూనియర్

కాలేజియందూ, బి.ఎస్సీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ జరిగాయి. తదుపరి కార్వేటినగరం డైట్‌లో టీచరు ట్రెయినింగ్ కోర్సు పూర్తి చేశారు. ఆపై దూరవిద్య ద్వారా ఎం.ఎ. పట్టం పొందారు.

తేది 20-2-1984 నాడు కడప జిల్లా సంబేపల్లి మండలం రేగడగుంట వారి పల్లెకు చెందిన శ్రీ ఆర్. సహదేవనాయుడుతో అరుణకుమారి కళ్యాణం కమనీయంగా జరిగింది. రంగాని సహదేవనాయుడు గారు చిత్తూరు మండలం శేషాచలపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

1983వ సంవత్సరంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలుగా నియమితులైన అరుణకుమారిగారు టి. చవటపల్లెలో పంద్రెండు సంవత్సరాలు, జోగుల కాలనీలో ఎనిమిది సంవత్సరాలు, బండపల్లెలో తొమ్మిది సంవత్సరాలు పనిచేసి ప్రస్తుతం తిమ్మసానిపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా వృత్తి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

శ్రీ యం.ఆర్. చంద్రగారిల్లు వచ్చిపోయే కవులు, కళాకారులు, రచయితలతో ఒకరకమైన ఆరోగ్య, ఆహ్లాద, సాహితీ వాతావరణంతో నిండివుండేది. తన నోటు పుస్తకాలలో తనకు తోచిన రచనలు చేసుకుంటుండిన అరుణకుమారి స్వయంకృషితో వచన కవయిత్రిగా, ఆధునిక రచయిత్రిగా ఎదుగుతున్న క్రమంలో కొంతకాలంపాటు... "ఈమె తండ్రిగారి అండదండలతో వెలుగు చూస్తున్నారు!" అన్న అపప్రధను పొందారు. కానీ క్రమంగా ఆమె ప్రతిభ పాఠకలోకానికి అవగతమవుతూ వచ్చింది.

ఎం.ఆర్. అరుణకుమారిగారు నిరంతరం ఏదో ఒకటి వ్రాస్తూ నిరంతర గుర్తింపును కోరుకునే ప్రొఫెషనల్ రచయిత్రి కాదు. వారి కథా వస్తువులన్నీ నిజజీవిత సంఘటనలు, సంవేదనలు, సంఘర్షణలే! తను విన్నదో, కన్నదో, చదివినదో, అనుభవించినదో... ఏదయినా వారి మనసును కలవరపరచి మానసిక ఘర్షణకు గురిచేసినప్పుడు, భరింపలేని ఆవేదనను కలిగించినప్పుడు మాత్రమే కలం పట్టుకునే రచయిత్రి. వారి రచనలలో కథానాయిక లెప్పుడూ 'చావటం' అన్న ఆలోచనే లేకుండా ధైర్యంగా సమస్యల్ని ఎదుర్కొంటూ పరిష్కార దిశగా అడుగులేస్తుంటారు.

అరుణకుమారి మొదటి దశలో స్త్రీవాద రచయిత్రిగా ముద్ర పొందినా ఆపై సమకాలీన, సామాజిక సమస్యల పట్ల ప్రతిస్పందించే రచయిత్రిగా పేరు పొందారు. వీరి లేఖిని నుండి వందకు పైగా కథలు, కవితలు, వ్యాసాలు వెలువడ్డాయి. దాదాపు అన్ని పత్రికలలో వీరి రచనలు ప్రచురింపబడగా, కొన్ని రచనలు ఆకాశవాణి కడప, తిరుపతి కేంద్రాల నుండీ ప్రసారం అయ్యాయి.

అనేక కవి సమ్మేళనాలలో, కథా సదస్సులలో, అంతర్జాతీయ రచయితల సదస్సులలో పాల్గొన్న వీరికి అనేక బహుమతులు, పురస్కారాలు, అవార్డులు లభ్యమయ్యాయి.

వీరి కథలలో కొన్నింటి నయినా పరిశీలిస్తే...

**1. మన్నులో మన్నునై :** ఎంత గొప్ప కథ!?... అప్పుడెప్పుడో స్వర్గీయ చక్రవేణు వ్రాసి వుండిన కథ!, ఆ తరువాతెప్పుడో మధుర కథకులు మధురాంతకం వ్రాసిన కథ! ఆనక... పల్లెదాటి పొట్ట చేతబట్టుకుని పట్నానికి వెళ్ళి పడే పేదరైతు కుటుంబాల విషాదభరిత అమానుష గాథను గూర్చి సంఘమిత్ర వ్రాసిన కథ!!

ఇలా అక్కడొక్కటీ, ఇక్కడొక్కటీ పాఠకుల గుండెల్ని చెరువులు జేసి, వెన్నంటి తరిమే విదేశీ వెతల కథల, స్వదేశీ రైతు వ్యధల గాథల సరసన నిలబడే కథ 'మన్నులో మన్నునై...!?

"ఉండూరి నష్టం... పొరుగూరి లాభం రెండూ ఒకటే!" అని అనుకునే కాలం ఎప్పుడోపోయింది. పొట్ట చేత బట్టుకుని పట్టణాలకో, సప్తసముద్రాలు, ఎడారులు, అగ్నిపర్వతాలు దాటి... దేశం కాని దేశాలలో భాషకాని భాషల మధ్యన బాధలు పడడానికో, జీవచ్ఛవాలలా బ్రతకడానికో పరుగులు తీసే కాలాలు వచ్చేశాయి.

ఛిద్రమైపోతున్న వేల, లక్షల, కోట్ల జీవితాలను గూర్చి, పశువుల కన్నా హీనంగా బ్రతకాల్సి వస్తున్న మనుషుల జీవనాలను గూర్చి పాలకులకు పట్టదు! పాలితులు శారీరకంగా, మానసింకగా కూడా అశక్తులు!! ముఖ్యంగా గ్రామీణ బలహీనులు...

ప్రపంచీకరణ ప్రభావం యేమంటూ ఆరంభమైందో కానీ అప్పట్నుండీ కష్టకాలాలు నిరవధికంగా ప్రారంభమైనట్లుంది. సాగునీటి మాట దేముడెరుగు... త్రాగునీటికీ కటకటే! కొని తాగాల్సిన దుస్థితే!!... మూలాలలోకి వెళ్ళే ఓపికా తీరికా ఎవరికీ లేదు... ఇహపోతే కులవృత్తులు పోవడమేకాదు... దిగజారి కూలిపనుల బాటపట్టినా అవీ కూడు పెట్టలేకపోతున్నాయి మండే ధరల మధ్యన!... వీటన్నింటినీ గొప్ప హృదయ స్పర్శతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రస్తావించగలగారు 'మన్నులో మన్నునై...' కథలో అరుణకుమారిగారు. అందుకే ఈ కథ ఎన్నదగిన గొప్ప కథ అయింది.

**2. నిశ్శబ్ద కెరటాలు :** లోతయిన సామాజిక స్పృహతో, అద్భుతమైన కథనంతో నిండిన కథ. పేద, దిగువ మధ్య తరగతి ముస్లిం కుటుంబాల లోని

చీకటి కోణాలను పరిశీలనగా సమీపం నుండి గమనించిన అనుభవం కథను నేర్పుగా నడిపించిన తీరులో స్పష్టంగా కన్పిస్తుంది.

పేద ముస్లిం కుటుంబాలనే కాదు భారత దేశంలోని అనేక వేల లక్షల, కోట్ల నిరుపేద కుటుంబాలలోని మనుషుల జీవితాలలోని దైన్యానికి, నిరాశా నిస్పృహలకు, జీవితాలనే జూదానికి పణంగా పెట్టడానికి దోహదపడే విచిత్రమైన, నిస్సహాయతతో కూడిన ఘోరమైన పరిస్థితులకూ వాస్తవిక చిరు దర్పణం ఈ కథ!

ఈ కథలో రచయిత్రి ఇలా అంటారు... "... అప్రయత్నంగా కండ్లలో నుండీ కారుతున్న కన్నీళ్ళు పెదవుల మధ్య చొరబడి ఉప్పు ఉప్పుగా...! యుగాల నుండీ స్త్రీలు కారుస్తున్న కన్నీళ్ళనంతా పోగేస్తే... సప్త సముద్రాయ్యాయా? అందుకేనా సముద్రపు నీళ్ళంత ఉప్పగా ఉంటాయి? నిస్సహాయతే నిరంతర ఘోషగా... చెలియలి కట్టను ఢీకొంటూ... వేదనా కెరటాలు విరిగి పడుతూ! పడిలేస్తూ... అంతేనా స్త్రీ జీవితం?..."

పై వాక్యాలు యుగయుగాల వేదనాభరితమైన బాధనమభవిస్తున్న నిరుపేద, అసహాయ, శృంఖలా బద్ధమైన స్త్రీ హృదయఘోషకు ప్రతీకగా నిలుస్తాయి.

రచయిత్రి సునిశిత దృష్టికోణానికి హేట్స్ అప్ చెప్పకతప్పదు.

**3. రహదారి బతుకులు :** ప్రపంచాన్ని గడగడ లాడిస్తున్న ఓ భయానక మహమ్మారి జబ్బును గూర్చి హెచ్చరికలనిస్తూ సామాజిక బాధ్యతతో ఆసక్తికరంగా వ్రాయబడ్డ కథ. సమాజానికి ఇలాంటి కథల అవసరం చాల వుంది నిజానికి.

ఈ కథలో మరో ఆసక్తికరమైన విషయం యేమిటంటే... చిత్తూరు జిల్లా దామలచెరువు ప్రాంతానికి మామిడిపండ్ల సీజన్‌లో తాత్కాలికంగా వలస వచ్చే మనుషుల జీవితాలలోని ఒక ముఖ్య కోణాన్ని ప్రాంతీయత ప్రతిఫలించేలా రచయిత్రి ఆవిష్కరించిన తీరు... నిజంగా అభినందనీయం.

**4. పాడవే కోయిలా :** నిర్భయను అమానుషంగా చిత్రవధ చేసి, పాడుచేసి మరణానికి కారకులైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని, చట్టాలను మరింత కఠినతరం చేయాలనీ ఢిల్లీ నుండీ కొండ వెనుక పల్లె గల్లి దాకా దేశమంతా అట్టుడికి పోతోంటే నిర్భీతిగా మగ పశువులు అక్కడక్కడ తులసి మొక్కలను తొక్కేస్తూనే వున్నాయి. ఇదీ నేటి ఆధునిక భారత సమాజపు హీనమైన నీచదుస్థితి. ఈ స్థితిలో స్త్రీలు సహనానికి స్వస్థి వాచకం పలికి నడవాల్సిన రాజబాటలను సూచించిన కథ.

సంఘ హితకరమైన ఈ కథను రచయిత్రి పది సంవత్సరాల క్రితమే వ్రాయడం జరిగింది.

**5. శశిరేఖా పరిణయం :** అద్భుతమైన ఎత్తుగడ! అసాధారణమైన వస్తువు! హర్షణీయమైన నడక! ఆదర్శవంతమైన ముగింపు కలిగిన కథ. రగులుతున్న అగ్నిగోళంలా వున్న ప్రపంచానికి మంచి సూచననందించిన క్లుప్తమైన కథ. రచయిత్రి అభినందనీయురాలు.

**6. తొలిబలి :** ఈ కథ చదువుతొంటే ఒక యుద్ధం తరువాతి చీకటి కోణం కన్పించి భయం కలిగిస్తుంది. చదవడానికే ఇంత భయానకంగా, హృదయ విదారకంగా వుంటే... యుద్ధం సృష్టించే భీభత్సానికి బలయిపోగా మిగిలిన జీవచ్ఛవాలు శిధిలాల మధ్యనో, శిబిరాలలోనో అపరిశుభ్రత, అభద్రత, అరకొర వసతులు, ఆకలి, అంతులేని రోగాలు, అందని మందులు మొదలైన రౌరవాలను భరించలేక ఎంతగా అలమటిస్తుంటారో తోచి ఒళ్ళు జలదరిస్తుంది. ఇంత మంచి కథ చివర్లో రచయిత్రి జోక్యం కలిగించుకోకుండా కథనాన్నే కొనసాగించి వుంటే మరింత శక్తివంతం అయివుండేది!

**7. కర్మసాక్షి :** చాల శక్తివంతమైన చిన్న కథ. చిన్ని కృష్ణుడు తన బుల్లి నోటితో బ్రహ్మాండాన్నీ చూపినట్లు... పంటలు పండని నేలలు, వలసలు, నీటికొరత, కూలిపనులయినా దొరకని, కడుపునిండా తిండి ఎరుగని బడుగు జీవుల వెతలు మొదలైన ప్రపంచీకరణ ప్రభావం తాలూకు విశ్వరూపాల నెన్నంటినో దృశ్యమానం చేస్తుంది ఈ చిన్ని కథ!

**8. సిపాయీ...! ఓ సిపాయీ...! :** కవిత్వాంశతో తళుకులీనుతూ సాగిన సరస, శృంగార, సరదా, పరదా కథ. కానీ ముగింపు కొచ్చేసరికి చాలా గంభీరం అయిపోతుంది. కర్తృత్వాన్ని కరకుగా కాకుండా సుకుమారంగా సున్నితంగా చెప్పిన కథ.

**9. ఆనాటి చెలిమి ఒక కల :** అద్భుతమైన ప్రేమకథ! పరిస్థితుల ప్రభావం మధ్యన కులాంతర వివాహం చేసుకున్న ఓ జంట పండించుకున్న ప్రేమపంట!

ఇలాంటి శక్తివంతమైన కథలు, మరెన్నో కవితలు, వ్యాసాలు వ్రాసి ప్రత్యేక గుర్తింపు పొందిన అరుణకుమారి గారి జీవితంలో ఆనందాలతోపాటు కొన్ని విషాదాలూ కన్పిస్తాయి. మొదటిది... అరుణకుమారిగారు ఎంతో ప్రేమించే తమ తండ్రిగారి ఆకస్మిక మరణం. (యం.ఆర్. చంద్రగారు తేది 19-2-1999 నాడు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో పరమపదించారు). రెండవది... వీరికి ముగ్గురు

పిల్లలు. 1. సారికాప్రియ (బి.టెక్) 2. లేఖ్యాప్రియ (ఫ్యాషన్ టెక్నాలజీ) ఇద్దరు ఆడపిల్లలు. 3. పూర్ణచైతన్య (బి.టెక్)

పై ముగ్గురు పిల్లలలో... మంచితనం, మానవత్వం, ప్రేమ, సేవల ప్రతిరూపమైన పూర్ణచైతన్యను క్రూరమైన విధి తేది 1-8-2010నాడు రోడ్డు ఆక్సిడెంటు రూపంలో బలితీసుకుంది.

అంతటి విషాదంలోనూ ఆ దంపతులు ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకుని తమ కుమారుని ఆశయాలకు ఆచరణగా అతని కళ్ళు, కిడ్నీలు, కాలేయం మొదలైన వాటిని వెంటనే దానం చెయ్యడం జరిగింది.

తరువాత "పూర్ణచైతన్య మెమోరియల్ ట్రస్ట్" అన్న సంస్థను స్థాపించి అనేక సేవా కార్యక్రమాల ద్వారా పూర్ణచైతన్య ఆత్మశాంతికి నివాళులర్పించడం జరుగుచున్నది.

అందుబాటులో వున్న యం.ఆర్. అరుణకుమారిగారి గ్రంథాలు :

1. వేగుచుక్క - కథా సంపుటి - 1996, 2. సాగరకోయిల - కథా సంపుటి - 2003, 3. మన్నులో మన్నునై - కథా సంపుటి - 2006

మనిషి మనిషిగా బ్రతకాలన్న ఆశ, స్త్రీలు ద్వితీయ శ్రేణి మనుషులుగా కాక సాటి మనుషులుగా గౌరవింపబడాలన్న తపన, ప్రతి మనిషీ సదా ఆత్మానందంతో, జీవించాలన్న ఆకాంక్ష కలిగిన ఈ రచయిత్రి కలం నుండీ మరిన్ని మంచి రచనల్ని ఆశించడం పేరాశ మాత్రం కాదు.

**రచయిత్రి చిరునామా :**

**యం.ఆర్. అరుణకుమారి**

19-278/ఎ, రెడ్డీస్ కాలనీ,

మిట్టూరు, **చిత్తూరు - 517 001**

సెల్ : 99856 72904, 81215 23835

# చిత్రమైన కథకుడు ... చిలమకూరి లాజరెస్



మనుషులు రకరకాలుగా ఉంటారు. బహుశా జీవవైవిధ్యం కావచ్చు. కొద్దిమంది స్తబ్దుగా ఉంటారు. మరికొంతమంది చలాకీగా ఉంటారు. అయితే ఈ రెండు రకాల మనుష్యులలో కూడా కొందరు ఆలోచనాపరులు కన్పిస్తారు. పరిశీలిస్తే వీరిలోంచీ కొందరు లోతయిన ఆలోచనా పరులూ కన్పిస్తారు. వీరి నుండీ ఉత్తమ ఉపాధ్యాయులు, అత్యుత్తమ కవులు, కళాకారులు, కథకులు, ప్రతిభ కలిగిన నాయకులు... వినాయకులు, శక్తివంతులైన యోధులు మొదలైన వారు ఉత్పన్నమయి వెలుగులోకి వస్తుంటారు. వారి వారి జీవితాలలో జరిగే అనేకానేక ఘటనలు అందుకు కారణాలు కావచ్చునని అన్పిస్తుంది.

అలాంటి వారిలో ఒకరు... విశ్రాంత ఉపాధ్యాయులు, ఆంగ్ల వ్యాకరణ అధ్యాపకులు, వచనకవి, కథకులు, నవలాకారులు, భావుకులు అయిన చిలమకూరి లాజరెస్ గారు! కడప జిల్లాలో జనన మందిన వారయినా చిత్తూరు జిల్లాలో స్థిరపడిపోయిన వ్యక్తి వీరు!

బాల్యం నుండీ కూడా లాజరెస్ గారి జీవితంలో ఎక్కువ భాగం ముళ్ళమీద నడకగానే నడిచింది. యవ్వన దశలోనే భార్యాపిల్లలకు దూరం అయి వారిని పోగొట్టుకున్నారు. అందుకు తమ తప్పు కూడా ఎక్కువగానే ఉందనే వాస్తవాన్ని అంగీకరించడానికి సంతోషంగా ఇష్టపడే యధార్థవాది ఆయన.

చల్లని పుణ్యభూమి మదనపల్లెలో స్థిరపడి విద్యార్థులకు ఆంగ్ల వ్యాకరణ పాఠాలు బోధించడంలో, జాకబ్ చాంబర్లీన్ మెమోరియల్ చర్చ్‌లో ప్రార్థనలతో గడపడంలో... ప్రశాంతతను వెతుక్కుంటూ... రకరకాల రచనలు చేసిన వ్యక్తి వీరు.

మదనపల్లెలో నీటి ఎద్దడి ఎక్కువయ్యాక, అనేక సంవత్సరాలుగా తాముండిన వసతి గృహంలో కూడా నీటికి కటకట కలగడం వల్ల మదనపల్లెతో అనుబంధాన్ని తెంచుకుని పుంగనూరు–తిరుపతి మార్గంలోని సదుం చేరుకుని అక్కడే ఇల్లు, ప్రార్థనా మందిరం నిర్మించుకుని స్థిరపడిపోయారు వారు.

లాజరెస్‌గారి రచనలను తిరగేస్తే కడగండ్లు, అవధులు లేని ఆనందాలు, అంతు తెలియని ఆవేశాలు, సుఖాలు, వేదనలు అడుగడుగునా దృశ్యమాన మవుతాయి. అన్నీ కలసి వారిని చిత్రమైన రచయితగా తయారుచేసి ఉంటాయి బహుశా.

వందలాది వ్యాసాలు, గేయాలు, కవితలు, కథలు వీరి లేఖిని నుండీ వెలువడ్డాయి. రెండు నవలలు... ఒకటి వీరి సంపూర్ణ జీవనానికి ప్రతిబింబ మయితే, రెండవది... తాము కోల్పోయిన జన్మభూమి యొక్క ఒక నాటికీ–నేటికీ చెందిన దృశ్యమానం! ఇంకా వారు ఆంగ్లంలో ఎక్స్‌ప్లెయిన్డ్ ఇంగ్లీషు గ్రామర్, ఇంటర్ ఇంగ్లీషు గ్రామర్ అండ్ కాంపోజిషన్ మొదలైన వ్యాకరణ గ్రంథాలను గతంలోనే వెలువరించారు.

తెలుగులో వీరి మొట్టమొదటి గ్రంథం 'చిలమకూరి భావ తరంగాలు'. 1980వ సంవత్సరంలో వెలువడిన ఈ గ్రంథం సరళ గ్రాంధికము, ఆధునిక వ్యవహారికము కలగలసిన బాషతో సాగుతుంది.

మైసూరు విభాగపు దక్షిణ భారతీయ భాషా సంస్థ ప్రిన్సిపాల్ డా॥ కె.వి.వి. ఎల్. నరసింహరావు, మైసూరు యూనివర్శిటీ తెలుగు అధ్యాపకులు డా॥ ఆర్.వి.ఎస్. సుందరం, జువాలజీ అధ్యాపకులు అయిన హరగోపాలదత్తు, శ్రీమతి లాజరెస్, మైసూరు రీజనల్ కాలేజి ఆప్ ఎడ్యుకేషన్ తెలుగుశాఖ అధ్యాపకులు పైడిమఱ్ఱి వెంకటసత్యనారాయణమూర్తి మరియు భాషాప్రవీణ, సారస్వత యం.వి.ఎస్. వేణుగోపాల్ గార్లు ఈ గ్రంథానికి తొలిపలుకులు అందివ్వడం జరిగింది.

ఒక చిత్రం ఏమిటంటే ఈ గ్రంథం ఏ ప్రక్రియకు చెందుతుందో నిర్ణయించడం కష్టం. ఇందులో కవితలు, కథలు, గేయాలు, వ్యాసాలు, ఉపన్యాసాలు, ప్రభోదాలు, సూచనలు ఇలా అనేక ప్రక్రియలు పంతొమ్మిది కలగలసి గ్రంథరూపం దాల్చాయి. రచయిత యొక్క భావాల తీవ్రత, తపన, అనుభూతులు, అనుభవాల సారాంశం ఈ గ్రంథం. శ్రద్ధగా పరిశీలిస్తే వస్తువైవిధ్యం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. రచయిత అంతరాత్మ ప్రతిఫలించే ఈ గ్రంథంలోకి అడుగిడితే...

**1. సరసురాలు (వచన కవిత) :** కామాతురాలయిన స్త్రీ యొక్క జాణతనాన్ని, తెలివితేటలను, అలివిగాని కోర్కెలను తీర్చుకోగలిగే వలపు,

వయ్యారాల వైనాల్ని, చాతుర్యాల్ని తెలియజేస్తుంది ఈ కవిత. చక్కని నడక, మెచ్చుకోదగ్గ పదాల కూడిక, ఆసక్తికరమైన విషయ పరిచయం ఇందులో కన్పిస్తాయి.

**2. సరసుడు (కవిత) :** మొదటి కవితలో కన్పించే సరసురాలి చాతుర్యం, శృంగార వైభవం పురుషుల పరంగా మరింత హెచ్చు మోతాదుతో 'సరసుడు' కవితలో కన్పిస్తాయి.

**3. ఒక అధ్యాయం ముగిసింది (కథ) :** లాజరెస్‌గారు తమ జీవితంలో వ్రాసిన మొట్టమొదటి కథ అయివుండాలి ఇది.

తమ మూడేండ్ల ప్రాయంలో తండ్రిని కోల్పోయిన నాటినుండీ, నలభై మూడేండ్ల ప్రాయంలో తల్లిని కోల్పోయి ఆఖరి చూపులకు కూడా నోచుకోక పోవడం వరకూ నడచిన లాజరెస్‌గారి ఆత్మకథగా ఈ కథను చెప్పుకోవచ్చు. కథ కాస్త పెద్దదయినా చక్కగా చదివిస్తుంది. పేదరికంలోని సాధక బాధకాలు, జీవిత చక్రాల మీద కష్టంతో కూడిన బతుకుబండి నడకా ఈ కథలో కన్పించి కంట తడిని పెట్టిస్తాయి. కొన్ని ఘటనలయితే హృదయాన్ని అలవోకగా స్పర్శించి పాఠకుడి గుండెను ఆర్ద్రతతో నింపేస్తాయి.

**4. కాటుక కంటినీరు (వ్యాసం) :** సమాజానికి మంచి సందేశాన్ని ఇవ్వడానికి ప్రయత్నించిన వ్యాసమిది. కాలాన్ని వృథాచేసే మనుషులను హెచ్చరిస్తూ, దుర్నడతలను మానుకోమని సూచిస్తూ, సమాన, సహజీవన సూత్రాన్ని ప్రభోదిస్తూ సాగిన వ్యాసమిది.

**5. రొంబ ఆశ (కథ) :** సృష్టి కొనసాగుటకుగాను సృష్టింపబడిన స్త్రీ పురుష శరీరాల తాలూకు కలయికలు కాలక్రమాన ఒక నియమబద్ధమైన చట్రంలోకి తేబడి కుటుంబ వ్యవస్థ ఏర్పడింది. అయితే గతం తాలూకు అనాగరికపు వాసనలను కోల్పోని కొన్ని శరీరాలు విశృంఖలమైన, సమాజం హర్షించని కలయికల కోసం ఆరాటపడి పోతుంటాయి!! అలా ఆరాటపడే ఒక స్త్రీని రెచ్చగొట్టిన పురుషుడు ఆపై తప్పుకుని... అంతటితో ఆగక జీవాత్మలను గూర్చి ధర్మబోధ కావించడం 'రొంబ ఆశ' కథలోని కథనం!

వీలయినంత ఎక్కువ మందితో శారీరక సంబంధాలు కలిగి ఉండాలని కోరుకునే మనుషుల మనస్థత్వాలను గూర్చి కొంత మేర తెలుపుతుంది ఈ కథ.

రచయిత తొలి కథలలో ఒకటయినందున కాబోలు శిల్పపరమయిన తడబాట్లు, కథ నిర్మాణ క్రమంలో కొన్ని చిన్నచిన్న లోపాలు కన్పిస్తాయి.

**6. మలుపు (కథ) :** ఆకలి, పేదరికం... ఈ ప్రపంచంలోని చాల, చాల దేశాలను పట్టి పీడిస్తున్న భయానక రుగ్మతలు. విధిలేని పరిస్థితులలో శీలాన్ని వదిలి శరీరాల్ని అమ్ముకుంటూ బతుకు బండిని లాగించే ప్రయత్నాలు చేస్తూన్న పడతులు లెక్కలేనంత మందే కన్పిస్తారు. ఆ నిర్భాగ్యులను గూర్చి ఆలోచించే ఓపికా, తీరికా పాలకులకు ఉండవు! పాలితులా?... సరేసరి!!

అలాంటి ఒక దీనురాలు–ఆమె పసికందు... వీరి ఇరువురి జీవితాలలోని ఒక దయనీయమైన రోజును రచయిత తమ దృష్టి కోణంతో దృశ్యమానం చెయ్యడానికి ప్రయత్నించిన కథ 'మలుపు'.

**7. సంక్రాంతి (వ్యాసం) :** సంక్రాంతి... అంటే... కొత్త కాంతి! సంక్రాంతి శోభమీద సాగిన కవితలతో ప్రారంభం అయ్యే వ్యాసమిది. పశువుల పట్ల నిర్లక్ష్యం వహించిన మనిషి పశుఘోషను గ్రహించి మార్పు చెంది పశువులకు ప్రాధాన్యతల నిస్తూ పశువుల పండుగలు జరపడానికి శ్రీకారం చుట్టినట్లుగా తెలియజేస్తుంది ఈ వ్యాసం. ఇంకా.. కోడి పందేలలోని క్రూరత్వాన్ని, అమానవీయ కోణాల్ని నిరసిస్తుంది. అలనాటి రచ్చబండ ఉత్సవాలు, గ్రామీణ కళాప్రదర్శనలు, సంక్రాంతి వంటలు మొదలైన అనేక విషయాలతో సంక్రాంతి యొక్క ప్రాశస్త్యాన్ని, నిండుదనాల్ని తెలిపే వ్యాసమిది.

**8. కన్నీరు–పన్నీరు (కథ) :** "ఈ ప్రపంచంలో దారుణంగా దోపిడికి గురవుతున్నది స్త్రీ!" అన్నాడు లెనిన్. అలా దోపిడికి గురయిన ఒక స్త్రీ మూర్తి అంతరంగ వేదనతో కూడిన రోదన ఈ కథ. అనేక మలుపులు తిరిగి, ఎన్నో తలుపులు మరెన్నో తలపులు తెరచి... మొత్తానికి సుఖాంతమయ్యే కథ 'కన్నీరు–పన్నీరు'.

**9. కాగితం – ఆ కాగితం (వ్యాసం) :** ఈ రోజయితే ఇంటర్నెట్ వల్ల కాగితం విలువ ఏకాస్తో తగ్గినట్లుంది కానీ కాగితం యొక్క కదలిక, రూపాంతరాలు, మరియు విలువలను గూర్చి చెప్పిన అలనాటి వ్యాసమిది.

**10. అంతర్యుద్ధం (వ్యాసం) :** మానవ జీవితంలోని ఘర్షణలనూ, మానసిక సంఘర్షణలనూ తెల్పుతూ శాంతియుత జీవన గమనానికి సూచన నిచ్చిన వ్యాసమిది.

తమ తల్లిదండ్రులకు లాజరెస్ గారిచే అంకిత మివ్వబడ్డ ఈ గ్రంథంలో ఇంకా వ్యాసరూపక కథనాలు తొమ్మిది ఉన్నవి. అక్కడక్కడ వాక్య నిర్మాణాలలో లోపాలు, పదప్రయోగాలలో చిన్నచిన్న దోషాలు కన్పించినా రచయిత ఆశయాలకూ, ఆలోచనలకూ, ఆవేదనలకూ, ఆవేశాలకూ ప్రతీకలుగా కన్పిస్తాయి.

భావతరంగాలు గ్రంథావిష్కరణ తదుపరి అనేక రచనలు చేసినా లాజరస్‌గారు ఇటీవలి కాలంలో అపారమైన తమ జీవితానుభవాన్ని రంగరించి, తమ జీవన గమనంలోని అనేకానేక ఘటనలను క్రోడీకరించి 'తప్ప(ప్పు)టడుగులు' పేరిట ఒక పెద్ద నవలను వ్రాయడం ఎన్నదగిన మంచి అంశం. అద్భుతమైన ఈ నవల ప్రస్తుతం జయంతి పబ్లికేషన్స్, హైదరాబాదు వారి వద్ద ముద్రణలో ఉంది.

లాజరెస్‌గారు ఈ మధ్యన పలు అంశాల మీద (అతి తక్కువ వ్యవధిలోనే) వ్రాసిన 28 వ్యాసాలకు "చిలమకూరి సుగుణాల స(స్వ)రాలు" పేరిట ముద్రణ గావించి, తిరుపతిలో జరిగిన నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలలో ఆవిష్కరింపజేయడం జరిగింది.

శీర్షికకు తగిన విధంగానే ఈ గ్రంథంలో... 1. ప్రేమ 2. దయ 3. శాంతి 4. సంస్కారం... ఇలా ప్రారంభమైన భావగర్భిత రూపక కథనాలు 'న్యాయస్థానం, అన్యాయస్థానం – 'ఆ' న్యాయస్థానం అన్న ఇరవయి ఎనిమిదవ వ్యాసంలో ముగుస్తాయి. ఈ గ్రంథానికి ప్రముఖ పద్యకవి, బహుగ్రంథకర్త, విశ్రాంత తెలుగు అధ్యాపకులు, మ.ర.సం. అధ్యక్షులు డా॥ మల్లెల గురవయ్యగారు ముందుమాట వ్రాయడం జరిగింది.

తదుపరి వీరి లేఖిని నుండీ వెలువడబోతున్న (ముద్రణలో వున్న) గ్రంథం "మావూరు... నాడు–నేడు". తమ జన్మభూమి యొక్క ఒకనాటి నిండుదనాల్ని, ఔన్నత్యాలను తమ బాల్య స్మృతులతో రంగరించి గొప్ప హృదయస్పర్శతో లాజరస్‌గారు అందిస్తున్న గ్రంథమిది.

కడప జిల్లా చిలమకూరులో శ్రీ సైలాస్, శ్రీమతి దయాన అను పుణ్యదంపతులకు చివరి సంతానముగా తేది 10–8–1938నాడు జన్మించిన లాజరెస్‌గారు కడు కడగండ్లతోచదువు సాగించి ఎం.ఎ. ఇంగ్లీషు, ఎం.ఎ. తెలుగు చేసిన పిదప కొంతకాలం నరసారావుపేట, ఒంగోలులలో మున్సిఫ్‌కోర్టు ఎల్.డి.సిగా పనిచేసిన పిదప శెలవులో వుండి కర్నూలులో ప్రభుత్వ బి.ఇడి.

కాలేజి యందు బి.ఇడి. చేశారు. ఆపై రేపల్లె మున్సిఫ్‌కోర్టులో కొంతకాలం పనిచేసిన తదుపరి ఆ ఉద్యోగం వదిలి 1967లో కడపలో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించారు.

మదనపల్లెలో స్థిరపడిన కొంతకాలానికే పదవీ విరమణ చెందిన వీరు ప్రస్తుతం సదుంలో విశ్రాంత జీవితం గడుపుతూ సాహితీ సృజన గావిస్తున్నారు. ఆటుపోట్లను, విషాదాలను తట్టుకుని డెబ్బయి ఏడేళ్ళ వయసులో సైతం ఆరోగ్యంగా సంచరిస్తున్న లాజరస్‌గారు తమ రచనల ద్వారా మూడుకాళ్ళతో నడువక మునుపే ఇంటి మర్మమెరిగిన చిత్రమైన తాత్విక రచయితగా కన్పించుచున్నారు. అయితే గత కొంతకాలంగా వీరికి గొంతుకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమయి స్వరం పోయింది. 2013 అక్టోబరు మాసములో చెన్నయి ఆస్పత్రిలో సర్జరీ జరిగి గొంతు క్రింది భాగములో రంధ్రము చెయ్యబడి, రేడియం ట్రీట్‌మెంటు అందివ్వడం జరిగినది. మృత్యువుకు సమీపంగా వెళ్ళిన వీరు తిరిగివచ్చి కోలుకుంటున్నారు.

కాలం కదలికలలో వీరికి నిండు నూరేండ్లూ సంపూర్ణ ఆరోగ్యం నిలచి వుండాలనీ, మరిన్ని రచనలను వీరి నుండీ పొందగలగాలనీ ఆశిద్దాం.

వీరి గ్రంథములు కావలసిన వారు వీరి చిరునామాను సంప్రదించి పొందవచ్చును.

**వీరి చిరునామా :**

**చిలమకూరి లాజరెస్**

4/137, హైస్కూలు రోడ్,

సదుం – 517 123

వయా చౌడేపల్లి, చిత్తూరు జిల్లా,

సెల్ నెం : 94904 87196.